# ఫ్లాష్ బ్యాక్

2వ భాగం

## - గతకాలపు సినీస్మృతులు





శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: ౧౨౦



| | |
|---|---|
| అక్కినేని నాగేశ్వరరావు | 3 |
| సూర్యప్రభ | 7 |
| నందమూరి తారక రామారావు | 9 |
| ఎ.పి.కోమల | 13 |
| పాలువాయి రామకృష్ణారావు | 15 |
| టి.వి.రాజు | 18 |
| కడారు నాగభూషణం | 21 |
| రేలంగి జీవిత కథ | 24 |
| రచయిత, దర్శకుడు – వీటూరి | 28 |
| సముద్రాల రాఘవాచార్య | 30 |
| టి.వి.ఎస్.శర్మ | 33 |
| కాంచనమాల | 35 |
| భానుమతి | 37 |
| గత సంవత్సరపు కాంచనమాల | 42 |
| ఎల్వీ. ప్రసాద్ | 44 |
| డి.మధుసూదన రావు | 46 |
| సెల్వరాజ్ | 50 |
| దేవులపల్లి | 54 |
| సి.నారాయణ రెడ్డి | 57 |
| విఠలాచార్య | 60 |
| సినిమాటోగ్రఫీ అన్నయ్య | 64 |
| షావుకారు జానకి | 66 |
| బి.ఎన్.రెడ్డి – 1 | 69 |
| బి.ఎన్.రెడ్డి – 2 | 72 |
| యద్దనపూడి సులోచనారాణి | 75 |
| నాగభూషణం | 77 |
| మాస్టర్ వేణు | 81 |
| ఎమ్.మల్లికార్జునరావు | 85 |
| దాసం గోపాలకృష్ణ | 88 |
| కె.ఎస్.రెడ్డి | 89 |
| సుందర్ లాల్ నహతా | 91 |
| పాలగుమ్మి పద్మరాజు | 94 |
| పి. దేవరాజ్ | 96 |
| ఎ.పుండరీకాక్షయ్య | 98 |
| జి. వీరయ్య | 102 |

# అక్కినేని నాగేశ్వరరావు ఆత్మకథ

## ( చిత్రసీమ 1957 ఆగస్టు నుంచి పునర్ముద్రితం)



అక్కినేని నాగేశ్వరరావు.

నేను ఆంధ్రప్రదేశ్ లో కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా వెంకట రాఘవపురం అనే చిన్న పల్లెటూరులో 20-9-1924 న జన్మించాను. మాది సామాన్య రైతు కుటుంబం. మా తండ్రిగారు అక్కినేని వెంకటరత్నంగారు. మా అమ్మ పున్నమ్మగారు ఆ దంపతులకు పుట్టిన వారందరూ మగవాళ్ళే. వారిలో నేను కడగొట్టు కొడుకును. నా అయిదవ ఏటే మా నాన్నగారు చనిపోయారు. పసివాడనైన నన్ను మా అమ్మగారి పోషణలో ఉంచినా, నా యోగక్షేమాలన్నీ మా పెద్దన్న శ్రీ రామబ్రహ్మం గారే చూస్తూ వుండేవారు. నా 12 వ ఏట, మా పొరుగూరు పెదవిరివాడలో చదువు మొదలుపెట్టాను. మా ఊరి పిల్లలు ఏటేటా స్కూలులో నాటకాలాడేవారు. మా అన్నయ్యకు నాటకాలంటే అభిమానం అమ్మకు ఆడపిల్లలంటే అమిత ప్రేమ. నటనంటే నాకూ ఏదో అర్థం కాని సరదా. ఇంకేం పిల్లల నాటకంలో వేషం వేశాను. అంతా బాగుందని మెచ్చుకున్నారు. మా అన్నయ్యా, అమ్మా ఆనందానికి అంతులేదు. అదే నా నటజీవితానికి నాంది.

తరువాత రెండవ ఫారం చదువుతూ ఉండగా, హిందీ మాధ్యమిక పరీక్ష పూర్తి చేశాను. అప్పుడే, మా ప్రక్క ఊరు 'కుదరవల్లి' లో కొందరు మిత్రులు 'కనకతార' నాటకం ప్రదర్శించే ప్రయత్నాలు చేస్తున్నారు. అన్నయ్య ఆ నాటకంలో 'తార' వేషం వెయ్యమన్నాడు. ఆడపిల్ల వేషం గనక, అమ్మ కూడా తలూపింది. సాగుతున్న చదువు మానేసి, నాటకరంగంలో ప్రవేశించడం నాకంతగా నచ్చలేదు. కాని 'చదువు సాగించినందువల్ల ఉన్న నేల కాస్తా పోవడమే గాని, నువ్వు చేసే పెద్ద ఉద్యోగాలేమిట'ని వారివాదం. పెద్దవాళ్ళ మాట శిరసావహించి, ఆ నాటక సమాజంలో చేరి, బాగా ప్రాక్టీస్ చేసి, కనకతార ప్రదర్శించాం. చూచిన వారంతా బాగుందన్నారు. నా వేషానికి ప్రత్యేక ప్రశంస వచ్చింది. ఇక మా వాళ్ళ సంతోషం చెప్ప శక్యం కాదు. ఆ నాటకాలలో అభినయిస్తూ, విశ్రాంతి దొరికినప్పుడల్లా పొలం పనికి వెళ్తూ వుండేవాణ్ణి. నేను వ్యవసాయం చెయ్యడం అన్నయ్యకు ఇష్టం లేదు. పేరు ప్రతిష్టలున్న నటులు పాల్గొనే పెద్ద నాటక సంఘాలలో ప్రవేశపెడితే, నేను త్వరగా పైకి రాగలనని వారి భావం. అందుకోసం పనిగట్టుకుని ప్రఖ్యాత నటులతో నాకు పరిచయం కలిగించారు. తత్ఫలితంగా, శ్రీ స్థానం, శ్రీ మాధవ పెద్ది, శ్రీ సూరిబాబు మొదలైన ప్రముఖ నటులతో కలిసి, నాలుగైదు నాటకాలలో వేషాలు ధరించి నటించాను. వేసినవి చిన్న వేషాలైనా, నన్ను వారభిమానించి, నాలో పైకి రాదగిన లక్షణాలున్నాయనీ, రాగలననీ మా అన్నయ్యకు చెప్పారు. ఆయన ఉత్సాహం, సంకల్పం, మరికొంత బలపడినై.

అప్పుడు ధర్మపత్ని చిత్రం తీస్తున్న శ్రీ పి.పుల్లయ్యగారికి నాకేదైనా అవకాశం ఇప్పించమని శ్రీ కాజ వెంకట్రామయ్య గారి చేత సిఫారస్ చేయించారు. వారూ అంగీకరించారు. కొల్హాపూర్ పంపించారు. రెండు మాసాలు గడిచిన తర్వాత బడిపిల్లలు ఆడుకునే ఒక ఘట్టంలో వారితో పాటు నేను పాడుతూ ఆడుకున్నాను. ఆ చిత్రంలో నేను చేసిన పని అంతే.

ఇంటికి వచ్చేశాను. అప్పుడు రామచంద్రపురం నుంచి వచ్చిన శ్రీ వై.భద్రాచార్యులు గారు, గుడివాడలో నాటకసంఘం పెట్టి, నాటకాలాడుతూ వుండేవారు. వారివద్ద నన్ను మా అన్నయ్య ప్రవేశపెట్టారు. నేను కొద్దో గొప్పో పాడేవాణ్ణి. శ్రీ మోటూరు వీరరాఘవయ్య, మునిస్వామిగార్ల వద్ద పాటలూ, పద్యాలూ నేర్చుకున్నాను. శ్రీ భద్రాచార్యులు గారి సమాజంలో పెద్ద నటులమధ్య చాలా ఆడవేషాలు వేశాను. వారందరూ నన్ను ఎంతగానో ప్రోత్సహించేవారు. క్రమంగా నాకూ ధైర్యం ఏర్పడి; నటించాలనే ఆశా, శ్రద్ధా కలిగినై.

ఈ పరిస్థితుల్లో శ్రీ కడారు నాగభూషణం గారు 'తల్లిప్రేమ' చిత్రం నిర్మిస్తూ, అందులో ఏదో వేషం ఉందని తీసుకు వెళ్ళారు. కొన్నాళ్ళున్న తర్వాత ఆ వేషానికి, పదహారేళ్ళ వయస్సున్న నేను పెద్దవాణ్ణని నిర్ణయించారు. దాంతో కథ కంచికీ నేనింటికీ. మామూలు నాటకాలు ప్రారంభించాను. నాకు లేని ఆశాభంగం, నిరుత్సాహం, మా అన్నయ్యకు కల్గినై.

తర్వాత గుడివాడలో శ్రీ బుద్ధిరాజు శ్రీ రామమూర్తిగారు బడి పిల్లలతో వేయించిన 'విప్రనారాయణ' నాటకంలో 'దేవదేవి' పాత్రను నటించాను. ఆ నాటకం చూచినప్పుడు ప్రస్తుతం అన్నపూర్ణ పిక్చర్స్ అధినేత శ్రీ దుక్కిపాటి మధుసూధనరావు, సినిమా నటులు శ్రీ కోడూరు అచ్చయ్య గార్లు నాకు రజత పాత్రలను బహూకరించారు. నన్ను వారి కంపెనీలో నాయిక పాత్ర వేయడానికి రమ్మన్నారు. వారు గుడివాడ తాలూకా ముదినేపల్లిలోని 'ఎక్సల్షియర్ డ్రమెటిక్ అసోషియేషన్' కు నన్ను, తీసుకు వెళ్ళారు. అక్కడ శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు సంగీత దర్శకులుగా, శ్రీ కె.గోపాలరావు మేకప్ మాన్ గా వుండేవారు. 'ఆశాజ్యోతి' అనే నాటకాన్ని ఆరుమాసాలు ప్రాక్టీస్ చేశాం. ఆ సాధనలో శ్రీ అచ్చయ్యగారు నాకు ఎంతో సహాయపడ్డారు. నాటకం ప్రదర్శించాం. ప్రజాదరం పొందింది. తరువాత 'సత్యాన్వేషణం', 'తెలుగుతల్లి' నాటకాలు కూడా ప్రాక్టీస్ చేసి, ఆంధ్రదేశంలో వివిధకేంద్రాల్లో ప్రదర్శించాం. మా కంపెనీకి, నాకూ మంచిపేరూ, ప్రఖ్యాతి వచ్చినై. ఈ కాలంలో నటనను గురించి, రంగస్థలం మీద నటుడు, క్రమశిక్షణాబద్ధుడై ఎంత మహోజ్వల భవిష్యత్ ను సృష్టించుకోగలడోననే విషయాల్ని గురించీ ఎంతో నేర్చుకున్నాను. ఆ సమయంలో నేనూ, శ్రీ మధుసూధనరావు గారూ చాలా సన్నిహితులమైనాము. నన్నెంతో ఆదరంతో చూడడమేగాక, నా జీవిత పురోగమనానికి కావలసిన సంస్కార సామగ్రిని సమకూర్చారు. ఈ నాటికి నా శ్రేయోభిలాషులలో ముఖ్యులుగానున్నారు.




ఒకనాడు తెనాలిలో నాటక ప్రదర్శనం ముగించుకుని, గుడివాడకు వెళుతూ, దారిలో బెజవాడ స్టేషనులో ఉన్నాం. అక్కడ ప్రతిభా పిక్చర్సు అధినేత శ్రీ ఘంటసాల బలరామయ్య గారు, వారి కెమేరామాన్ శ్రీధర్ గారు నన్ను చూచారు. 'సినిమాలో నటించడానికి వస్తావా?' అని అడిగారు. 'మా

పెద్ద వాళ్ళతో మాట్లాడ'మన్నాను. అందరం కలిసి వెళ్ళాం. నా శ్రేయోభిలాషులతో సంప్రదించారు, మా వాళ్ళు అంగీకరించారు. కాని ఆడవేషాలు వేస్తూన్న నేను, వారి 'సీతారామ జననం'లో శ్రీ రాముని వేషం ధరించాలి అనేటప్పటికి, నాకు సందేహమూ, భయం కలిగాయి. మా అన్నయ్య పట్టుదల శ్రీమంగయ్య గారి ధైర్యవచనాలు, నన్ను ప్రోత్సహించాయి. శ్రీ మధుసూధనరావు గారి సలహాపై నెలకు ఇరవై రోజులు మద్రాసులో ఉండేటట్లు, మిగతా పది రోజులూ నాటకాలు వేసుకునేటట్లు ఏర్పాట్లు చేసుకున్నాం.

1944 వ సంవత్సరం మే నెల 8 వ తేదీన మద్రాసు వచ్చాను. ప్రతిభా పిక్చర్సులో సినీ జీవితం మొదలు పెట్టాను. ఆ తర్వాత శ్రీ బలరామయ్య గారు అనుమతి ఇవ్వనూ లేదు, నేను నాటక ప్రదర్శనాలకు వెళ్ళనూ లేదు; అక్కడ నాటక కంపెనీ నడవనూ లేదు.

ఇక్కడ సీతారామజననం ప్రారంభమైంది. వేషం వేసుకుని కెమేరా ముందు నిలబడ్డ నాకు వణుకు ఆరంభమైంది. వేలాదిజనం ముందు రంగస్థలం మీద నటించిన నాకు ఇక్కడ కాలు నిలువలేదు. ఒళ్లంతా ముచ్చెమటలు పోసినై నన్ను నేనే గిల్లుకుని, ధైర్యం చెప్పుకున్నాను. 'రెడీ' అన్నారు షాటు తీశారు. 'ఓ.కె.' అని బలరామయ్య గారు వెన్ను తట్టారు. అంతటితో వణుకు తగ్గింది. ఆ ప్రధమ చిత్ర నటనానుభూతి, ఆ ఘడియలు, అప్పటి మనోభావాలూ, ఇన్నేళ్ళ తర్వాత, ఇప్పటికీ నేను మర్చిపోలేదు. చిత్రం విడుదలైన తర్వాత ప్రజలేమనుకున్నారో నాకు తెలీదు. కాని నా ఆడనడకలు, కులుకులు, పలుకులు పట్టివ్వ లేదనే నిర్మాతలు చెప్పారు.

సీతారామ జననం తీస్తూ ఉండగానే మాయలోకం నిర్మించదలుచుకున్న శ్రీ గూడవల్లి రామబ్రహ్మం గారికి నా వయసు గల హీరో కావలసి వచ్చాడు. శ్రీ మధుసూధనరావుగారి ప్రయత్నమూ, శ్రీ చల్లపల్లి రాజా వారి సిఫారసు వల్ల నన్నా చిత్రంలో హీరోగా తీసుకున్నారు. మాయలోకం సగభాగం పూర్తయిన తర్వాత శ్రీ రామబ్రహ్మంగారికి నా మీద అవ్యాజానురాగం కల్గింది. నన్ను వారింటిలోనే ఉండమన్నారు. నన్నెంతో ప్రేమతో చూసేవారు. ఎంతో పెద్దవాణ్ణి చేయాలని ఆశపడుతున్నట్లు చెపుతుండేవారు. నేను కూడా ఆ చిత్రంలో హేమాహేమీలైన నట నటీమణుల మధ్యపడి రాణిస్తే, నా భవిష్యత్ కు సుస్థిరత ఏర్పడుతుందని ఆత్మ విశ్వాసంతో, పట్టుదలతో, అందరి ఆదరణాభిమానాలకోసం కృషి చేశాను.

నా మొదటి అయిదు చిత్రాల వరకూ శ్రీ రామబ్రహ్మం గారూ, శ్రీ బలరామయ్య గారే సినిమా పరిశ్రమలో నాకు బాగా తెలిసిన నా శ్రేయోభిలాషులు. వారిద్దరికి నేనెంతో ఋణపడివున్నాను. అది తీర్చుకునే అవకాశం నాకు లభించేముందే వారిద్దరూ ఒకరి తర్వాత ఒకరు ఈ ప్రపంచంతో ఋణం తీర్చుకుని వెళ్ళిపోయారు. ఈ నాటికి వారికి నేను ఋణస్థుణ్ణిగానే ఉండిపోయాను.

'తల్లి ప్రేమ'కు వచ్చినప్పుడే పరిచయులైన శ్రీ డి.యల్.నారాయణ గారు, భరణీ వారి ప్రథమ చిత్రం 'రత్నమాల' లో నటించే అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఆ సంస్థలో ఆరు చిత్రాలలో నటించాను. నేను ఎక్కువ చిత్రాల్లో పాల్గొన్న సంస్థ అదే.

అప్పటికి యుద్ధ మేఘాలు పూర్తిగా విచ్చిపోవడం, దేశంలో శాంతి సుభిక్షాలు ఏర్పడడం, వర్తక వ్యాపారాలు విరివిగా సాగడంతో, సినిమా పరిశ్రమకు కూడా క్రొత్త బలం, క్రొత్త చైతన్యం వచ్చింది. ఎందరో కొత్త ప్రొడ్యూసర్లు, క్రొత్త నటులు, క్రొత్తరకం చిత్రాలు, క్రొత్త క్రొత్త విలాసాలూ, వెలుగులూ వచ్చినై. అనేక సమస్యలను పరిశ్రమా, పరిశ్రమలో పనిచేసే మా నటవర్గమూ ఎదుర్కోవలసి వచ్చింది. క్రొత్తరకం చిత్రాలకోసం నిర్మాతలు, ఆ పాత్ర ప్రదర్శన కోసం మేమూ అహో రాత్రులు కృషిచేశాం. అలాగే వాగులూ వంకలూ దాటుతూ, పల్లాలూ ఎక్కి దిగుతూ, ఈనాటికి అరవై చిత్రాలలో నటించాను. ఈ మాట నేను మనవి చేసేది, నాతో సన్నిహిత సంబంధంకల పారిశ్రామికులకూ, సోదర నటవర్గానికే గాదు. నావలె ఆశలు పెంచుకుంటూ సినిమా పరిశ్రమలో చేరి, పేరు ప్రఖ్యాతులు సంపాదించుకో దలచుకున్న యువకులకు చెబుతున్నాను. సత్యం చెపుతున్నాననేగాని, గొప్పకోసం చెప్పడం లేదు. నేటి ఆనందం సులభంగా వచ్చింది కాదు. నటజీవితం పూవుల సెజ్జ అంతకు ముందే కాదు, సైనిక విజయాలకోసం కత్తిగట్టి పోరాడే వీరజీవితానికీ, కళావిజయానికి గజ్జకట్టి ఆడే నటజీవితానికీ తేడా లేదనే నా

ఊహ. నా అనుభవం కూడా అంతే. పౌరాణిక చిత్రంతో రంగ ప్రవేశం చేసి, జానపద చిత్రాలలో శిక్షణపొంది, సాంఘీక సమస్యా చిత్రాలలో నూతనానుభవాలను ఎదుర్కొని. భిన్న విభిన్న ప్రకృతులుగల పాత్రలను నటింపవలసి నప్పుడు నేను పడిన బాధలు, చేసిన సాధన, దర్శకులు చేసిన సహాయ్యం చాలామందికి తెలీదు. ఏ ఒక్క చిత్రంలో, నిర్మాత నన్ను ఎన్నుకోవడం పొరబాటయినా, ఏ పాత్రాభినయంలోనైనా నేను తప్పటడుగులేసినా, ఆ చిత్రమూ, నిర్మాత నేనూ పరాజయం పొందవలసిందే. మళ్ళీ ప్రజలముఖం చూచే అవకాశం ఉండదు.

కత్తిపై సాముపంటి కళాసాధనలో నేనిలాటి పరీక్షకే గుర్రైనాను. బాలరాజునుంచి బాలచంద్రుడు ఒక గెంతు వీరరస ప్రధానమైన ఆ పాత్రనుంచి లైలామజ్నులో భగ్న ప్రేమికుడైన ఖైస్ పాత్రకు మరో గెంతు. ఆ పాత్ర పులకరిస్తుంది. ఆ తర్వాత నేనెదుర్కొన్న మరొక పాత్ర సంసారంలో. ఇంతవరకూ సంపాదించుకున్న ప్రజాదరం సాంఘిక చిత్రంలో ఎక్కడ చేజారిపోతుందో అని క్షణక్షణమూ వణికిపోయేవాణ్ణి. ఆ చిత్రం విజయవంతమైన తర్వాత సాంఘిక చిత్రాలంటే బెదురు పోయింది. ఏ పాత్రనైనా నటించగలనన్న ఆత్మవిశ్వాసం ధీమా కల్గింది.

లైలామజ్ను తీసే రోజుల్లోనే నాకు వివాహం జరిగింది: దెందులూరు వాస్తవ్యులు శ్రీ కొల్లిపర వెంకట నారాయణగారి కుమార్తె అన్నపూర్ణా దేవిని 1949 సంవత్సరం ఫిబ్రవరి 18 వ తేదీన వివాహమాడాను. మాకిప్పుడు ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు సత్యవతి, నాగ సుశీల, ఒక మగపిల్లవాడు వెంకట నారాయణరావు. నా నట జీవితంలో కళారాధనకు పూర్తిగా నన్ను అంకితం చేసుకుని, రోజుకి రెండు, మూడు కాల్ షీట్స్ కూడా పనిచేస్తూ, ఒక్కొక్కప్పుడు వారాల తరబడి ఇంటిపట్టున అరగంట కూడా వుండలేకపోతూ, నా స్వంత జీవితంలో అర్థంగాని ఆవేదన పడిన సమయాలున్నాయి. కాని నటుడు కళాతపస్సులో నిమగ్నుడయిపోయాకా, లక్ష్యసిద్ధికోసం, కొన్ని త్యాగాలు అవసరమని స్వానుభవం వల్ల గుర్తించాను.

తర్వాత నేను నటించిన చిత్రాలలో, ఒకే రకానికి చెందక, అన్నదమ్ముల పోలికలున్న పాత్రలు అనేకం నా పాలబడినై. వాటిలోగల వైవిధ్యానికి లోపం రాకుండా, విశిష్టత కనిపించేలగు నటించవలసి వచ్చింది. ఆ లక్ష్య సాధనలో ఆయా చిత్రాల దర్శకులు ప్రత్యేక శ్రద్ధ చూపించి, నాకు కళాసిద్ధి కలిగించారు.

నన్ను కలవరపెట్టిన మరొక చిత్రం 'పరదేశి'. అంతవరకూ వేసినవి పడుచు వేషాలు. ఈ చిత్రంలో ముసలి వేషం, నడక, ఉచ్చారణ వచ్చింది. చాలా ఇబ్బంది పడ్డాను. కన్నతల్లిలో వేషం కష్టమైనా, పల్లెటూరి వాతావరణంలో పుట్టి పెరిగిన నాకది నల్లేరుపై బండి నడకగా సాగిపోయింది. నా అభిమాన వేషాల్లో అదొకటి.

'దేవదాసు' చిత్రం వచ్చింది. నాలోనూ, దేశంలోనూ గాలి దుమారం రేగింది. నేనాపాత్ర నిర్వహణకు పనికిరానని చాలా మంది సందేహాలు వెలిబుచ్చారు. అనేకమంది ఆక్షేపించారు. ఆ ఆక్షేపాలే నాలోని పట్టుదలను పెంచాయి. ఇంతమంది కాదన్న పనిని జయప్రదంగా నిర్వహించాలని ప్రత్యేక శ్రద్ధతో నా సమస్త శక్తులనూ కేంద్రికరించి కృషి చేశాను. నా శ్రమ ఫలించి, చిత్రం తెలుగు, తమిళ భాషలలో అఖండ విజయం సంపాదించింది. నిర్మాత, దర్శకులు, సాంకేతిక వర్గం, సోదర నటవర్గం, ఈ చిత్ర విజయానికై ఎంతో కృషిచేసి సాయపడ్డారు. ఈ చిత్రంతో నా నట గౌరవం పెరిగింది. ప్రజానీకం ఉత్తమచిత్రాన్ని సమిష్టి కృషిని – భేదభావాలు, వ్యక్తిగత అభిప్రాయాలూ, అసూయలూ లేకుండా ఎంత మెచ్చుకుంటుందో, నీరాజనమిచ్చి ఎంతగా హర్షించి, ఆనందిస్తుందో తెలుసుకున్నాను.

తర్వాత ప్రత్యేకించి చెప్పుకోదగ్గ ఘట్టం. విప్రనారాయణ, మిస్సమ్మ, అర్థాంగి, దొంగరాముడు, రోజులు మారాయి, అనార్కలి, భలేరాముడు, తెనాలి రామకృష్ణ మొదలగు చిత్రాలలో ఒకేసారి నటించవలసి వచ్చింది. ఆ చిత్రాల్లోని నా పాత్రలు ఎలాంటివో మీరందరూ చూసినవే. ఒకేసారి అంత విభిన్న ప్రకృతులుగల పాత్రలను (ఒకేనాడు రోజుకు రెండు కాల్ షీట్సు కూడా ఉండేవేమో) నటించవలసి వచ్చేది వేషాలైతే క్షణంలో మార్చగలను కాని, మనసు, ఆవేశం మార్చుకోవడం ఎలా ? ఒక పాత్ర స్వభావం మరొక పాత్రమీద పడేది. అడుగడుగునా

విభ్రాంతి కలిగి, సలహా కోసం దర్శకులవైపు చూచేవాణ్ణి, వారు నన్ను దారిలో పెట్టేవారు. నేను ముందుకు నడిచి వెళ్ళేవాణ్ణి. కొన్ని చిత్రాలలో మాటలెక్కువై, పలుకుబడి కోసం బాధ పడితే, 'చరణదాసి', 'ఇలవేలుపు' చిత్రాలలో మాటలు తక్కువై, భావ ప్రదర్శనమే ప్రధానమైన పాత్రలు నటించవలసి వచ్చింది. అట్లాంటప్పుడు చెమటలు పట్టి అవస్థపడి, దర్శకుల సహాయంతో బయటపడే వాణ్ణి. ఈ వివిధ ప్రకృతులు గల పాత్రల నుంచి నేను నేర్చుకున్నది ఇంతా అంతా కాదు.

ఆ తర్వాత 'తోడికోడళ్ళు', 'సావిత్రి', 'అల్లావుద్దీన్', 'మాయాబజార్', 'సువర్ణసుందరి', 'దొంగల్లో దొర' చిత్రాలతో అరవై చిత్రాలు పూర్తి అయినై.

ఈ చిత్ర జీవిత సంగ్రామంలో జయించినప్పుడల్లా ఏనుగనెక్కినంత సంబరంతో పొంగుతూ చిత్రం ప్రజాదరం పొందనప్పుడు వైకుంఠపాళీలో పాములతో చెలగాటంలా క్రుంగిపోతూ, నా లక్ష్యాన్ని మరువకుండా, విడవకుండా సాధన చేశాను. ఏమి సాధించానో నిర్ణయించే రసికులు మీరే.

# సూర్యప్రభ

## ( తెలుగు సినిమా 1950 డిసెంబర్ నుంచి పునర్ముద్రితం)




సినిమా ప్రేక్షకులకు సూర్యప్రభతో పరిచయం 'మాలిని' చిత్రం తర్వాత కలిగిందే కాని సినిమా పరిశ్రమతో ఎంతో కొంత సంబంధం వున్న మాకందరికీ సూర్యప్రభ చిరపరిచితురాలు. ఆంధ్రమహిళా సభలో సూర్యప్రభ బెనారిస్ మెట్రిక్యులేషన్ పరీక్షకి చదవటం దగ్గిర్నించి, ఆమె నాటకాలలో నటించడం వరకూ మేము చూస్తూనే వున్నాం.

అందాల తార అనే పేరు తెచ్చుకున్న శ్రీమతి పుష్పవల్లి చెల్లెలు సూర్యప్రభ. అందువల్లే సూర్యప్రభతో మాకందరికీ చాలా కాలం నించీ పరిచయం కలిగింది.

సూర్యప్రభ కూడా పెంటపాడులోనే జన్మించింది. ఆమె తండ్రి పేరు కందాళ తాతాచారి. 1930వ సంవత్సరంలో జననం. ఆమె అక్క పుష్పవల్లి సినిమా

నటన వృత్తిగా స్వీకరించటం సూర్యప్రభ జీవితంలో ముఖ్యపరిణామం తీసుకొచ్చింది. చిన్నతనంలోనే అక్కతో బాటు మద్రాసుకి వచ్చేసిందీమె.

సినిమారంగంతో ఎటువంటి సంబంధం లేని, సినిమా నిర్మాణం గురించి ఏమీ తెలియని వుత్సాహవంతులయిన యువతీ యువకులకు సినిమా పరిశ్రమ గురించి కొన్ని అభిప్రాయాలు వుంటాయి. కావలసినంత డబ్బు, మోటారుకార్లు; సోఫాలతో, తివాసీలతో, వెండివస్తువులతో నిండిన వైభవంగా వుండే భవనాలు; పత్రికల్లో తమ ఫోటోలు; ప్రజలు తండోపతండాలుగా అభిమానంతో తమ దర్శనం కోసం నిరీక్షించటం, సినిమా నిర్మాతలు, నటీనటులతో తమతో సన్నిహితంగా వుండటం, ఎలక్ట్రిక్ దీపాలతో, కళాకాంతులతో వెలిగే, సినిమా స్టూడియోలు; సినిమా పరిశ్రమ గురించి చాలా మందికి యిటువంటి అభిప్రాయాలుంటాయి.

సినిమా పరిశ్రమతో పరిచయం వుండి; సినిమా మనుష్యులతో నిత్య సంబంధం వున్న సినిమా నిర్మాణం గురించి తెలుసున్న సూర్యప్రభకి ఎన్నడూ యిటువంటి అభిప్రాయాలు లేవనే చెప్పాలి.

బుకింగ్స్ లేని ఆర్టిస్టులు పడే తిప్పలూ; డబ్బు ఇవ్వని నిర్మాతలతో నటీనటులు పడే అష్టకష్టాలు; వ్యక్తిగత దూషణలతో నిండే సినిమా పత్రికలు; మేకప్ వేసుకుని ఎండలో, ఎండకన్నా తీవ్రమైన ఎలక్ట్రిక్ దీపాల్లో గంటల తరబడి నిలబడడం; యివన్నీ సూర్యప్రభకి తెలిసిన విషయాలే.

నటీమణిగా ఖ్యాతి సంపాదించుకొనటం వల్ల కలిగే భౌతిక, ఆర్థిక లాభాలూ, మానసిక ఆనందమూ ఆమెకి తెలుసు. నటీమణిగా విజయాన్ని సంపాదించలేకపోతే కలిగే చిక్కులు, అసంతృప్తితో కలిగే సంక్షోభమూ; దురభిమానంతో కలిగే బాధ ఆమెకి పూర్తిగా తెలుసు. ఇందువల్లే పదిహేనో ఏడువరకూ సినిమాల్లో నటించటానికి సూర్యప్రభ ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. చిన్నతనంలోనే సినిమాల్లో చేరాలని సూర్యప్రభ వుత్సాహపడి వుంటే, పరిశ్రమలో పరపతి వున్న శ్రీమతి పుష్పవల్లి ఆ అవకాశం అప్పుడే లభింపచేసి వుండేది.

'నటన'లో సూర్యప్రభ మొదటి అనుభవం రంగస్థలం మీదే. 1944 వ సంవత్సరంలో ఆంధ్రమహిళా సభ వారు 'అనార్కలి' అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఆ నాటకంలో సూర్యం (మేమంతా చనువుగా యిలా పిలుస్తాం) రాణి పాత్ర నటించింది.

నిజం అంగీకరించ వలసి వొస్తే ఆనాడు మేము ఎవరం కూడా సూర్యప్రభ సినిమా తారగా తయారవుతుందని అనుకోలేదు.

ఆమె విగ్రహం ఆకర్షణీయంగా వుంటుంది. పొడుగు పొడుక్కి తగ్గ లావు; యీ రెంటికీ తగ్గ అంగ సౌష్టవమూ; సన్నని నడుము; వెడల్పాటి కళ్ళు; తీర్చి దిద్దిన ముఖరేఖలూ, కళకళలాడే మొహమూ; యీమెలో ఆకర్షణలు. కలుపుగోరుతనంగా వుండి, అపరచితులను కూడా సన్నిహితులుగా చేసుకోవడం యీమెకి బాగా చాతనవును. అయినప్పటికీ యీమెకి ఆత్మాభిమానం కొంచెం ఎక్కువే. ఎవరయినా ఆమెని పల్లెత్తు మాట అంటే సంహించదు. స్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో టీచర్ ఒక రోజున సూర్యప్రభ ఆలస్యంగా వొచ్చినందుకు కొంచెం గట్టిగా కోప్పడేటప్పటికి చరచర నడుచుకుంటూ స్కూల్లోంచి వెళ్లిపోయింది.

ఆంధ్రమహిళ సభలోనే శ్రీమతి సామ్రాజ్యం వద్ద నాట్యం నేర్చుకోవటం ప్రారంభించింది. తర్వాత శ్రీ వేదాంతం రాఘవయ్య గారి వద్ద నేర్చుకున్నది.

సూర్యప్రభ ప్రారంభంలో తమిళ సినిమాలో నటించింది. 'మిస్ మాలిని' ఆమె మొదటి చిత్రం. అక్క చెల్లెళ్ళు యిద్దరూ యీ చిత్రంలో నటించారు. తర్వాత చిత్రం 'చక్రధారి'. తెలుగు సినిమాలో మొదటి సారి స్వతంత్రా వారి 'ద్రోహి'లో కనిపించింది. ఆ చిత్రంలో ఈమె నటించలేదు. కంపెనీ ఎంబ్లంగా నిలబడ్డది. ఈమె మొదటి చిత్రం ప్రతిభావారి 'లక్ష్మమ్మ'. తిలోత్తమలోను, వినోదా ప్రొడక్షన్స్ వారి చిత్రంలోనూ, 'మంగళ' లోనూ ఈమె నటిస్తున్నది.

శ్రీమతి అంజలీదేవి సినిమాల్లో ప్రవేశించినపుడు, డాన్సుచేసే నర్తకి పాత్రలు ఆమెకి ప్రత్యేకించబడ్డాయి. కేవలమూ డాన్సు చేయటమే కాక, నటించడం కూడా ఆమెకి చాతనవును అని గ్రహించిన తర్వాత అంజలీ దేవిని ముఖ్యపాత్రలకి తీసుకోవడం ప్రారంభించారు. అంజలీ దేవి ఖాళీ చేసిన స్థానాన్ని సూర్యప్రభ ఈనాడు ఆక్రమించింది.

డాన్సు చేయవలసిన పాత్రలు సూర్యప్రభకి ప్రత్యేకిస్తున్నారు ఈనాడు. అయినప్పటికీ అంజలీదేవిలాగే సూర్యప్రభకూడా ప్రధమ శ్రేణి నటీమణుల జాబితాలోకి త్వరలో చేరవచ్చునని ఆశించవచ్చు.

ఈమె చాలా తమిళ చిత్రాల్లో కూడా నటిస్తున్నదీనాడు. తెలుగు మనిషి అయిన సూర్యప్రభకి ముందు తమిళులు తారాపధాన్ని అందిస్తున్నారు. కనీసం అదే సమయానికి తెలుగు సినిమాల్లోనూ ఈమెకి యింకా ప్రాముఖ్యం వొస్తుందని ఆశపడుతున్నాము.

★★★

*అదనపు సమాచారం:*

ఈ వ్యాసంలో ఆశించినట్లు తర్వాతి రోజుల్లో సూర్యప్రభ పెద్దగా రాణించలేదు. తర్వాత కొన్ని సంవత్సరాలకి సూర్యప్రభ గారిని వేదాంతం రాఘవయ్యగారు వివాహం చేసుకున్నారు. వారి సంతానమే ఒకనాటి దక్షిణాది చిత్రాల హీరోయిన్ శుభ. కృష్ణ హీరోగా నటించిన గూడుపుఠాణి లాంటి తెలుగు చిత్రాల్లో కూడా హీరోయిన్‌గా నటించారు ఈ శుభ. ప్రముఖ హిందీ తార రేఖకి సూర్యప్రభ పిన్ని ఔతారు.

# నందమూరి తారక రామారావు

## (కినిమా 1952, సెప్టెంబర్ సంచిక నుంచీ)



"పెళ్లిచేసిచూడు"లో

"పాతాళ భైరవి" నాయకుడు తోటరాముడుగా యావదాంధ్రకేగాక, యావద్భారతానికీ, అంతర్జాతీయ సినిమా ఉత్సవాల ద్వారా విదేశీయ సినిమా ప్రతినిధివర్గాలకూ పరిచయం అయిన నందమూరి తారక రామారావు (మీ ఎన్.టి.రామారావు) 1923 జూన్ 15 న గుడివాడ తాలూకా నిమ్మకూరు గ్రామంలో పుట్టాడు.

జూన్ లో పుట్టినవారు "తెలివైన నటులూ, లాయర్లూ, ఉపన్యాసకులూ, జీవిత నాటకంలో మారుతూవుండే పాత్రలు ధరించేవారూ అవుతారు" అని చెబుతారు. వీరిని అర్థం చేసుకోవటం చాలా కష్టం. వీరి మనసులు అతి చురుకుగా వుండి, శత్రువులకు అందుకోరానివిగా ఉంటాయి. ఈ నెలలో పుట్టినవారికి పైకిరావాలనే ఆశ వుంటుందిగాని ఒక స్థాయికి చేరుకునే లోపుగానే దానిమీద విరక్తి

కలుగుతుంది. వీరి ముఖాలు కోలగా వుంటాయి, కళ్ళు అందంగా, చురుకుగా వుంటాయి. వీరికి మిత్రులెక్కువగా వుంటారు. తత్కాలానికి తమ మనసులో మెసిలే మనిషికి వీరు విరివిగా సహాయం చేస్తారు. వీరికి వేగం ఇష్టం. ఈ లక్షణాలలో చాలాభాగం రామారావులో మనం చూడవచ్చు.

రామారావు తండ్రి లక్ష్మయ్య గారు, తల్లి వెంకట రామమ్మ గారు, వారిది రైతువంశం. నిమ్మకూరులో వారి కుటుంబానికి రెండు పెద్ద లోగిళ్ళూ, సుమారైన భూవసతీ వుంది. ఈ నందమూరి వారిలో ఆడపిల్లలు అరుదుగా కనిపిస్తుంది. రామారావుకు మేనత్తలుగాని, అక్కచెల్లెళ్ళుగాని కుమార్తెలు గాని లేరు. అతనికి రామకృష్ణ, జయకృష్ణ అని ఇద్దరు కుమారులున్నారు.

రామారావు తండ్రిగారివద్ద పెరగలేదు. పెత్తండ్రి రామయ్య గారు అతన్ని పెంచి పెద్దచేశారు. రామయ్యగారు విలాస పురుషుడు, దర్జాగా బతికేవాడు. తెల్లబట్ట మాయటానికి వీల్లేదు. "షోకు రామయ్య" గారంటే ఆ ప్రాంతాల అందరికీ తెలుసు. ఆయనే రామారావును పెంచి, పెద్దచేసి, చదువు చెప్పించారు.

రామారావు చదువు నిమిత్తం పదోయేట స్వగ్రామం వదిలిపెట్టి బెజవాడ చేరాడు. ఈ విద్యార్థి దశలో రామారావును చూసినట్టయితే మనకు "పాతాళభైరవి" లోని తోటరాముడు తప్పక స్ఫురిస్తాడు. ఖాకీ లాగూ, చొక్కా ధరించి పాత హెర్క్యులిస్ సైకిల్ మీద సవారి చేసేవాడు. గోదాలోపడి బస్కీలు తీసేవాడు. శరీరం మీద తప్ప మరి దేనిమీదా ధ్యాసలేదు. ఎవరితోనో ఒకరితో పోట్లాడనిరోజు దుర్దినం అది తన పోట్లాటే కానక్కర్లేదు.

కాని ఈ "బండ" అవతారం వెనక ఏదో కళాతృష్ణ దాగివుంది. అతనికి బొమ్మలు వెయ్యాలనే వెర్రి మహావుండేది. బొమ్మలు బాగా వేసేవాడు కూడానూ. 1941–42 లో బెజవాడలో జరిగిన ఆంధ్రరాష్ట్ర విద్యార్థివైజ్ఞానిక మహాసభలలో "రైతు బంధన" అన్న ఇండియన్ ఇంక్ చిత్రానికి ప్రథమ బహుమతి వచ్చింది. ఈ చిత్రంలో ఒక పక్క బంధించిన రైతువుంటాడు. అతడికి యెదురుగా పెద్ద బొర్రవేసుకొని, యికిలిస్తూ జమీందారుంటాడు, రైతు పరికరాలు నేలపై చెల్లచెదురుగా పడివుంటాయి. ఈ చిత్రం రచించినది రామారావు... రామారావు హస్తనైపుణ్యం సాటి విద్యార్థులెరుగుదురు. వారు తమ నోటు పుస్తకాల మీద అతనిచేత తమపేర్లు రాయించుకుంటూ ఉండేవారు.

ఎన్ని యితర గొడవలున్నప్పటికీ రామారావుకు నాటకాల గొడవమటుకు లేదు. "షోకు రామయ్య" గారు స్టేజి మీద వేషాలు వేసేవాడు. ఆయన నుంచి అయినా రామారావుకు నాటకాలపిచ్చి అబ్బింది కాదు. కాని రామారావు యింటర్ చదువుతూవుండగా నాటకంలో వేషం కట్టవలిసిన పరిస్థితి ఏర్పడింది. దీనికి కారకులు మరెవరో కాదు, కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు.

విశ్వనాథవారు తమ కాలేజిపిల్లల చేత ఆడించటానికని "రాచమల్లుని దౌత్యం" అనే నాటిక వ్రాశారు. అందులో నాగమ్మ (నాయకురాలు) పాత్రను రామారావు వెయ్యాలని పట్టుబట్టారు. మొదట రామారావు నిరాకరించాడు, కాని కవిసమ్రాట్ గారి "అక్షింతలు" కొన్ని పడ్డాక ఒప్పుకున్నాడు తాను మీసంతీయకుండా నాగమ్మ వేషం ధరించే షరతుతో :... ఆ ప్రదర్శనం గురించి మనం ఇవాళ తెలుసుకోగలిగిందల్లా యేమంటే_రామారావును తోటి విద్యార్థులు చాలాకాలం "మీసాల నాగమ్మ" అని పిలిచారు. ఈ వేషానికి రామారావుకు రెండవ బహుమతి వచ్చింది.

ఈ బహుమానం పుచ్చుకున్నాక "కోటా" రంగు వాసన రామారావు నరాలకు బలంగా యెక్కినట్టు కనిపిస్తుంది. అతను ఏపని కూడా సౌమ్యంగా చెయ్యలేదు. ఇంటర్ రెండోయేడు ఆరంభిస్తూనే కాలేజి నాటకసంఘానికి ఉపాధ్యక్షుడుగా పోటీ చేసి, నెగ్గి నాటకాలపిచ్చిలో పడ్డాడు. ముద్దుకృష్ణగారి "అనార్కలీ" ఆడించి, అందులో సలీంపాత్ర ధరించాడు. ఆ నాటకం యెంతో విజయవంతమై, మళ్ళీ ఆడవలసివచ్చింది. ఈ సంవత్సరమే అతని వివాహం కూడా జరిగింది. సంవత్సరాంతాన అతను పబ్లిక్ పరీక్షకు కూర్చుని తప్పాడు. 1942 మార్చి లగాయితు 1945

మార్చి దాకా అతను ఇంటర్ పరీక్ష నెగ్గనే లేదు. "పెళ్ళి అయిపోయింది యింక చదువు సాగదు" అన్నారు. కాని రామారావు వదిలే రకం కాదు. 1945 లో ఇంటర్ పూర్తి చేసి బి.ఎ. చదవటానికి గుంటూరు వెళ్ళాడు.

1942 మొదలు 1945 వరకూ రామారావుకు నాటకాల స్పర్శ కూడా పోయింది. కాని తిరిగి కాలేజీలో చేరగానే మళ్ళీ నాటకాలు ఆరంభమయాయి. "నాయకురాలు" నాటకంలో రామారావు "నలగామ రాజు" పాత్ర ధరించగా నాగమణిగారు (శ్రీరంజని భర్త) చూడటం తటస్థించింది. ఆయన ద్వారా రామారావును గురించి సి.పుల్లయ్య గారికి తెలిసింది. ఆయన రామారావు ఫోటోలూ అవీ చూసి తృప్తి పడి, తాము తయారు చేయనున్న "వింధ్యారాణి" చిత్రంలో "శివశ్రీ" పాత్ర ధరించమని కోరారు. ఇది 1946 డిసెంబరులో రామారావు బి.ఏ. పరీక్షకు తయారవుతూ వుండగా జరిగింది. బి.ఏ. డిగ్రీ తెచ్చుకోవాలన్న పంతం మీద రామారావు చదువు నిలపటానికి సమ్మతించలేదు. (తదుపరి శివశ్రీ పాత్రను రమణారావుకిచ్చారు.)

రామారావు సినిమా నటుడి జీవితానికి బీజం ఎప్పుడు పడిందీ చెప్పటం కష్టం. ఇటువంటి చిక్కే యితర సినిమా నటుల జీవితాలలోనూ కనిపిస్తుందేమో మరి. 1947 ఏప్రిల్ 11 న రామారావు పరీక్షలు అయిపోయాయి. అతను బెజవాడకు తిరిగి వెళ్ళాడు. ఏప్రిల్ 14 న డైరెక్టర్ ప్రసాద్ గారు బెజవాడలో ఉన్నారు. ఆ రాత్రి దాదాపు అర్ధరాత్రివేళ దుర్గాకళామందిరంలో ప్రసాద్ గారు "రైతుబిడ్డ" చిత్రం ప్రైవేటుగా వేసుకొని చూసుకుంటూ వుండగా రామారావు ఆయనకు పరిచయం చేయబడ్డాడు. ఆ అపరాత్రి వేళ డైరెక్టర్ ప్రసాద్ కు రామారావును దీక్షగా పరిచయం చేసిన వ్యక్తి స్టిల్స్ తీసే మణ్యంగారు.

రామారావును చూస్తూనే డైరెక్టర్ ప్రసాద్ గారు అతనికి సినిమాలో మంచి భవిష్యత్తు వున్నదని గ్రహించినట్టు కనిపిస్తుంది. 1947 మే నెలలో రామారావు మద్రాసు చేరాడు. అప్పట్లో సారధీ ఫిలిమ్స్ వారు "శ్రీమతి" అనే చిత్రం తీద్దామనుకుంటున్నారు. వారు శోభనాచల స్టూడియోలో రామారావుకు టెస్ట్ తీయించారు. "శ్రీమతి" చిత్రం తీసే ప్రయత్నం విరమించుకోబడింది. కాని ఎం. ఆర్. ఏ. వారు తీద్దామనుకుంటున్న "మనదేశం" చిత్రంలో పోలీసు అధికారి పాత్రకు రామారావు బుక్ అయినాడు. అయితే ఆ చిత్రం 1947 లో ప్రారంభమే కాలేదు.

తిరిగి 1948 జనవరిలో రామారావు మద్రాసుకు వచ్చి "పల్లెటూరి పిల్ల" లో "జయంత్" పాత్రకు బుక్ అయినాడు. 1949 లో "సంసారం" లో "రఘు" పాత్రకూ. "మాయారంభ" లో "నలకూబరుడు" పాత్రకూ, విజయావారి "షావుకారు" లో "సత్యం" పాత్రకూ బుక్ అయినాడు. "షావుకారు" లో నటిస్తూ ఉండగానే రామారావు విజయ వారి పర్మనెంట్ ఆర్టిస్టు అయి "పాతాళ భైరవి" లోనూ, వాహినీ వారి "మల్లీశ్వరి" లోనూ, విజయ వారి "పెళ్ళి చేసి చూడు" లోనూ నటించాడు.

సినిమా నటుడుగా రామారావును ఈనాడు అందరూ ఎరుగుదురు, అతన్ని అంచనా కట్టటం కూడా ఏమంత కష్టంకాదు.

రామారావుది చాలా అందమైన విగ్రహం. మొదట్లో కొంచెం స్థూలంగానూ, మొరటుగానూ ఉన్నాడనిపించేది గాని రాను రాను చాలా నాజూకుగా, నేవళంగా తయారైనాడు. ఇవాళ తెలుగు తెరమీద రామారావుకన్న ఆకర్షవంతమైన వ్యక్తి లేడంటే అతిశయోక్తి కాదు. అతని నటన పాత్రకు "చాల లేదు" అన్న విమర్శ ఎన్నటికీ కలగదు. అతను అవసరమైన దానికన్న కాస్త యెక్కువే నటిస్తాడుగాని తగ్గడు. అందుచేత డైరెక్టరుకు అతన్ని ఉపయోగించుకోవటం సులభం; తనకు కావలిసిన మోతాదులో రామారావుచేత నటింపజేయవచ్చు. అతనిలో "కదలిక" కూడా బాగావుంది. రామారావు కేవలం ప్రేక్షకుల దృష్టిలోనే కాక, చిత్ర నిర్మాణానికి యివతలవైపున వుండే వారిదృష్టిలో కూడా చాలా తృప్తికరమైన నటుడు. అతన్ని ఫోటోగ్రాఫ్ చెయ్యటంలో కామెరామాన్ కు గాని. అతని గొంతు రికార్డు చెయ్యటంలో రికార్డిస్టుకుగాని ఈషణ్మాత్రమైనా ఇబ్బందిలేదు.

సినిమా నటుడుగా రామారావును గురించి ఒక్క విషయం విశేషం కింద చెప్పుకోవచ్చు. "ప్లేబాక్" పాటలు పాడే వారందరిలోకీ హెచ్చుగా భావోద్రేకంతో పాడగల వ్యక్తి ఘంటసాల. ఆయన పాడిన పాటలకు చాలామంది పెదవులు కదిలించారు. కాని ఘంటసాల పాటలోగల భావానికి తూగేలాగు నటించగల నటుడు ఒక్క రామారావే కనిపిస్తాడు. అతని భావప్రకటనా సామర్థ్యానికి ఘంటసాల పాటలే గీటురాయి. "షావుకారు" , "పెళ్ళిచేసిచూడు", "మల్లీశ్వరి" చిత్రాలలో రామారావు అభినయించిన ఘంటసాల పాటలు ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకోండి.

తన నటన జయప్రదం అయినందుకు రామారావు తన ప్రతిభ ఎంతవరకు కారణమంటాడు? "నటుడి నటనకు ప్రాముఖ్యం చాలా తక్కువ. అసలు ప్రాముఖ్యత డైరెక్టరుది, కథది" అంటాడు రామారావు. ప్రతిభావంతులైన నటులు అన్ని చిత్రాలలోనూ ప్రకాశించరేమని అతని సవాలు. ఎవరి నటనగాని విజయవంతమయిందా, కాలేదా అన్నదానికి రుజువేమిటి? "ప్రజాభిప్రాయమే", అంటాడు రామారావు. ఇంకొక రుజువులో అతనికి విశ్వాసం లేదు.

రామారావు ప్రజలపై అపారవిశ్వాసం కలవాడు. కళ యావత్తూ ప్రజలదేనని అతని వాదన. ఈనాటి సినిమా పరిశ్రమ లోపభూయిష్ఠంగా ఉందని అతను ఒప్పుకుంటాడు. కాని ఈ లోపాలు కొద్దిమంది విమర్శకులద్వారాగాని, చిత్ర నిర్మాణంలో ఉన్నవారి పరివర్తనవల్లగాని చక్కబడతాయని అతనికి నమ్మకం లేదు. "ప్రజలే ఈ పరిశ్రమని సంస్కరించాలి" అని అతని దృఢవిశ్వాసం.

నటుడి ధర్మాలను నిర్ధారణ చెయ్యటంలో రామారావు భావవాది ఎంతమాత్రం కాదు. పొట్టగడవని స్థితిలో కళాకారుడు ఎటువంటి అవకాశాన్ని చేపట్టినా తప్పులేదు; కాని దారిద్ర్య సమస్య తీరిన అనంతరం నటుడు తన కళాధర్మాన్ని త్యజించరాదు. తనకు లభించే అవకాశాలలో సరియయిన వాటినే స్వీకరించి కళాధర్మాన్ని కాపాడుకోవాలి" అని రామారావు మతం.

ఇటీవల రామారావు "ఆంధ్రప్రభ రాయలసీమ క్షామ నివారణ నిధి"కి వసూళ్ళు చేస్తూ ఒక నెలపాటు ఆంధ్ర యావత్తూ పర్యటించి నాటకాలాడటం అందరికీ తెలిసిన విషయమే. ఈ పర్యటనలో అతను తన విశ్వాసాలను అమలులోకి తీసుకురావటమే గాక, కొన్ని కొత్త విషయాలు నేర్చుకున్నాడు.

రామారావు ఎన్నడూ రాజకీయాల జోక్యానికి పోయిన వాడు కాదు. ఏ ఉద్యమాలలోనూ పాల్గొన్న వాడు కాదు. అటువంటి వాడు రాయలసీమ క్షామం సందర్భంలో ఎందుకీ విధంగా కదలాలి? ప్రజలసమస్య తీవ్రస్వరూపములో సాక్షాత్కరించినప్పుడు ఏ కళాకారుడూ ఆ సమస్యకు దూరంగా ఉండరాదని రామారావు మతం. ఇటువంటి సందర్భాలలో పృథ్వీరాజు పూర్వం ఎట్లా కదిలిందీ రామారావు గమనించి ఉన్నాడు. పృథ్వీరాజు ఒక దేవుడని భావించి ఉన్నాడు. రాయలసీమ క్షామ సమస్య తన సమస్య చేసుకొని, సర్కారాంధ్రుల సమస్యగా చేయటానికి అతను ఉపక్రమించాడు. తన నేషనల్ ఆర్ట్ థియేటర్ ను పైకి తీసి, జి.వరలక్ష్మి, బాలకృష్ణ, పేకేటి శివరాం, ఎం.ఎస్.రామారావు మొదలైన సినిమాకారుల సహకారం స్వీకరించి ప్రజలలో ఒకడుగా ప్రజలమధ్యకి వెళ్ళి అఖండ విజయంతో, తిండికి మాడే రాయలసీమ వాసుల కొరకు లక్షరూపాయలు పోగుచేసి మద్రాసు చేరుకొన్నాడు.

ఈ నేషనల్ ఆర్ట్ థియేటర్ గురించి ఒక్క ముక్క చెప్పాలి. రామారావు యీ సంస్థను తన బంధుమిత్రుల సహాయంతో 1946 లో, గుంటూరులో బి.ఎ. చదువుతూ ఉండగా, నెలకొల్పాడు. దీని నిర్వాహకులు పి.ఎల్.నారాయణ గారు. రామారావు బావమరిది పుండరీకాక్షయ్య గారు యిందులో వొక నటుడు. 1947 లో బెజవాడలో శాంతారాం అధ్యక్షత కింద జరిగిన 14 వ ఆంధ్ర నాట్యకళా పరిషత్తులో ఈ కంపెనీ వారు కొప్పరపు సుబ్బారావుగారి ఏకాంకిక "చేసిన పాపం" ప్రదర్శించి షీల్డ్ బహుమతి పొందారు. ఈ నాటికలో రామారావు "బౌద్ధభిక్షువు"

పాత్ర ధరించాడు. రామారావు సినిమాలలో ప్రవేశించిన అనంతరం కూడా ఈ సంస్థ పనిచేస్తూనే వచ్చింది. ఇందులో నటించిన వారిలో కె.జగ్గయ్య, సావిత్రి కాలక్రమాన సినిమారంగంలో కూడా ప్రవేశించారు.

క్షామ నివారణ నిధి పర్యటన సందర్భంలో రామారావు నేర్చుకొన్న విషయమేమిటంటే, సినిమా నటుడుగా ప్రజల వద్దకు వెళ్ళినదానికీ, ప్రజలలో ఒకడుగా వెళ్ళినదానికీ ఎంతో తేడావుందని. "మేము పాతాళ భైరవి శతదినోత్సవాల సందర్భంలోనూ, జూబిలీ సందర్భంలోనూ సినిమా నటుల హోదాతో ప్రజల దగ్గరికి వెళ్ళాము. మాకు ముందూ, వెనుకా కూడా పోలీసు బందోబస్తు కావలిసి వచ్చింది. ప్రజలు మామీద దొమ్మిచేశారు. మమ్మల్ని కిరాయి వ్యక్తులల్లే పాటలు పాడమన్నారు. ఈ సారి బిచ్చగాళ్ళుగా ప్రజలదగ్గరికి వెళ్ళాము. ఒంటి ఆడకూతురు వరలక్ష్మి నడివీధిలోకి జోలెపట్టుకు వచ్చింది. మాకు ఏ బందోబస్తూ లేదు. మమ్మల్ని ఎవరూ దొమ్మీ చేయలేదు. తృణమో పణమో ఇచ్చారు. మమ్మల్ని తమ ఆప్తులుగా చూసుకున్నారు. మామీద తమకుగల గౌరవానురాగాలు చూపారు" అన్నాడు రామారావు. ఇది ప్రతి కళాకారుడూ నేర్చుకోదగిన పాఠమేననటానికి సందేహం లేదు.

రామారావు స్టేజిని కళానిలయంగానే ఆరాధించాడు. తాను స్టేజిమీద వేసిన యే వేషానికీ ఒక దమ్మిడీ యెన్నడూ పుచ్చుకోలేదు. నటించటంలో కలిగే సంతృప్తి స్టేజిమీద కలిగినట్టుగా సినిమారంగంలో కలగదంటాడు రామారావు. అంతమాత్రం చేత అతనికి సినిమా నటనపై ఆదరం లేదని కాదు.

రామారావు ప్రస్తుతం రాజ్యం పిక్చర్స్ వారి "దాసి"లో "బండిరామయ్య" గానూ, కృష్ణాపిక్చర్స్ వారి "అమ్మలక్కలు" లో "కుమార్" గానూ, పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్ వారి "పల్లెటూరు" లో "చంద్రం" గానూ, విజయవారి "చంద్రహారం" లో "చందన్" గానూ, ఏ.వి.ఎం. వారి "గర్ ర్." లో "రాజా" గానూ, యింకా భరణీవారి "చండీరాణి" లోనూ నటిస్తున్నాడు. సినిమా నటుడుగా రామారావుకు మంచి భవిష్యత్తువున్నది. నానాటికీ అతను మెరుగు తేరుతున్నాడు. అతని విశ్వాసాలుకూడా అతని పురోభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయిగాని ప్రతికూలంగా ఎంతమాత్రమూ లేవు.

# ఎ.పి.కోమల

## (చిత్రసీమ 1957, మార్చి సంచిక నుంచీ)



నేను 1934 వ సంవత్సరం ఆగస్టు 27 వ తేదీన మద్రాసులోనే పుట్టాను. మా నాన్నగారు, పార్థసారథిగారు సంగీత విద్వాంసులు. మా తల్లి లక్ష్మీయమ్మకు కూడా సంగీతంలో చాలా ఆసక్తి. మేము నలుగురు అక్క చెల్లెళ్ళం. నలుగురు అన్నదమ్ములం. ఆడ పిల్లల్లో నేను మూడోదాన్ని. మా పెద్ద అన్నయ్యకు ఫోటోగ్రఫీ అంటే ఆసక్తి ఎక్కువ. (నాకు సంగీతమంటే అభిలాష అని మీకు వేరే చెప్పనవసరం లేదుగా !) ఆ ఉత్సాహంలో కలర్ ఫోటోగ్రఫిని గురించి వివరాలు తెలుసుకోటానికి ఆయన జర్మనీ వెళ్ళారు. ఇంకో రెండు నెలల్లో తిరిగి వస్తారు. నా విషయం చెప్పాల్సింది పోయి, మా అన్నయ్య విషయం చెప్పుకు పోతోంది,

www.koumudi.net

ఏమిటనుకుంటున్నారేమో ? కళలు, లలిత కళలు కానీండి ఏ కళైనా కానీండి.. అంటే మాకెంత ఉత్సాహమో మీకు తెలియ చేయటానికే ఈ సొదంతా చెప్పాను.

ఇక మిమ్మల్ని విసిగించకుండా నా విషయాలకి వస్తాను. నా విషయం మీకు తెలియ చేయాలంటే పెద్ద వివరాలేమీ లేవు. నేనేమీ సరోజనీ నాయుణ్ణీ కాదు; కస్తూరిబానీ కాదు. సాధారణ స్త్రీని, అయితే, ఏమంత గొప్పతనం ఉన్నదని 'నా అనుభవాలు' రాస్తున్నావూ అంటారేమో ! ప్లేబాకు గాయకురాలుగాను; ఆలిండియా రేడియో ద్వారాను మీకు పరిచయమైనాను కాబట్టి నేనూ కొంతవరకూ 'పబ్లిక్ ఫిగర్'ను అయ్యాను కాబట్టి, నా అనుభవాలేమిటో మీరు తెలుసుకోవాలని ఉబలాటంతో ఉంటారని 'చిత్రసీమ' సంపాదకులు ఊహించి నన్ను అడగటం, నేను రాయటం జరుగుతోంది.

మా నాన్నగారు సంగీత విద్వాంసులైనా ఆయన దగ్గర నేను శిక్షణ పొందలేదు. ఆయన చెపితే నాకు సంగీతం రాదనుకున్నారో ఏమో, రాజమండ్రిలో ఉన్న నాగస్వర విద్వాన్ జి.పైడిస్వామిగారి శుశ్రూష చేయమని ఎనిమిదో యేటనే నన్ను రాజమండ్రి పంపారు. వారిదగ్గిర రెండేళ్ళు సంగీతాన్ని అభ్యసించాను. వారి శిష్యురాలని చెప్పుకోటానికి నేను గర్విస్తుంటాను కూడా.

నేను రాజమండ్రి నుంచి రావటంతోనే ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రంలో పర్మినెంట్ ఆర్టిస్టుగా చేరే అవకాశం దొరికింది 'గానలహరి' ప్రోగ్రాంలో సంగీత పాఠాలు చెప్తుండేదాన్ని. ఈ విధంగా పది సంవత్సరాలు రేడియో స్టేషన్ లో పనిచేశాను.

అయితే ప్రయాగ నరశింహ శాస్త్రిగారి ప్రోత్సాహమే లేకపోతే నేను అట్లాగే రేడియోకే అంకితమై పోయి ఉండే దానినేమో అనుకుంటాను. నన్ను సినిమాల్లో చేరి ప్లేబాక్ పాటలు పాడమని ప్రోత్సహించింది ప్రయాగవారే. వారు మొట్టమొదటగా నాగయ్య గారికి పరిచయం చేశారు. ఆ రోజుల్లో నాగయ్య గారు 'త్యాగయ్య' చిత్రం తీస్తున్నారు. అందులో 'మధురా నగరిలో...' పాటను నేనే పాడాను. సినిమా జీవితంలో నా మొదటి అనుభవం యిదే. తర్వాత అనేక చిత్రాలలో పాడాను.

రేడియో స్టేషన్ లో నాకు మల్లిక్ గారు కూడా పరిచయమైనారు. కర్నాటక శాస్త్రానికి పైడిస్వామిగారు గురువులైతే 'లైట్ మ్యూజిక్' కు మల్లిక్ గారు గురువులైనారనుకోండి.

ఈ మాత్రం సంగీతం నేర్చుకున్నా పాట కచ్చేరీలు మాత్రం ఎక్కువగా చేయటం లేదు. అయితే రాజమండ్రిలో సంగీత శిక్షణ పొందగానే పిఠాపురంలోనూ, ఆ పరిసర పట్టణాల్లోనూ పాటకచేరీలు చేశాను గాని, ఆంధ్రదేశం వెళ్ళే అవకాశాలు మాత్రం మళ్ళీ రాలేదు.

జన్మతః ఆంధ్రులమే అయినా మా కుటుంబం మద్రాసులోనే స్థిరనివాసం ఏర్పరుచుకున్నందువల్ల మేమూ తమిళుల క్రిందనే జమకట్ట బడుతున్నాం. అందుచేతనే అనుకుంటా, తెలుగు నిర్మాతలకన్నా, తమిళ నిర్మాతలే నన్నెక్కువగా చిత్రాల్లోకి తీసుకుంటున్నారు. అయితే లలిత కళలకు ఈ భాషా సమస్యలు అడ్డురావు కాబట్టి ఏ పేచీ లేకుండా ఉంది.

నాయీ 22 ఏళ్ళలోనూ యింతకు మించిన విశేషాలేమీ జరుగలేదు. ఇప్పటికెన్నో చిత్రాల్లో ప్లేబాక్ పాటలు పాడాను. ఎందరో అభిమానులు ఫలానా పాటను చాలా బాగా పాడారు అని ఉత్తరాలు వ్రాస్తుంటారు. కాని నాకు నచ్చిన పాటను యింతవరకూ నేను పాడలేదనే అనుకుంటాను. నాకు తృప్తికరమైన పాటను ఏనాటికైనా పాడతానని, అప్పటికి నా జీవితం సార్ధకమవుతుందని అనుకుంటాను.

ఇంత చెప్పినా యిప్పుడు ఏయే చిత్రాలలో పాడుతున్నాననే సందేహం కలిగి మీరు ఉత్తరాలు కురిపిస్తారని తెలుసు. మీకా సందేహం కలుగ కుండా ఇప్పుడు నేను పాడుతున్న చిత్రాలను తెలియ చేస్తాను.

కెంప్ రాజ్ 'నలదమయంతి' తెలుగు, కన్నడం; ఎం.వి.ఎం. 'భూకైలాసం' తెలుగు, కన్నడం; మంగళా పిక్చర్సు వారి తమిళ చిత్రం; జూపిటర్ వారి కన్నియన్ శపథం, తంగపుదుమై తమిళ చిత్రాలు; పిచ్చిపుల్లయ్య, (తమిళంలోకి డబ్బింగ్), అంజలీ వారి సువర్ణ సుందరి, అరుణా వారి 'బొమ్మల పెళ్ళి' గౌతమి వారి 'వేగుచుక్క' మినర్వా వారి 'సారంగధర', రాజ్ శ్రీ వారి కొత్త చిత్రం, రాజరాజన్ తమిళ చిత్రం, అల్లావుద్దీన్ అద్భుత దీపం, రత్నగిరి రహస్యం (తమిళం, కన్నడం) కృష్ణా పిక్చర్స్ వారి 'రాజా దేశింగ్' చిత్రాలలో పాడుతున్నాను. మీ ఆశీర్వచనాలతో యింకా అనేక చిత్రాలలో పాడగలను. – నా అడ్రస్ ఎ.పి. కోమల, 7, నమ్మాళ్వార్ వీథి, మద్రాసు–5.

# పాలువాయి రామకృష్ణారావు

## (కినిమా 1956, ఫిబ్రవరి సంచిక నుంచీ)



చలనచిత్ర పరిశ్రమలోనివారి జీవితాలు చాలా విచిత్రమైనవి,అర్హతలు కలిగి అదృష్టం లభించిన జీవులు, అర్హతలు వుండికూడా ఉన్నత స్థితికి రాలేకపోతున్న ప్రాణులు, అర్హతలు లేకుండా అదృష్టదేవత కరుణకు గురి అయే వ్యక్తులూ ఈ విచిత్ర పరిశ్రమలోనే ఉన్నారు, అర్హతలు లేకుండా అదృష్టవంతులైనవారు ఎవరని మమ్మల్ని ప్రశ్నిస్తే మాత్రం మా నుంచి సమాధానం రాదు. అచ్చు పెనుభూతం వంటి శక్తి.

అర్హతలుకలిగి అదృష్ట దేవత కరుణాకటాక్ష వీక్షణాలకు గురియైన వ్యక్తులలో రామకృష్ణ అగ్రజుడని చెప్పక తప్పదు.

చిత్రపరిశ్రమలో అడుగుపెట్టాలని ఆయన ఏనాడూ కలలోకూడా అనుకోకుండా పరిస్థితుల ప్రాబల్యం వల్ల అందులో ప్రవేశించి, మరుక్షణం నుంచి సాకల్యంగా సాంకేతిక విజ్ఞానం పొంది అదృష్టదేవత చిరునవ్వుల వర్షానికి ఎదురుచూసిన వ్యక్తి రామకృష్ణ.

కర్నూలులో శ్రీనివాసరావుగారు డిప్యూటీ ఇన్స్ పెక్టర్ ఆఫ్ స్కూల్స్, ఆయనకు 1918 లో పుట్టినబిడ్డ రామకృష్ణ. రామకృష్ణ విద్యాభ్యాసంలో మెరపు కనబడుతుండేది. స్కూలు ఫైనలు ప్యాసయాక ఉన్నతవిద్యకు బావగారి ఆర్థిక ప్రోత్సాహంతో రామకృష్ణ 1935 లో బందర్ హిందూ కళాశాలలో ప్రవేశించాడు. ఇంటర్మీడియేట్లో ఉత్తీర్ణుడై 1937 లో బి. ఏ తరగతి చదువుటకు ప్రయత్నించేటప్పటికి అంతవరకు అండగా వుంటున్న బావగారు దివంగతులైనారు.

ఈ సంఘటనతో ఎగిరేపక్షికి రెక్కలు విరిగినట్లుగా ఏర్పడింది రామకృష్ణ స్థితి. తిరిగి రెక్కలను పొంది వాటిపై ఆధారపడే మార్గం అతను అన్వేషించవలసి వచ్చింది. చదువు సాగటానికి చేతిలో 'డబ్బు' లేదు. జీవిత నౌక నడపటానికీ 'డబ్బు' కావలసివచ్చింది. 'ఉద్యోగం పురుష లక్షణం' అనుకుని రామకృష్ణ ఉద్యోగాన్వేషణ సాగించాడు. ఐతే ఎటువంటి ఉద్యోగం చేయాలి ? ఈ ప్రశ్నలు, ఈ దూరపు చూపు ఆతనినేమీ అప్పట్లో బాధించలేదు. సత్వరావసరం భృతికి తోడ్పడే వృత్తి. అది ఏశాఖకు చెందినదైనా దానితో అతనికి నిమిత్తం లేదు; అంతగా పట్టింపూ లేదు. ఈ ప్రకృతితో అతడు అడుగుపెట్టిన శాఖ చలనచిత్రానికి చెందినదే కావటం ఎంతటి తలవని తలంపువంటిదో అంతటి విధివిలాసం కూడా అని చెప్పకతప్పదు. వేల్ పిక్చర్స్ స్టూడియోలో సౌండ్ రికార్డింగ్ శాఖలో ప్రవేశించాడు కాని అతను అనుకున్నంత వుత్సాహం పొందలేదు– ఆ పరిస్థితులలో – దర్శక పితామహుడు శ్రీ హెచ్, ఎమ్, రెడ్డిగారు 1937 లో 'మాతృ భూమి' అనే తమిళ చిత్రం తయారు చేస్తుండగా, ఆ నిర్మాణ సంస్థకు చెందిన ఎడిటింగ్ శాఖలో రామకృష్ణ అప్రెంటిస్ ఉద్యోగం సంపాదించాడు. అప్పటికి ఆతని వయసు 19 సంవత్సరాలు. తెలుగు టాకీ వయసు 6 సంవత్సరాలు అది అతనికి చాలా కొత్తశాఖగా కనుపించటంవల్ల, ఎడిటింగ్ అంటే ఏమిటో సంపూర్ణంగా నేర్చుకోవాలనే అభిలాష పుట్టి దీక్షగా పెరిగింది. రెండేళ్ళ సమగ్ర శిక్షణ లభించింది. 1939 లో 'మాతృభూమి' విడుదలైన వెంటనే శ్రీ రెడ్డిగారు అతని కృషికి మెచ్చి రోహిణీ పిక్చర్స్ కు చెందిన ఎడిటింగ్ శాఖలో అసిస్టెంటుగా నియమించారు. పనిలో చేరిన కొద్ది కాలంలోనే రామకృష్ణకు ఇంతటి అభివృద్ధి చేయూత లభించటానికి ఆధారాలు అతని సత్ప్రవర్తన, శ్రద్ధాభక్తులే.

"బోండాం పెళ్ళి" "తెనాలి రామకృష్ణ" "సత్యమే జయం" చిత్రాలు రోహిణీ సంస్థ తయారు చేసినవే. ఆ చిత్రాల నిర్మాణకాలంలో రామకృష్ణ ఎడిటింగ్ శాఖలో చక్కని అనుభవ, విజ్ఞానాలు సంపాదించాడు.

చెన్నపట్టణంలోని చలనచిత్ర పరిశ్రమ ప్రాసాదంలో పాగావేసినట్లు సంతోషించాడు. కాని, అతని దురదృష్టమే కాకుండా చెన్నపురి నివాసుల అభాగ్యంగా ప్రపంచ సంగ్రామం, దాని ప్రభావం విషమించినవీ, తత్ఫలితంగా శ్రీ రెడ్డిగారు 1942 అరంభంలో పట్టణంవదిలి వెళ్లటంవల్ల రామకృష్ణ రెండవసారిగా రెక్కలు తెగిన పక్షిస్థితి పొందాడు. అది తాత్కాలిక మే ఐనప్పటికీ శ్రీ రెడ్డి శిశ్రూష, శిక్షణలు సామాన్య మైనవి కావనేది యోగ్యతగా, ఆధారంగా అతనికి ఉండేవి. అవి నిష్ప్రయోజనం కావని అతనికి అనతి కాలం లోనే రుజువు కనుపించింది. 1942 మూడవ పాదంలాగ యుద్ధ పరిస్థితుల ఉద్ధతి నీరసించగానే స్టార్ కంబైన్స్ సంస్థ శ్రీ ఏ. రామయ్యగారి కృషి ఫలంగా ఉద్భవించి "కృష్ణప్రేమ" చిత్రనిర్మాణం ప్రారంభించింది. ఆ చిత్రానికి దర్శకుడుగా శ్రీ హెచ్. ఎమ్. రెడ్డి 'చేలా' శ్రీ హెచ్.బి. బాబు నియమించబడ్డాడు. శ్రీ బాబు రామకృష్ణను తమ అసిస్టెంటు గా నియమించారు.

ఎడిటింగ్ శాఖనుంచి రామకృష్ణ సహాయదర్శక బాధ్యతలను స్వీకరించాడు. అతనిలో నూతనోత్సాహం ఉదయించింది. నూతన బాధ్యతలను అతను చాల శ్రద్ధాశక్తులతో నిర్వహించిన ఫలితంగా అతనికి దర్శకత్వ నిర్మాణశాఖల విజ్ఞానం కరతలామలకమైనది.

రామకృష్ణకుగల నిరాడంబరత్వం, విధులు నిర్వహించడంలో ఉత్సాహం, గోవుకు వుండే సాధులక్షణాలు నిర్మలమైన మనస్సు ఇత్యాది సద్గుణాలు "కృష్ణపేమ" చిత్రం లో ప్రముఖపాత్ర నిర్వహిస్తున్న ఒక ఆందాల రాణిచే ఆకర్షించబడినవి. ఆ సంగతి రామకృష్ణకు తెలియదు. కనీసం కలలోకూడా తననొక ఊర్వశిలాంటి సినీతార వరిస్తుందని ఆనుకోలేదు రామకృష్ణ. దీనికి కారణం తనకి చెప్పకోదగిన ధనం, స్థిరాస్థి ఏమీ లేదని అతనికి తెలిసిఉండటమే. తన గుణ గణాలు యజమానుల మెప్పు సంపాదిస్తున్నవనే యదార్థం అతనికి తెలుసునేగాని అవి తాను పనిచేసున్న చిత్రంలోని తన్వికే ఆకర్షణగా మారిన సత్యం అతనికి తెలియదు. ఆ యువతికికూడా మనసువిప్పి చెప్ప గలిగే ధైర్యం లేదు. పెద్దల నీడలే ఆమెకు భయకారణాలు. కాని, పరిస్థితుల ప్రభావంవల్ల, పెద్దలు ఆమెకు పెళ్లిమాటలు జరుపుతున్న వేళల్లో ఆమె తనమనోగతాన్ని

బహిర్గతంచేయక తప్పిందికాదు. “నా భర్తను నేనే ఇదివరకు ఎన్నుకున్నాను. ఆయనే రామకృష్ణ. మరొకర్ని పెళ్లాడను" అని గుండెనిబ్బరంతో ఖచ్చితంగా తలిదండ్రులకు చెప్పింది. ఆ సాహసియే నేటి అసమాన సినీతార శ్రీమతి భానుమతి. ఆనాటి “కృష్ణప్రేమ” లోని రాధ !

ఈ కళ్యాణానికి శ్రీమతి భానుమతి పెద్దలు అంగీకరించకపోవడం సహజం. వారి అభ్యంతరాలు కొన్ని అవాంతరాలను కలిగించినవి. అవి విధిచేష్టలు కాకుండా సాధారణ మానవులవే కావటం ఒక సుగుణం. ఈ అవాంతరాల అఖాతాన్ని ఆమె ధైర్యంతో యీది ఒడ్డుచేరుకుని రామకృష్ణని పెళ్లి చేసుకుంది. పెళ్ళి బాజాలు 8–8–1943 న మ్రోగినవి.

“కృష్ణప్రేమ” చిత్ర నిర్మాణానుభవం రామకృష్ణకు ఈవిధంగా రెండు లాభాలు అందించింది. ఒకటి దర్శకత్వానుభవం, రెండు 'భానుమతీ పరిణయం'.

రామకృష్ణ రోజులు మారాయి. అతని జీవితోద్యానవనం వసంతశోభ పొందింది. వర్ధమాన సినీ తార, అందాల యువతి ఆతనికి రాణీకావటమే ఆదృష్టదేవత చిరునవ్వుల తొలకరికి చిహ్నం.

“కృష్ణ ప్రేమ” అనంతరం రామకృష్ణ అసిస్టెంట్ డైరెక్టర్ గానే కొన్ని సంస్థలలో పనిచేశాడు. ఆతని శ్రీమతి మాత్రం ఏ చిత్రంలోనూ నటించటానికి అంగీకరించలేదు. దాంపత్య జీవితాన్ని ఆదర్శప్రాయంగా ఆనందదాయకంగా అసిస్టెంట్ డైరెక్టరుగా భర్తకు వచ్చే జీతంతో నడుపుతూ ఉండేవారు.

తెలుగుచిత్ర నిర్మాతల ఒత్తిడివల్ల శ్రీమతి భానుమతి ఒక్క గృహలక్ష్మీ గానే కాకుండా తెరతారగా కూడా జీవితం గడపవలసిన అవసరం ఏర్పడింది. 1944 లో వాహినీ వారి చిత్రం “స్వర్గసీమ” లో ఆమె ప్రధాన పాత్ర నిర్వహించిన ఫలంగా 1945 లో తారాపథంలో ఆమె హిమగిరి శిఖరాలను అందుకున్నారు.

1945 వ సంవత్సరం రామకృష్ణ దంపతుల జీవితంలో వినూత్న అధ్యాయాన్ని ప్రారంభించింది. వారికి పుత్రుడు ఉదయించాడు. “ధరణి నేలు” భరణీ నక్షత్రంలో ఆ పసి వాడు ఉదయించాడు. అతని పేరు అందుకే భరణి అయింది. ఈ పుత్రోత్సాహంతో రామకృష్ణ, శ్రీమతి జీవితంలో అత్యున్నత దశ ఆరంభమైనది. భరణీ పిక్చర్స్ సంస్థను అతను వ్యవస్థాపించాడు. ఆ సంస్థలో దంపతులే భాగస్వాములు. రామకృష్ణకు తన దర్శకత్వ ప్రతిభను లోకానికి ఆందించటానికి తగిన మంచి కాలం ఆసన్నమైంది. భరణీసంస్థ తరపున శ్రీమతీ ప్రధానపాత్ర నిర్వహణతో “రత్నమాల” చిత్రానికి దర్శకత్వం వహించి నిర్మించాడు. తెలుగు చలన చిత్ర కళాకన్యకు ఆతడు అందించిన తొలి పుష్పం అదే. ఆ చిత్రం విజయం పొందింది. వెంటనే వారిద్దరూ “లైలామజ్ను” చిత్ర నిర్మాణం సాగించి 1949 లో విడుదలచేశారు. ఆది బ్రహ్మాండమైన విజయం పొందింది. ఉత్తమ దర్శకుడుగా అతనికి గల యోగ్యతలకు ఉత్తమ నటీమణిగా ఆమెకు గల అర్హతలకు 'లైలామజ్ను' నీరాజనం అందించింది.

1951 లో “ప్రేమ” చిత్రం తయారుచేశారు.

1952 లో రామకృష్ణ భానుమతి గార్ల జీవితంలో మరొక అంతస్తు పైకి వెళ్ళగలిగారు. ఆ సంవత్సరం లోనే వడపళనికి సమీపానగల సాలగ్రామంలో 15 ఎకరాల నేల కొని చక్కని భరణీ స్టూడియోను నెలకొల్పారు. స్టూడియోను ప్రారంభించగానే వారు తయారుచేసిన చిత్రం మూడు భాషల చిత్రం “చండీరాణి" ఈ చిత్రానికి రామకృష్ణ నిర్మాత; శ్రీమతి భానుమతి దర్శకత్వం వహించారు. 1954 లో స్వంతస్టూడియోలో “చక్రపాణి”, “విప్రనారాయణ” చిత్రాలు రామకృష్ణ దర్శకత్వం క్రింద తయారైనవి. “విప్రనారాయణ” చిత్ర దర్శకత్వానికీ,

నిర్మాణానికి ఇండియా ప్రభుత్వం యోగ్యతాపత్రం అందజేసింది. ఈ ఊతతో రామకృష్ణ ఏటేటా ఉత్తమ చిత్రాలను అందిస్తాడనే నమ్మకం మాకు ఉన్నది

# టి.వి.రాజు

## (విజయచిత్ర 1968, జనవరి సంచిక నుంచీ)



'ఒక పాటకు ఎంత ఆర్కెస్ట్రా పెట్టాం ఎన్ని వాయిద్యాలు వాడాం అన్నది ఎన్నటికీ ఘనత కాజాలదు. ఎంత తక్కువ వాయిద్యాలతో పాటను ఎంత రక్తి కట్టించాం అన్నదే ఘనత' అన్న ఉద్దేశ్యం గల సంగీత దర్శకుడు తోటకూర వెంకటరాజు. "ఇవాళ మన పాటల్లో ఆర్కెస్ట్రా ఎక్కువయిపోతున్నదన్న విషయాన్ని నేను ఒప్పుకుంటున్నాను, ఆ ఆర్కెస్ట్రా సాహిత్యాన్నీ, గాయకుని గాత్రంలోని మాధుర్యాన్నీ చెడగొడుతుందన్న విషయాన్నీ ఒప్పుకుంటాను. గాత్రానికి ఆర్కెస్ట్రా సహాయపడాలి గానీ, ఆర్కెస్ట్రాకు గాత్రం సహాయపడరాదు. ఎంతో అవసరమైతే తప్ప-నేను ఎక్కువ అర్కెస్ట్రాను పెట్టను. పెద్ద డాన్సుపాటో, మరేదో అయితే తప్ప_ నేను ఆర్కెస్ట్రాను ఎక్కువగా వాడను; గాత్రం మీద 'కౌంటర్పా' వెయ్యను. నాలుగైదు వాయిద్యాలతోనే నేను కంపోజ్ చేసిన అనేక పాటలు హిట్టయినవి వున్నాయి. దాన్ని బట్టి పాట హిట్టు కావడానికి అర్కెస్ట్రా ఎక్కువగా వాడవలసిన అవసరం లేదనీ, పాటలోని మాధుర్యం ముఖ్యమనీ తేటతెల్లమవుతుంది." అన్నారు-టి.వి.రాజు.

"టి. వి. రాజుగారి సంగీతం సంప్రదాయ బద్ధంగా వుంటుందంటారు సంగీతాభిమానులు, ఆ మాట నిజమేనని ఆయన ఒప్పుకున్నారు" మన సంగీతం మనకుంది; మన రాగాలు మనకున్నాయి. వాటిని మనం మలచుకుంటూ, కొత్త ప్రయోగాలు చేసుకుంటూ పోవడంవల్ల మన సంప్రదాయాన్ని నిలబెట్టినవాళ్ళ మవుతాము. అయితే, విదేశీయ సంగీతాన్ని అనుసరించరాదని గాని, అనుకరించరాదనిగాని నేను అనను. ఇవాళ, మన సంగీతాన్ని వారు అనుసరిస్తున్నారు. అవసరమైతే మనం విదేశీయ సంగీతాన్ని తీసుకోవచ్చు. అయితే ఎంతవరకూ అనుసరించాలి ? ఎప్పుడు అనుసరించాలి ? అన్న విషయం మట్టుకు తెలుసుకోవాలి. అది సాంఘికచిత్రమైనా, పౌరాణికమైనా, జానపదమైనా, ఏదైనాసరే అందులో సంప్రదాయ సంగీతాన్ని ప్రవేశపెట్టవచ్చును. తేలిక సంగీతాన్ని తేలికగానే వుంచవచ్చును. పాట హిట్టు కావడం ఆ 'తేలిక' మీద ఆధారపడి వుంటుంది కూడా." అన్నారాయన.

"చిత్రాల్లో కాపీసంగీతం నిర్మాతలు కావాలంటున్నారు కాబట్టి-సంగీతదర్శకులు ఇస్తున్నారు గాని-ఏ సంగీత దర్శకుడూ తనంతట తాను ఫలానా ట్యూన్ ను మక్కికి మక్కీ దించాలని అనుకోడు. తను సొంతంగా ఒక ట్యూన్ చెయ్యాలని, తన శక్తిని ప్రదర్శించాలనీ అనుకుంటాడు ప్రతి సంగీతదర్శకుడూ, ఇవాళ మన చిత్రాల్లో కాపీ సంగీతం వినిపించడానికి ముఖ్యకారకుడు సంగీతదర్శకుడే కాడు. నిర్మాతల దర్శకుల అభిరుచులను బట్టి సంగీతదర్శకుడు-పయనించాలి. నిజానికి సంగీతదర్శకునికి స్వతంత్రం అవసరం, కొంత స్వాతంత్ర్యాన్ని అతనికి ఇవ్వాలి. అలా అని, అంత బాధ్యతా సంగీత దర్శకుడికే

వదిలివేయడం కూడా మంచిదికాదు. తగిన సూచనలు చేస్తూ, సంగీతదర్శకునితో సహకరించాలిగాని, అతని కి ఆదేశించరాదు. అలా చేసిననాడు, సంగీతదర్శకుడి దగ్గర్నుంచి చక్కని సంగీతం రావడానికి అవకాశం వుండదు. నేను చక్కని పాటలు ఏవేనా చెయ్యగలిగానంటే, అది నా నిర్మాతలు నా కిచ్చిన తోడ్పాటు, స్వాతంత్ర్యం." అని చెప్పారు రాజు.

"అలాగే రీరికార్డింగ్, హడావిడిలో పడుతూ వుంటుంది. చిత్రం విడుదల చెయ్యడానికి తేదీ నిర్ణయిస్తారు: చిత్రం ముగింపు కాబట్టి తాము అనుకున్న బడ్జెట్ దాటిపోతోందని, అప్పడు పొదుపు చూపడం సాగిస్తారు. దాంతో–చిత్రానికి జీవమైన రీరికార్డింగ్ చప్పబడుతుంది. అంచేత, నేను నిర్మాతలను కోరేదేమంటే – చిత్రం ఆరంభంలో ఏ శాఖకు ఎంత పైకం వెచ్చించాలని ఎలా తీర్మానించుకుంటారో, ఆలాగే రీరికార్డింగ్ కు కూడా కొంత కేటాయించాలి. దాంతో పాటు, వ్యవధీ కేటాయించాలి."

"చిత్రం అంతటా వెనక మ్యూజిక్ వుండాలంటారా ?" అన్న ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ, " ఎప్పడూ వుండరాదు. రీరికార్డింగ్ కు పద్ధతు లున్నాయి. చిత్రం పూర్తిగా ఏదో వాయించుకు పోరాదు. సన్నివేశానికి తగినట్టు, సన్నివేశానికి అవసరమైతే–తన సంగీతంవల్ల ఆ సన్నివేశానికి మరింత రాణింపు కలుగుతుందన్న నమ్మకం వుంటే. నేపథ్యసంగీతం కలపాలి గాని, పూరికే ప్రతి సన్నివేశంలోనూ ఆ సంగీతాన్ని వినిపించడం వల్ల సన్నివేశాలను పాడు చేసినవాళ్ళమవుతాము. కొన్ని దృశ్యాలలో నేపథ్య వాయిద్యాలు లేకపోతేనే రక్తి కడతాయి: కొన్ని వుంటేనే రక్తికడతాయి. సంగీతదర్శకుడు ఆ భేదాన్ని తెలుసుకుంటూ, ఆ ప్రకారంగా నడుచుకోవాలి." అని చెప్పారు.

ఐదు దశాబ్దాల కిందట టి. వి. రాజుగారు, రాజమండ్రి తాలూకా రఘుదేవపురంలో జన్మించారు. వెంకటరాజుగారి తండ్రిగారు సోమరాజు గారు. రాజుగారి చిన్నతనంలోనే ఆయన చనిపోవడంవల్ల రాజుగారి జీవితం అడవులపాలైనట్టయింది. దారం తెగిన గాలిపటంలా ఆయన సంచరించసాగాడు. అతన్ని అదుపాజ్ఞలలో పెట్టి క్రమశిక్షణలో పెంచవలసిన బాధ్యత గల వ్యక్తి లేకపోవడంతో ఆయన చదువు వానాకాలం చదువైపోయింది. అతికష్టంమీద నాలుగో ఫారం వరకూ రాగలిగారు. అయితే, రాజుగారికి సంగీతం మీద అభిమానమూ, శ్రద్ధా బాగా వుండేవి. స్వగ్రామంలోనే నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులవారి దగ్గర ఆయన మూడేళ్ళ పాటు సంగీతాభ్యాసం చేశారు. ఆ మూడేళ్ళ జ్ఞానంతోనే ఆయన తర్వాత పిల్లలకు పాఠాలు చెప్పడం సాగించారు. పిల్లలకు సంగీత పాఠాలు చెబుతూనే, రాజుగారు కూడా 'జీవిత పాఠాలను' చాలా నేర్చుకున్నారు.

పాట, పద్యం రాజుగారిని ముడివేసుకుని వుండడంతో ఆయన రంగస్థలనటుడు అయ్యారు. 1984 వ సంవత్సరంలో ఆయన రంగస్థలం ఎక్కి లోహితాస్యుడు, కనక సేనుడు, నారదుడు, కబీరు, కృష్ణుడు మొదలైన పాత్రలను నటించ సాగారు. 'మాస్టర్ వెంకటరాజు' లోహితాస్యుడిగా పద్యం చదివితే, పద్యానికి 'వన్స్ మోర్'లు కురిసేవి. ఎన్నిసార్లు వన్స్ మోర్లన్నా అన్నిసార్లూ ఆయన అంత కమ్మగానూ పాడి ప్రేక్షకులను తృప్తిపరిచేవారు.

మాస్టర్ వెంకటరాజు, వెంకటరాజయి, టి. వి, రాజు అయ్యారు. ఏదేనా వాయిద్యాన్ని నేర్చు కోవాలన్న అభిలాష చిన్నప్పట్నుంచీ ఉండడంతో హార్మోనియమ్ ను నేర్చుకుని, అందులో గట్టివాడయ్యారు. సురభి నాట్యమండలిలో చేరి వారి నాటకాలకు కొన్నాళ్ళు హార్మోనియమ్ వాయించారు.

టి. వి. రాజుగారి అన్నగారు సత్యనారాయణ రాజుగారు. ఆయన తమిళ దేశంలో వున్న నాటకం ట్రూపులో వుండేవారు. టి. వి. రాజు గారు కూడా రెండు మూడేళ్ళపాటు ఆ ట్రూపులో చేరి అన్నగారికి చేదోడు వాదోడుగా వుంటూ, ఆ ట్రూపు నాటకాల్లో వేషాలు కూడా వేశారు.

కొన్నాళ్ళకు రాజుగారు నటించడం మానుకుని, సంగీతం మీదే శ్రద్ధవహించి. 'గట్టి హార్మోనిస్టు' గా పేరు పొందారు. అనేక నృత్యప్రదర్శనలకూ, నాటక ప్రదర్శనలకూ ఆయన హార్మోనియమ్ వాయించేవారు. నేటి అంజలి దేవి, అంజనీకుమారిగా నాడు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనాలకు టి. వి. రాజు హార్మోనిస్టు: మల్లాది కృష్ణశర్మ రాసిన 'మిస్ ప్రేమ బి. ఏ.' నాటకానికి కొంతకాలం హార్మోనిస్టు, ఆ నాటకం యుద్ధనిధి కోసం చాలాచోట్ల ప్రదర్శింపబడింది.

బి.వి.నరసింహారావు గారి డాన్సు ట్రూపు, ఆదర్శ నాట్యబృందం మొదలైన నాటక సమాజాల్లో కూడా హార్మోనిస్టుగా కొంతకాలం పనిచేశారు. అనేక సమాజాల్లో పనిచెయ్యడం, అనేకమంది గాత్రాలను హార్మోనియమ్ మీద తాను ఫాలో కావడం, అనేకచోట్ల అనేకమంది వ్యక్తులను కలుసుకోవడం, కొన్నిచోట్ల డక్కామొక్కీలు తినడం  వంటివన్నీ కలిసి రాజు గారికి జీవితం అంటే ఏమిటో బాగా నేర్పాయి. అలా తిరగడంవల్ల సంగీతానుభవాన్నీ జీవితానుభవాన్నీ కూడా పుష్కలంగా పొందగలిగారాయన. ఆ నాటక సమాజాలతోపాటు అనేక వూళ్ళు తిరిగారు.

రాజుగారికి సినిమా ఛాన్సు వచ్చినట్టే వచ్చి మాయమైంది. శ్రీమతి రమాజోషీ అనే ఆవిడ, రాజుగారికి తెలుసు. శోభనాచల స్టూడియోలో హార్మోనిస్టు ఉద్యోగం ఖాళీగా వుందని, ఉత్సాహం ఉంటే వెంటనే బయల్దేరి రమ్మని ఆవిడ రాజు గారికి టెలిగ్రామ్ ఇచ్చింది. సినిమా ఉత్సాహం అన్నది రాజుగారిలో వున్నా – ఆ టెలిగ్రామ్ చూసి, అంతకంటె తొందరగా తాను మద్రాసు పరుగెత్తలేకపోయారు. ప్రోగ్రామ్సు వుండడంవల్ల కొద్దిరోజులు ఆలస్యంగా మద్రాసు చేరుకోవడంతో ఆ ఉద్యోగం భర్తీ అయిపోయింది. రాజుగారు నిరుత్సాహపడ్డారు. అయితే ఏం చెయ్యాలి ? 'ఎలాగూ మద్రాసు చేరుకున్నాను కాబట్టి ఇక్కడే ఎక్కడో ఓ ప్రయత్నం చేదాం' అన్న పట్టుదలతో మద్రాసులో వుండిపోయారు. కొన్నాళ్ళకు 'చంద్రవంక' అనే చిత్రానికి టి. వి. రాజు సహాయ సంగీత దర్శకులుగా నియమింపబడ్డారు. ఆ చిత్రానికి నాళం నాగేశ్వరరావు సంగీత దర్శకుడు. ముందే వచ్చిన 'సినిమా ఛాన్సు' అలా ఆలస్యంగా ఆయన్ని చిత్రసీమలో ప్రవేశపెట్టింది. ఆ తర్వాత ఆయన 'మనదేశం' చిత్రంలో ఆర్గన్ వాయించారు; 'పల్లెటూరిపిల్ల' చిత్రానికి ఆదినారాయణరావుగారి దగ్గర సహకార సంగీత దర్శకునిగా చేరి మరింత అనుభవం గడించారు.

బి. ఏ. సుబ్బారావుగారు " టింగు రంగా " చిత్రాన్ని ఆరంభిస్తూ టి. వి. రాజును ఆ చిత్రానికి సంగీత దర్శకుని చేశారు. అదే ఆయనకు మొదటి చిత్రం. అయితే ఆ అవకాశంలో ఇంకో విశేషం కూడా వుంది. "టింగు రంగా" ను 'శ్యామల' అన్న పేరిట తమిళంలో కూడా ఆరంభించారు. తమిళ చిత్రానికి కూడా ఆయనే సంగీత దర్శకుడు. అలా మొదటి ఛాన్సులోనే టి. వి. రాజు 'రెండు ఛాన్సులు' సంపాయించారు.

'శ్యామల' చిత్రంలో ఓ 'ఘనత' కూడా జరిగింది. అందులో కీ. శే. త్యాగరాజభాగవతార్ ముఖ్య పాత్రధారి. త్యాగరాజభాగవతార్ గారు తాను చిత్రంలో నటించే ముందు సంగీత దర్శకుడెవరన్న విషయాన్ని తెలుసుకుంటారు. ఎందుకంటే ఆయనకు ఎక్కువగా పాటలు వుంటాయి కాబట్టి. పైగా, ఆయనకు సరిపోయే సంగీత దర్శకులు ఇద్దరే తమిళ పరిశ్రమలో వుండేవారు. వారిద్దరూ కాకుండా, ఇంకొక రెవరయినా సంగీత దర్శకత్వం ఇవ్వడానికి భాగవతార్ అంత తొందరగా సమ్మతించేవారు కారు. అయితే, ఆ చిత్రానికి టి. వి. రాజు సంగీత దర్శకుడు. భాగవతార్ ఎరగని వ్యక్తి; పైగా అనుభవం లేనివాడు; అంచేత త్యాగరాజభాగవతార్ అభ్యంతరం వుంటుందేమో నని రాజుగారు భయపడ్డారు. కాని బి. ఎ. సుబ్బారావుగారు "కొత్త వ్యక్తికి అవకాశం ఇచ్చాము. తెలుగులో రికార్డు చేసిన పాటలు వున్నాయి. మీరు వినండి. మీకు నచ్చితే సరే సరి, లేకపోతే మీ యిష్టం వచ్చినట్టు చేదాం" అన్నారు.

భాగవతార్ సరేనన్నారు. 'టింగు రంగా' చిత్రానికి సంబంధించిన 'కవి కలముకు కళ కుంచెకు' 'రాజా మహారాజా' అన్న రికార్డయిన పాటలను ఆయన విన్నారు. సంప్రదాయానికి కట్టుబడి, మధురంగా వున్న ఆ పాటలు భాగవతార్ కు బాగా నచ్చాయి. టి. వి. రాజును ఆయన అభినందించారు. అలా, మొదటి ప్రయ త్నంలోనే రాజుగారికి అభినందనలు వచ్చాయిఅది నిజంగా ఘనతే ! త్యాగరాజభాగవతార్ పాడిన 'రాజన్, మహారాజన్' మున్నగు పాటలు విశేష జనాదరణను పొందాయి.

'టింగురంగా" చిత్రం విడుదలతో, పాటలు జనాదరణ పొందడంతో రాజుగారికి మంచి పేరొచ్చింది.

ఆ తర్వాత ఆయన పిచ్చిపుల్లయ్య, తోడు దొంగలు, జయసింహ మున్నగు అనేక చిత్రాలకు సంగీతదర్శకత్వం వహించారు. పిచ్చి పుల్లయ్య చిత్రంలో 'బస్తీకి పోయేటి ఓ పల్లె టూరి వాడా' అన్న పాటను–నేటి నిర్మాత వుండరీకాక్షయ్య చేత పాడించారు. జయసింహ చిత్రంలోని 'జయజయ శ్రీరామా' 'కొండమీద కొక్కిరాయి' 'మనసైన చెలిపిలుపు' 'ఈనాటి ఈహాయి' మున్నగు పాటలన్నీ హిట్టయినట్టే పాండురంగ మహాత్యం లోని 'హే కృష్ణా ముకుందా మురారీ' 'వన్నెల చిన్నెల నెర' మున్నగు పాటలూ హిట్టయినాయి.

"సంప్రదాయాన్ని అనుసరిస్తూ చేసిన అనేక పాటలు జనాదరణ పొందుతాయని అనడానికి ఆ పాటలన్నీ సాక్ష్యం." అంటారు రాజుగారు.

గత సంవత్సరం విడుదలైన చిత్రాల్లో 8 చిత్రాలు రాజుగారి సంగీత దర్శకత్వంలో తయా రైన చిత్రాలు. అది ఘనత; అలాగే ఇవాళ ఆయనకు వున్న చిత్రాల సంఖ్య చూసుకుంటే కూడా 'ఘనత'గానే కనిపిస్తుంది. ఉమ్మడి కుటుంబం, శ్రీ కృష్ణావతారం మొదలైన ఇటీవలి చిత్రాల్లోని పాటల వరసలు జనం మెచ్చుకున్న వరసలు.

సినిమా నటునికి నటనానుభవం అవసరమైనట్టే, సంగీతదర్శకునికి కూడా నాటకానుభవం అవసరమనీ, ఆ అనుభవమే పద్యాలకు రాగాలను ఏర్పాటు చెయ్యడంలోనూ, పాటలను అల్లడం లోనూ తనకు సహాయపడుతోందనీ ఆయన అంటారు. "ఇవాళ కొత్త గాయనీగాయకుల అవసరం వున్నది.

కొత్తగాత్రాలకోసం అన్వేషి స్తూ నే వున్నాము. అయితే గొంతు వుంటే భావం పలకక, భావం వుంటే గొంతు పలకక, రెండూ వుంటే 'రేంజ్' కుదరక , ఇలా జరుగుతోంది. అయినా కొత్తగాత్రాలు లభించగలవనే ఆశ నాకున్నది." అన్నారాయన.

టి. వి. రాజుగారు దాదాపు 60 చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు. వాటిలో కొన్ని తమిళ చిత్రాలు కూడా వున్నాయి; కొన్ని డబ్బింగ్ చిత్రాలూ వున్నాయి. పురాణ, సాంఘిక, జానపద చిత్రాలన్నింటికీ రాజుగారు సంగీతం సమకూర్చారు; సమకూరుస్తున్నారు.

తాను సంగీతాభ్యాసం చేసినా, అంతకంటె ఎక్కువగా తాను చేసిన కృషి, కృషితో లభించిన అనుభవం, పెద్దల ప్రోత్సాహం – ప్రజాదరణ. ఇవే తనను సంగీత దర్శకునిగా నిలబెట్టాయన్నది ఆయన నమ్మకం.

పాటకు స్వరం ఏర్పరచడంలో ఆయన రెండు విధానాలనూ పాటిస్తారు. ముందుగా తాను స్వరం వేస్తే రచయిత పాట రాస్తారు; రచయిత పాట రాస్తే తర్వాత తాను స్వరం అల్లుతారు.

"రెండూ విధానాలే. ఎప్పుడు ఎలా అవసర మైతే అలా ఆ విధానాన్ని పాటిస్తాను. " అంటా రాయన.

తిక్కశంకరయ్య, గృహమే స్వర్గసీమ, ముగ్గురు మరాటీలు, బాగ్దాద్ దొంగ, యస్. వి. యస్. వారి చిత్రం, రామకృష్ణ యన్. ఏ. టి. వారి చిత్రం, గోకుల్ పిక్చర్స్ చిత్రం, పాండవుల బాల్యకథ, తారాశశాంకం, దేవకన్య మున్నగు చిత్రాలు టి. వి. రాజు సంగీత దర్శకత్వంలో తయారవుతున్న చిత్రాలు. ఆయన అనుభవానికీ, నమ్మకాలకూ, కృషికీ, ఈ చిత్రాలు కూడా తార్కాణంగా వుండగలవన్న నమ్మకం ఆయనకు గట్టిగా వుంది !

# కడారు నాగభూషణం

## (చిత్ర 1964, సంచిక నుంచి)

## రజితోత్సవ నిర్మాత శ్రీ కె.బి.నాగభూషణం



గత 25 సంవత్సరాలుగా, తెలుగు, తమిళం, కన్నడం, భాషల్లో 25 చిత్రాలు నిర్మించిన శ్రీ కడారు నాగభూషణం దక్షిణాది నిర్మాతల్లో ప్రముఖులు. ఆయన చేతిక్రింద అనేకమంది నటీనటులు, దర్శకులు తయారైనారు. దక్షిణ భారతదేశంలో ఫిలిం పరిశ్రమకు రూపురేఖలు దిద్దటంలోనూ, దాని అభివృద్ధికి తోడ్పడటంలోనూ ఆయనెంతో కృషి చేశారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఎంతో మంది ఎన్నో వ్యాపార విషయాలు నేర్చుకోవలసి ఉంది. దక్షిణాదిన ఒకే నిర్మాత నాగభూషణంగారు నిర్మించినన్ని చిత్రాలు నిర్మించ లేదంటే అతిశయోక్తి కాదు.

శ్రీ కడారు నాగభూషణం గారు ప్రస్తుతం నిర్మిస్తున్నది 26వ చిత్రం. ప్రస్తుతం ముగింపు దశలో నున్న ఈ చిత్రమే గాక, అనతి కాలంలోనే యింకా ఎన్నో చిత్రాలను నిర్మించేందుకు నాగభూషణం గారు పధకాలు వేశారు. త్వరలో వరలక్ష్మీ పిక్చర్స్ బేనర్ లో తమ 27 వ చిత్రాన్ని నిర్మించేందుకు జెమినీ అధినేత శ్రీ వాసన్ తో భాగస్వామిగా 28 వ చిత్రాన్ని నిర్మించేదుకు, సుందర్ లాల్ నహతా తో భాగస్వామి గా 'ద్రౌపది' వర్ణచిత్రాన్ని ఈ సంవత్సరాంతంలోగా ప్రారంభించేందుకు

పథకాలు తయారైనవి. ఈ వర్ణచిత్రంలో తెలుగు తెరపై కనిపించే ప్రముఖ నటీనటులంతా ఉంటారు.

1948 వ సంవత్సరంలో ఆయన తమిళంలో నిర్మించిన 'నవజీవనం' చిత్రం మద్రాసు ప్రభుత్వపు సువర్ణ పతకాన్ని అందుకుంది. కదారు వారి అనేక చిత్రాలు ఆర్థిక విజయాన్ని పొందినవి.

కృష్ణా జిల్లాలోని కోలవెన్ను గ్రామంలో 58 సంవత్సరాల క్రితం, ధనిక భూస్వామి ఆయిన కదారు భగవానులుగారి పుత్రుడైన నాగభూషణంగారు ఇంటర్మీడియట్ వరకు విద్య నభ్యసించారు. ఆయన గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది. తరువాత విజయవాడ లోని హిందూ హైస్కూలులో చదువుకొన్నారు. బందరులోని నోబుల్ కళాశాలలో ఉన్నత విద్య నభ్యసించారు. తెలుగు ఫిలిం పరిశ్రమకు రూపు రేఖలు దిద్ది సౌత్ ఇండియన్ ఫిలిం ఛేంబరు ఆఫ్ కామర్స్ కు మూలపురుషుడైన క్రీ. శే. గూడవల్లి రామబ్రహ్మం కాలేజ్ లో నాగభూషణంగారికి సహాధ్యాయి. విద్యార్థిగానుండగానే, నాగభూషణం గారికి నాటకాలన్నా, సంగీతమన్నా అభిరుచి ఎక్కువగా ఉండేది. 'బొబ్బిలి యుద్ధం'లో బుస్సీగానూ, 'చింతామణి' లో బిల్వమంగళుడుగా ఆయన నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. కాలేజీ చదువు కాగానే, ఆయన 'సీతారామాంజనేయ సమాజం' అనే సంస్థను ఇందుపల్లి గ్రామంలో స్థాపించి సావిత్రి, బొబ్బిలి నాటకాలను ప్రదర్శించి ప్రజా మన్ననలను పొందారు.

తర్వాత 1929 వ సంవత్సరంలో బాలమిత్ర సమాజంతో పరిచయ మేర్పడి, వారితో ఆంధ్ర, మైసూరు రాష్ట్రాలంతా 1932 వ సంవత్సరం వరకూ ప్రదర్శనలిస్తూ తిరిగారు. 1934 వ సంవత్సరంలో శ్రీమతి పసుపులేటి కన్నాంబతో పరిచయ మేర్పడింది. ఆ రోజుల్లో ఆమె రంగస్థలం మీద అఖండ కీర్తినార్జించింది. ఆమెతో కలసి శ్రీ రాజరాజేశ్వరీ నాట్య మండలిని స్థాపించారు. ఆ సమాజంలో ఆనాటి ప్రముఖ రంగస్థల నటులు వేమూరి గగ్గయ్య, సూరిబాబు, దొమ్మేటి సూర్యనారాయణ, రఘురామయ్య, కన్నాంబ, ఋష్యేంద్ర మణి తదితరులంతా ఉండేవారు. ఈ సంస్థ మేనేజరుగా నాగభూషణం గారు 5 సంవత్సరాలు యావద్భారతదేశం పర్యటించారు. తత్ఫలితంగా ఆయన నాటక రంగ ప్రేక్షకుల నాడిని గ్రహించ గలిగారు.

1936-37 సంవత్సరాలలో విజయవాడ లోని సరస్వతీ టాకీసుతో వారికి పరిచయ మేర్పడింది. అప్పుడు వారు తెలుగులో నిర్మిస్తున్న 'కనకతార' చిత్ర నిర్మాణంలో నాగభూషణం గారు సహకరించారు. 1939 వ సంవత్సరంలో విజయవాడలోని కీ శే కురుకూరి సుబ్బారావు, మానికొండ నరసింహం గార్లతోనూ, కన్నాంబతోనూ కలసి 'భవానీ పిక్చర్సు' ను స్థాపించి 'చండిక' చిత్రాన్ని నిర్మించారు. 1940 వ సంవత్సరంలో శ్రీ రాజరాజేశ్వరీ పిక్చర్స్ అనే మరొక సంస్థను వారి యితర మిత్రుల సహకారంతో స్థాపించి 'సుమతి' 'తల్లిప్రేమ' చిత్రాలను జెమినీ స్టూడియోలో నిర్మించారు. 1943 వ సంవత్సరంలో ఆ కంపెనీ పేరును 'శ్రీ రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీ' గా మార్చి భాగస్థులెవరూ లేకుండా మొత్తం కంపెనీకి ఆయనే సారధ్యం వహించారు.

నాగభూషణం గారి పై ఎస్.ఎస్.వాసన్ కు ఎనలేని ఆభిమానం, వాసన్ తో భాగస్వామిగా ఆయన జెమినీ స్టూడియోలో 7 చిత్రాలను నిర్మించారు. (హరిశ్చంద్ర; తులసీ జలంధర్ తమిళం లోనూ, లక్ష్మి, సౌదామిని, తెలుగు తమిళ భాషల్లోనూ, పాదుకా పట్టాభిషేకం తెలుగులోనూ నిర్మించారు. 1956 వ సంవత్సరంలో ఎస్.ఎస్. వాసన్ తో కలిసి వరలక్ష్మీ పిక్చర్స్ అనే మరొక సంస్థను నెలకొల్పి 8 చిత్రాలను నిర్మించేరు. సావిత్రి చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడం భాషల్లోనూ; వీరభాస్కరుడు, ధర్మమే జయం తెలుగు భాష లోనూ నిర్మించారు.) ఇవి-గాక రాజరాజేశ్వరీ బేనర్ లో 5 చిత్రాలను కూడా నిర్మించారు. (సక్కు బాయి; అన్న తమ్ముడు, శ్రీకృష్ణ మాయ, శ్రీకృష్ణ తులాభారం, ఉషా పరిణయం చిత్రాలు.) 1952 వ సంవత్సరములో శ్రీ సుందర లాల్ నహతాతో పరిచయం కలిగింది. నాగభూషణం గారి అనేక చిత్రాలకు సుందర లాల్ ఎంతగానో సహకరించారు. ప్రస్తుతం నిర్మాణంలో నున్న 26 వ చిత్రంలో సుందర లాల్ కూడా ఒక భాగస్థుడే.

నాగభూషణంగారు నిర్మించిన అన్ని చిత్రాలకు వారే దర్శకులు కూడా. మొదట ఆయన నిర్మించిన 'చండిక' చిత్రానికి దర్శకత్వం వహించిన స్వర్గీయ ఆర్.ఎస్.ప్రకాష్ దగ్గర్నుంచి ఆయన చాలా మెళకువలు నేర్చుకున్నారు ప్రస్తుతం ప్రముఖ దర్శకుడుగా ఉన్న సి. ఎస్. రావు, తమిళనాడులోని రామకృష్ణ, కన్నడ చిత్ర దర్శకుడు జి.ఆర్.రావు నాగభూషణం గారి దగ్గిర ఆసిస్టెంట్లుగా పని చేసినవారే. తెలుగు ఫిలిం పారిశ్రామికుల్లో ప్రముఖులైన కీ.శే.

పారుపల్లి శేషయ్య గారు, నాగభూషణం గారిని దర్శకుడుగా వుండమని ప్రోద్బలపరిచారని, ఆయనపై తనకెంతో గౌరవభావమున్నదనీ నాగభూషణం గారు అంటుంటారు.

తమిళంలో చిత్రాలను తాను నిర్మించటానికి వాసన్ గారే ముఖ్య కారకులని నాగభూషణంగారు అంటూంటారు, తన చిత్ర నిర్మాణానికి అవసరమైన సదుపాయాలను, ఆర్థిక సహాయాన్ని వాసన్ గారే ఏర్పాటు చేశారని ఆయన అంటారు. వాసన్ తో పరిచయం కలిగినది మొదలు, ఆయన తనకు అన్నివిధాల తోడ్పడుతూ, ఉత్సాహపరుస్తుండేవారని, ఆయనపై తనకెంతో గౌరవమున్నదనీ యిప్పటికీ ఆయన అంటారు.

1953వ సంవత్సరంలో మొదటి సారిగా తను సుందర్ లాల్ ను కలుసుకున్నది మొదలు ఆయనపై తనకు ఎంతో గౌరవము ఏర్పడిందని నాగభూషణం గారు చెప్పారు. "సుందర్ లాల్ నహతా గారి విలువైన సలహాలు, సహాయమూ నాకెంతో ధైర్యాన్నిచ్చాయి. ఆ ధైర్యంతో నేను ఫిలిం నిర్మాణంలో ముందుకు పోగలిగాను" అన్నారు. అనేక పరిస్థితుల్లో తాను ఆర్థికంగా, మానసికంగా దిగజారిపోయినప్పుడు, సుందర్ లాల్ నాకెంతో ధైర్యాన్నిచ్చి నాకు మానసిక బలాన్నిచ్చారు. ఆయన నిర్మించిన దాదాపు అన్ని చిత్రాలను సుందర్ లాల్ ఆధ్వర్యంలో నున్న కంపెనీలే డిస్ట్రిబ్యూట్ చేశాయి. ఏ ఒక్క నిర్మాతా తనిచ్చినన్ని చిత్రాలను సుందర్ లాల్ కు యివ్వలేదని ఆయన అంటారు. సుందర్ లాల్ జీ హుందాగల వ్యక్తి. మా ఆఫీసులో ఆయన చిత్ర మొక్కటే అలంకరించబడి ఉంది. ఆయనలోని హుందాతనమూ అదృష్టం నాకూ అబ్బాలని ప్రార్థిస్తాను అన్నారు నాగభూషణంగారు.

దాదాపు గత మూడు దశాబ్దాలుగా నిర్మాతగా తన అనుభూతులను స్మరణకు తెచ్చుకుంటూ నాగభూషణంగారిలా ఆన్నారు. "దక్షిణాదిన ఫిలిం పరిశ్రమ పుట్టిన దగ్గర్నుంచి, వస్తున్న పరిణామాలన్నింటినీ చూస్తూనే ఉన్నాను. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నేను పాత కాలపు వాణ్ని అవటం వలన ఈ నాటి పరిస్థితులలో సర్దుకోలేకపోతున్నాను. ఈనాటి పరిస్తితుల్లో నిర్మాత బ్రతుకు అస్తవ్యస్తంగా ఉంది నిర్మాణ ఖర్చులు పెరిగి పోతున్నాయి. నటీనటుల కిచ్చే రేట్లు కూడా తారాపథాన్నందుకుంటున్నాయి. ప్రేక్షకులు కూడా స్టార్ వేల్యూకే ఎక్కువ ప్రాముఖ్యతనిస్తున్నారు. పరిశ్రమలో వచ్చే నష్టాలన్నింటినీ నిర్మాతే భరించ వలసి వస్తోంది. డిస్ట్రిబ్యూటరు, ఎగ్జిబిటరు కూడా నిర్మాతతో సహకరించి ఆదుకోకపోతే భవిష్యత్తులో నిర్మాత చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఫిలిం పరిశ్రమపై సానుభూతిని ప్రదర్శించకుండుట వల్ల పన్నుల రేట్లు పెరిగిపోవడం, ఫిలిం పరిశ్రమపై అనేక నిర్బంధాలు పెట్టటంవల్ల నిర్మాతలకు నిరుత్సాహం కలుగుతోంది. 25 చిత్రాలను నిర్మించిన తర్వాత (వీటిలో చాలావరకు జయప్రద మైనవే) కూడా నాకు కలిగిన నష్టం లక్షల్లో ఉంది. ఫిలిం పారిశ్రామికులంతా నిర్మాత పడుతున్న ఆగచాట్లను గ్రహించి, దీనికేదోఒక మార్గాన్ని అన్వేషించాలి. విపరీతమైన రేట్లను కోరే నటీనటులను తీసుకొనక పోవటం; 2 లక్షలకు మించకుండా చిత్రనిర్మాణాన్ని ముగించటం; ఈ రెండే ఫిలిం పరిశ్రమాభివృద్ధికి ఉపకరించే చిట్కాలు. ఇక ముందైనా తారాగణం కంటే చిత్రంలోని విలువలే ఎక్కువ ప్రాధాన్యం వహించాలని, భావి భారతదేశ సౌభాగ్యం దృష్ట్యా ఉత్తమ చిత్రాలను నిర్మించేందుకు, అందువల్ల నిర్మాత నష్టపడకుండా ఉండేట్టుగా ఫిలిం పారిశ్రామికవేత్తలంతా తగు మార్గాలను అన్వేషించాలని కోరుచున్నాను" అన్నారు నాగభూషణంగారు.

*రచన: శ్రీ మల్లాది ఫణిభూషణ రావు*

# రేలంగి జీవిత కథ

## (చిత్రసీమ 1959, జూన్ సంచిక నుంచీ)



రేలంగి స్వస్థలం కాకినాడ, తండ్రి రామదాసుగారు. ఆయన హరికథలు చెప్పేవారు. ఆ రోజుల్లో ఆ ప్రాంతాన ఆయనెన్నెరగని వారెవరూ లేరు. ఆయనకు హార్మోనియంలను మరమ్మతు చేసే కొట్టు ఒకటుండేదీ, రేలంగి అక్కడ చక్కని తర్ఫీదు పొందాడు, సరిగమలు కూడా తండ్రిగారి వద్ద నేర్చుకున్నాడు. తత్ఫలితంగా రాగాలు రేలంగి నరనరాలలోనూ, లయజ్ఞానం ప్రతి హృదయ స్పందనం లోనూ మిళితమై పోయాయి. ఇప్పటికీ రేలంగి కొన్ని వర్ణాలు, కృతులను గానం చెయ్యగలడన్న విషయం ఆయన సన్నిహితులకు సైతం చాలామందికి తెలియదేమో!

యంగ్ మన్స్ హేపి క్లబ్ ఆరోజుల్లో పేరు మోసిన నాటకసంస్థ ఆదినారాయణరావుగారు ఒకప్పుడు ఆ క్లబ్ లో సంగీత దర్శకుడుగా పని చేసినవారే, అంజలీదేవి కూడా ఆ సంస్థలో చెక్కబడిన శిల్పమే. ఆ యంగ్ మన్స్ హేపీ క్లబ్ వారు ఆడుతున్న 'రఘుదేవరాజీయం' అనే నాటకానికి శ్రే రేలంగిని ఆయన తండ్రి రామదాసుగారు తీసుకెళ్లారు. ఆ నాటకం చూస్తూన్నంత సేపూ రేలంగి తనను తాను మరచిపోయాడు, రంగస్థలం మీద పాత్రధారులు వదిలే వేడి నిశ్వాసను రేలంగి స్పర్శించగలిగాడు. దాంతో ఆయనలో అజ్ఞాతంగా ఉన్న కళామతల్లి విజృంభించింది. తను కూడా రంగు పూసుకుని రంగస్థలమెక్కాలన్న తలంపు మొలకెత్తింది. కాని, ఆ కోర్కెను తండ్రి గారితో తెల్పడమా, మానడమా ? ఆయన ఆగ్రహిస్తారేమో ! ఏం చేయడం ? ఈ ఆలోచనలతో రేలంగి సతమతమై పోయాడు. ఐతే, ఆ తర్వాత కొంత కాలానికే ఆ యంగ్ మన్స్ హాపీ క్లబ్ వారి మరో నాటకం 'బృహన్నల'లో రేలంగి ఒక గ్రూప్ డాన్స్లో 'నర్తనబాల' వేషం వేయడం జరిగింది. కదం తొక్కుతూ, పదం పాడుతూ రేలంగి మహదానందం పొందాడు. ఐతే, ఆ ఆనందం ఎంతసేపు ఉండలేక పోయింది. ఆ రాత్రి ఆలస్యంగా ఇంటికి తిరిగి వచ్చాక తండ్రి రామదాసు గారు, రేలంగి వొళ్లు హూనం చేసేశారు. "నాటకాల్లో వేషాలు వేస్తావుట్రా !" అని ఆయన కొట్టిన దెబ్బలు ఇప్పటికీ గుర్తు ఉన్నాయేమో !

ఐతే, రామదాసు గారు ఏనాడో గ్రహించాడు-తన కొడుకులో ఏ మూలో, ఏదో 'ఆర్ట్' దాగి ఉందని, కాని, కళ ఏ నాడూ కడుపు నింపదు, కళాశాల విద్యతో సరితూగదు. కొడుకును ప్రోత్సహించడమా, కొడుకు మనసును మరో వైపుకు తిప్పడమా అన్న సందిగ్ధంలో పడ్డారాయన.

కాని, తన భావి జీవితం గురించి రేలంగే ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

బడికి వెళ్ళడం మానేసి, నాటక సమాజాలతో తిరగడం మొదలెట్టాడు. పంతుళ్ళు కొట్టడం మూలంగా వొళ్లు మరింత గట్టి పడిందే కాని, ఫోర్త్ ఫారమ్ తర్వాత చదువు ఏ మాత్రం అబ్బ లేదు.

ఆ రోజుల్లో నాటకాలలో స్త్రీ పాత్రలు ధరించడానికి నడుం బిగించిన స్త్రీలు చాలా అరుదు, ఆందుచేత పురుషులే ఆ కొరతను తీర్చవలసి వచ్చేది, అలా రేలంగి యంగ్ మన్స్ హేపీ క్లబ్ వారి సమాజంలో ఆడ వేషాలు వేస్తూ, ఆ ట్రూప్ తో బాటు నాలుగేళ్ళు ఊరూరా తిరిగారు, అటుపైన ఆంధ్ర గాన బాల సంఘం, ఆంధ్ర సేవా సంఘం ఇంకా మరెన్నో నాటక సంస్థల్లో చేరి ఆనేక ప్రదర్శన లిచ్చారు. రోషనార, మోహినీభస్మాసుర, ప్రమిలార్జునీయం

నాటకంలో సుయోగుడు, చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి, శ్రీ కృష్ణతులాభారంలో వసంతకుడు, విప్రనారాయణలో శ్రీనివాసుడు, మిస్ ప్రేమ ఎం.ఏ లో ఒక పాత్ర ధరించారు, చింతామణిలో శ్రీహరి పాత్రను కూడా కొన్ని సార్లు అభినయించారు.

చదువుకు స్వస్తి చెప్పాక కొంత మంది మిత్రులతో కలిసి 'నాట్య మిత్రమండలి' అనే సంస్థను సొంతంగా లేవదీశారు. ఆ సమాజం వారి తొలి నాటకం తెనాలిలో శ్రీరామనవమి పర్వదినాన. ఆరోజుతో రేలంగి నిత్యజీవిత రంగంలోని అధ్యాయం మారింది, ఆ నాటకానికి అవసరమైన చీరలను రేలంగి ఇంట్లో తల్లిగారికి తెలీకుండా తెనాలికి తీసుకెళ్లాడు, నాటకమయ్యాక ఇంటికి వెళ్తే, తన ఒళ్లు ఎక్కడ హూనం అవుతుందో నని భయపడ్డాడు. ఆ భయంతో మళ్ళీ కాకినాడ వెళ్ళడానికి గుండె ధైర్యం లేక పోయింది. ఆ నాటినించే రేలంగికి ఇల్లూ వాకిలీ, తల్లీ తండ్రీ, బంధుమిత్రులు–అందరూ దూరమయ్యారు. తెగిపోయిన గాలిపటంలా ఒక ఊరంటూ స్థిరనివాసం లేక నాటకాలలో ఛాన్సులు దొరికిన చోట వేషాలు వేస్తూ, తాడూ బొంగరం లేని జీవితంలా దారీ తెన్నూ, దిక్కు మొక్కూ లేకుండా తిరుగాడుతూన్న సమయంలో పారేపల్లి సుబ్బారావుగారు, జొన్నవిత్తుల శేషగిరిరావు గార్లు – వారి నాటక సమాజాల్లో ఆశ్రయమిచ్చారు. ఆ రోజుల్లో రేలంగికి ఆత్మీయుడు పరదేశి అనే తబలిస్టు అతను రేలంగిని కష్ట సమయాల్లో ఆదుకుంటూ, సలహాలిస్తూండేవాడు. కాని, క్రమక్రమంగా నాటకాలలో రేలంగికి ప్రోత్సాహం సన్నగిల్లింది. అయినా నిరుత్సాహపడలేదు. నటనకే తన జీవితాన్ని అంకితం చేయాలన్న ఏకలక్ష్యంతో ఉండిపోయాడు.

సినిమాలలో నటించే వారికి రంగస్థలం ఒక పాఠశాల అని భావించే వారిలో రేలంగి ఒకడు, అంచేతనే నేటికీ రేలంగి వీలున్నప్పుడల్లా కొన్ని నాటకాలలో పాల్గొంటూ, రంగస్థలానికి సేవచేస్తూనే ఉన్నాడు.

...మూకీ చిత్రాలకు అవసాన దశ ప్రాప్తించి, టాకీలు తెలుగులోకి వస్తూన్న రోజులవి. కలకత్తాలో ఐ, రాజారావు అనే వ్యక్తి కృష్ణతులాభారాన్ని తెరకెక్కించడానికి సన్నాహాలు పూర్తి చేశాడు, లక్ష్మీరాజ్యం, జోగినాధం మొదలైనవారు ఆ చిత్రంలో నటించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జోగినాథం ఆ చిత్రంలో వసంతకుడి పాత్రను ధరించడానికి బయల్దేరబోతూండగా, రేలంగి తనూ వస్తానన్నాడు, వెంటనే మూటా ముల్లే సర్దుకొని బయల్దేరాడు ఆ చిత్రంలో ఏ వేషం దొరికినా చాలని. చివరికి ఒక చిన్న గొల్లవాడి వేషం దొరికింది, అంచేత అదే రేలంగి నటించిన మొదటి చిత్రం. ఐతే, ఆ చిత్రంలో ఆ పాత్ర మాత్రం చాలా చిన్నదవడం మూలంగా రేలంగికి ఆ తర్వాత మరే చిత్రంలోనూ అవకాశం లభించలేదు, మళ్ళీ సొంత ఊరు చేరుకొని, నాటకాలలో వేషాలు వేయక తప్పింది కాదు.

ఆటుపైన ఆత్మీయుడు పరదేశి, సి. పుల్లయ్యగారి "లవకుశ" లో పనిచేసి వచ్చి కాకినాడలో మిత్రుడు రేలంగిని కలుసుకున్నాడు. అప్పుడు పరదేశికి మళ్ళీ సి.పుల్లయ్య గారి వద్దనించి కబురు వచ్చింది——

"సతీ అనసూయ–ధృవవిజయం" చిత్రాలలో పని చేసేందుకు. పరదేశి బయలుదేరుతూ, తనతో మిత్రుడ్ని కూడా తీసుకెళ్ళాడు. పరదేశి సహాయంతో సి. పుల్లయ్య గారి వద్ద పనిచేయడానికి రేలంగి అవకాశం సంపాదించుకున్నాడు.

"ధృవ విజయం, సతీ అనసూయ" చిత్రాల తర్వాత సి. పుల్లయ్యగారి వద్దే దాదాపు 14 సంవత్సరాల పాటు ఉండిపోయాడు రేలంగి, ఆసిస్టెంట్ డైరెక్టర్ గా, ప్రొడక్షన్ మేనేజర్ గా–కెమేరా ముందే కాక, వెనక కూడా రేలంగి పని చేసి, చిత్ర నిర్మాణంలోని అన్ని శాఖలలోనూ మంచి అనుభవం సంపాదించాడు. ఈ అవకాశం, అదృష్టం, ఘనత – నటులలో రేలంగి ఒక్కడికే దక్కింది. తొలుత 30 రూపాయల జీతం, తర్వాత రెండు నెలల్లో 40 రూపాయలయింది. అటుపైన రెండేళ్ళకు 100 రూపాయలయింది. ఆ రోజుల్లో వంద రూపాయలంటే నేడు వెయ్యి రూపాయలతో సమానం, సి. పుల్లయ్య గారి వద్ద సతీ అనసూయ – ధృవ విజయం, వరవిక్రయం, మాలతీ మాధవం, మోహినీ భస్మాసుర శ్రీసత్యనారాయణ వ్రతం, గొల్లభామ, జెమినీ బాల నాగమ్మ చిత్రాలలో పని చేసిన తర్వాత రేలంగి మళ్ళీ కాకినాడకు వెళ్లిపోవలసి వచ్చింది.

కాకినాడలో తన భావిజీవితం గురించి ఎటూ నిర్ణయించుకోలేక సతమతమౌతూన్న రేలంగి చివరికి ఏమైతేనేం సినిమాల సంగతి ఆటోఇటో తేల్చుకోవాలన్న ఉద్దేశ్యంతో సకుటుంబంగా మద్రాసుకు తరలివచ్చాడు. సినిమారంగంలో అదివరకు ఎంత అనుభవం సంపాదించినా, ఎందరు

ప్రముఖులతోనో పరిచయమైనా రేలంగి కొంతకాలం పాటు తన కాళ్ళమీద తానే నిలుచుకోవలసిన దుస్థితి వచ్చిపడింది తెచ్చుకున్న తైలం హరించి పోగానే ఎవరో బంధువులకు రాసి రెండు వందలు తెప్పించుకున్నాడు. ఐనా, ఆ రెండొందలు ఎంత కాలం వస్తుంది? తనెంత కాలం ఇలా అవస్థపడాలి ? తనకు మంచి రోజులు ఎప్పడొస్తాయ్ ? తనకు సినిమా పరిశ్రమలో చోటు దొరకదా? ఈ ఆలోచనలతో రేలంగి బుర్ర దిమ్మెక్కిపోయింది.

ఆంధ్రా హాలీవుడ్ గా శోభనాచల స్టూడియో విరాజిల్లుతూన్న రోజులవి. ఎన్నో తెలుగు చిత్రాలు ఆ కర్మాగారంలోంచి దేశంమీదికి దండెత్తుతూండేవి, శోభనాచలా వారు అప్పడు నిర్మిస్తూన్న కీలుగుఱ్ఱం చిత్రంలో రేలంగి అతికష్టంమిద చిన్న ఛాన్సును సంపాదించగలిగాడు. అందుకు నటి కృష్ణవేణి ఎంతో తోడ్పడింది. ఆ చిత్రంలో రేలంగితో కనకం నటించింది. 'చెంప వేసి నాకింపు చేసితివె-చక్కని దానవె చిన్నదాన.' అనే పాటను (డ్యుయెట్లో) రేలంగి స్వతంగా పాడాడు. ఆ చిత్రం శతదినోత్సవం చేసుకుంది. ఐతే, రేలంగికి ముట్టింది మూడు వందల రూపాయలే, ఆ డబ్బుతో మద్రాసు లాంటి మహానగరంలో ఎంత కాలం గడపడం? అలాగే కొంత కాలానికి చేతిలో ఉన్న డబ్బు అయిపోవడంతో రేలంగికి మళ్ళీ దుర్దినాలు ఎదుర్కొన్నాయి. భార్య మెటర్నటీ హాస్పేటల్లోనూ, తండ్రి జబ్బుతో నర్సింగ్ హోమ్ లోనూ ఉన్నారు. చేతిలో చిల్లి గవ్వయినా లేదు. హాస్పిటల్ ఖర్చులు, ఇంటి ఖర్చులను చూచుకోవడమా, మరో వైపు కొత్త చిత్రాలలో ఛాన్సులు చూసుకోవడమా? అలా కొంత కాలంపాటు భగవంతుడు రేలంగిని నానా అవస్థలూ పెట్టాక వైజయంతీ ఫిలిమ్స్ వారు జెమినీలో నిర్మిస్తూన్న 'వింధ్యరాణి' అనే చిత్రంలో ఒక హాస్య పాత్రకు ఆఫర్ ప్రసాదించాడు. ఆ చిత్ర నిర్మాతలు కూడా కీలుగుఱ్ఱంలో శోభనాచల వాళ్లు ఇచ్చినంత తైలమే ఇస్తానన్నారు. సరే సన్నాడు రేలంగి, వంద రూపాయలు అడ్వాన్సుగా పుచ్చుకొని ముందు తన కష్టాలను కొంత వరకు నివృత్తి చేసుకోగలిగాడు. 'వింధ్యారాణి' చిత్రంలో రేలంగి పార్ట్ నర్ గా జి. వరలక్ష్మీ నటించింది. ఆ చిత్రం విడుదలయ్యాక రేలంగి తెలుగు తెర హాస్య నటుడుగా కొందరు నిర్మాతల చేత గుర్తించబడ్డాడు, అలాటి వారిలో కె, వి, రెడ్డి గారొకరు. 'గుణసుందరి కథ' చిత్రంలో ఆయన రేలంగికి మంచి పాత్రను కల్పించారు. దాంతో రేలంగి రోజులు మారాయి, మంచి రోజులొచ్చాయి.

1949 లో 'గుణసుందరి కథ' విడుదలవడంతో రేలంగికి డిమాండ్ పెరిగిపోయింది, రేలంగి లేనిదే చిత్రం విజయవంతం కాదన్న నమ్మకం నిర్మాతలలో బలపడి పోయింది దానికి తగ్గట్టు రేలంగి నటించిన చిత్రాలను చూడడానికి బయలుదేరే ప్రేక్షకులే ఎక్కువైపోయారు. అలా పది సంవత్సరాలు సినిమా రంగంలో పెనుగులాడిన రేలంగికి 'గుణసుందరి కథ', 'మదాలస', 'మనదేశం', 'షావుకారు', 'సంసారం', 'పాతాళ భైరవి', 'స్త్రీ సాహసం' చిత్రాలు విడుదలవడంతో 1950 లో రేలంగి ఖ్యాతి పరాకాష్టనందుకొంది.

వయోవృద్ధులనించి, ముద్దు పాప నిద్దరలో అమాయకంగా వెదజల్లే చిరునవ్వు వరకు రేలంగి తన చిత్రాలలో అనుకరించాడు, ప్రశంసలు పొందాడు. చిన్న అబ్బాయి వీధిలో నిలుచొని అప్పచ్చి తింటూంటే, ఉన్నట్టుండి ఓ కాకి వచ్చి ఆ అప్పచ్చిని కాస్తా లాక్కెళ్లినప్పడు ఆ కుర్రాడు ఎలా మొహం పెట్టాడో, అలా రేలంగి ఒకసారి ఇమిటేట్ చేసేసరికి, బెంగుళూరులోని ఒక థియేటర్లో ప్రేక్షకులు దాదాపు మూడు నిమిషాలపాటు పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుకుంటూండి పోయారట.

సాధారణంగా కారులో ఏకాంతంగా వెళ్తూన్నప్పడు రేలంగి తను నటిస్తూన్న చిత్రాలలోని పాత్రల పోషణల గురించి ఆలోచిస్తూంటాడు. ఏవైనా ఐడియాలు మెదడుకుతోచితే, వెంటనే ఏ డైరీలోనో నోట్ చేసుకుంటూంటాడట కూడా,

1936 వ సంవత్సరంలో రాజమండ్రిలో జరిగిన నాటకాల పోటీలో రేలంగికి ఘనసన్మానం జరిగింది. ఆ సభకు అధ్యక్షత వహించిన హాస్యకవి బ్రహ్మ కీ. శే. శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు గారు రేలంగి కళా సేవను కొనియాడుతూ, 'హాస్యనట చక్రవర్తి' అనే బిరుదును ప్రసాదించారు.

ప్రఖ్యాత హాస్యనటుడు చార్లీచాప్లిన్ ను పరమ వేదాంతి అని అందరూ ప్రశంసించారు, అది పరమ సత్యం, హాస్యకారులందరూ వేదాంతులే, ఈ విషయాన్ని ప్రత్యక్షంగా నిరూపించగల సిద్ధుడు రేలంగి, తనకన్నా విద్యావంతులను సైతం తన వాక్చాతుర్యంతో కట్టివేయగల ప్రతిభాశాలి.

తొలి పరిచయంతోనే ఎలాటి వారికైనా ఆప్తుడైపోతాడు రేలంగి. అంచేత అతని ఆత్మీయులను లెక్కపెట్టడం అంత తేలికైన పని కాదు.

రేలంగి అభిమాన హాస్య నటుడు స్వర్గీయ ఎన్. ఎస్. కృష్ణన్ ఎన్. ఎస్. కె. పేరెత్తినప్పుడల్లా రేలంగి ఒకసారి చేతులు జోడించి, హృదయ పూర్వకంగా జోహారు అర్పించకుండా ఉండలేదు.

తోటి హాస్య నటులు ముందుకు రావడానికి రేలంగి ఈ మధ్య కొన్ని చిత్రాలలో నటించడానికి ఒప్పుకోవడం లేదన్న విషయం సినిమా రంగంలో అందరూ ఎరిగినదే.

అంతే కాదు, రేలంగి దయార్ద్రహృదయుడు. ఉదార స్వభావుడు, ఎన్నో కుటుంబాలకు పోషక కర్త. ఆయన్ని ఆశ్రయించి, ఆయన ఇంట్లో దాదాపు 40 మందికి పైగా తిండీ బట్టకు లోటు లేకుండా ఎలాటి చీకూ చింతా లేక హాయిగా కాలం గడుపుతున్నారు. పైగా ఎన్నో పేదకుటుంబాలలో ధర్మంగా వివాహాలు చేయిస్తున్నాడు రేలంగి. ఎన్నో విద్యాలయాలకు ఆర్థికంగా సాయం చేస్తున్నాడు. ఇటీవల తిరుపతి విశ్వవిద్యాలయానికి 25 వేల రూపాయల విరాళమిచ్చాడు కూడా, ఆ విశ్వవిద్యాలయానికి రేలంగి సెనేట్ సభ్యుడు.

విరాళాల ప్రస్థావన వచ్చినప్పుడల్లా 'నాదేముందీ ? నా సొంత డబ్బేమి కాదుగా? ప్రజల దగ్గర్నించి వచ్చిన డబ్బును ప్రజలకే ఇచ్చేస్తున్నాను,' అంటాడు రేలంగి.

మానవసేవ, మాధవసేవ కన్నా మొత్తం మీద సేవ లన్నిటిలోకీ గోసేవ ఉత్తమోత్తమమైనదని రేలంగి అభిప్రాయం.

రేలంగి హాబీ–తీరిక ఉన్నప్పుడల్లా పాశ్చాత్య చిత్రాలు చూడడం, తను ఒంటరిగా వెళ్లక, తనతోపాటు కొంతమందిని కుడా సినిమాలకు తీసుకెళ్తూంటాడు.

రేలంగి ఆశయం ఒకటుంది. తన తోటి హాస్య నటులందరితోనూ ఒక ఫుల్ లెంత్ కామెడీ చిత్రాన్ని నిర్మించాలని. ఆ ఆశయం కూడా త్వరలోనే నెరవేర గలదు.

ఫిలిమ్ ఫాన్స్ అసోసియేషన్, తదితర సంస్థలవారు ఏటేటా నిర్వహించే బేలెట్ లలో కథానాయకుడు, నాయకి, విలన్ సహాయ నటుడు తప్ప—హాస్య నటుడికి మాత్రం ఒక స్లానాన్ని కేటాయించ లేదు, ఈ విషయమై రేలంగి కాస్త సంచలనం కలిగించి, చివరికి కృతకృత్యుడయ్యాడు. చాలాసార్లు తనే ఉత్తమ హాస్య నటుడుగా విజయాన్ని సాధించాడు.

దైవచింత, పాపభీతి కలవాడు రేలంగి.

ముక్కోటి ఆంధ్రులకు నవ్వులు అందజేస్తూన్న హాస్య నట చక్రవర్తి రేలంగి.

## శ్రీ రేలంగి వెంకట్రామయ్య గారికి

## ఆంధ్రా ఫిల్ము జర్నలిస్టుల సంఘ సభ్యులు సమర్పించు అభినందన పత్రం

మహాశయా ! 'శ్రీకృష్ణ తులాభారం'తో ఆరంభమైన మీ సినిమా జీవిత శకటం కొన్ని సంవత్సరాలపాటు – చీమలు దూరని చిట్టడవిని ప్రయాణించి, కాకులుదూరని కారడవిని అధిగమించి–ఆఖరుకు ప్రశాంతభూముల్లో ప్రవేశించింది. ఇంతవరకూ మీరగపడ్డ నూటఎనిమిది చిత్రాలలో కరుణ, శృంగార, వీర, శాంతి, భయానక, భీభత్స, రౌద్ర, అద్భుత రసాలు హాస్యరసానికి అలుసయిపోయాయని చెప్పడంలో ఆక్షేపణకు తావుండదు.

'కీలుగుఱ్ఱం', 'సంసారం', పాతాళభైరవి', 'పక్కింటి అమ్మాయి', ధర్మదేవత, 'బ్రతుకు దెరువు', 'పెద్దమనుషులు', 'మిస్సమ్మ', 'రోజులుమారాయి', 'సువర్ణసుందరి', 'సంతానం', 'సక్కు–బాయి', 'పేద రైతు' 'లక్ష్మి', 'దొంగరాముడు', 'జయసింహ', 'చెంచులక్ష్మి', 'సంతోషం', 'చింతామణి, 'చరణదాసి'

మొదలయిన చిత్రాలలో మీరు దాల్చిన పాత్రలు హాస్యరసాన్ని కుంభపోతగా వర్షించి ఆంధ్ర సినిమా ప్రేక్షక ప్రజాహృదయఫలకాలమీద వాటి ముద్రలను శాశ్వతంగా అచ్చుగుద్దాయి.

తెలుగు సాహిత్యరంగంలో తెనాలి రామలింగనికి ఎల్లాంటి స్థానముందో అల్లాంటి స్థానం తెలుగు సినిమా రంగంలో మీకుందని ప్రతి కళాకారుడు ఒప్పుకోక తప్పదు. చిత్రసీమలో కథానాయకునికి సవాలిచ్చి హాస్యనటునికి సముచిత స్థానం కల్పించిన మిమ్మల్ని ఏ చరిత్రకారుడు మరిచిపోలేదు. రేలంగి ఉన్న చిత్రం నిర్మాతకు కనకాభిషేకం చేస్తుందన్న సత్యాన్నికూడా ఎవ్వరూ యీనాడు సంస్మరించకుండా ఉండలేరు.

సినిమారంగ ప్రవేశానికి ముందు నాటక రంగంమీద మీరు ఆడిన ఆట, పాడిన పాట మా స్మృతిపథాలలో యింకా పచ్చపచ్చగానే ఉంది. 'సుబ్బిసెట్టి' పాత్రలో మీ విశ్వరూపాన్ని చూడడానికి వేయికళ్లు కావాలనడంలో అతిశయోక్తి ఏమాత్రంలేదు.

సంపాదించిన డబ్బును ఖర్చుపెట్టడంలో మీరు ఆదర్శప్రాయంగా వ్యవహరిస్తున్నారన్న విషయం లోకానికి తెలియనిది కాదు, ఈ మధ్య శ్రీ తిరుపతి వెంకటేశ్వర విద్యాలయానికి నిరాడంబరంగా మీరిచ్చిన యిరవై అయిదువేల రూపాయల భూరివిరాళమే యిందుకు ప్రత్యక్ష నిదర్శనం. పొద్దున లేస్తే సాయంత్రం వరకు మీరు చేసే గుప్తదానాలే మీలోని ఉదారబుద్ధికి సాక్ష్యమిస్తాయి.

హాస్యరసాధి దేవత కాళ్లకు పసుపు పూసి, పారాణి పెట్టి, నొసట సింధూరతిలకం దిద్ది, అందల మెక్కించి, ఆంధ్రదేశపు నడివీధుల్లో తిప్పిన మీకు మా అభినందనల నందజేస్తున్నాం. 'శతమానం భవతి శతాయుః పురుషశ్శతేంద్రియ–ఆయుష్యేవేంద్రియే ప్రతిదిష్ఠతి,' అంటూ యీ శుభ సమయంలో మీ మీద మేము పుష్పాక్షతలు చల్లుతున్నాం.

ఇట్లు

ఆంధ్రా ఫిల్మ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ సభ్యులు.

మద్రాసు,

14–5–59

# రచయిత, దర్శకుడు – వీటూరి

## (విజయచిత్ర 1974, సెప్టెంబర్ సంచిక నుంచీ)



ఉత్సాహవంతులకూ, సినిమాలకూ మధ్య 'వారధి' లాంటిది నాటకం. చలన చిత్రానికి తొలిదశ నాటకమే కాబట్టి, చలనచిత్ర ప్రవేశానికి, నేటికీ నాటకం 'వారధి' లాగానే నిల్చున్నది. నాటకాల ద్వారా ఎందరో నటులు, నటీమణులు, రచయితలు, సంగీత దర్శకులు సినిమాలకు వచ్చినట్టే వీటూరీ వచ్చారు. చిన్ననాడు ఆయనకు నాటకాల మీద ఉత్సాహమే గనక లేకపోయినట్టయితే, తర్వాత తర్వాత సినిమాల మీద కూడా ఉత్సాహం వుండేది కాదేమో! విజయనగరంలో వీటూరి చదువుకుంటున్నప్పుడు రచన మీద ఉత్సాహం కలిగింది. తండ్రిగారు జ్యోతిషంలో పెద్ద పండితులు. ఆయన ద్వారానూ, దగ్గర బంధువైన యామిజాల పద్మనాభస్వామి గారి ద్వారానూ వీటూరిలో కవితాంకురం జరిగింది. స్వయంకృషితో తెలుగు భాషలో ప్రావీణ్యం సంపాదించుకున్నాడు. పన్నెండో ఏటే అతను కవిత్వం రాశాడు. వీటూరికి ఇంకో ఉత్సాహం కూడా ఉండేది. అది

హార్మోనియం వాయిస్తూ పాటలు పాడడం. ఆ ఉత్సాహం, ఈ ఉత్సాహం కలిసి అతని చేత నాటకాలు రాయించాయి. పగ, కరుణాశ్రమం, కల్పన, ఆరాధన, చంద్రిక మొదలైన నాటకాలు రాశారు వీటూరి. ఆయనే సొంతంగా నాటక సంస్థ నెలకొల్పి, ఆ నాటకాలు ఆడారు. ఆ సమయంలోనే విజయనగరంలో వీటూరికి సన్మాన సభ జరిగింది. 'తరుణ కవి' అని వీటూరికి బిరుదు ఇచ్చారు.

వీటూరి. వీటూరి ఇంటిపేరు. వెంకట సత్య సూర్యనారాయణమూర్తి వీటూరి పేరు. ఈ పేరుతో కాకుండా, 'జ్యోతిర్మయి' 'జ్యోతి కుమార్' 'వీటూరి' అన్నపేర్లతో ఆయన అప్పట్లో ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ మొదలైన పత్రికల్లో కథలు రాశారు.

వీటూరి ఉత్సాహం చలనచిత్రాల మీదకు మళ్ళింది. పరిశ్రమలో వున్న అవకాశం అతనికోసం ఎదురు చూడసాగింది. 'అక్కచెల్లెలు' చిత్రం దర్శకులలో ఒకరైన సార్వభౌమారావుది ఆ ప్రాంతమే. భీమునిపట్నంలో ఆయన వీటూరి నాటకం ఒకటి చూశారు. ఆ నాటకం ఆ ఇద్దర్నీ కలిపింది. వీటూరిలో వున్న ఉత్సాహాన్ని, ప్రజ్ఞనూ చూసి అతన్ని సినిమా రచయితగా పరిచయం చెయ్యాలనుకున్నారు సార్వ భౌమారావు. ఆ ఊహకు రెక్కలొచ్చాయి. ఆ రెక్కలు కట్టుకుని 1958లో వీటూరి మద్రాసులో వాలారు. అయితే అనుకున్నట్టుగా సార్వభౌమారావు చిత్ర నిర్మాణం ఆరంభం కాలేదు. జరుగుతున్న ఆలస్యాన్ని చూసి, ఆయనే వీటూరిని చాలామంది పెద్దలకు పరిచయం చేశారు. సదాశివబ్రహ్మం, పాలగుమ్మి పద్మరాజుగార్ల దగ్గర వీటూరి లవకుశ, ఇంటిగుట్లు, కృష్ణలీలలు, భక్తశబరి చిత్రాలకు సహాయకుడిగా పని చేసి, సినిమా స్క్రిప్టు దానికి సంబంధించిన విషయాలు తెలుసుకున్నాడు. 'భక్త శబరి' లో కొన్ని పాటలు, పద్యాలూ రాసే అవకాశం లభించింది. ఆతర్వాత హెచ్. యమ్. రెడ్డిగారితో పరిచయం కలగడం; వీటూరిని ఆయన, రచయతగా నియమించడం; 'గజదొంగ' చిత్రానికి వీటూరి మాటలు రాయడం జరిగాయి.

అంతకు ముందు వీటూరికి మరో మంచి అనుభవం కూడా కలిగింది. రేఖా అండ్ మురళీ ఆర్ట్స్ తరపున పద్మనాభం 'శాంతి నివాసం' నాటకం తీసుకున్నారు. వీటూరి అందులో పాటలు రాశారు. అంతేకాకుండా, ఆ బృందంతో వూరూరూ వెళ్ళి, నిర్వహణ శాఖలో పాల్గొన్నారు. ఆ తర్వాత కొన్ని డబ్బింగ్ చిత్రాల్లో పాటలు రాసే అవకాశం కూడా కలిగింది.

వీటూరికి కలిగిన తొలి పూర్తి అవకాశం"స్వర్ణగౌరి" చిత్రంతో, వై.ఆర్.స్వామి తీసిన ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు వీటూరి రాశారు. తర్వాత నిర్మాత భావనారాయణగారు వీటూరిని బాగా ప్రోత్సహించారు. అలాగే విఠలాచార్య గారూ. ఈ ప్రముఖులిద్దరూ చూపిన ఆదరణే తనను పరిశ్రమలో రచయితగా నిలబెట్టిందని వీటూరి ఎప్పుడూ కృతజ్ఞతలతో చెప్పుకుంటూనే వుంటారు. అలాగే పద్మనాభం. వీటూరి రాసిన తొలి సాంఘిక చిత్రం రేఖా అండ్ మురళీ వారి 'దేవత'.

ఇంతవరకూ వీటూరి 42 చిత్రాలకు రచన చేశారు. వీటిల్లో ఎక్కువ చిత్రాలు జానపదాలు. ఇవి కాకుండా కొన్ని డబ్బింగ్ చిత్రాలకు కూడా మాటలు, పాటలు రాశారు. ఇవి కాకుండా, విడిగా పాటలు మాత్రమే రాసినవి కూడా చాలా వున్నాయి.

ఆకాశరామన్న, చిక్కడు దొరకడు, మర్యాద రామన్న, తోటలో పిల్ల కోటలో రాణి, బంగారు తిమ్మరాజు, శ్రీమతి, లోగుట్టు పెరుమాళ్ళకెరుక, ఇద్దరు మొనగాళ్ళు, మల్లమ్మ కథ, భక్త తుకారాం, గుండెలు తీసిన మొనగాడు – మొదలైన చిత్రాలు వీటూరి రాసిన చిత్రాల్లో కొన్ని చిత్రాలు. 'భక్త తుకారాం' లో మాటలే కాకుండా, కొన్ని పాటలు, పద్యాలూ కూడా రాశారు.

విజయలలిత పిక్చర్స్ పేరిట వీటూరి సొంతంగా సంస్థ ఆరంభించి 'అదృష్ట దేవత' జానపద చిత్రాన్ని నిర్మించారు. దాంతో చిత్రనిర్మాణంలో వున్న సాధకబాధకాలు బాగా అర్థమయినై. ఆ శాఖలో అనుభవం తక్కువ కావడంతో కొన్ని ఇబ్బందులకు గురయ్యారు.

వీటూరికి దర్శకత్వశాఖలో కూడా అనుభవం వున్నది. భావనారాయణగారి చిత్రాలకు రచన చేసినప్పుడు దర్శకత్వశాఖలో ఆయన సెట్సు మీద కూడా పని చేసేవారు. చాలా చిత్రాలకు పని చెయ్యడంతో ఆ శాఖతో కూడా మంచి పరిచయం, అందులో అనుభవం కలిగాయి.

వీటూరి తయారు చేసిన ఎన్నో కథల్లో 'భారతి' కథ కూడా ఒకటి. ఈ కథను తానే చిత్రంగా తీసుకుని తన వూహలకు తానే రూపకల్పన చేసుకోవచ్చునని తానే డైరక్టు చెయ్యాలనుకున్నారు. మనోరంజని పిక్చర్స్ వారు ఈ కథను విన్నప్పుడు వీటూరి వూహ కూడా విని 'అయితే మీరే దర్శకత్వం

కూడా వహించండి' అన్నారు. ఆ అవకాశంతో వీటూరి దర్శకుడు కూడా అయినారు. 'భారతి' చిత్రానికి కథకుడు, మాటలు, పాటల రచయిత, దర్శకుడూ వీటూరి.

ఈ చిత్ర నిర్మాణం పూర్తయింది; త్వరలోనే విడుదల కానున్నది. రామలక్ష్మి పిక్చర్స్ అనే కొత్త సంస్థ పేరిట వీటూరి ఒక కొత్త తరహా చిత్రం తియ్యబోతున్నారు; ఆయనే దర్శకత్వం కూడా వహిస్తారు.

"నేను దర్శకుడిని కూడా కావడం కేవలం కాకతాళీయం. నా మీద సంపూర్ణమైన విశ్వాసంతో ఆ బాధ్యతను నాకు వప్పజెప్పిన మనోరంజని పిక్చర్స్ కె.వి.రెడ్డిగారికి, తక్కిన భాగస్తులకు, పంపిణీదారులకూ నేను ఎప్పుడూ కృతజ్ఞుడను.

తొలిసారిగా నేను దర్శకత్వం చేపట్టినా నేను అనుకున్నది తియ్యగలిగానన్న తృప్తి కలిగింది. దర్శకత్వం వహించగలనన్న విశ్వాసం ఏర్పడింది. ఇక ముందు దర్శకుడిగా కూడా స్థిరపడాలన్న వాంఛను కలగజేసింది;

నా దృష్టిలో చిత్ర దర్శకుడికీ, రచయితకూ పెద్ద తేడా లేదు. ఇద్దరూ ఒకటే. రచయిత కాగితం మీద రాస్తాడు; దర్శకుడు తెర మీద చెబుతాడు. ఇద్దరూ రచయతలే. అయితే రచయితే దర్శకుడు అయినా, దర్శకుడే రచయిత అయినా నా ఉద్దేశంలో – కొన్ని లాభాలున్నాయి. రచయితగా తాను ఉద్దేశించినదాన్ని, సవ్యంగా ఆచరణలో పెట్టగలగడానికి ఆస్కారం వుంటుంది. దీనివల్ల కొందరు ఒక మాట అంటూ వుంటారు. దర్శకుడు, రచయిత– ఇద్దరూ వేర్వేరు వ్యక్తులు కాబట్టి రెండు మేధస్సులు కలుస్తాయి ఒకడే రెండూ చేపడితే, ఒక మేధస్సు తగ్గిపోదా – అని. ఇందులో కొంత నిజమూ వుంది; కొంత ఇబ్బందీ వుంది. దర్శకుడు సమర్థుడయితే రచయిత భావాలను మరింత రాణింపజేయ గలుగుతాడు; లేకపోతే అంతా మారిపోవచ్చు. రెండు మేథలు తగ్గిపోయి, ఒక్కటి అయిపోయినా, చర్చించడానికి, నిర్ణయాలు చెయ్యడానికీ తక్కిన వాళ్ళు ఉండనే వుంటారు. ఏమైనా – పరస్పర అవగాహన, ఏకీభావం తగ్గిపోయిన ఇవాళ్టి రోజుల్లో దర్శకుడు, రచయిత ఒకరే అయితేనే నయమేమో అనిపిస్తుంది." అన్నారు వీటూరి.

# సముద్రాల రాఘవాచార్య



## (విజయచిత్ర 1966, సెప్టెంబర్ సంచిక నుంచి)

"ఫలానా పద్యం ఏ గ్రంథంలోది మాస్టారూ?" అని అడిగితే "ఫలానా గ్రంథంలోదిరా అబ్బాయీ" అని ఆలోచనకు కూడా ఆస్కారం ఇవ్వకుండా, ఠపీమని చెప్పగల జ్ఞాపకం, ప్రజ్ఞాగలవారు అరుదుగావుంటారు. అలాంటి అరుదైనవారిలో అరుదైనవారు రాఘవాచార్యులుగారు, ఆయన చదవని పుస్తకంగాని–ఎరగని గ్రంథంగాని, పఠించని పురాణంగాని, కంఠస్థం చెయ్యని కావ్యం గాని లేవు. ఆచార్యులుగారే ఒక గ్రంథాలయం ఒక నిఘంటువూనూ. సంస్కృతాంధ్రాల్లో ఆయనకు మంచి పాండిత్యమూ, పలుకుబడీ వున్నాయి.

ఆయన రచనచేసిన దాదాపు నూరు చిత్రాల్లోనూ పురాణాలు, సాంఘికాలు, జానపదాలు, చరిత్రలు – అన్నిరకాలూ వున్నాయి, వెయ్యికి పైగా రాసిన సినిమా పాటల్లో శృంగార, రౌద్ర, హాస్య, శౌర్య శోకాది నవరసాలూ వున్నాయి. "కవి అన్నవాడు ఏ ఒక్కటో రాయగలిగేవాడు కాదు. అన్నీ రాయగలడు–రాయాలి. అలా రాసిన వాడే కవి" అంటారాయన.

చలనచిత్రాల్లో_ అందులోనూ పౌరాణిక చిత్రాల్లో మొట్ట మొదటిసారిగా వాడుక భాష వాడినవారు ఆచార్యులుగారు.

ఆయన రచనచేసిన తొలిచిత్రం 'కనకతార'లో వాడుక భాషలో సంభాషణలు రాస్తూవుంటే – నిర్మాతలు ముక్కు మీద వేలు వేసుకున్నారు. "ఇదేమిటి ఈ భాష ?" అనుకున్నారు. "ఇదే భాష, ప్రజల భాష. 'కూర్చుండుడు – దయసేయుడు' అనే గ్రంధపదజాలం సినిమాల్లో ఎందుకు? పదిమందికీ దగ్గరగా వుండే 'దయచేయండి' లాటి పదాలే వుండాలి" అని వాదించి – వ్యావహారిక భాషను ప్రవేశపెట్టారు సముద్రాలగారు.

1902 వ సంవత్సరం జూలై 19 వ తేదీన గుంటూరుజిల్లాలో వున్న రేపల్లె తాలూకా పెదపులివర్రు గ్రామంలో "పండితుల" ఇంట జన్మించారు రాఘవాచార్యులుగారు. ఆచార్యులుగారి తండ్రిగారూ, తాతగారూ సంస్కృతాంధ్రాల్లో పాండిత్యం సంపాయించినవారు. సరస్వతీదేవి ఇంట్లోనే సాక్షాత్కరించినందువల్ల ఆమె కటాక్షం రాఘవాచార్యులవారికి చిన్నప్పుడే కలిగింది !

రేపల్లె హైస్కూల్లో నాలుగోఫారం చదువుతున్నప్పుడు ఆయన కవిత్వం చెప్పడం ప్రారంభించారు. ఆయన సాహచర్యం అంతా పండితులతోనూ, కవులతోనే. బడిలో ఉపాధ్యాయులకు ఆయన 'ప్రియమైన విద్యార్థి' తెలుగుమాస్టారికి ఆచార్యులుగారంటే ఎంత అభిమానం వుండేదో అంత అభిమానమూ ఇంగ్లీషు మాస్టారికీ వుండేది. ఎంచేతంటే ఆయన ఇంగ్లీషులోనూ మంచి మార్కులే సంపాయించేవారు. 'స్కూలు ప్లేగ్రౌండు' ఎలా వుంటుందో ఆయనకు తెలియకపోయినా 'పాఠశాల వ్యాయామ సంఘానికి' ఆయనే కార్యదర్శి ! దీనికి కారణం మరేమీ లేదు కార్యదర్శిగా వుండ వలసిన వాడికి ముఖ్యంగా తెలివితేటలుండాలని, రాఘవాచార్యులు గారిని ఎన్నిక చేసుకున్నారు.

1918వ సంవత్సరంలో ఆచార్యులుగారికి 'అవధానం' అంటే ఏమిటో తెలిసి ఆ సాధనలో పడ్డారు. ఏ ఐదారుమైళ్ళ దూరంలోనో ఏ పండితుడైనా 'అవధానం' చేస్తున్నాడంటే చాలు ఆయన అక్కడికి పరిగెత్తారన్నమాటే.

స్కూలు ఫైనలు ఐపోయిన తర్వాత సముద్రాలగారు 'పాఠశాల చదువుకు' స్వస్తి చెప్పి 'అసలు చదువు' సాగించారు. స్వయంగా కృషిచేసి సంస్కృతాంధ్రాల్లో పాండిత్యం, ఆంగ్లభాషలో ప్రావీణ్యం సంపాయించారు. తర్వాత ఆయనకు గుంటూరుజిల్లా గ్రంధాలయ సంఘంతో బాగా సంబంధం ఏర్పడింది. అప్పడే ఆయన, రోజుకు వెయ్యిపేజీల చొప్పున చదివి మొత్తం గ్రంధాలన్నీ – దాదాపు "బట్టీ" వేశారు.

రాఘవాచార్యులుగారు ఉప్పు సత్యాగ్రహంలో కూడా పాల్గొన్నారు.

బెజవాడలో 'ఫ్రెండ్స్ అండ్ కో' అనే వ్యాపారసంస్థ ఒకటి వుండేది. ఆ సంస్థ అధిపతికి సాహిత్యాభిలాష ఎక్కువ, నాటకాల మీద మంచి మక్కువ. సాహిత్యంలో మంచి ప్రవేశం కూడా వున్నది. ఆచార్యులుగారు ఎవరితోనో ఒకనాడు ఆ కంపెనీకి వెళితే ఆ కంపెనీ యజమానికి ఆచార్యులుగారిని పరిచయంచేసి, ఆయనను రాఘవాచార్యులుగారికి పరిచయం చేశారు "వీరు గూడవల్లి రామబ్రహ్మం గారు. ఈ ఫ్రెండ్స్ అండ్ కో వీరిదే. రసహృదయులు" అని.

రామబ్రహ్మంగారు చలనచిత్రాలకు దర్శకత్వం వహిస్తారని గాని, రాఘవాచార్యులుగారు రచనలు చేస్తారనిగాని వాళ్ళెవరూ అప్పుడు వూహించి వుండరు! తర్వాత వాళ్ళిద్దరూ ఆ పన్లు నిర్వహించవలసిన యోగం వుండడంచేతే కాబోలు–వారిద్దరిమధ్య స్నేహం బాగా పెరిగింది. ఇద్దరూ కూచుని గంటల తరబడి సాహిత్య చర్చలు చేసేవారు. ఆ చర్చల్లో గూడవల్లిగారు వ్యాపారమూ, సముద్రాలవారు ప్రపంచమూ మరిచిపోయేవారు! అప్పుడు రాఘవాచార్యులగారి రచనలు తరచూ పత్రికల్లో పడుతూవుండేవి.

సాహిత్యాభిలాష వెనక్కుపోతుందనో ఏమో ఆచార్యులుగారు ఎక్కడా ఉద్యోగం చెయ్యలేదు. "మీ ఉద్యోగం ఏమిటండీ?" అని ఎవరైనా అడిగితే. "పుస్తకాలు చదువుకోవడం, ఏదేనా రాసుకోడం, మంచిచెడ్డలు తర్కించడం" అని సమాధానం చెప్పేవారాయన.

అప్పుడు గుంటూరు జిల్లాబోర్డు అధ్యక్షులుగా వుంటున్న జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారికి రాఘవాచార్యులగారంటే మంచి అభిమానం వుండేది. వీలైనప్పుడల్లా ఆయన్ను పిలిచి పద్యాలు చెప్పించుకుంటూ వుండేవారు. ఆచార్యులగారితోపాటు ఇంకొకాయన కూడా వచ్చి సాహిత్య చర్చల్లో పాల్గొనేవారు, ఆయన కొసరాజు రాఘవయ్యచౌదరిగారు !

కొన్నాళ్ళకు రామబ్రహ్మంగారు 'ఫ్రెండ్స్ అండ్ కో' ను మూసేసి – మద్రాసు వెళ్ళి 'సమదర్శిని' పత్రికలో సహాయ సంపాదకుడిగా చేరారు. తాపీ ధర్మారావుగారికి కూడా ఆ పత్రికతో సంబంధం వుండేది.

'కమ్మచరిత్ర' అనే విషయంమీద పరిశోధనలు చెయ్యడానికి కుప్పుస్వామి చౌదరిగారు, రాఘవాచార్యులుగారిని మద్రాసు విశ్వవిద్యాలయంలో వున్న ప్రాచీన లిఖిత పుస్తకభాండాగారానికి పంపించారు. ఆ పనిమీద వచ్చినప్పుడు ఆచార్యులుగారు 'సమదర్శిని' పత్రికతో కూడా కొంత సంబంధం ఏర్పరచుకున్నారు. కారణాంతరాలవల్ల ఆ పత్రిక ఆగిపోవడంతో రామబ్రహ్మంగారు బెజవాడ, పరిశోధన పూర్తికావడంతో రాఘవాచార్యులుగారు గుంటూరూ చేరుకున్నారు.

రామబ్రహ్మంగారూ, ఆచార్యులు గారూ తర్వాత 'ప్రజామిత్ర' లో పనిచేశారు. ఆ పత్రిక అప్పుడు బెజవాడ నుంచి వెలువడేది. ఏవో ఇబ్బందులొచ్చి ఆ పత్రిక ఆగిపోతే – సముద్రాలగారూ, గూడవల్లి గారూ మద్రాసు వచ్చి 'ప్రజామిత్ర'ను రాజకీయ వారపత్రికగా ప్రారంభించారు. ఇది 1934 లో. అప్పడే బి.యన్.కె.ప్రెస్ వెలిసింది – 'ప్రజామిత్ర' అక్కడే అచ్చయేది.

తర్వాత రామబ్రహ్మంగారి మనసు సినిమాలమీదికి మళ్ళడం 'ద్రౌపదీ వస్త్రాపహరణం' చిత్రంతో ఆయనకు కొంత సంబంధం ఏర్పడడం జరిగాయి. రాఘవాచార్యులుగారికి బి. యన్. రెడ్డి. నాగిరెడ్డిగార్లతో పరిచయం ఏర్పడింది.

"కనకతార" చిత్రానికి రామబ్రహ్మంగారు ప్రొడక్షన్ డైరెక్టరుగా ఉండేవారు. చిత్రానికి రచయిత ఎవరా అని మీమాంస వచ్చింది. "రాఘవాచార్యులవారితో రాయిద్దాం" అన్నారు రామబ్రహ్మం.

రామబ్రహ్మంగారి ప్రోద్బలంవల్ల రాఘవాచార్యులుగారు "కనకతార" చిత్రానికి మాటలూ, పాటలూ, పద్యాలూ రాశారు. ఇది ఆయన మొదటి చిత్రం. సినిమా రచయితగా ఆచార్యులుగారు అలా పరిచయమైనారు. ఆ చిత్రం బాగా ధనార్జన చేసింది. ఆయన ప్రవేశపెట్టిన వ్యావహారిక భాష అందరికీ నచ్చింది.

హెచ్. ఎం. రెడ్డిగారు, బి. యన్. రెడ్డిగారూ 'రోహిణీ' సంస్థ స్థాపించి _ 'గృహలక్ష్మి' నిర్మాణానికి పూనుకొని – రాఘవాచార్యులుగారిని రచయితగా తీసుకున్నారు. ఈ చిత్రం సాంఘికం ! ఐతేనేం అదేమాత్రం ఇబ్బంది అనిపించలేదు సముద్రాలగారికి.

తర్వాత వాహినీసంస్థ వెలియడం తో ఆచార్యులుగారు 'వాహినీ'లో చేరి 'వందేమాతరం' 'సుమంగళి' 'దేవత' 'పోతన' 'స్వర్గసీమ' 'వేమన' చిత్రాలకు రచన చేశారు.

1950 లో వినోదా పిక్చర్స్ సంస్థలో 'భాగస్వామి' గా చేరి 'స్త్రీ సాహసం' 'శాంతి' 'దేవదాసు' చిత్రాలు రాశారు. ఆయన ఒక్క పాటలే రాసిన మొదటి చిత్రం జెమినీవారి 'జీవన్ముక్తి'.

రాఘవచార్యులు గారి పెద్ద అబ్బాయి రామానుజాచార్యులు 'మాయలోకం' చిత్రంలో తండ్రిగారికి సహాయపడ్డారు అందులో కొన్ని పాటలు కూడా రాయడంతో 'సినిమా'ల్లో ఆయన కూడా రచయితగా పరిచయమైనారు. ఆయనే సముద్రాల జూనియర్.

1962వ సంవత్సరం జులై 18 న ఆచార్యులుగారికి వైభవంగా మద్రాసులో 'షష్టిపూర్తి' మహోత్సవం జరిగింది.

సముద్రాలగారు చిత్రాలకు కేవలం రచన మాత్రమే చెయ్యలేదు. కొన్నింటికి దర్శకత్వం కూడా వహించారు. 'వినాయక చవితి' 'భక్త రఘునాథ్' 'బభ్రువాహన' చిత్రాలు ఆయన దర్శకత్వంలో తయారైనవి.

ఇప్పుడు ఆయన–చిన్నీ బ్రదర్స్ వారి 'సుమతి' యస్.యమ్. యస్. వారి 'గోరాకుంభార్' తారక రామావారి 'కృష్ణావతారం' మాధవీ వారి సాంఘిక చిత్రాలకు రచన చేస్తున్నారు.

"సినిమాలలో జన సామాన్యానికి అర్థం కాని పద్యాలను జొప్పించడంలో అర్థంలేదు. ప్రయోజనం అంతకన్నా లేదు. ఆ పద్యం చివర జరిగే 'రాగాలాపన' కూడా రసోత్పత్తికి భంగం కలిగిస్తుంది. కోపంతోనూ యుద్ధాల్లోనూ వాదనల్లోనూ పద్యాలు చదవడం నాకేమాత్రం నచ్చదు. ఐతే దర్శకులు, నిర్మాతలూ కావాలంటారు కాబట్టి – తప్పడం లేదు. ఐతే – నా ఉద్దేశంలో ఇవి శుద్ధ అనవసరం అని. ఎంచేతంటే ఆ పద్యంలో వున్న భాషగాని, భావంగాని ఎంతమందికి అర్థమవుతుంది ? పైగా పద్యాల్లో వాదించుకోవడం కూడా ఏమంత మంచి పద్ధతి ?" అంటారాయన.

"పురాణ కథల్లో లేని విషయాలను మేము చిత్రాల్లో ప్రవేశ పెడుతున్నామని, లేని పాత్రలను సృష్టిస్తున్నామని అంటారు. ఇది నిజమే ఐనా సమర్థనీయం. ఎంచేతంటే పురాణంలో వున్న విషయాన్ని తెరమీద చెప్పడానికి గాని, రాయడానికి గాని కొంత 'డ్రామా' అవసర మవుతుంది. ఆయా పాత్రల ఔచిత్యానికి భంగం కలగకుండా – అసలు కథలోని పాత్ర పోషణకు దెబ్బ తగలకుండా చేస్తే ఏమీ తప్పులేదు. అది వాంఛనీయం కూడా ! మహాభారతంలో వున్న 'శకుంతల' కథను తీసుకుని కాళిదాసు నాటకంగా రాపినప్పుడు 'నాటకీయత' కోసం మూలంలో లేని మార్పులు కొన్ని చేశాడు. నాయకుడైన దుష్యంతుని పాత్రను ఉదాత్తంగా చిత్రించడానికని – కాళిదాసు నాటకంలో 'శాపం' విషయాన్ని ప్రవేశ పెట్టాడు. ఇలా ఔచితికి భంగం రానీయకుండా జనరంజకం చెయ్యడానికి కవులు ఇటువంటి స్వాతంత్ర్యాన్ని తీసుకున్నారు. 'రామాయణం' రాసిన మహా కవులు కూడా 'వాల్మీకి రామాయణంలో లేని ఘట్టాలను ప్రవేశ పెట్టారంటే. కారణం ఇదే ! 'కథ'లో ఒకలా వుండే 'కథ'ను తెరమీద గాని, రంగంమీద గాని చెప్పడానికి ప్రయత్నం చేసినప్పుడు – 'డ్రెమటిక్'గా వుండాలి. మానవ హృదయ ప్రవృత్తులు ఇప్పుడెలా వున్నాయో, అప్పుడూ అలాగే వుండేవి. అంచేత, రసభంగం చెయ్యని మార్పులు – ఎంతో అవసరమైతే తప్ప – కవులు చేస్తూనే వున్నారు – చెయ్యాలి కూడా."

"సినిమా స్క్రిప్టు ముందే సిద్ధం చేసుకోవడం అన్నది చాలా మంచి పద్ధతి. కావలసినది ఏమిటో అనుకుని, విపులంగా చర్చించుకుని క్షుణ్ణంగా అర్థం చేసుకుని రాసుకున్నాక – మళ్ళీ మార్పులు అనేవి అవసరం కావు. స్క్రిప్టు మీద నమ్మకం లేకపోయినప్పుడే – అడుగడుక్కీ మార్పులు అవసరం అనిపిస్తూ వుంటాయి. అందుకనే ముందే నమ్మకం సంపాదించుకోడానికి – చక్కగా చర్చించుకుని "ఇదీ" అనుకోవాలి. నేను పని చేసిన దర్శకులలో ఈ పద్ధతిని అనుసరించి క్షుణ్ణంగా 'స్క్రిప్టు' చర్చించి ముందే రాయించిన వాళ్ళలో శ్రీ కె. వి. రెడ్డి, శ్రీ యన్. టి. రామారావు ముఖ్యులు!" అన్నారు ఆచార్యులుగారు. 'వెండి పెట్టె'లో వున్న తమలపాకులు తీసి, 'తాంబూలం' వేసుకుంటూ.

# టి.వి.ఎస్.శర్మ

# ఆర్టు డైరెక్టరు

## (తెలుగు సినిమా 1948, ఏప్రిల్ సంచిక నుంచీ)



ఒక చిత్రం విజయవంతమయిందంటే దానికి కారకులు ఒక్క నటీ నటకులు మాత్రమేకారు. మీరు తెరపైన చూడని టెక్నీషియన్ల శ్రమ ఎంతో వుంటేగాని చిత్రం విజయవంతమవటానికి వీలు లేదు. మద్రాసు చిత్ర పరిశ్రమలో వున్న ముఖ్య ఆర్టు డైరక్టర్లలో శ్రీ టి.వి.యస్.శర్మ గారు ఒకరు. వీరిని పాఠకులకి పరిచయం చేస్తున్నాము. ప్రతి సంచికలోనూ ఒక టెక్నీషియన్ ని పాఠకులకి పరిచయం చేస్తాము. సం!!

www.koumudi.net

★ ★ ★

1909 సం||లో నెల్లూరు జిల్లా పొదిన తాలూకాలోనున్న తంగిరాల సుబ్బయ్య అనే గ్రామ మునసబుకి జన్మించాడు. టి.వి.యస్.శర్మ. శర్మకి ఎనిమిదేళ్ళ వయస్సు వున్నపుడు, స్నేహితులతో ఆడుకుంటూండగా, రాళ్ళు పగలగొట్టటానికి కూర్చబడిన మందుగుండు పేలటం, తత్ఫలితంగా ఆడుకుంటున్న కుర్రాళ్ళకి గాయాలు తగలటం శర్మ ఎడంచేయికి దెబ్బ తగలటం జరిగాయి. డాక్టర్ల సలహా ప్రకారం శర్మ ఎడం చేయిని ఏంపుట్యువేట్ చేశారు. ఆనాటినుంచీ శర్మ వంటిచేయి వాడయ్యాడు.

అసలే బీదవాడు అయిన శర్మ తండ్రికి వుద్యోగం పోవటంవల్ల నిలువ నీడలేక నెల్లూరు చేరుకున్నారు. అప్పుడు శర్మకి తొమ్మిదేళ్ళు. నెల్లూరులో ఒక సత్రంలో నివసిస్తూండేవారు. శర్మకి ముగ్గురు తమ్ముళ్ళు, ఒక చెల్లెలు. ఉద్యోగం లభించక; యింత సంసారాన్ని మోయలేక శర్మతండ్రి బ్రాహ్మణీకం ప్రారంభించాడు. అదే సత్రంలో 10 సంవత్సరాలు గడిపారు. శర్మ చదువుకుంటూండేవాడు. నెల్లూరులో పెద్ద గాలివాన వచ్చింది. శర్మకి దాదాపు 19 సంవత్సరాలు. ఆ గాలివానలో శర్మ తండ్రి మరణించాడు.

తండ్రిని పోగొట్టుకున్న శర్మలో విరక్తి ఏదో భయం మళ్ళీ కొంత మొండిధైర్యం రగుల్కున్నాయి. ఆనాటినుంచీ ప్రారంభించాడు శర్మ జీవితంతో హోరాహోరీగా యుద్ధం.

దేశ సంచారం బయలుదేరాడు. ఆగ్రా, నాసిక్_హైద్రాబాదు మొదలయిన వూళ్ళు తిరిగి తిరిగి చివ్వరికి విజయనగరం చేరుకున్నాడు. డబ్బులేని శర్మ ఈ వూళ్ళన్నీ ఎలా తిరిగాడు! ఈ ప్రశ్నకు సమాధానం మీ వూహాతీతం కాదు. విజయనగరంలో కట్టు సూర్యనారాయణ శాస్త్రి గారి దగ్గర సంగీతం నేర్చుకోవటం ప్రారంభించాడు. దాదాపు ఒకటిన్నర సంవత్సరం విజయనగరంలోనే వుండి, యువకుడూ చంచల మనస్కుడూ అయిన శర్మ హైద్రాబాదు చేరుకున్నాడు. హైద్రాబాదు లో హుసేన్ బక్ష్ ప్రముఖ చిత్రకారుడు దగ్గిర చిత్రకళ నేర్చుకొనటం ప్రారంభించాడు. కొంతకాలం హైద్రాబాదులో గడిపి అక్కణ్ణుంచి బందర్ చేరుకున్నాడు. డబ్బులేని, వుద్యోగంలేని శర్మ ఈ సంచారం ఎలా సాగించాడు ? ఈ వూళ్ళల్లో ఎలా జీవించాడు బ్రతకాలనే యిచ్ఛవున్న ప్రతివ్యక్తీ ఏవో కొన్ని మార్గాలు వెదుక్కుంటాడు.

శ్రీ ఈరంకి వెంకటశాస్త్రి గారి అభిమానాన్ని సంపాదించుకుని, ఆంధ్రజాతీయ కళాశాలలో ప్రవేశించాడు శర్మ. ముట్నూరి కృష్ణారావు, చెరుకువాడ లక్ష్మీనరసింహారావు, మన్నవ రాజగోపాల కృష్ణయ్య, ధనస్సు సూర్యనారాయాణరావు శాస్త్రి, వారణాసి సదాశివపంతులు మరికొందరి పెద్దమనుష్యుల ఆదరాన్ని సంపాదించుకుని వారాలు చేసుకుంటూ చిత్రలేఖనం నేర్చుకుంటూండేవాడు. నవ్వులరాణి, నవ్వులతోట అనే రెండు తెలుగు పత్రికలకి బొమ్మలు గీస్తూ కొంత సంపాదించుకునే వాడు.

ఒక హిందీ నాటకంలో అలెగ్జాండర్ పాత్ర ధరిస్తూండేవాడు కూడా. ఆంధ్రజాతీయ కళాశాల గురించి ఒక ముక్క చెప్పాలి. ఆంధ్రదేశంలో పేరుపడ్డ చిత్రకారులయిన కౌతా రామ్మోహన్, అడివి బాపిరాజు, మాధవపెద్ది గోఖలే, చలనచిత్ర పరిశ్రమలో పేరుపడ్డ చిత్రకళా దర్శకులు ఎస్.వి.ఎస్. రామారావు, శర్మ, ఎస్.ఎస్.బ్రహ్మ కూడా ఆంధ్ర జాతీయాకళాశాల నుంచి వచ్చిన వారే. బరోడా సంస్థాన చిత్ర కారుడు శంకరరామనాధన్ కూడా ఈ కళాశాలనుంచి వచ్చిన వాడే. శర్మ సహాధ్యాయి అయిన డైరెక్టర్ సి.పుల్లయ్య ప్రప్రధమంగా శర్మని మద్రాసు పిలిపించి స్టార్ పబ్లిసిటీ అనే ఒక అడ్వర్టయిజింగు కంపెనీలో ప్రవేశ పెట్టాడు. ఆనాటినుంచీ శర్మకి చలనచిత్ర పరిశ్రమతో సంబంధం ఏర్పడింది. ఈ పబ్లిసిటీ కంపెనీ, స్టార్ కంబైన్స్ అనే సినిమా కంపెనీగా మారటం కొల్హాపూరులో హరిశ్చంద్ర తీయటం, శర్మకూడా వెళ్ళి ఆర్టు డైరెక్షన్ నేర్చుకొనటం సంభవించాయి. కొంతకాలం అసిస్టెంటుగా పనిచేసి, తర్వాత తర్వాత స్వంతంగా ఆర్టుడైరెక్షన్ నిర్వహించాడు. శర్మ ఆర్టు డైరెక్షన్ యీ చిత్రాలలో మనం చూశాం. హరిశ్చంద్ర, సతీతులసి, మార్కండేయ, బాలాజీ, మైరావణ, భూకైలాస్, విశ్వమోహిని, పార్వతీకళ్యాణం, కృష్ణప్రేమ, గరుడగర్వభంగం, సీతారామజననం, సత్యభామ, భీష్మ, గొల్లభామ, ఎక్సుక్యూజ్ మీ, అరవ అశోక కుమార్, ఋష్యశృంగం, ధన, అమరావతి, పారిజాతం, కంకణం, ద్రోహి.

తారల జీవితాలకీ టెక్నీషియన్ల జీవితాలకి వున్న వ్యత్యాసం పాఠకులకి గోచరిస్తుందని విశ్వసిస్తున్నాను. తృటికాలంలో తారాజువ్వ మల్లే ఆకాశాన్ని అందుకోలేడు టెక్నీషియన్, కష్టపడి ఒక్కొక్క అడుగే వేస్తూ జీవితాన్ని, భవిష్యత్తుని నిర్మించుకుంటాడు టెక్నీషియన్. శోభనాచల స్టూడియో ఆర్టుడైరెక్టరుగా పనిచేస్తూ, పెద్ద జీతం సుమారు రూ.1000 యీనాడు సంపాదిస్తున్న శర్మ యీ స్థితికి చేరుకొవటానికి ఎంతకాలం ఎంత శ్రమ అవసరమైందో ఆలోచించండి.

# కాంచనమాల

## (తెలుగు సినిమా 1948, ఏప్రిల్ సంచిక నుంచీ)


శివలింగ ప్రసాద్, కాంచనమాల

తెనాలి సమీపంలో కూచిపూడి అనే గ్రామంలో నివసించే దాసరి నారాయణదాసు కుమార్తె కాంచనమాల. పినతండ్రి వీరాస్వామి ఇంట్లో పెరిగింది కొంతకాలం. వీరాస్వామి సంఘసంస్కర్త, వైలనిస్టు. ఈయన ఇంట్లో పెరిగిన కాలంలోనే కాంచనమాలకి కొంత సంగీతం, విజ్ఞానం అబ్బింది. ఆమెకి పదమూడు ఏళ్ళున్నపుడు, సినిమాలలో చేరాలని బుద్ధిపుట్టింది. కాని, అప్పట్లో ఖ్యాతి గడించిన ఒక దర్శకుడు, కాంచనమాల ముఖం స్క్రీనుకి పనికిరాదన్నాడు.

ఆ తర్వాత కొంతకాలానికి కపిలవాయి రామనాథశాస్త్రి, ఋష్యేంద్రమణి నటించిన 'కృష్ణ తులాభారం' లో యీమెకి అవకాశం లభించింది. అప్పటికే గాలి వెంకయ్యతో కాపురం చేస్తూండేది. కృష్ణ తులాభారంలో కాంచనమాల నటించిన పాత్ర మరీ చిన్నదవటం వల్ల, పైగా యీ చిత్రం విజయవంతం కాకపోవటం వల్ల, కాంచనమాలకి పేరు రాలేదు.

తెనాలి వారు 'వీరాభిమన్యు' కి ఆర్టిస్టులని అందచేసే కాంట్రాక్టు తీసుకోవటం వల్ల యీమెకి వీరాభిమన్యులో అవకాశం లభించింది. వీరాభిమన్యుకోసం తీసిన టెస్టుషాట్సు చూసి, ప్రఖ్యాత స్త్రీ నిర్మాత బాయిజదన్ బాయి ముగ్ధురాలయిందనీ, ప్రఖ్యాత హిందీ చిత్రాలలో వేయిస్తానని అడగ్గా అందుకు కాంచనమాల అంగీకరించలేదనీ తెలుస్తున్నది. ఆ తర్వాత విప్రనారాయణలో నటించింది. విప్రనారాయణలో యీమె నటన చూసి, కీ.శే.గూడవల్లి రామబ్రహ్మం గారు "యిప్పటికి తెలుగు సినిమాలకి ఒక తార వచ్చింది" అని ప్రజామిత్రలో వ్రాశారు. గృహలక్ష్మి తర్వాత కాంచనమాల తారాపథాన్ని చేరుకుంది. మాలపిల్ల, వందేమాతరం, మళ్ళీ పెళ్ళి, యిల్లాలు, మైరావణలలో నటించింది. 1941 ప్రాంతాలకి, కాంచనమాలకి ఒక్క తెలుగు సినిమా పరిశ్రమలోనే కాక, దక్షిణదేశ సినిమా పరిశ్రమ అంతటిలోనూ ఒక పెద్ద విలువ ఏర్పడింది.

జెమినీ స్టూడియోస్ ప్రారంభించి, దక్షిణదేశ సినిమా పరిశ్రమ అంతటినీ అరచేతుల్లో బిగిద్దామని వుద్దేశించి, ఆనాటి ప్రఖ్యాత తారలనీ, టెక్నీషియన్లని బుక్ చేయ ప్రారంభించాడు వాసన్.

జెమినీ వారి నాలుగు చిత్రాలలో నటించటానికి బుక్ చేశాడు కాంచనమాలని వాసన్. ఆర్థికంగా, సాంఘికంగా, మనిషి స్థితి పెరిగినపుడు, ఆ పరిణామంలో కాకపోయినా, కనీసం కొంతయినా విజ్ఞానమూ, సంస్కారమూ పెరిగితే కాని తట్టుకోవటం కష్టం. అలాకాని సందర్భంలో మానసిక వైపరీత్యాలు కలగటం సహజం.

తెలుగు దేశంలో వుత్తమ నటీమణిగా పూజింపబడిన కాంచనమాలకి అహంకారం కలిగింది. అంతే కాకుండా ప్రతి మనిషినీ_ప్రతివ్యక్తినీ శంకించటం ప్రారంభించింది. ఇవన్నీ మానసిక వైపరీత్యాలే. సామాన్య మనిషి స్వభావానికి యీమె స్వభావానికీ యిదే వ్యత్యాసం. ఈ వ్యత్యాసాన్నే పిచ్చి అంటారు.

బాలనాగమ్మలో నటించేటప్పుడే కాంచనమాల మతి కొంచెం అస్థిరంగా వుండేది. లక్షణాలు పైన చెప్పాను. దీనికి తోడు దేహ అనారోగ్యం. కాని అప్పట్లో యీమె మతి స్థిరంగా లేదని ఎవ్వరూ అనుకోలేదు. గీర్వాణం అన్నారు. చీటికి మాటికి కయ్యిమనటం ప్రారంభించింది. జెమినీలో పనిచేసే వుద్యోగులకి యిది భరించటం కష్టంగా వుండేది. వైషమ్యం పెరిగింది.

ఒకసారి పోట్లాట శృతి మించింది. వాసన్ వచ్చి తీర్పు చెప్పబోయాడు. కాంచనమాల వాసన్నీ తిట్టింది.

మేకప్ తీయించమన్నాడు. నష్టపరిహారంగా లక్షరూపాయలకి పైన యిచ్చుకోమని, వాసన్ రిజిష్టర్ నోటీసు యిచ్చాడు. వాసన్ రిజిష్టర్ నోటీసుకు కాంచనమాల బెదిరిపోయింది. రాజీకి సిద్ధమైంది. అప్పటికి జెమినీ నుంచి కాంచనమాలకి 22.5 వేల రూపాయలు ముట్టాయి. బాలనాగమ్మ పూర్తి చేసేటట్టుగా, ఆ తర్వాత, నెలకి 500 రూ. అలవెన్సుతో మరొక చిత్రంలో నటించేట్టుగా రాజీ కుదిరింది.

రాజీ కాగితాలమీద సంతకం పెట్టటానికయితే అంగీకరించింది కాని, మళ్ళీ జెమినీ స్టూడియోస్ లో అడుగుపెట్టడానికి సిద్ధపడలేదు. కాంచనమాల. ఆత్మాభిమానం అందుకు కారణం. ఈ ఆత్మాభిమానమే అతిగా వుండటం యీమె మానసిక చాంచల్యానికి కారణం.

తెనాలికి వెళ్ళి తలుపులు మూసుకుంది. ఎవ్వరితోనూ, మాట్లాడదు. ఎక్కడికీ వెళ్ళదు. వాసన్ రాజీ, సినిమాలు అన్నీ మరిచిపోవ ప్రయత్నించింది. దీన్ని ఎస్కేపిజమ్ అంటారు. ఆ తర్వాత ఆరు నెలలకి ఆమె భర్త గాలి వెంకయ్య మరణించటం జరిగింది. అసలే కష్టాల్లో చిక్కుకున్న కాంచనమాల మనస్సు వెంకయ్య మరణంతో దద్దరిల్లింది.

మరికొంత చలించింది. కాంచనమాలకి పట్టిన పిచ్చి భయంకరమైంది కాదు. ఒకరికి హానిచేసే పిచ్చీ కాదు. నవ్వుతుంది. కిలకిల నవ్వుతుంది. ఎవరన్నా పలకరిస్తే పలకదు. పలికితే సరయిన జవాబు యివ్వకపోవచ్చు. రిక్షాలు జట్కాలు ఎక్కి తిరుగుతుంది. ఇవే ఆమె పిచ్చి లక్షణాలు. ఈ లక్షణాలు కూడా ఎప్పుడు వుండేవి కావు. ఎప్పుడో ఒకప్పుడు కనుపిస్తాయి. తతిమ్మా సమయాలలో స్థిరంగానే వుంటుంది.

తెనాలిలో సత్యనారాయణ టాకీసు నిర్వహిస్తున్న శివలింగప్రసాద్ వుంటున్న వీధిలోనే కాంచనమాల నివసిస్తూండేది. ప్రసాద్ కి కాంచనమాల మీద కల అభిమాన గౌరవాలవల్ల_వెంకయ్య మరణానంతరం దాదాపు రెండు సంవత్సరాలు మగదిక్కు లేకపోవటం వల్ల, కాంచనమాల మతికొంత స్థిమిత పడటం వల్ల, కాంచనమాల, ప్రసాద్ లకు బాంధవ్యం ఏర్పడింది.

మళ్ళీ సినిమా పరిశ్రమలో అడుగుపెడితే మిగిలివున్న కాస్త మతి చాంచల్యం పోతుందని, 1946 లో ప్రసాద్ కాంచనమాలని మద్రాసుకి తీసుకొచ్చాడు. స్టార్ కంబైన్సు, ఫేమస్ ఫిలింస్ వారు కలిసి 'ఆడజన్మ' తీద్దామనుకున్నారు. కొన్ని ఆటంకాలవల్ల ఆ ప్రయత్నం ఫలించలేదు.

ఆమెకి సినిమాలలో నటించాలని యీనాడు ఎంతో వుత్సాహం వుంది. కెమెరా ముందు నిలబడగానే ఆమె ప్రవర్తనలో ఎంతో మార్పు వస్తుంది. ఆమె భర్త ప్రసాదే స్వయంగా కాంచనమాలతో చిత్రం తీయటానికి సన్నాహాలు జరుపుతున్నారు.

కనీసం 1949 లోనన్నా కాంచనమాలని మళ్ళీ తెరపై చూడటానికి సినిమా ప్రేక్షకులకి అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నాను. .

# భానుమతి

## ( సినిమారంగం 1963, జనవరి సంచిక నుంచీ)




సినీ కెమేరా ఎప్పుడైనా మీ హృదయంలోకి చొచ్చుకు పోయిందా ? వెండితెరతో మీరెన్నడైనా ఐక్యమైపోయారా ?

ఏ.వి.యం. వారి 'అణ్ణయ్' అనే తాజా తమిళ చిత్రం చూస్తూంటే మీకా అనుభూతులు కలుగుతాయి. ఆ చిత్రంలో ఒక కొత్త భానుమతి కనిపిస్తుంది; నటిగా మరో పదేళ్ళు ముందుకు పురోగమించిన భానుమతి కనిపిస్తుంది. 'మాయామృగ్' అనే ప్రఖ్యాత వంగ నవల ఆధారంగా నిర్మించబడిన ఆ తమిళ చిత్రంలో ఇంకా ఎస్.వి.రంగారావు, హరనాథ్, జానకి మున్నగు తెలుగు తారలతో పాటు ఆరితేరిన తమిళ తారలు కూడా నటించారు. కాని, భానుమతి పక్కన వాళ్ళెవరూ మనకు కనిపించరు. థియేటర్ నించి బయటకు వచ్చాక కూడా భానుమతి ఆ చిత్రంలో ప్రదర్శించిన హావభావ అభినయాలే మన కళ్ళ ముందు మెదులుతుంటాయి.

ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆ చిత్రంలో ఆ పాత్ర భానుమతి కోసమే పుట్టింది; భానుమతి ఆ పాత్ర కోసమే పుట్టింది. ఇదెంత మాత్రం నిజమో త్వరలో తెలుగులో కూడా వెలువడే ఆ చిత్రంలో మీరూ చూస్తారుగా.

భానుమతి త్వరలోనే తన 'ఆత్మకథ' రచనకు ఉపక్రమించబోతోంది. అంచేత ఇక్కడ 'నటి'గా ఆమె జీవితం గురించే మీరు ఎక్కువగా తెలుసుకుంటారు.

అసలు తొలుదొల్త భానుమతి కెమేరా ముందు నటించలేదు. క్రమక్రమంగా అమె ధరించిన పాత్రలే ఆమెను నటిగా తీర్చి దిద్దాయి. ఆ పాత్రలే ఆమెకు ఎనలేని పేరు ప్రతిష్టలు సంపాదించి పెట్టాయి.

ఆమె 'నటి భానుమతి' గా కాక 'ఒఠ్ఠి భానుమతి' గా ఉన్న రోజులవి..

అప్పుడామె వయసు పదమూడు, అప్పట్లో ఆమెకు తెలిసిందల్లా ఆమె నాన్నగారు చూపే త్రోవలో నడవడం, ఆయన చెప్పినట్లు చేయడం, లేకపోతే ఎవరైనా పాడిన పాటను అనుకరించి కూనిరాగాలు తీయడం.

తన కంఠంలోని మార్ధవాన్ని, మాధుర్యాన్ని అందరూ మెచ్చుకుంటున్నారన్న విషయాన్ని కూడా ఆమె గుర్తించలేని అమాయకురాలు ఆ రోజుల్లో. అలాంటి అమాయకురాలికి మొట్ట మొదటిసారిగా 'వరవిక్రయం' చిత్రంలో పేదపిల్ల వేషం లభించింది, ఆ చిత్రకథ ఏమిటి. అందులో ఆమె ధరించబోయే పాత్ర స్వభావం ఎలాంటిది అన్న విషయాలేవీ ఆమెకు తెలియనే తెలియవు. తెలిసిందల్లా ఆమె నాన్నగారు ఎలా చేయమంటే అలా చేయడం.. అంతే.

"అమ్మాయ్, నువ్వు కష్టపడి చేయవలసిందేమీ లేదు. 'వరవిక్రయం' లోని పేదపిల్ల పెద్దల కట్టుబాట్లలో ఉన్న పిల్లే నువ్వు మామూలుగా ఇంట్లో ఎలా మసలుతావో అలాగే కెమేరా ముందు నడుచుకో. అంతే," అన్నారు ఆమె నాన్నగారు.

అడ్డు చెప్పే అలవాటో, లేక పెద్దల మాటకు ఎదురు చెప్పే ధైర్యమో ఏ పల్లెటూరి పిల్లకు ఉంటుంది? అంచేత, ఆ అమ్మాయికి నాన్నగారు గీచిన గీతలో నడవడమే అప్పుడు తెలిసిందల్లా..

ఇక ఆమెతో పాటు ఆమె నాన్నగారు కూడా కెమేరా పక్కనే హమేషా ఉండిపోవలసి వచ్చింది. అప్పుడే ఆమెలో ఏదో చైతన్యం ప్రవేశించేది ఏదైనా; పని మీద ఆమె తండ్రి కాస్త కనుమరుగైతే చాలు ఆమె నోటి వెంబడి డైలాగులు వచ్చేవి కావు. కొయ్యబొమ్మలా అచేతనంగా నిలుచుండి పోయేది.

ఆ చిత్రంలో ఆమె సంభాషణలనీ పక్కన ఉన్న సహ నటీనటుల్ని చూసి ఎన్నడూ మాట్లాడిన పాపాన పోలేదు ఎదురుగా ఉన్న తండ్రిని చూస్తూనే డైలాగులు వల్లించింది.

"రామ్మా.. కూర్చో.. లే... మాట్లాడు..." అని డైరక్టర్ గారు తన ధోరణిలో తాను చెప్పేవారు. ఆయన చెప్పినట్లల్లా ఆమె చేసేదే కాని, వొంచిన తల మటుకు పైకి ఎత్తేది కాదు.

ఆ చిత్రంలో 'పెళ్ళి చూపుల ఘట్టం'.... ఆ ఘట్టంలో తన ఇంట్లో తనకే పెళ్ళి చూపులు ఏర్పాటైనట్లుగా భావించుకుందామె. ఆ ఘట్టం పూర్తిగా చిత్రీకరింపబడే వరకు ఆమె వొంచిన తల ఎత్తలేదంటే నమ్మండి. అప్పుడేదో పాట పాడమన్నారు కూడా. అలాగే పాడిందామె.

ఆ దృశ్యం అత్యద్భుతంగా తయారైందని అనుకున్నారంతా. అందులో అతిశయోక్తి ఏమీ లేదు, ఇంతకీ. ఆ ఘట్టంలో ఆమె 'ఆమె' గానే ఉందే కాని, అసలెక్కడ నటించింది ?

'లిప్ స్టిక్ – మేకప్' ఇత్యాదులు భానుమతికి కొత్తగా పరిచయమయ్యాయి అప్పుడే. ముఖమంతా బిగదీసుకున్నట్లుగా చిరచిరలాడుతూంటే, చేత్తో తడుముకుని, మేకప్ ని పాడు చేసుకునేదామె కొత్తల్లో.

ఆ చిత్రంలో అమె కోసం ప్రత్యేకంగా దుస్తులేవీ తయారు చేయబడలేదు. ఆమె ఇంట్లో ధరించే పావడా, ఓణీలతోనే కెమేరా ముందు నిలుచునేది. ఆ దుస్తులు కూడా తను నటిస్తున్నాననే భ్రమను ఆమెలో కలుగనీయకపోవడానికి ఓ కారణం అని చెప్పకతప్పదు. ఆ దుస్తుల వల్లే 'హోమ్లీ' గా ఉండడానికి వీలయ్యేది. ఆ రోజుల్లో ఆమె ఖద్దరు మాత్రమే వాడేది.

ఆమె ఆశలు, ఆశయాలతో, ఆమె మనఃప్రవృత్తికి అనుగుణంగా ఉండడం వల్లే ఆ 'వరవిక్రయం' లోని కథానాయకి కాళింది పాత్ర ఆమె విజయానికి తొలి సోపానమని చెప్పక తప్పదు. ఆ పాత్ర ఆమె స్వభావానికి అన్ని విధాలా సరిపోయింది గనుకనే ఆమె ఏ మాత్రం కష్టపడవలసిన అవసరం, నటించాల్సిన అవస్థ లేకుండానే నలుగురి మెప్పుదలను సంపాదించుకోగలిగింది.

ఆ చిత్రంలో మహాకవి స్వర్గీయ బలిజేపల్లిగారు ఆమెతో పాటు నటించారు. ఆయన స్వయంగా కాస్త పొదుపరి. ఆయన 'లోభి' పాత్ర ధరించారు ఆ చిత్రంలో! తనకు మల్లేనే ఆయన స్వభావానికి తగ్గ పాత్ర అయనకు లభించడం ఎంత విచిత్రం అనుకునేది భానుమతి.

"మాలతీ మాధవం, భక్తిమాల" వగైరా చిత్రాలలోని ఆమె నటన గురించి చాలా పత్రికలు ప్రశంసిస్తూ రాసిన విషయాల గురించి తెలుసుకొని కూడా ఆమె సంతోషించలేకపోయేదంటే, అప్పుడు ఆమె ఎంత అమాయకురాలో మీరు ఊహించుకోగలరనుకుంటాను. కుమార్తె నటన గురించి పొగుడుతూ రాసిన వాక్యాలను చదివి తన తండ్రి మురిసిపోతున్నందుకే ఆ అమ్మాయి సంతోషించేది ఆ రోజుల్లో..

ఇప్పుడవన్నీ తలచుకుంటుంటే తమాషాగా ఉంటుందామెకు.

ఇక్కడ ఒక్క ముక్క మాత్రం చెప్పి తీరాలి. భానుమతి 'భానుమతి' గానే ఉండిపోయిన 'వరవిక్రయం' చిత్రంలోని పాత్రలాంటిది మాత్రం మళ్ళీ ఇంతవరకూ లభించనే లేదామెకు.

ఆమె జీవితంలో మంగళవాద్యాలు వినిపిస్తున్న శుభక్షణాలవి... 'కృష్ణప్రేమ' చిత్రంలో నటిస్తూండగా 1943 లో ఆ చిత్రానికి సహాయ దర్శకుడుగా పని చేస్తున్న శ్రీ రామకృష్ణారావుతో ఆమెకు వివాహమైంది.

ఇక సినిమా వద్దు, నటనవద్దు శ్రీవారికి ఇంత వండి పెట్టి ఇంటి పట్టునే ఉండి పోవడం చాలని నాన్నగారూ, ఆమే నిశ్చయించుకున్నారు.

కుంపటికి ఆమె దగ్గరయినా కెమేరాకు మాత్రం దూరం కాలేకపోయింది.

'స్వర్గసీమ' కథను చేతబట్టి, శ్రీ బి.ఎన్.రెడ్డి గారు ఓ రోజు ఆమెను కలుసుకున్నారు. ఆ చిత్రంలో ఆమెను ఒక పాత్ర ధరించాలన్నారు. సుబ్బి – సుబ్బులక్ష్మి – సుజాత అనే మూడు విభిన్న మనఃప్రవృత్తులు గల పాత్ర అది.

సుబ్బి – ఒక పల్లెటూరి పిల్ల. అమాయకురాలు – కాని, దుడుకుతనం ఎక్కువ. ఆ కేరెక్టర్ తన కోసమే పుట్టిందేమో అనిపించిందామెకు.

ఆ తర్వాత సుబ్బులక్ష్మి – ఇది కూడా ఫరవాలేదు.

చివరికి సుజాత – ఆటపాటల్లో ఆరితేరిన ఆరిందా... వలపు చూపులతో మాయ మాటలతో ఒక గృహస్థుని మనసును ఆకర్షించి, స్వర్గ తుల్యమైన అతని సంసారంలో చిచ్చుపెట్టే పాత్ర అది. నిజానికి ఆ దుష్ట నాయకి పాత్ర ఆమె స్వభావానికే విరుద్ధమైనది. ఈ కేరెక్టర్ కోసం తను పుట్టలేదేమో అనిపించకపోలేదామెకు మొదట్లో.

త్రివిధ మనస్తత్వాలు గల ఆ పాత్రను ఎలా పోషించడం? అందుకు తగ్గ శక్తి సామర్థ్యాలు తనలో లేవే అని మథనపడసాగింది భానుమతి. కాని, శ్రీ బి.ఎన్. రెడ్డిగారు ఆమెలో లేని ధైర్యాన్ని కలిగించి, చివరికి ఎలాగైతేనేం – ఆ పాత్రను ఆమె ధరించడానికి ఒప్పించారు.

ప్రఖ్యాత హాలీవుడ్ తార రీటా హేవర్త్ నటించిన 'బ్లడ్ అండ్ సాండ్' అనే అమెరికన్ చిత్రం నించే 'స్వర్గసీమ' చిత్రంలోని ఆమె కేరెక్టర్ సృష్టించబడింది.

"ముందు మీరోసారి ఆ అమెరికన్ చిత్రాన్ని చూడండి." అని రెడ్డిగారు చెప్పి వెళ్ళిపోయారు. అలాగే వెస్టెండ్ (ఇప్పుడు మద్రాసులోని మిడ్ లాండ్) థియేటర్ లో భానుమతి అ చిత్రం చూసింది. అందులో రీటా ప్రదర్శించిన నటనకు భానుమతి ముగ్ధురాలయింది. రీటాను తెరమీద చూస్తున్నంత సేపూ భానుమతిలో ఏదో నూతనోత్సాహం పొంగసాగింది. గిటార్ చేతబట్టి అందులో పాడిన ఓ పాట ఆమె చెవిని ఇల్లు కట్టుకు నిలిచిపోయింది.

ఆ చిత్రం చూసి వచ్చాక నాగయ్య గారికి ఆ పాట బాణీని వినిపించిందామె. ఆయన 'స్వర్గసీమ' చిత్రానికి సంగీత దర్శకులు. ఆమె పాట విని ఆయన అమాంతంగా విస్తుపోయారు. "అమ్మాయ్, నువ్వే స్వయంగా పాడేటట్లయితే, ఆ బాణీని సుజాత పాటకు ఈ చిత్రంలో ప్రవేశ పెట్తా" అన్నారాయన.

త్యాగరాయనగర్ లోని వాహినీ పిక్చర్స్ కార్యాలయం మేడ మీద నాగయ్య గారూ, నిర్మాత – దర్శకులు బి.ఎన్.రెడ్డిగారూ, భానుమతీ ఆ పాటకు 'బాణీ' కూర్చారు. ఆ బాణీకి అనుగుణంగా రాయబడిన గీతం ఆమె చేతికి ఇవ్వబడింది.

అలా వాహినీ కార్యాలయం మేడమీద బ్రహ్మాండంగా హిట్ అయిన 'ఓహోహో–పావురమా!' అనే పాట పుట్టింది.

ఈ నాటికీ అంత భావగర్భితంగా ఎవరు పాడినా ఆ పాటలో ఏదో జీవం ఉట్టిపడుతూనే ఉంటుంది.

'స్వర్గసీమ' చిత్రంలో భానుమతి ఆ పాటను మైక్ ముందు పాడుతున్నప్పుడు, సెట్ మీద నటిస్తున్నప్పుడూ కూడా ఆమె స్మృతి పథంలో రీటాహేవర్త్ సదా మెదులుతూనే ఉండేది. "ఆ చిత్రంలో నా నటన పండిత పామరుల ప్రశంసలనందుకున్నదంటే – ఆ ఘనతంతా రీటాదే. నిజానికి ఆ పాత్ర విషయంలో నేనామెకు ఎంతో ఋణపడి ఉన్నాను," అంటుంది భానుమతి.

'స్వర్గసీమ' లో నటించడానికి పూర్వం ఆమె అప్పుడప్పుడు కెమేరా ముందు కాస్త సంకోచిస్తూనే నిలుచొనేది. కాని, ఒకటి రెండు చిత్రాల తర్వాత ఆమెలోంచి ఆ జంకు గొంకులు అంతర్ధానమై పోయాయి. తనకు తగిన, తనకు నచ్చిన పాత్ర లభిస్తేనే కాని నటించలేనేమో అన్న భీతి కూడా ఆమె లోంచి తొలగిపోవడంతో విభిన్న స్వభావాలు గల పాత్రలను సునాయాసంగా నిర్వహించే మనో నిబ్బరమూ, ధైర్యమూ ఆమెలో కలిగాయి.

అంచేత తొలుత భానుమతి నటించాలనుకుని నటించలేదు. ఆ నటన అనేది (ఆమెలో అజ్ఞాతంగా దాగి ఉందేమో అప్పుడు ఆమెకే తెలియదు) ఆమెలోంచి స్వభావసిద్ధంగా బయటకు ఊడిపడేది. ఇప్పుడు మాత్రం తను నటించాలి _ అనుకునే నటిస్తోందామె. అవును ఆమె అలా క్రమేపీ నటిగా మారింది. 'సాధనమున పనులు సమకూరు ధరణిలో' అన్న వేమన్న సూక్తి అక్షరాలా నిజమయింది.

ఒకప్పుడు 'మంగమ్మ శపథం' అనే జెమినీ వారి తమిళ చిత్రాన్ని భానుమతి చూసింది అందులో మంగమ్మ పాత్ర ఆమెనెంతో ఆకర్షించింది చిలిపిదనం, శక్తి సామర్థ్యాలు ఇత్యాది ఎన్నో విశేషాలు గల పాత్ర అది.

"అటువంటి క్లిష్టమైన పాత్రను ధరించాలని ఉందండీ నాకు," అని భర్త శ్రీ రామకృష్ణతో తన మదిలోని కోర్కెను ఎరుగపరిచింది భానుమతి ఓ రోజు.

"మళ్ళీ వాసన్ గారే ఆ చిత్రాన్ని ఏ హిందీలోనో, తెలుగులోనో తీస్తే తీయవచ్చు. అయినా, ఆ పాత్ర నీకే లభిస్తుందని ఎలా అనుకోగలం? అంచేత ఆ కోర్కెను నీ మనుసులోంచి తొలగించుకోవాల్సిందే." అన్నారాయన.

"మీరిలా నిరాశ కల్గిస్తే ఎలాగండీ? నేను వాసన్ గారిని ఎక్కడైనా కలుసుకోవడం జరిగితే, ఈ విషయం గురించి వారితో చెప్పడానికి సంకోచించను." అందామె నవ్వుతూనే.

అయితే, అప్పటికే వాసన్ గారు ఆ చిత్రాన్ని తెలుగు హిందీ భాషల్లో పునర్నిర్మించడానికి పూనుకున్నారన్న విషయం ఆమెకు గాని, రామకృష్ణ గారికి కాని తెలియనే తెలియదు. విచిత్రమేమిటంటే, వాళ్ళిద్దరికీ ఆ సంభాషణ జరిగిన పక్షం రోజులకే వాసన్ గారి దగ్గర్నించి వాళ్ళకు ఫోన్ కాల్ వచ్చింది.

"వసుంధరాదేవి(వైజయంతి మాల తల్లి) 'మంగమ్మ' తమిళ చిత్రంలో తనే స్వయంగా పాడి అత్యద్భుతంగా నటించింది. అప్పట్లో ఆ పాత్రను పోషించడానికి తగు శక్తి సామర్థ్యాలు గల నటి ఆమె ఒక్కతే అలాగే ఇప్పుడు మీ శ్రీమతి గారొక్కరే నా హిందీ తెలుగు చిత్రాలలో ఆ పాత్రను ధరించగల స్థోమత గలవారు. ఇంకెవ్వరూ ఆ పాత్రకు సరిపోరు. ఏమంటారు ?" అన్నారట వాసన్ గారు శ్రీ రామకృష్ణతో.

"నువ్వేమంటావ్?" అన్నారాయన భానుమతితో. అప్పుడామె ఏమని ఉంటుందో ఇక్కడ మళ్ళీ రాయాల్సిన అవసరం లేదనుకుంటా. నటిగా ఆమె జీవితంలో పొందిన ఆనందం ఇంతా అంతా కాదు_ అంటే ఆ రోజే !

ఆ మర్నాడే వాసన్ గారు వాళ్ళ భవనానికి వచ్చారు 'మంగళ'లో కథానాయకి పాత్రకు భానుమతి బుక్ అయింది.

అయితే అనుకోకుండా అకస్మాత్తుగా ఏర్పడిన ఓ చిన్న మార్పు ఆమెలో అమాంతంగా నిరుత్సాహాన్ని కాస్త కలిగించకపోలేదు 'మంగళ'ను నిర్మించడానికి ముందు వాసన్ గారు 'అపూర్వ సహోదరులు' చిత్రాన్ని తయారు చేయ నిశ్చయించినట్లు, ఆ తర్వాతే 'మంగళ' తీయడం జరుగుతుందని చెప్పారు. బొంబాయిలో ఒక నిర్మాత ఆ కథనే చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నాడని తెలిసినందు వల్లే వాసన్ గారు హుటాహుటిగా ఆ నిర్ణయానికి రావడం జరిగింది.

అయితే ఆ నిరుత్సాహం తాత్కాలికమైనదే కదా అని భానుమతి తనకు తాను నచ్చ చెప్పుకొని, తృప్తి పడింది. అయినా, ఆ 'అపూర్వ సహోదరులు' చిత్రంలో ఆమె ధరించిన పాత్రకూడా చాలా క్లిష్టమైనదే. ఆ పాత్ర కాస్త చిన్నదైనా ఆమెలోని నటనా కౌశలాన్ని ప్రదర్శించడానికి వీలయింది. ఆ చిత్రం ద్వారానే భానుమతి అఖిల భారత మేటి నటిగా ఖ్యాతికెక్కింది.

ఆమె భర్త శ్రీ రామకృష్ణ దర్శకత్వంలో వాళ్ళ సొంత భరణి సంస్థ నిర్మించిన తొలిచిత్రం 'రత్నమాల'. ద్వితీయ చిత్రం 'లైలామజ్ను'తో తెలుగు చిత్ర చరిత్రలో నూతనాధ్యాయం ప్రారంభమైందనే చెప్పి తీరాలి. నటీ నటుల పాత్ర పోషణ, సాంకేతిక నిపుణుల పనితనం, అన్ని శాఖల్లోనూ ఉన్నత శిఖరాలను అందుకున్న ఆ చిత్రం బ్రహ్మాండమైన విజయం సాధించింది తెలుగు, తమిళ భాషల్లో కూడా. అదే సమయంలో తమిళంలో అప్పటి పేరు మోసిన హీరో టి.ఆర్. మహలింగంతో పోటీగా విడుదలయిన బాలాజీ వారి 'లైలామజ్ను' చిత్రం టుప్ మని ఎగిరి పోయింది. 'ప్రేమ, చక్రపాణి, వరుడు కావాలి. విప్రనారాయణ, చింతామణి' ఇత్యాది చిత్రాలను భరణి సంస్థ నిర్మించింది.

ఆబాలగోపాలం 'మల్లీశ్వరి' భానుమతి నటనకు ఒక గీటురాయిగా నిర్ణయించారు. ఆమె 'మహానటి' అని వేనోళ్ళ పొగిడారు. నిజమే, ఆ చిత్రంలో ఆ క్లిష్టమైన పాత్రను అతి జాగ్రత్తతో పోషించడానికి భానుమతి తన శక్తి సామర్థ్యాలనంతా వినియోగించవలసి వచ్చింది. సుప్రసిద్ధ నిర్మాత దర్శకుడు శ్రీ బి.ఎన్.రెడ్డి సమర్పించిన ఆ చిత్రంలో 'మనసున మల్లెల మాలలూగెనే' అనే పాటను ఎప్పటికీ మనం మరచిపోలేము.

భానుమతిని 'డైరక్టర్' గా చేసిన చిత్రం 'చండీరాణి'. ఆమె అలా దర్శకత్వ బాధ్యతను తలమీద వేసుకోవడం కాకతాళీయంగా జరిగినదే. అయితే, "ఆ విషయంలో జ్యోస్యం కూడా కొంత ఫలించిందని చెప్పక తప్పదు." అంటుంది భానుమతి నవ్వుతూ.

వాళ్ళ కుటుంబానికి ఒక గురూజీ పరిచయమయ్యారు. ఆయన్ని భానుమతీ రామకృష్ణలు తరచు కలుసుకరావడం పరిపాటి. ఒకసారి ఆయన "ఇంకో ఆర్నెల్లల్లో మీరు చిత్ర దర్శకులైనా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు," అన్నారు భానుమతితో. అప్పటికి ఆ దంపతులిద్దరూ నవ్వి ఊరుకున్నారు. అసలా తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయారు కూడా.

ఒకరోజు మాటల సందర్భంలో "మన కొత్త చిత్రానికి కథ గురించి ఏం చేశారు?" అంది భానుమతి, శ్రీ రామకృష్ణతో.

ఆయన ఒక కథను వినిపించి. "ఈ చిత్రాన్ని నువ్వే తీసేయ్... నేను మరో (బ్రతుకు తెరువు) చిత్రాన్ని డైరెక్ట్ చేయడానికి ఒప్పుకున్నాను." అన్నారు.

"అదేమిటండీ?" అంది భానుమతి దిగాలుగా చూస్తూ.

"ఏం? నువ్వు డైరెక్ట్ చెయ్యలేవా? అందుకు తగ్గ శక్తి సామర్థ్యాలు, అనుభవం ఉండి కూడా అంత ధైర్యం లేకపోతే ఎలా? ధృఢ చిత్తంతో ముందంజ వెయ్యి. అవసరముంటే అప్పుడప్పుడు సెట్ మీదికి వచ్చి సలహాలిస్తుంటాలే.." అన్నారు రామకృష్ణగారు.

ఆయన ప్రోత్సాహమే ఆమెలో లేని ధైర్యాన్ని కలిగించింది.

'చండీరాణీ'లో కథానాయిక పాత్రలు రెండు ఆ ద్విపాత్రాభినయనాన్ని భానుమతి ఓ వైపున నిర్వహిస్తూ, మరో వైపున దర్శకత్వ బాధ్యత కూడా తనే చూసుకోవాలి. తానే కదా నటించేది అనే అశ్రద్ధకాని, దర్శకత్వ బాధ్యత కూడా తనదే అన్న భీతి కాని కలగకుండా చూసుకోవడంలో భానుమతి చాలా సతమతమై పోయింది. పైగా అది త్రిభాషా చిత్రం కూడా.

"భానుమతి ఏమిటి, డైరెక్టర్ గా ఆమెకు ఉన్న అనుభవమేమిటి?" అనే తలంపుకు తావియ్యకుండా, అలక్ష్యం ఏ మాత్రం చేయకుండా సాంకేతిక నిపుణులందరూ ఆమెతో కాస్త భయపడుతూనే సహకరించారు.

ద్విపాత్రాభినయనం విషయంలో తనే రెండు పాత్రలలో అగుపించవలసిన దృశ్యంలో కెమెరాను ఎక్కడ ఉంచాలి, ఎలా ట్రిక్ ఫోటోగ్రఫీ నిర్వహింపజేయాలి – అనే విషయాలలో భానుమతికి కాస్త అనుభవం లేకపోయినా ఆమె నిర్దుష్టమైన పద్ధతిలోనే తన బాధ్యతను నిర్వహించింది. చివరికి ప్రయత్నం ఫలించింది. అంత చక్కగా అన్ని బాధ్యతలూ తానేలా నిర్వహించానా అన్న ఆశ్చర్యం ఆమెలో కల్గకపోలేదు. పూర్తయ్యాక చిత్రం చూసి ఆమె భర్త కూడా చాలా ఆశ్చర్యపడ్డారు.

"చండీ రాణి – చిత్రం కోసం నే పడ్డ శ్రమ, చింత నన్ను ఒక్క ఏడాదిలోనే మరో పది సంవత్సరాల వయసు మీరినట్లు చేశాయి." అంటుంది భానుమతి తృప్తిగా నిశ్వాస వదులుతూ.

చివరికి ఎలాగైతేనేం–ఆమె ఒక చిత్రాన్ని డైరెక్ట్ చేసింది. వాళ్ళ గురూజీ చెప్పిన మాట నిజమైంది.

కాని, ఆమె భర్త మాత్రం ఆ చిత్ర నిర్మాణానికి ముందు ఆమెకిచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారు. ఆయన ఒక్క రోజైనా భానుమతికి సహాయంగా సెట్ మీదికి పర్యవేక్షణకు గాను వచ్చిన పాపాన పోలేదు అందుకు కారణం – ఆ సమయంలో ఆయన 'బ్రతుకు తెరువు' చిత్ర దర్శకత్వంలో మునిగి ఉండడమే.

తను దర్శకత్వం వహించిన 'చండీరాణి' ఒక మోస్తరుగా డబ్బు చేసుకుంది కాని, అదే సమయంలో తన భర్త డైరెక్ట్ చేసిన 'బ్రతుకు తెరువు' చిత్రం మాత్రం విజయధంకా మ్రోగించింది అయినా, 'చండీరాణి' చిత్ర నిర్మాణంలో తనకు కలిగిన వినూత్నానుభవాలను అనుభూతులను. ఆ చిత్రం చూచిన అభిమానులు తన పట్ల చూపిన ఆదరాభిమానాలతో సంతృప్తి చెందుతూ; ఆ చిత్రం అంతగా విజయం సాధించలేకపోయిందనే అసంతృప్తిని భానుమతి తనలోంచి తొలగించుకుంది. అప్పుడు ఏదో ఉత్సాహంలో, ఉద్వేగంలో 'చండీరాణి' చిత్రం కోసం భానుమతి అంతగా పడరాని పాట్లు పడిందే కాని, మళ్ళీ అలా అన్ని బాధ్యతలనూ మరోసారి ఆమె తన మీద వేసుకో గలదో లేదో?

'రాజభక్తి' అనే తమిళ చిత్రంలో భానుమతి 'మందాకిని' అనే దుష్టనాయకి పాత్ర ధరించింది అది ఆమెకు గిట్టని, ఆమె స్వభావానికి పొసగని పాత్ర అయినా, ఆ పాత్రను ఒక విశిష్ట పంథాలో నిర్వహించడానికి ఆమె ముచ్చట పడింది. ఆ పాత్రకు 'ది కింగ్ అండ్ ఐ' అనే చిత్రంలో ప్రఖ్యాత అమెరికన్ నటుడు యూల్ బ్రిన్నర్ చూపిన హావభావ ప్రకటనలు ఆమెకు ఇన్ స్పిరేషన్ ఇచ్చాయి. భానుమతి ఒక్క పాటయినా పాడని చిత్రం ఆ 'రాజభక్తి' అనే చిత్రమే. పాత్ర అన్నింటిలో భానుమతిని ఎక్కువగా ఆకర్షించినది 'బడదీది'. అది ఇంతవరకు ఆమె నటించిన పాత్రలన్నిటికీ ఎంతో విభిన్నమైనది. ఆ మిగతా పాత్రలన్నీ ఒక ఎత్తు; 'బడదీది' ఒక ఎత్తు. ఇందులో చిలిపిదనంతో కూడిన పల్లె బాలిక వేషం లేదు. జీవితంలో ఒడుదుడుకుల్ని వేదాంతం వెనుక అణచి పెట్టిన ఒక స్త్రీగాథ అది.

అంతకన్నా క్లిష్టమైనది "అణ్ణయ్" అనే తమిళ చిత్రంలో తను ధరించిన పాత్ర అంటుంది భానుమతి. అదే చిత్రం తెలుగు వర్షన్ లో ఆమె నటన మన ఊహా శిఖరాలను మరింత అధిగమించవచ్చు – అనడంలో అతిశయోక్తి ఏమీ ఉండదు.

# గత సంవత్సరపు కాంచనమాల

# - రామన్

## ( తెలుగు సినిమా, 1949, అక్టోబర్ సంచిక నుంచీ)



ఆమెను చూచేవూ... ఆమె కాంచన మాల అన్నాడు రావు...

నేను చూచేను నాకు నమ్మకం లేదు. రావు అనేకమార్లు కాని విషయాన్ని అవునని బూకరిస్తూండేవాడు. ఇదీ అంతే అనుకున్నాను. కాని ఆ మనిషికీ కాంచనమాల పోలికలున్నయి. అదీ విచిత్రం...

★ ★ ★

గుమ్మం ముందు కూర్చుని తనలో తను వెకిలిగా నవ్వుకుని మళ్ళీ కొంతసేపటికి తనలో తను ఏదో పాడుకుంటూంది. ఉబ్బెత్తుగా ఒక్క మారు లేచి మోకాళ్ళ పైకి చీరను లాగి నవ్వుతూ నించొనేది. ఆమె కాంచనమాల....

★ ★ ★

నేను కూర్చుని వ్రాసుకునే వాడిని ఆ యింట్లో. ఆమె ఇతరుల పనుల్లో కాని యితరుల కార్యకలాపాల్లో కాని అనవసరంగా "తగుదునమ్మా" అని తయారయేది కాదు. ఆమె తనలో తను నవ్వుకునేది. ఏమీ తోచకపోతే ప్రొద్దుటే లేచి కాలకృత్యాలు తీర్చుకుని తన మురికిబట్టల్ని కొన్నిటిని వెండి బకెటులో వేసి వుతకడానికి తయారయేది.

★ ★ ★

ఆమె కొక్కక్క రోజున ఉదయమే పువ్వుల సంగతి జ్ఞాపకమొచ్చేది. తక్షణం పువ్వులు కొనుక్కోవాలని పట్టు పట్టేది. ఏరోజునా ఆమె ఎక్కువ డబ్బు వెచ్చించి పువ్వులు కొనలేదు. కాని కారుమీద, పువ్వులు కొనడానికి మాత్రం ఉదయమే బయలు దేరేది.

★ ★ ★

సాధారణంగా రాత్రి పన్నెండు ఒంటిగంటా దాకా ఆమె నిద్రపోయేది కాదు. ఒంటిగా ఒక కుర్చీలో కూచుని ఏదో ఆలోచించుకునేది. అల్లాగని ఇతరులకి నిద్రా భంగం కలిగించే పనులేమీ చేసేది కాదు. "తన గొడవ తను చూచుకుంటూ" రాత్రి చాలా సేపు నిద్రపోకుండా మలిన మేఘావృతమైన ఆకాశం క్రింద చీకాకుబడ్డ మనస్సుతో కూచునేది. ఆ సమయాన ఆమెనెవ్వరైనా పలకరించినా ఆమె సమాధానం చెప్పదు. అదొక 'సమాధి' ఆమెకు... !

★ ★ ★

కూర్చొని కూర్చొని ఆకలి పుట్టి అన్నం తినేది. అది రాత్రి రెండుగంటలకు. ఇది తరుచు జరగక పోయినా అధమం ఎక్కువ మాట్లే జరిగిందని చెప్పాలి. ఒక్కొక్కొప్పుడు కొన్ని పూటలు భోజనం లేకుండానే నిద్రపోయేది.

★ ★ ★

కాంచనమాల చాలా పట్టుదల గల మనిషి. ఆమె కెంతతోస్తే అంత. ఇతరుల మీద చచ్చే అపనమ్మకం. వారిని దరిచేరనివ్వదు. వారి మాట ససేమిరా వినదు. ఒక సంతకం పెట్టడానిక్కాని, ఒక కాని విదల్చడానిగ్గాని గంటల గంటలాలోచిస్తుంది ఆమె కాంచనమాల కనుక.

ఆమెకు పరిచారకులు చాలామందున్నారా యింట్లో...

ఆమె ఆ పరిచారకుల్ని గౌరవంగా చూచేది... ఎవర్ని కించపర్చడం ఆమె ఉద్దేశ్యం కాదు.

★ ★ ★

ఉదయమే లేచి తక్షణం "కాఫీ" అని అరుస్తుంది. కాంచనమాలకు ముఖం కడగటం అవీ తరువాత విషయాలు. ఆమెకు కాఫీ వచ్చేవరకూ అదే అరుపు. కాఫీ తాగి చాలాసేపు అల్లానే స్థబ్ధుగా కూర్చుంటుంది. కాని 1948 వ సంవత్సరంలో ఆమెకు స్నేహితులుండేవారు. వాళ్ళు ఆమె మనస్తత్వం మార్చడం కోసం రోజూ వచ్చి పిచ్చాపాటి మాట్లాడుతుండేవారు. ఆమె శారదా ప్రొడక్షన్సుకి తరచు పోయే రోజులు.




★ ★ ★

ఆ రోజుల్లో ఆమె అనుకున్నంత ముందుకు పోలేదు. మామూలుగానే వుండేది. ఆమెకు టెలిఫోన్ వుపయోగం, కారు వుపయోగం మాక్సుఫాక్టర్ టాయిలెట్ సామానుల వుపయోగం కరతలామలకం. ఆమెకు ఏ చీర అందంగా వుంటుందో, మనిషి ఎల్లావుంటే అందంగా వుంటుందో తెలుసు. ఏదైనా అసహ్యమైన విషయం మీద తక్షణం "ఛీ పాడు" అని రియాక్టు అయ్యే మనస్తత్వం ఆమెది.

★ ★ ★

ఆమెకు ప్రపంచంలోని ప్రతివ్యక్తీ వంచకుడు. మోసగాడు దొంగ. వాళ్ళని ఆకళ్ళతో చూచేది. తనకి చాలా ఆత్మీయుడైన మనిషిని కూడా నమ్మలేకపోయేది. అది ఆమెకు చాలా ముప్పు తెచ్చిపెట్టింది. కాని దానికి కారణాలున్నై. ఒక రోజున ఆమె వంచించబడింది. ఆమెకు ఆ వంచన ఒక మనిషివల్ల కాక అతని అనుయాయులందరి వల్లా జరిగింది. అందుకే ఆమెకు అంత భయం. అది ఆమె మనస్సు మీద తీవ్రంగా పనిచేసి "ప్రపంచంలో జీవించే వాళ్ళందరూ ఇంతేలావుంది" అనిపించింది పాపం ! కాంచనమాల.

★ ★ ★

ఒక రోజున కాంచనమాలతో కన్నెమరా హోటలుకి పోవడం సంభవించింది. అప్పుడామె సల్లివన్ స్ట్రీటులో వుండేది. తరచు ఆమె ఆరోగ్యం

బాగోకపోయినా అధమం వారంలో కొన్ని రోజులు ఆమె మాట్లాడితే సహించతగ్గదిగా వుండేది. అది సాయంకాలం ఆయన, ఆమె, నేను, ఇంకా కొంతమంది ఆయనకీ నాకూ సంబంధించిన స్నేహితులూ వున్నారు. సోఫాలమీద కూర్చొని సాయంకాలపు టీ త్రాగుతున్నాము. బిస్కట్లు టీ.. బిస్కట్లు చాలా మిగిలి వున్నయి. ఆమె టీ కూడా త్రాగడమైంది. ఆ మిగిలిన బిస్కట్లు పూర్తి చెయ్యాలని.. ఆమెకు కావాలేమో అడగమన్నాం ఆయన్ని... ఆయన అడిగాడు "కావాలా?" అని... ఆమె " ఛీ పాడు, టీ తాగిన తరువాతా?" అంది...

అంత తెలివితేటలు గలదామె. కాంచనమాల ఇంట్లో చాలా ఎక్కువగా తినేది తిండి. కాని నలుగురిలో మసులుకోవాల్సి వచ్చినపుడు ఆమెకు ఏమి చెయ్యాలో, ఏమి చెయ్యకూడదో తెలుసు. అది ఆమె లోని గొప్పతనం. ఆమె మానసిక స్థితి ఆ రోజుల్లో చాలా అధ్వాన్నమైన స్థితిలో వున్నా సభ్యతగా సంచరించడాన్ని ఆమె విస్మరించలేదు.

★ ★ ★

మరొక రోజున ఆమె ఉమామహేశ్వరరావు మా యింటికి రావడం చూచింది. తనంత తను అతన్ని గుర్తుపట్టినట్టు కాని తనంత తాను పలకరించటం కాని చెయ్యలేదు, ఆయన కూడా మాట్లాడక వూరుకున్నాడు. కాని జరిగిన విచిత్రం ఇది. ఆమె అతన్ని చూడగానే గుర్తు పట్టింది. తను స్క్రీనుకి దూరమై పోయినదాన్ననే ధ్యాసతో ఆమె అతన్ని పల్కరించడనికే సిగ్గుపడింది. కాని తరువాత యోగ క్షేమాలు కూడా విచారించి పంపింది.

ఆమెను యిట్టే చికాకు పరచడం సాధ్యం. చాలా కొట్టచ్చే మనస్తత్వం. ఉండి ఉండి కోపం పైకుబుకుతుంది. దానితో ఆమె "చూడు నీ..." అంటుంది, ఆమెకు అది మనస్సు చీకాకుగా ఉండటం వల్ల వచ్చింది. కాని అవన్నీ మరిచి పోడానికి రోజల్లా ప్రతి సమయంలోనూ ఆమె ఏదో కూనిరాగాలు తీసేది. "సక్కుబాయి"లోని పద్యాలు పాడేది. ఇంకా తను నటించిన సినిమాల్లోని పాటలు పాడేది. కాంచనమాల ఆ రోజుల్లో ఏదో సమస్యతో కలవర పడేది అని నా అభిప్రాయం. అది తన భవిష్యత్ ని గురించి కావచ్చు. లేదా గతాన్ని గురించి కావచ్చు.

# ఎల్వీ. ప్రసాద్

## ( కినిమా, 1952, సెప్టెంబర్ సంచిక నుంచి)

మాది పెద్ద రైతు కుటుంబం. నేనాట్టే చదువుకోలేదు గాని కాడిగట్టి పొలం దున్నాను. అయితే 1929 ఆఖరుదినాలలో మా కుటుంబం ఆర్థిక పరిస్థితులు విషమించి తలవంపులుగా యెంచబడే పని జరిగింది. మా నాయనగారు దివాళా పిటీషన్ పెట్టవలసి వచ్చింది. దానిమీద సంతకం పెట్టేసి, ఆ రాత్రే నూరు రూపాయలు తీసుకుని, నా భార్యా బిడ్డలకు సైతం చెప్పకుండా బొంబాయి బయలుదేరాను. నాకు బాగా జ్ఞాపకం, నేను యిల్లు విడిచినది 1929లో, బొంబాయి చేరినది 1930 లో.




బొంబాయి చేరి దాదర్ లో ఒక హోటల్లో మకాం పెట్టాను. నాకంతా అయోమయం. ఎవరితోనూ మాట్లాడటానికిలేదు. నాకు వచ్చిన

ఇంగ్లీషు బహుకొద్ది. హిందూస్థానీ, మరాఠీ భాషలు అసలే రావు. నా దుస్థితి కనిపెట్టి ఎవడో నా పెట్టెలో వున్న డబ్బు కొట్టేసి 20 రూపాయలు మాత్రం వదిలేశాడు. ఎందుకో నాకప్పుడర్థం కాలేదు. తరవాత నేను ఒక సినిమా కంపెనీకు మేనేజరుగా వుండగా యీ మనిషే నా దగ్గరికి వేషం కోసం వచ్చి, నన్ను చూసి ఆశ్చర్యపడి, "ఇంకా నువ్విక్కడే వున్నావా? నీ తిరుగు రైలు చార్జీకి 20 రూపాయలు ఉంచానే?" అన్నాడు. నా సంగతి వాడెరగడు. ఇంటికి ఉత్తరం ముక్క రాయకుండా, నా ఆచూకీ నా భార్యాబిడ్డలకు తెలియకుండా నేను బొంబాయిలో 21 మాసాలు గడిపాను. తిరిగి నా వార్తలు మా వాళ్ళకూ, వాళ్ళ వార్తలు నాకూ తెలిసేలోగా నా కుమార్తె చనిపోవటం కూడా జరిగింది...

బొంబాయిలో దిగిన కొత్తలో రోజూ కోహినూరు సినిమాకు వెళ్ళి గేటుదగ్గర నిలబడి లోపలికి చాలాసేపు ఆశగా చూసి హోటలుకి తిరిగివచ్చేవాణ్ణి. కాని దగ్గిరవున్నది 20 రూపాయలు. ఎంతకాలం వస్తాయి? హోటలు వాడు నాకు ఉద్వాసన చెప్పాడు. ఈ విధంగా వీధిలో నిలబడిన నాకు ఒక దర్జీవాడు ఆశ్రయమిచ్చాడు. నా పెట్టె ఆ దర్జీ కొట్టులో వుంచాను. రాత్రి వేళలో కొట్టులో పడుకునే వాణ్ణి. తెల్లవారి లేచి కొట్టంతా శుభ్రంగా ఊడ్చేవాణ్ణి. నాకు సినిమాల్లో ప్రవేశించాలని వుందని తెలిసి ఈ దర్జీవాడే నాకు వీనస్ పిక్చర్స్ లో పనియిప్పించాడు. పేరుకు నెలజీతం 15 రూపాయలు. కాని, ఈ జీతం డబ్బులు మొహం నేనెన్నడూ చూసిన పాపాన పోలేదు. ఈ వీనస్ పిక్చర్స్ వారు చిత్రమే తీయలేదు.

అయినా ఒక ఉపకారం జరిగింది. ఆ రోజుల్లో మిస్ మోతీ అని ఒక సినిమా తార వుండేది. ఈమె సోదరుడు ధారీలాల్ అనేవాడు వీనస్ పిక్చర్స్ లో వుండేవాడు. ఇతను నాకు గ్రాంట్ రోడ్డులో వుండే కార్నివాల్ లో పనియిప్పించాడు. రాత్రుళ్ళు అక్కడ పని చేసి, కార్నివాల్ ముగిసిన తర్వాత రెండు గంటల వేళ... బస్సులూ, ట్రాములూ వుండవు.. నాలుగైదు మైళ్ళు దాదరుకు నడిచి దర్జీదుకాణం చేరి, అక్కడ కాసేపు పడుకుని, మళ్ళీ 6 గంటలకు లేచి కొట్టు శుభ్రం చేసి, రైలు మీద శాంటాక్రుజ్ లో వీనస్ పిక్చర్స్ కు హాజరయేవాణ్ణి. కార్నివాల్ వాళ్ళు నాకు రోజూ రూపాయిన్నర ఇచ్చేవారు. దీనితోనే నాఖర్చులన్నీ సరిపెట్టుకునేవాణ్ణి.

3, 4 నెలలు గడిచాక వీనస్ పిక్చర్స్ దివాళా తీసింది.

తరవాత అఖ్తర్ నవాజ్ కు చెందిన ఇండియా పిక్చర్స్ లో చేరి "స్టార్ ఆఫ్ ది ఈస్ట్" అనే మూకీ చిత్రంలో చిల్లర వేషం వేశాను. ఆ రోజుల్లో చిల్లరనటులచేత వెట్టిచాకిరీ చేయించేవారు. ఎక్కడికైనాపోతే సామాన్లు మొయ్యాలి, రిఫ్లెక్టర్లు మొయ్యాలి, వట్టి కూలిపని. ఒకసారి అఖ్తర్ నవాజ్ షూటింగుకని మమ్మల్ని యెక్కడో మారుమూల స్థలానికి తీసుకుపోయాడు. రైలు స్టేషనుకు 15 మైళ్ళ దూరాన ఒక రహదారి బంగాళాలో మకాం చేశాం. దగ్గిర డబ్బులేదేమో అఖ్తర్ నవాజ్ రాత్రికి రాత్రే మాకెవరికీ చెప్పకుండా పరారీ అయినాడు. మా పాట్లు పరమాత్ముడికెరుక. రెండు రోజులు ఎవరికీ తిండిలేదు. ఆ తరవాత 15 మైళ్ళు నడిచి స్టేషనుకు చేరి, చావుతప్పి కన్ను లొట్టబోయి, యెట్లాగో బొంబాయి వచ్చిపడ్డాం.

ఆ తరువాత అర్దేషిర్ ఇరానీ కింద ఇంపీరియల్ ఫిలిం కంపెనీలో నెలకు ముప్ఫై రూపాయల జీతం మీద నటుడుగా చేరాను. ఈ ఇంపీరియల్ ఫిలిం కంపెనీలో దాదాపు రెండేళ్ళున్నాను. ఈ కాలంలోనే వీరు మొట్టమొదటి బారతీయ టాకీ చిత్రం "అలం ఆరా" తీశారు. ఇందులో నేను చిల్లర వేషాలు వేశాను. నేను ఇంపీరియల్ లో ఉండగానే నాకు హెచ్.ఎం.రెడ్డి గారి పరిచయం కూడా అయింది. ఆయన అక్కడికి వచ్చి "కాళిదాస్" అనే చిన్న టాకీ చిత్రం హిందీలో తీశారు. ఇందులో నేను పురోహితుడి పాత్ర ధరించాను.

1933 లో కాబోలు ఇంపీరియల్ కంపెనీలో ఉద్యోగులను తగ్గించారు. దాంతో నేను వీధిలో వచ్చిపడ్డాను. నా నిరుద్యోగానికి తెరమరుగులాగా కృష్ణా సినిమాలో డోర్ కీపర్ పని దొరికింది. ఈ పని చేస్తూనే హెచ్.ఎం.రెడ్డిగారి "భక్త ప్రహ్లాద" లో చండామార్కులు వేషమూ, "సావిత్రి"లో సత్యవంతుడి మిత్రుడి వేషమూ వేశాను.

అనంతరం రెడ్డిగారు దాదర్ లోని విజయా సినిటోన్ లో "సీతా స్వయంవర్" అనే హిందీ చిత్రాన్ని డైరెక్టు చెయ్యటానికి కుదిరారు. ఆ చిత్రంలో నేను వేషం వేశాను. చిత్రం పూర్తికాకపూర్వమే కంపెనీ వారికి రెడ్డిగారికీ ఏవో విభేధాలు ఏర్పడి ఆయన వెళ్ళిపోయారు. నేను మాత్రం చిత్రం పూర్తి అయినదాకా కంపెనీలో ఉండి, తరువాత ఆ కంపెనీకు రిప్రెజెంటేటివుగా కుదిరి, ఆ చిత్రం తాలూకు టిన్నులు పట్టుకొని బొంబాయి రాష్ట్రమంతటా తిరిగాను. తరువాత నేనా కంపెనీకి ఆఫీసు మేనేజర్ కూడా అయినాను. అయితే కొద్దిరోజులకే ఆ కంపెనీ రద్దయింది.

ఇక్కడి నుంచి నేను న్యూ ఈరా పిక్చర్స్ కు వెళ్ళాను. దాని ప్రొప్రయిటరు రజనకాంత పాండ్యా, ఈయన ప్రస్తుతం బొంబాయి శ్రీ సౌండ్ స్టూడియోస్ కు అధిపతి. న్యూ ఈరా వారు అప్పుడు తీయనున్న "మత్స్యగంధి" (భీష్మ ప్రతిజ్ఞ) చిత్రానికి నన్ను ప్రొడక్షన్ మేనేజరుగా నియమించారు. ఈ చిత్రం పూర్తికాగానే రేణు పిక్చర్స్ (దాదర్) లో చేరాను. ఈ కంపెనీ వారు ఒక కెమేరా, సౌండ్ ట్రక్ కొని చిత్రాలు తీయబోతున్నారు. ఈ కంపెనీకి నేను మేనేజరుగానూ, అసిస్టెంటు కామెరామాన్ గానూ కుదిరాను. 1937లో జమ్నాదాస్ కపాడియా కింద "స్త్రీ" అనే చిత్రానికి కెమెరాపని చేశాను.

నాకు అసిస్టెంటు డైరెక్టర్ అవకాశాన్ని మొదట ఇచ్చిన వాడు గజన్ ఫరాలీషా. ఇతను భయంకరుడు. కోపం వచ్చినప్పుడల్లా పిస్తోలు తీసేవాడు. (అతనికి పిస్తోలు లైసెన్స్ ఉండేది.) అతనికింద ఎవరూ అసిస్టెంటుగా పనిచెయ్యలేక పోయే వారు. కాని నేను అతనికింద పనిచేసినంతకాలం అతనితో నాకు ఏ పేచీ రాలేదు. ప్రస్తుతం గజన్ ఫరాలీషా అనే ఆయన పాకిస్తాను మంత్రిగా ఉన్నట్టున్నది. ఈయనే ఆయనేమో నాకు తెలియదు.

ఒక కంపెనీ అని లేకుండా దొరికిన చోటనల్లా చిల్లర వేషాలు వేస్తూ బొంబాయిలో మరి రెండేళ్ళు గడిపిన అనంతరం 1940 లో హెచ్.ఎమ్.రెడ్డి గారు నన్ను మద్రాసుకు తీసుకొచ్చారు. ఆయనకు సహాయంగా ఉంటూ "సత్యమే జయం" "తెనాలి రామకృష్ణ" చిత్రాలలో వేషాలు కూడా వేశాను.

తిరిగి 1942 లో తాండ సుబ్రహ్మణ్యం గారు "కష్టజీవి" తీయటానికి బొంబాయి బయల్దేరితే దాన్ని డైరెక్టు చేయటానికి నేను వెంటవెళ్ళాను. ఈ చిత్రం మూడు రీల్సు పూర్తి అయినాక ఆగిపోయింది. నేను గీతాంజలి పిక్చర్స్ కు అసిస్టెంటు డైరెక్టరుగా చేరి "సవాల్" అనే చిత్రానికి పని చేశాను. ఇందులో ముంతాజ్ శాంతీ, ఉల్లాస్ ప్రధాన పాత్రలు ధరించారు. దీని తరువాత ముంతాజ్ శాంతి భర్త వల్లీ సాహెబ్ "లేడీ డాక్టర్" డైరెక్షనుకు కుదిరినప్పుడు నేనాయనకు అసిస్టెంటుగా పని చేశాను.

తరువాత డైరెక్టర్ యూసుఫ్ నన్ను అసిస్టెంటుగా తసుకున్నాడు. "దర్బాన్", "నేక్ పర్వీన్" చిత్రాలు తీశాము. కుమార్ తీసిన "దేవర్" చిత్రానికి స్క్రిప్టు రాశాను.

ఇంతలో పృథ్వీరాజ్ కపూర్ పృథ్వీ థియేటర్స్ పెట్టి నాటకాలాడనారంభించాడు. మొదట "శకుంతల" ఆడాడు. తరవాత "దివార్". ఈ రెండు నాటకాలలోనూ నేను అనేక చిన్న పాత్రలు ధరించాను.

1945 ఆగస్టులో, "గృహప్రవేశం" చిత్రం డైరెక్టు చేయటానికి మద్రాసు వచ్చి ఇక్కడి సినిమా ప్రపంచంలో ఒక డైరెక్టరుగా స్థిరపడిపోయాను.

ఏతావాతా చెప్పవచ్చిందేమంటే నేను పడ్డ కష్టాలన్నీ బొంబాయిలోనే పడ్డాను. బొప్పెలన్నీ అక్కడే తగిలాయి. కాని నేర్చుకోవలసిందంతా కూడా అక్కడే నేర్చుకున్నాను. బొంబాయి ముఖ్యంగా నాకు ఓపిక నేర్పింది. ఏమైనా సాధించాలంటే ఎంతో ఓపిక అవసరం. ముఖ్యంగా ఈ సినిమా లైనులో తొందరపాటు వల్ల ఏమీ కాదు.

# డి.మధుసూదన రావు

## ( విజయచిత్ర, 1968, మార్చి సంచిక నుంచి)



చలన చిత్ర నిర్మాత అంటే చలన చిత్ర 'విజ్ఞాన సర్వస్వం' లాంటి వ్యక్తి. ఆ వ్యక్తికి అన్ని శాఖలతోనూ పరిచయం వుండాలి; అన్ని విషయాలలోనూ అనుభవం వుండాలి. ప్రేక్షకుల మనస్తత్వాల దగ్గర్నుంచి, కథా కమామీషులను నిర్ణయించడం వరకూ చిత్ర నిర్మాత క్షుణ్ణంగా తెలుసుకుని వుంటాడు. కేవలం పెట్టుబడి పెట్టడంతోనే నిర్మాత బాధ్యత తీరిపోదు; నిర్మాణ వ్యవహారాలను ప్లాన్ చెయ్యడం, కథ, మాటలు పాటలు దగ్గర్నుంచి తక్కిన శాఖలన్నీ చూసుకోవడం వరకూ అతనికి బాధ్యత వున్నది. అలా అన్ని శాఖలతోనూ పరిచయం, అన్ని రంగాల్లోనూ అనుభవం, మంచి అభిరుచులూ గల నిర్మాతలు కొద్దిమందే వుంటారు. అన్నపూర్ణా అధినేత మధుసూదనరావుగారు వాళ్ళల్లో ఒకరు.

ఏ కథను ఎన్నుకోవాలి? ఆ కథకు రచయిత ఎవరు? దర్శకుడెవరు? పాత్రలు ఎలా వుంటాయి? ఆ పాత్రలను ధరించడానికి సరైన నటీనటులు ఎవరు? షూటింగ్ కార్యక్రమాలు ఎలా? ఏ దృశ్యం తక్కువైంది? ఎందుకైంది? ... ఇలాంటి సవాలక్ష విషయాలను ఆలోచించడంలో, చర్చించడంలో మధుసూదనరావుగారు గట్టివారు. ఆ గట్టిదనమే ఆయన చిత్రాల్లో కనిపిస్తుంది. ఆ గట్టిదనంతోనే ఆ చిత్రాలూ విజయవంతం కాగలుగుతున్నాయి. 'అన్ని రంగాలతోనూ వున్న పరిచయంతో పాటు అభిరుచి కూడా ముఖ్యమైనది.' అన్నది మధుసూదనరావుగారి అభిప్రాయం. ఆ అభిప్రాయం ఏర్పరుచుకోడానికి జరిగిన – ముందు కథలో వున్న అభిరుచులూ అలాంటివే.

స్వగ్రామమైన కృష్ణా జిల్లాలోని పెయ్యేరులో చిన్నతనం గడిచిన రోజుల్లోనే ఆయనకు మంచి అభిరుచులు కలిగాయి. నాటకాల మీద ఆసక్తి కలిగింది. వేదాంతం రాఘవయ్యగారు ఆ వూరు రామాలయంలో కూచిపూడి నాటకాలు ప్రదర్శించేవారు. నాటకాలను చూడడంలోనూ, చూసి విమర్శించడంలోనూ ఆయన ప్రజ్ఞను సంపాయించారు.

పెయ్యేరులో ఎలిమెంటరీ స్కూలు చదువు అయిన తర్వాత, గుడివాడలో స్కూల్ ఫైనల్ దాకా చదివి, బందరు నోబుల్ కాలేజీలో ఇంటర్, బి.ఏ. చదివారు. ఇంటర్ మీడియట్ లో ఫస్ట్ క్లాస్ వచ్చింది. మద్రాసు వైద్య కళాశాలలో సీటు కూడా వచ్చింది. కానీ తండ్రిగారి అస్వస్థత వల్ల మెడిసిన్ చదవడం వీలుపడలేదు. అలా 'వీలుపడకపోవడమే' ఆయనను నేడు చిత్రనిర్మాతగా చేసింది. తండిగారికి జబ్బు చెయ్యడంతో, ఇంటి దగ్గర వుండవలసి రావడం వల్ల రెండేళ్ళ విరామం ఏర్పడింది. ఆ రెండేళ్ళూ మధుసూదనరావుగారిని పాతికేళ్ళ అనుభవజ్ఞుడిని చేశాయి. గొప్ప గొప్ప రచనలను చదవడం, అర్థంచేసుకోవడం, చర్చలు చెయ్యడం లాంటివెన్నో జరిగాయి. ఆయన స్వగ్రామానికి బాగా దగ్గర్లోనే వున్న ముదినేపల్లిలో ఎక్సెల్షియర్ క్లబ్ అన్న పేరుతో ఒక చిన్న సమితిని ఏర్పాటు చేసి, ఆటలలో ఉత్సాహం చూపించడం సాగించారు. ఆ సమితి టోర్నమెంటులను జరిపేది; అనేకమంది క్రీడాకారులకు ప్రోత్సాహం చూపేది. ఆ సమితికి మధుసూదనరావుగారు కార్యదర్శి.

మధుసూదనరావుగారికి నాటకాల మీద వున్న ఉత్సాహం చేత, కోడూరి అచ్చయ్యగారి సహకారంతో ఎక్సెల్షియర్ క్లబ్ లో నాటక శాఖను కూడా ఆరంభించారు. అప్పుడు పురాణ నాటకాలూ, పద్య నాటకాలూ మంచి చెల్లుబడిలో వుండేవి. ఆ నాటకాలవల్ల సాంఘిక ప్రయోజనం వుండదనీ, సాంఘిక నాటకాలయితే సమాజానికి ఉపయోగకరంగా వుంటాయనీ, సాంఘిక నాటకాలను వెలుగులోకి తీసుకు రావాలనీ నిర్ణయించుకున్నారు. కోనేరు కుటుంబరావు రాసిన "ఆశాజ్యోతి" అనే నాటకాన్ని ఆయన చూశారు. ఆ నాటకంలో ఇరవై దృశ్యాలున్నాయి. పాటలు పద్యాలూ వున్నాయి. దాంతో నాటకం పూర్తయేసరికి తెల్లారింది! ఆ నాటక ఇతివృత్తం మధుసూదనరావుగారిని బాగా ఆకర్షించడంవల్ల ఆ నాటకాన్ని తీసుకుని కుదించారు! రసవత్తరమైన సన్నివేశాలను కల్పించారు. మంచి పాటలు పెట్టారు.

మధుసూదనరావుగారి అత్తవారి వూరు కాటూరు. కాటూరు, పెండ్యాల నాగేశ్వరరావు గారి వూరు. అప్పటికే పెండ్యాలగారు సినిమా పరిశ్రమలో హార్మోనిస్టుగానూ, సహాయ సంగీత దర్శకుడిగానూ పని చేసి, బాంబుల భయంవల్ల మద్రాసు విడిచిపెట్టి కాటూరు చేరుకున్నారు. ఆయనకూ, మధుసూదనరావుగారికీ, ఉన్న పరిచయం వల్ల – పెండ్యాలగారిని 'ఆశాజ్యోతి' నాటకానికి సంగీత దర్శకునిగా తీసుకున్నారు. అయితే హీరోయిన్ సమస్యయింది. ఆ రోజుల్లో స్త్రీ పాత్రలను ఎక్కువగా మగవాళ్ళే ధరించేవారు. బాగా అందంగా వుండి, పాడగలిగే మగాడు కావాలి. ఏం చెయ్యాలని వాళ్ళంతా ఆలోచనలో పడ్డారు. కాస్సేపు ఆలోచించి, పెండ్యాల గారు ఓ సలహా ఇచ్చారు.

"ఓ గుడివాడ కుర్రాడిని చూశానండీ. అబ్బాయి అద్భుతంగా పాడుతున్నాడు. విప్రనారాయణలో దేవదేవి వేశాడు. అచ్చం ఆడపిల్లలా వున్నాడు" అన్నారు పెండ్యాల. సరే అని, ఆ అబ్బాయి కోసం గాలించి, పట్టుకున్నారు–చూశారు–మాట్లాడారు–తమ నాటకంలో హీరోయిన్ వేషం వెయ్యమని అడిగారు,తీసుకొచ్చారు. ఆ 'హీరోయిన్' – అక్కినేని నాగేశ్వరరావు. నాగేశ్వరరావుతో మధుసూదనరావుగారి పరిచయం అలా జరిగింది. నాటక సమాజాలు క్రమశిక్షణాయుతంగా వుండాలని, ఓ పద్ధతిలో సాగాలనీ, మధుసూదనరావుగారు ఆలోచించేవారు. పకడ్బందీగా రిహార్సల్సు వేయించేవారు; కచ్చితంగా తయారయేట్టు చూసేవారు. నాగేశ్వరరావుగారి సంభాషణలన్నీ పురాణ పద్ధతిలో వుండేవి. సాంఘిక నాటకం కాబట్టి, ఆ భాషనూ, ఉచ్చారణనూ సరిగ్గా అలవడ జేసుకోవాలని దైతా గోపాలం గారిని పిలిపించి, నాగేశ్వరరావుకు నేర్పడానికి ఏర్పాటు చేశారు. పెండ్యాల గారి చేత ఆర్కెస్ట్రాతో సహా పాటలు కంపోజ్ చేయించారు. నాటకాల్లో పాటలకి బాక్ గ్రౌండ్ మ్యూజిక్కూ మంచి ఆర్కెస్ట్రాతో రావడం అదే మొదటిసారి! ఆ నాటకం విజయవంతమైంది.

తర్వాత 'ఆశాజ్యోతి' నాటకాన్ని చాలా చోట్ల ఆడారు. అయితే, నాటకంలో సమ్మెలు లాంటి ఉద్యమాలు వుండడం వల్ల ప్రభుత్వం వారు ఆ నాటకాన్ని నిషేధించారు.

దాంతో ఎక్సెల్షియర్ క్లబ్ వారికి ఆడడానికి చేతిలో నాటకం లేకుండా పోయింది. త్రిపురనేని రామస్వామిగారికి ఓసారి సన్మానం జరుగుతూంటే, ఆ సందర్భంలో ప్రదర్శించాలని "సత్యాన్వేషణ" అనే నాటకాన్ని తీసుకున్నారు. అయితే, నాటకం ప్రదర్శించే ముందు ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి కాబట్టి , ఆ నాటకానికీ అనుమతి రాలేదు. ప్రభుత్వం దృష్టిలో ప్రజలను రెచ్చగొట్టేవిగా వున్నాయన్న సన్నివేశాలను తగ్గించి, అనుమతి తీసుకుని తర్వాత ఆడారు. అయితే కొన్నాళ్ళకు మళ్ళీ ఆ నాటకం నిషేధంలో పడింది !

ఎక్సెల్షియర్ క్లబ్ వారికి మంచి పేరు వుండేది. వారి నాటకాలకి డబ్బు బాగా వచ్చేది. కొప్పరపు సుబ్బారావుగారు 'నూర్జహాన్' పేరుతో రాసిన నిషేధింపబడిన నాటకాన్ని కొన్ని మార్పులుచేసి, "కోహినూర్" పేరుతో ఆడసంకల్పించారు. తోట వెంకటేశ్వరరావును (నేటి కళాదర్శకుడు) పిలిపించి, అతనికి ఒక పాత్ర ఇచ్చారు. బసవరాజు సుబ్బారావుగారు కూడా అప్పుడు సమితిలో చేరారు.

ఇలా – ఎక్సెల్షియర్ క్లబ్ మూడు పువ్వులూ ఆరు కాయలూగా వర్ధిల్లింది. క్లబ్బుకున్నంత పేరూ వారు ప్రదర్శించే నాటకాలకూ వుండేది. విప్లవాత్మకమైన నాటకాలను ప్రదర్శించడంలోనూ, కట్టుదిట్టమైన నాటకాలను ప్రదర్శించడంలోనూ, ఆ సమితి మార్గదర్శకమైంది. అలా కావడానికి ముఖ్య కారకులు మధుసూదనరావుగారు.

ఎక్సెల్షియర్ క్లబ్ వారి నాటకాలకు అశ్వరాజ్ ఫిలింస్ నిర్మాత గోపాలరావు, కీ.శే. మంగయ్య మేకప్ చేసేవారు. వారి ద్వారా, చలనచిత్ర నిర్మాతా దర్శకుడూ అయిన ఘంటసాల బలరామయ్యగారికి అక్కినేని నాగేశ్వరరావు పేరు తెలిసింది. బలరామయ్యగారు 'సీతారామజననం' చిత్రం తీస్తూ శ్రీ రామ పాత్రధారి కోసం అన్వేషణ సాగిస్తున్నారు. సమితివారంతా ఓసారి 'తెలుగుతల్లి' నాటకాన్ని ప్రదర్శించి తిరిగి వస్తూ వుండగా, బెజవాడ స్టేషన్లో బలరామయ్యగారు వాళ్ళను కలుసుకుని, నాగేశ్వరరావును చూశారు. తన కోరిక వ్యక్తం చేశారు. అవకాశం వెతుక్కుంటూ వచ్చింది గనక, కాదనరాదని, మధుసూదనరావుగారు నాగేశ్వరరావుకు సలహా ఇచ్చారు; తనకూ సినిమా ఉత్సాహం వున్నందువల్ల నాగేశ్వరరావు ఎగిరి గంతేశాడు !

నాగేశ్వరరావు సినిమాల్లోనూ, తోట డి.వి.సుబ్బారావుగారి ట్రూప్ లోనూ, పెండ్యాల గూడవల్లి రామబ్రహ్మంగారి సంస్థలో సహాయ సంగీతదర్శకుడిగానూ చేరడంతో, ఎక్సెల్షియర్ క్లబ్ వారి నాటకసమితి మూతపడవలసి వచ్చింది! ఆ తరవాత కోడూరు అచ్చయ్యగారు అప్పుడే స్థాపింపబడిన ప్రజా నాట్యమండలిలో చేరారు.

గూడవల్లి రామబ్రహ్మంగారూ, మధుసూదనరావుగారు మిత్రులు, మధుసూదనరావుగారికి గుడివాడలో ఖద్దరు వస్త్రాలయం వుండేది. దానికి బట్టలు కొనడానికని దక్షిణప్రాంతం వెళుతూ, మద్రాసులో వున్న రామబ్రహ్మంగారికి వంట్లో బాగులేదని తెలిసి, ఆయనను చూడ్డానికి వెళ్ళారు.

మాటల్లో రామబ్రహ్మంగారు తను 'మాయాలోకం' చిత్రం ప్రారంభిస్తున్నట్టూ దాంట్లో శరాబంది రాజు పాత్రకు చక్కని అబ్బాయి కోసం చూస్తున్నట్టూ చెప్పారు. మధుసూదనరావుగారు, నాగేశ్వరరావు పేరు సూచించారు. మొదట్లో ఆయన, ఆ పాత్రకు నాగేశ్వరరావును తీసుకోడానికి అంత ఇష్టపడకపోయినా, తర్వాత బాగా తృప్తి పడ్డారు; మధుసూదనరావుగారికి అభినందనలూ కృతజ్ఞతలూ తెలియజేశారు.

అయితే, మధుసూదనరావుగారికి నాటకాలు మీద వున్న ఉత్సాహం తగ్గలేదు. పైగా అధికం కాసాగింది. ఆంధ్రనాటక కళాపరిషత్తులో జేరి, ఉత్సాహంగా పని చెయ్యడంతో జాయింట్ సెక్రెటరీ అయ్యారు. ఆయన ఆ హోదాలో పని చెయ్యడం ప్రారంభించినప్పుడే పరిషత్తు నియమావళిలో కట్టుదిట్టమైన నిబంధనలు ఏర్పడ్డాయి. అప్పుడే మొదటిసారిగా నాటక పోటీలు జరిపారు. ఆ సందర్భంలోనే గూడవల్లి రామబ్రహ్మంగారినీ, భానుమతినీ సన్మానించారు.

ఆంధ్రనాటక కళాపరిషత్తులో ఆయన అమితోత్సాహంతో పని చెయ్యడంవల్ల ఆయనకు నాటక సాహిత్యం, ప్రదర్శనలమీద ఎక్కువ ఉత్సాహం కలిగింది. పరిషత్తు కమిటీలో వుండడంవల్ల అనేకమైన కొత్త నాటకాలు చదవడానికి ఆస్కారం ఏర్పడింది. కొత్త నాటకాలు రావాలన్న ఉద్దేశంతో 'కొత్త' నాటకాలే కావాలని, పరిషత్తు – రచనలను ప్రోత్సహించసాగింది. ఉత్తమంగా ఎన్నికైన పరిషత్తు నాటకాలను అనేక పట్టణాల్లో పరిషత్తు శాఖలను ఆరంభించి ప్రదర్శించేవారు. ప్రేక్షకులకు సాంఘిక నాటకాల మీద, కొత్తరకం నాటకాలమీద అభిరుచి కలిగింది. ఇవాళ చిత్రసీమలో రచయితలుగా పని

చేస్తున్న నరసరాజు, ఆత్రేయ, పినిసెట్టి, అనిసెట్టి, గోపాలరాయశర్మ మున్నగు రచయితలందరూ పరిషత్తులో పాల్గొన్నవారే. మదుసూదనరావుగారికి ఆ విధంగా రచనలతోనూ పరిచయం ఏర్పడింది.

నోబులో కాలేజీలో చదువుకంటున్న రోజుల్లో ఇంగ్లీషు ప్రొఫెసర్ 'బాగ్ షా' గారికి మధుసూదనరావుగారు ప్రియశిష్యుడు. ఇంగ్లీషులో మదుసూదనరావుగారు తెచ్చుకునే మార్కులను చూసి అంతా ముచ్చట పడేవారు. బి.ఏ.లో వారికి ఇంగ్లీషులో యూనివర్శిటీ ఫస్టు కూడా వచ్చింది. ఆ సందర్భంలోనే బాగ్ షా దొర మదుసూదనరావుగారికి 'వరల్డ్ ఫేమస్ షార్ట్ ప్లేస్' అన్న ఉత్తమ గ్రంధాలనూ బహుకరించారు. నేటికీ మధుసూదనరావుగారు వాటిని ప్రాణప్రదంగా చూసుకుంటారు. బాగ్ షా దొర ప్రోత్సాహంతో మధుసూదనరావుగారు ప్రముఖ ఆంగ్ల రచనలన్నీ క్షుణ్ణంగా చదివి, చాలా విషయాలి గ్రహించారు.

ఇవాళ – 'తెరవెనక' ఆయన స్కృప్టు మీద చేసే చర్చల వెనక, అలాంటి అనుభవం వున్నది. "పల్లెటూర్లో పుట్టి, పట్టణాల్లో పెరిగి, అనేక రకాల వ్యక్తులను కలుసుకోవడం, అనేకుల మనస్తత్వాలను గ్రహించడం వంటివి ఎన్నో, చిత్ర పరిశ్రమలో నాకు సహాయకారులైనాయి." అంటారాయన.

సినిమాలతో మధుసూదనరావుగారి పరిచయం విమర్శలతో ఆరంభమైంది. ఆ రోజుల్లో విడుదలైన చిత్రాలను చూసి, ఆయన మంచిచెడ్డలను విమర్శిస్తూ నిర్మాతలకు లేఖలు రాసేవారు. ముఖ్యంగా, స్నేహితులైన గూడవల్లి రామబ్రహ్మంగారు, ఘంటసాల బలరామయ్యగారు, భరణి రామకృష్ణగారూ, మధుసూదనరావుగారి విమర్శలకోసం ఎదురు చూసేవారు. ఆయనలో ఈ 'మంచిచెడ్డల విమర్శ' అన్న గుణం వున్నదని, మొదటిసారిగా గూడవల్లి రామబ్రహ్మంగారు, తమ 'పల్నాటి యుద్ధం' చిత్రం స్క్రిప్టును వినిపించి, ఆయనతో చర్చించారు. అప్పుడే మధుసూదనరావుగారికి, సినిమా స్క్రిప్టును ఎలా చర్చిస్తారన్న విషయం అర్థమైంది. రామబ్రహ్మంగారి ద్వారా పరిశ్రమలోని అనేక వ్యక్తులతో పరిచయం ఏర్పడింది.

అనుభవం, అభిరుచి రెండూ కలిసి 1951 లో మధుసూదనరావుగారిని చిత్ర నిర్మాతను చేశాయి. మంచి చిత్రాలు తయారు చెయ్యాలనే ఉద్దేశంతో, నవయుగ శ్రీనివాసరావు, నాగేశ్వరరావుగార్ల తోడ్పాటుతో ఆయన అన్నపూర్ణా సంస్థను ఆరంభించారు.

అన్నివిధాలా విజయవంతమయే చిత్రాలను తియ్యాలన్నది ఆ సంస్థ ఆశయం. మొదటి చిత్రానికి ఆయన కె.వి.రెడ్డిగారిని దర్శకునిగా తీసుకున్నారు. 'పెద్దమనుషులు' చిత్రంతో రెడ్డిగారు బిజీగా వుండడంవల్ల మూడేళ్ళపాటు నిరీక్షించవలసి వచ్చింది! అభిరుచి అనేది వున్నది కాబట్టే, అన్నేళ్ళు ఆయన నిరీక్షించగలిగారు. ఆ మూడేళ్ళలోనూ ఆయన అనేక కథలు విన్నారు; అనేక కథలు చదివారు; చర్చించారు. ఆ మూడేళ్ళలోనూ కలిగిన అనుభవాలు అనంతమైనవి. 'దొంగరాముడు' వారి మొదటి చిత్రం. 1954లో ప్రారంభించారు. కె.వి.రెడ్డిగారికి ప్రొడక్షన్ శాఖలో అనుభవం వుండడం చేత, ప్రొడక్షన్ వ్యవహారాలను కూడా ఆయనే చూసుకునేవారు. మధుసూదనరావుగారు ఆ అనుభవం అంతా రెడ్డిగారి దగ్గరే నేర్చుకున్నారు. 'దొంగరాముడు' చిత్రం అఖండమైన విజయం సంపాయించింది. దాంతో అన్నపూర్ణాసంస్థా, మధుసూదనరావుగారు ప్రేక్షకులలోనూ, పరిశ్రమలోనూ ఓ స్థానం సంపాయించుకున్నారు.

తర్వాత, 'తోడికోడళ్ళు' చిత్రాన్ని ఆరంభించారు. కె.వి.గారు బిజీగా వుండడంతో, సామర్ధ్యం వున్న దర్శకుని కోసం వెతికి, 'అమరసందేశం' చిత్రాన్ని చూసి, ఆదుర్తి సబ్బారావుగారిని తీసుకున్నారు. అప్పుడే సెల్వరాజ్ గారినీ (ఛాయాగ్రహణ శాఖకు) తీసుకున్నారు.

అక్కడినుంచీ అన్నపూర్ణాసంస్థ చక్కని సాంఘిక చిత్రాలను అందివ్వడం సాగించింది. మాంగల్యబలం, వెలుగునీడలు, ఇద్దరు మిత్రులు, చదువుకున్న అమ్మాయిలు, డాక్టర్ చక్రవర్తి, ఆత్మగౌరవం, పూలరంగడు మొదలైన చిత్రాలు ప్రేక్షక హృదయాలలో ఓ స్థానం సంపాయించుకున్న చిత్రాలు. ఈ చిత్రాల్లోని కొన్ని చిత్రాలను అన్నపూర్ణాసంస్థ తమిళంలో కూడా నిర్మించి, ఖ్యాతి సంపాయించింది; వీటిలో చాలా చిత్రాలు బహుమతులూ సంపాయించాయి!

కొత్త కొత్త రచనలనూ, కొత్త రచయితలనూ, ప్రోత్సాహించాలని, మధుసూదనరావుగారి ఉద్దేశం. డాక్టర్ శ్రీదేవి, కొర్రపాటి గంగాధరరావు, యద్దనపూడి సులోచనారాణి, కోడూరి కౌసల్యాదేవి, భమిడిపాటి రాధాకృష్ణ, గొల్లపూడి మారుతీరావు, ముప్పాళ్ళ రంగనాయకమ్మ మున్నగువారిని సినిమా రచయితలుగా సినిమా రంగానికి పరిచయం చేశారాయన.

"నాకు ఉన్న నమ్మకం – ముందు కథ మీద; తర్వాత దాన్ని తెరమీద చెప్పడం మీద; తర్వాత తక్కిన వాటిమీద" అంటారు మదుసూదనరావుగారు. చిత్రానికి కథే ప్రాణం కాబట్టి దాన్ని నిర్ణయించుకోవడంలోనూ, దాన్ని తెరకు మలచుకోవడంలోనూ శ్రద్ధ కనిపించాలన్నది ఆయన సిద్ధాంతం.

"నాకు మెలోడ్రామామీద నమ్మకంలేదు. చిత్రం చూస్తుంటే, 'అయ్యో పాపం!' అనాలేగాని, ఏడవకూడదు. నా ఉద్దేశం కథలో కొత్తదనం వుండి, విసుగు లేకుండా దాన్ని ట్రీట్ చెయ్యగలిగి, హాస్యం, చక్కని సంగీతం పెట్టగలిగితే చిత్రం తప్పక విజయవంతం అవుతుంది అని. చిత్రాల్లో హాస్యం, కథతో కలిసి వుండాలి గాని, వేరుగా వుండకూడదు. మంచి కథ గనక వుండేట్టయితే, దానికి తారాబలం అవసరం వుంటుంది; తారాబలం ఆ చిత్ర విజయానికి దోహదమూ చేస్తుంది. కథలో బలం లేకపోతే, తక్కిన ఏ బలాలూ ఏమీ సహాయం చెయ్యలేవు.

అయితే, ఇదివరలో మేము అందివ్వగలిగినంత క్వాలిటీని ఇవాళ ఇవ్వలేకపోతున్నామన్నది నాకు బాగా తెలుసు. దానికి కారణం.. అందరూ బిజీగా వుండడం; ఆలోచించి చెయ్యడానికి వ్యవధి లేకపోవటం. అంచేత విధిలేక కొన్ని కొన్ని నిర్ణయాలను తొందరగా తీసుకోవలసి వస్తూవుంటుంది మరి !" అన్నారాయన.

మదుసూదనరావుగారికి కె.వి.రెడ్డి గారంటే గురి. ఆయన గీసిన గీతల్లోనే ఇవాళ కూడా ఆయన నడుస్తున్నారు. "కథ, ట్రీట్మెంట్, నిర్మాణ పథకాలు మొదలైన వెన్నో ఆయన నేర్పారు" అంటారు మదుసూదనరావుగారు.

"మన సాంఘిక జీవన విధానాల్లో కొన్ని నిబంధనలున్నాయి. వాటిని అధిగమిస్తూ చిత్రాల్లో చూపడం భావ్యం కాదు. పాత్రపోషణలోనూ, కథనంలోనూ కొత్తదనం అవసరమే గాని, ఆ కొత్తదనం వెర్రితలలు వెయ్యకూడదు.  ఏ సన్నివేశమూ, ఏ పాత్రా కూడా అసహజంగా వుండరాదు. చిత్రాల్లో వస్తున్న 'అసభ్యకరమైన సెక్స్' ను నేను ప్రోత్సహించను. దాని మీద నాకు ఏ మాత్రం నమ్మకం లేదు" అన్నారాయన.

మన సంప్రదాయాలూ, కట్టుబాట్లు, నీతినియమాలూ వీటిని దృష్టిలో పెట్టుకుని, అన్ని తరగతుల వారినీ ఆకర్షించేలా చిత్రాలు నిర్మించే దుక్కిపాటి మదుసూదనరావుగారు ప్రస్తుతం – శ్రీ సారధి స్టూడియోస్ వారు నిర్మించబోతున్న చిత్రాన్ని 'ప్రొడ్యూస్' చేస్తారు. ఆ తరువాత అన్నపూర్ణా వారి కొత్త చిత్రాన్ని ఆరంభిస్తారు. ఆ సన్నాహాల్లోనే ఆయన ఇప్పుడు 'బిజీ' గా వున్నారు.

# సెల్వరాజ్

## ( విజయచిత్ర, 1968, ఫిబ్రవరి సంచిక నుంచీ)



"చలనచిత్ర ఛాయాగ్రాహకుడు అంటే, కేవలం కెమేరాను ఎదురుగా పెట్టి, నాలుగు లైట్లు వేసి మీట నొక్కడం కాదు. చాలామంది అలా అభిప్రాయపడుతూ వుంటారు. అంతకంటే అతనికి ఇంకేం పని వుంటుంది? అని కూడా అనుకుంటూ వుంటారు. అయితే, చలన చిత్ర నిర్మాణంలో చెప్పుకోదగ్గ బాధ్యత వహించేది కెమేరా. సినిమాలో ఒక్కోచోట శబ్దం లేకపోవచ్చును, మాటలు లేకపోవచ్చును; నటీనటులు లేకపోవచ్చును. ఎవరున్నా లేకపోయినా, పని చెయవలసింది కెమెరా. కెమెరా లేకపోతే చిత్రమే లేదు. అలాంటి చత్రాన్ని చూపే ఛాయాగ్రాహకుడి బాధ్యత ఇంతా అంతా కాదు." అని చెప్పారు ప్రసిద్ధ ఛాయాగ్రాహణ దర్శకుడు – పి.ఎస్. సెల్వరాజ్.

"చలన చిత్ర ఛాయాగ్రాహకుడు చిత్ర కథను ఆమూలాగ్రం తెలుసుకుని వుండాలి. తాను కథను దృష్టిలో పెట్టుకుని,

ఆ వాతావరణానికి తగినట్టుగా లైటింగ్ ఏర్పాటు చేస్తూ, సన్నివేశానికి తగినట్టు చిత్రీకరించాలి. అంటే, విషాద ఘట్టం లాంటిది వున్నప్పుడు, ఆ దృశ్యానికి అద్భుతమైన లైటింగ్ ఏర్పాటు చేయకూడదు. అలాగే హాయిగా వుండే దృశ్యానికి, 'డల్ లైటింగ్' లాంటి దాన్నీ ఏర్పాటు చెయ్యకూడదు చిత్రకథ, దృశ్యాలకు తగ్గవాతావరణంలో ప్రేక్షకులను లీనం చెయ్యగలిగే ప్రతిభ ఛాయాగ్రాహకుని దగ్గర వుండాలి. అవుట్ డోర్ దృశ్యాల్లో అయితే, దానికి తగ్గలైట్ ను చూసుకుంటూ ప్రకృతి సౌందర్యాన్ని కూడా ఇముడ్చుకుంటూ చిత్రీకరించాలి. నిజానికి ఛాయాగ్రాహకునికి 'వూహ' కూడా వుండాలి. అలాంటి వూహ వున్నప్పుడు చిత్రీకరణలో కొంత వైవిధ్యం కనిపిస్తుంది. దృశ్యంలో ముందు వుండే ఆర్టిస్టుకూ, వెనక వుండే ప్రదేశానికీ మధ్య, దూరం తెలిసేట్టు చిత్రీకరించడానికి లైటింగ్ ను ఏర్పాటు చేస్తాము. బొమ్మ బాగా కనిపించడం అనేది లైటింగ్ మీదే ఆధారపడి వుంటుంది. మనకు రెండు కళ్ళు వుండడం చేత, వస్తువుల మధ్య దూరం బాగా చూడగలుగుతున్నాము. కెమెరాకు వున్నది ఒక్కటే కన్ను. ఆ ఒక్క కంటితోనే దూరం తెలిసే భ్రాంతిని కలిగించాలి. అలాంటి దూరాన్ని చూపడానికి లైటింగ్ అవసరమవుతుంది." అన్నారు సెల్వరాజ్. ఆయన దృష్టిలో భారతీయ ఛాయాగ్రాహకులు, విదేశీయ ఛాయగ్రాహకులకు ఏమీ తీసిపోరు. "మనకున్న కొద్ది సౌకర్యాలతోనే మనం విదేశీ చిత్రాల స్థాయిలో ఛాయాగ్రహణాన్ని చూపించగలుగుతున్నాము. వారికి వున్న సౌకర్యాలన్నీ మనకూ వుంటే, వారినే అధిగమించేవారిమేమో! ఈ 'కళ'ను అభ్యసించడం అన్నది – విదేశీయ చిత్రాలను చూడడమే. ఎలా చేశారు? ఏం చేశారు ? అన్నది చదివితే రాదు, చూసే నేర్చుకోవాలి. ఈ రోజున భారతీయ ఛాయాగ్రాహకులు విదేశీయ చిత్రాలను చూసే నేర్చుకుంటున్నారు. వారు తీసిన పద్ధతులు ఎలాంటివి అని ఆలోచించుకుంటూ, తామూ అలా తియ్యడానికి కృషి చేస్తున్నారు; విజయం పొందుతున్నారు. అనేకమైన అధునాతన విధానాలతో, వారు తీసి చూపించే దృశ్యాలను మనం మనకున్న సౌకర్యాలతోనే వారి స్థాయికి వెళ్ళ గలుగుతున్నామంటే ఆది నిజంగా ఘనమైన విషయం. అలా చెయ్యగలగడానికి వూహ కావలసి వస్తున్నది; కృషి అవసరమవుతున్నది; శ్రమపడి కష్ట సాధ్యమైన వెన్నింటినో సాధించవలసి వస్తున్నది. మన ప్రఖ్యాత ఛాయాగ్రహణ దర్శకులందరూ, విదేశ చిత్రాలు చూసి, మేధస్సు ఉపయోగించి, ఆ ప్రకారం తీస్తున్నారు. అందుకే, ఛాయాగ్రాహకుడికి మేధాశక్తి కూడా చాలా అవసరం."

"మంచి ఛాయాగ్రహణం గల చిత్రం అంటే ఎలా వుంటుంది?" అన్న ప్రశ్నకు సెల్వరాజ్ ఇలా సమాధానం ఇచ్చారు: "చిత్రం చూస్తున్నప్పుడు కంటికి ఏమాత్రం ఇబ్బందిలాంటిదీ కలగకుండా, బొమ్మ చూస్తున్నామన్న భ్రాంతిని కలిగించకుండా, చక్కగా చూపగలిగేదే మంచి ఛాయాగ్రహణం. అంటే, ఒక దృశ్యంలో ఎక్కువ కాంతి, ఇంకో దృశ్యంలో ఇంకోరకం కాంతి లేకుండా వుంటే, కంటికి ఇబ్బంది కలగదు. చిత్రంలో దృశ్యాలకు తగ్గట్టు లైటింగ్ ను వాడుతూనే, చిత్రమంతా ఒకే విధానమైన 'లైట్' కనిపించేట్టుగా చిత్రీకరించాలి. అలా కంటికి 'హాయి' అనిపించే చిత్రంయొక్క ఛాయగ్రహణమే చక్కని ఛాయాగ్రహణం అని నా అభిప్రాయం. అలాగే, ఆర్టిస్ట్ ను ఒక దృశ్యంలో ఎలా 'మోల్డ్' చేస్తామో చిత్రం అంతా కూడా అలాగే 'మోల్డ్' చేయ్యాలి. దృశ్యాలలో కాంతి భేదాలున్నా, అన్ని భేదాలు, ఎలాంటి తేడాలూ లైటింగ్ లో వుండాలే గాని, ఆర్టిస్టు 'ముఖం'లో వుండరాదు. ఆ ముఖం ఆ ముఖంలాగే వుండాలి."

చలన చిత్ర ఛాయాగ్రాహకుడికి వున్న బాధ్యతలను వివరిస్తూ సెల్వరాజ్ ఇంకా ఇలా చెప్పారు; "దర్శకుడు తాను వూహించుకున్న కథకూ, కథలోని పాత్రలకూ ఒక రకంగా రూపకల్పన చేసుకుంటాడు. అదంతా అతని వూహలో వుంటుంది. "నేను అనుకున్న సన్నివేశం ఇది; నేను అనుకున్న షాట్ ఇది; నేను వూహించుకున్న ఎఫెక్ట్ ఇది" అని అతను ఛాయగ్రాహకునితో చెబుతాడు. అతని వూహను చిత్రంగా మార్చి, ఆ వూహకు ప్రాణం పోసి సజీవ ప్రతిమను చెయ్యవలసినవాడు ఛాయగ్రాహకుడు. రచయిత, దర్శకుడూ కాయితం మీద చెబుతారు; దాన్ని ఛాయాగ్రాహకుడు తెరమీద చెప్పాలి. అంచేత, దర్శకుని వూహలనూ, రచయిత వూహలనూ తాను జీర్ణం చేసుకుని, దాన్ని చిత్రంగా రూపొందించడానికి తగ్గ ప్రతిభా విశేషాలు ఛాయాగ్రాహకుని దగ్గర వుండాలి. అయితే, విదేశాలలో ఛాయాగ్రాహకుని బాధ్యత దర్శకుని బాధ్యత కంటే ఎక్కువైనది. కావలసినదేమిటో దర్శకుడు చెబుతాడు; దాన్ని చిత్రీకరించడానికి ఏమేమి చెయ్యాలీ, ఎలా చెయ్యాలీ, షాట్స్ ను ఎలా విభజించాలీ అన్నదంతా ఛాయాగ్రహణ దర్శకుడే చూసుకుంటాడు. దర్శకుని మెదడులో నామమాత్రంగా వున్నదానికి ఛాయాగ్రాహకుడు ఈ విధంగా పూర్ణ రూపాన్ని కలిగించాలి. మన దేశంలో దర్శకుడే సృష్టికర్త, నిర్దేశకుడు. అంతిమ నిర్ణయం ఎప్పుడూ దర్శకునిదే. అందువల్ల దర్శకుని సలహాలతోనూ, తోడ్పాటుతోనూ మన ఛాయాగ్రాహకుడు పనిచేస్తాడు."

"ఒక చిత్రంలో కెమెరా కోణాలు అడ్డదిడ్డంగానూ, అటూ ఇటూ గానూ వుండవచ్చు. అలాంటి 'ఆడ్ యాంగిల్స్'ను చిత్రమంతా వాడినంత మాత్రాన అది గొప్ప ఫోటోగ్రఫీ కాజాలదు. చిత్రాన్ని బట్టి, దృశ్యాన్నిబట్టి కోణాలను ఏర్పాటు చేస్కోవాలి గాని, ప్రతిదానికీ అలాంటి కోణాలు అనవసరం.

సాధ్యమైనంత వరకూ స్ట్రెయిట్ గా పోవడమే ఉత్తమమైన పద్ధతి అని నా ఉద్దేశం చిత్రంలో ఉండే శబ్దం, బొమ్మ రెండూ బాగుండాలి. నిజానికి ఈ రెండు కళలూ ఒకదాన్నొకటి పెనవేసుకునే వుంటాయి. రెంటికీ చాలా దగ్గర సంబంధం వుంది. రెండింట్లో ఏ టెక్నిక్ చెడినా రెండోది కూడా చెడుతుంది."

"వర్ణ చిత్రాన్ని చిత్రీకరించడానికీ మామూలు తెలుపు, నలుపు చిత్రాన్ని చిత్రీకరించడానికీ తేడా వుంది. వర్ణ చిత్రీకరణ కష్టమైనది. తెలుపు నలుపు చిత్రాల్లో వున్నవి రెండే రంగులు. వర్ణ చిత్రం అంటే అనేకమైన రంగులు. అంచేత, ఆ చిత్రాలకు ఎక్కువ లైట్స్ అవసరమవుతాయి; ఎక్కువ ధ్యేయం అవసరమవుతుంది. అక్కడ వున్న దాన్ని వున్నట్టు తియ్యాలి. నటీనటుల ముఖాలు, దుస్తులు, సెట్టు__ ఇలా అన్నీ వేటి వేటి రంగుల్లో అవి వుంటాయి. ఆ రంగులన్నీ ఏ రంగుకు ఆ రంగు చక్కగా తెలియాలి. ఛాయాగ్రాహకుడి పనితనం రంగుల చిత్రాల్లో కనిపించడానికి ఎక్కువ అవకాశం వుంది." అని చెప్పారు సెల్వరాజ్.

చండీరాణి, విప్రనారాయణ, వెలుగు నీడలు, ఇద్దరు మిత్రులు, ప్రాణ మిత్రులు, పూలరంగడు మున్నగు యాభై చిత్రాల అనుభవం గల ఛాయాగ్రహణ దర్శకుడు సెల్వరాజ్ గారి స్వస్థలం పాండిచేరి. చిన్నతనం నుంచీ మద్రాసులోనే వుండి, ఇక్కడే స్థిరపడ్డారు. చదువుకుంటున్న రోజుల్లోనే ఆయనకు ఫోటోగ్రఫీ మీద ఉత్సాహం కలిగింది. ఆ ఉత్సాహంతో ఫోటో స్టూడియోల్లో వున్న ఫోటోల దగ్గర్నుంచి, విదేశీయ ఫోటో మాగజైన్లలోని ఫోటోల వరకూ పరిశీలించడం సాగించారు. చిన్న కెమెరా కొనుక్కుని కనిపించిన దృశ్యాలను బొమ్మగా తీసి చూసుకునేవారు.

ఎక్కడో క్వార్టర్ ప్లేటు (అప్పటికి ఇంకా ఫిల్ము రాలేదు) దొరుకుతుందని తెలిస్తే అక్కడికి పరుగెత్తి, అది కొని, బొమ్మతీసి 'డెవలప్' చేసి ఫలితం చూసుకుంటేనే గాని ఆయన నిద్రపోయేవారు కాదు అప్పుడు సెల్వరాజ్ రెండోఫారం విద్యార్థి!

ఇలస్ట్రేటెడ్ వీక్లీ నడిపే ఛాయాచిత్రాల పోటీలో సెల్వరాజ్ పాల్గొని చిన్న వయసులోనే బహుమతులు అందుకున్నారు. "ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆ విధంగా నన్ను చాలా ప్రోత్సహించింది" అని చెప్పారు సెల్వరాజ్.

చదువూ, చదువుతోపాటు ఫోటోగ్రఫీ హాబీ.. శ్రద్ధగా సాగాయి. స్కూల్ ఫైనల్ వరకూ చదువుకుని, చదువుకు స్వస్తి చెప్పారు. అప్పుడాయన ఉత్సాహం ఫోటోగ్రఫీ నుంచి సినిమాటోగ్రఫీకి మారింది. చలన చిత్రాలను చూడడం, వెలుగు నీడల పరిశీలన, వివిధ కోణాల చిత్రీకరణ, మున్నగు అంశాల మీద ఎక్కువగా శ్రద్ధ వహించడం సాగించారు.

ప్రసిద్ధ ఛాయాగ్రహణ దర్శకుడు జితెన్ బెనర్జీ న్యూటోన్ స్టూడియోలో వుంటున్నారు. ఆయనను కలుసుకుని తన కోరికను వ్యక్తం చెయ్యాలనిపించింది సెల్వరాజ్ కు. ఆ కోరికతోనే ఆయన, తాను తీసిన ఫోటోలనూ, అనేకపోటీలలో తనకు బహుమానాలు తెచ్చిన ఫోటోలనూ తీసుకుని ఓ మంచి ఉదయాన న్యూటోన్ స్టూడియో చేరుకున్నారు.

జితెన్ బెనర్జీని చూసి, తన ఫోటోలను చూసి, తన వాంఛను వ్యక్తం చేశారు. ఆ ఫోటోలను జితెన్ జాగ్రత్తగా పరిశీలించారు. ఇంకా జాగ్రత్తగా చూశారు. అలా చూడడంలో ఆయనకు చాలా టైమ్ పట్టింది _ దాంతో సెల్వరాజ్ కంటి ముందు చిన్న ఆశాకిరణం కనిపించింది.

"అయితే అబ్బాయ్ ! నువ్వు కెమేరా శాఖలో పనిచేస్తానంటావు" అన్నారు జితెన్.

" అవునండీ "

" నీ బొమ్మలు బాగున్నాయ్. నీ ఉత్సాహం బాగుంది. ఐవిష్ యు ఆల్ సక్సెస్" అని, ఆయన సెల్వరాజ్ ను స్టూడియో కెమేరా శాఖలోకి తీసుకున్నారు. తన ఉత్సాహాన్నీ, జితెన్ బెనర్జీ ఆశీర్వాదాన్నీ వెంటబెట్టుకుని సెల్వరాజ్ న్యూటోన్ స్టూడియోలో 'అప్రంటీస్' గా చేరారు. ఇది 1938 లో అప్పటికి సెల్వరాజ్ వయస్సు ఇరవై ఒక్క సంవత్సరాలు !

అప్రంటీస్ గా చేరిన కొద్దికాలానికె ఆయన అసిస్టెంటు అయ్యాడు; తర్వాత ఆపరేటివ్ కెమేరామాన్ అయ్యాడు; తర్వాత ఆపరేటివ్ కెమేరామాన్ అయ్యాడు. ఆ మధ్యకాలంలో సెల్వరాజ్ ఛాయగ్రహణం విద్యలోని అనేక విషయాలను తెలుసుకున్నాడు రాత్రింబవళ్ళు కృషిచేసి మంచిచెడ్డలన్నీ తెలుసుకున్నాడు. ఆరోగ్యంకన్న, భోజనంకన్న, డబ్బుకన్నా కూడా ఆయనకు 'సినీకెమేరా' ప్రియమై పోయింది. దేన్నీ లక్ష్య పెట్టకుండా ఆయన సాధించిన సాధనే ఇవాళ ఆయన్ని ప్రఖ్యాత ఛాయాగ్రహణ దర్శకునిగా పరిశ్రమలో నిలబెట్టింది.

ఆ రోజుల్లో ఎక్కువగా చిత్రాలన్నీ న్యూటోన్ లోనే తయారయేవి. వాహినీవారి చిత్రాలు అక్కడ నిర్మించబడడంతో సెల్వరాజ్ కు బి.యన్.రెడ్డి, కె.వి.రెడ్డి, నాగయ్య, సి.పుల్లయ్య , కీ.శే.రామ్ నాథ్, రామబ్రహ్మం మున్నగు వారెందరితోనే పరిచయం కలిగింది. వారి పరిచయంతో సెల్వరాజ్ కృషికి మరింత దోహదమూ కలిగింది. రామ్ నాథ్ దగ్గర సహాయకుడిగా పనిచేసి, ఆయన ఎన్నో విషయాలు నేర్చుకున్నారు.

సెల్వరాజ్ గారు మొదటిసారిగా ఛాయాగ్రహణ దర్శకత్వం వహించిన చిత్రం "గృహప్రవేశం". దర్శకుడు ప్రసాద్ గారికి కూడా అదే మొదటి చిత్రం. అలా సెల్వరాజ్ గారు, ఛాయాగ్రహణ దర్శకుడైనారు. తర్వాత కొన్ని తెలుగు, తమిళ చిత్రాలకు ఛాయాగ్రహణ దర్శకునిగా పనిచేసి, భరణి సంస్థలో జేరారు. మూడు భాషలలోని చండీరాణి, చక్రపాణి, విప్రనారాయణ మున్నగు చిత్రాలకు పని చేశారు.

సెల్వరాజ్ గారికి 1948లోనే ఉత్తమ ఛాయాగ్రహణ దర్శకునిగా పేరొచ్చింది. ఆ చిత్రం తమిళంలో నిర్మింపబడిన సిటాడల్ వారి 'జ్ఞాన సౌందరి', అలాగే, ఎల్లిస్ ఆర్ డంకన్ డైరెక్టు చేసిన 'మీరా' (యమ్,యస్,సుబ్బలక్ష్మి నటించిన తమిళ చిత్రం) కూడా సెల్వరాజ్ గారి ప్రతిభకు నిదర్శనంగా నిలబడింది. 'మీరా' చిత్రాన్నే డంకన్ హిందీలో కూడా నిర్మించారు. సెల్వరాజ్ గారు ఆ చిత్రానికి కూడా పనిచేశారు. తర్వాత కొంతకాలంపాటు డంకన్ చిత్రాలకు పనిచేశారు. అమెరికా దేశస్తుడైన ఎల్లిస్ ఆర్ డంకన్ సహజంగా ఛాయాగ్రాహకుడు. అందువల్ల ఛాయాగ్రహణంలోని అనేక విషయాలు ఆయన దగ్గర సెల్వరాజ్ చాలా నేర్చుకున్నారు. 'మీరా' హిందీ చిత్రానికి బొంబాయి వెళ్ళడంతో, అక్కడ చాలా కొత్త విధానాలు తెలిశాయి. అలాంటి మంచి అనుభవాలు ఆయనకు ఎన్నో కలిగాయి.

"జితెన్ బెనర్జీ నాకు ఎన్ని విషయాలో నేర్పారు; నన్ను బిడ్డలా చూసుకున్నారు. న్యూటోన్ స్టూడియోను విడిచిపెట్టి, భరణి సంస్థలో జేరే సమయంలో నేను ఆయనదగ్గర సెలవు తీసుకున్నాను. నన్ను ఆయన గట్టిగా కౌగిలించుకుని, బొటబొట కన్నీరు కార్చారు; నాకూ ఎంతో ఏడుపు వచ్చింది. నా జీవితంలో నేను ఎన్నడూ మరిచిపోలేని సంఘటన అది." అన్నారు సెల్వరాజ్.

భరణి తర్వాత, అన్నపూర్ణావారు సెల్వరాజ్ ను ఆహ్వానించారు.

"నాగేశ్వరరావు గారూ, మధుసూదనరావు గారూ నాకు సన్నిహితులు. వారు చక్కని చిత్రాలను నిర్మించాలనే లక్ష్యంతో వున్నారు. నా ఉద్దేశ్యం కూడా అదే. ఎక్కువ చిత్రాల్లో పని చెయ్యాలని, ఎక్కువ ధనం సంపాయించాలనీ నా అభిమతం కాదు. అలస్యమైనాసరే, ఒక్కటే అయినా మంచి చిత్రానికి పని చేశామనే తృప్తి నాకు మిగలాలి. అందుకనే నేను అన్నపూర్ణా సంస్థలో జేరి, వారి 'తోడికోడళ్ళు' చిత్రంనుంచి, నిన్నటి 'పూలరంగడు' దాకా పని చేశాను; ఇంకా పని చేస్తాను. ఆ సంస్థతోనూ, వారితోనూ నాకు పన్నెండేళ్ళ పరిచయం, అనుభవం వున్నాయి." అన్నారాయన.

సెల్వరాజ్ గారు పనిచేసిన 50 చిత్రాలలోనూ ఒక హిందీ చిత్రం, ఒక వర్ణచిత్రం (తేనె మనసులు) వున్నాయి. ఆయన తీసిన పునర్జన్మ చిత్రానికి మద్రాసు ఫిల్మ్ఫాన్సు అసోసియేషన్ వారి 'ఉత్తమ ఛాయాగ్రహణం' బహుమతి వచ్చింది.

సెల్వరాజ్ చిత్రీకరణలో పూర్తయిన బ్రహ్మచారి, మంచికుటుంబం చిత్రాలు త్వరలో విడుదల కానున్నాయి. ప్రస్తుతం ఆయన పద్మశ్రీ వారి 'వింతకాపురం' చిత్రానికి పనిచేస్తున్నారు.

"పూర్తి అవుట్ డోర్ చిత్రాలంటే నాకు మంచి సరదా. అలాంటి చిత్రానికి పనిచెయ్యాలని నాకెంతో ఆశ. అందుకనే 'సాక్షి' చిత్రానికి ఎంతో ఉత్సాహంతో పనిచేశాను. రాత్రింబవళ్ళు పనిచేశాము. అనేక క్లిష్ట పరిస్థితులు (వాతావరణంలో) ఎదురైనా, అనుకున్న వ్యవధిలో చిత్రాన్ని పూర్తి చెయ్యగలిగాము. మళ్ళీ ఏదైనా పూర్తి అవుట్ డోర్ చిత్రానికి పనిచెయ్యాలనే ఉత్సాహం నాకున్నది" అని చెప్పారు సెల్వరాజ్.

సెల్వరాజ్ గారికి తన వృత్తి మీద ఎంతో గౌరవం, అభిమానం వున్నాయి. పదిచిత్రాల్లో ఒకేసారి పనిచెయ్యడం ఆయనకు గిట్టదు. రెండు చిత్రాలకంటె ఎక్కువ చిత్రాల్లో ఒకేసారి ఆయన ఎప్పుడూ పనిచెయ్యరు. దానివల్ల క్వాలిటీ దెబ్బతింటుందనీ, హడావిడి అయిపోతుందనీ ఆయన నమ్మకం. ఆ నమ్మకాన్ని ఆయన ఎంతో నమ్మకంతో పాటిస్తారు. ఆర్థర్ మిల్లర్, జోసెఫ్ రిటెన్ బర్గ్, జేమ్స్ వాంగ్ హో, జాల్ మి స్త్రీ, మున్నగు ఛాయాగ్రహణ దర్శకులంటే సెల్వరాజ్ కు అభిమానం.

సెల్వరాజ్ దగ్గర సహాయకులుగా పని చేసిన విఠల్ రావు, కుమార్, వెంకట్, సంపత్, ఆర్.ఎన్. పిళ్ళై మున్నగువారు ఇవాళ ఛాయాగ్రహణ దర్శకులుగా వున్నారు. "ఇంత మందిని ఆ హోదాలో చూడగలుగుతున్నందుకు నాకెంతో సంతోషంగా వుంటుంది" అంటారాయన.

సెల్వరాజ్ గారికి ముప్పై సంవత్సరాల కెమెరా అనుభవం వున్నదంటే, అది సామాన్యమైన విషయం కాదు. నిదానంగా, నిష్టగా, ధ్యేయంతో ఏ విద్యయినా నేర్చుకోవాలనీ, అలాగే తనూ ఛాయాగ్రహణాన్ని నేర్చుకున్నాననీ ఆయన చెబుతారు.

"ఇంకా నేర్చుకుంటూనే వున్నాను. ఆ నేర్చుకోవడానికి అంతులేదు. 'మీరెందుకు చిత్రాన్ని డైరక్టు చెయ్యరాదు?' అంటే దానికి సమాధానం వుంది. ఇంకా నేను నా విద్యలోనే పరిపూర్ణత సాధించలేదు. ఇందులోనే ఇంకా నేర్చుకుంటూ ఇంకో శాఖలో అడుగు పెట్టడం భావ్యమా ?" అని ప్రశ్నించారు సెల్వరాజ్ నిదానంగా చూస్తూ.

# దేవులపల్లి

## ( సినిమారంగం, 1969, ఫిబ్రవరి సంచిక నుంచి)




నలుగురు గుడ్డివాళ్ళు ఏనుగుని వర్ణించిన కథ అందరికీ తెలిసిందే. ఎవరి స్పర్శకు ఎలా తోస్తే, అలా వర్ణించారట ఆ నలుగురూ.

కృష్ణశాస్త్రి గారి పరిపూర్ణ 'వ్యక్తి' ఒక్క చూపులో ఇమడదు, చూసేవారి చూపుల అవధులను బట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా కనపడతారాయన. అందుకే 'నేనెరిగిన కృష్ణశాస్త్రి గారి' ని గురించి వ్రాస్తున్నాను.

నల్లటి ఒత్తయిన గిరిజాల జుట్టు, పొడుగాటి అతి పల్చని లాల్చీ, అసలైన తెలుగు వారి పంచెకట్టు, నోటిలో నిరంతరం కాలుతుండే చుట్ట, చుట్టూ పదిమంది పరివారం – ఆ రోజుల్లో భావకవుల స్వరూపానికి ఒరవడి చుట్టిన కృష్ణశాస్త్రిగారి మూర్తి. వేదిక మీద నిలబడి అటు పాత కవుల పద్యాల్లోని అందచందాలను, ఇటు నవ్యకవిత్వ రీతుల్లోని జీవాన్నీ ప్రతి పద సుందరంగా ఉపన్యసిస్తూంటే, కవిత్వమే రూపు దాల్చి పలుకుతున్నట్టుండేది. అందుకే ఆయన అటు పాతవారలకీ, ఇటు కొత్తవారికీ అత్యంతాప్తులయ్యారు. నవ్యకవిత్వానికి గౌరవాన్ని అర్జించిన ఘనత కృష్ణ శాస్త్రిగారిదే. కారణం వారి సర్వతోముఖమైన వ్యుత్పత్తి, అసాధారణమైన ప్రతిభ.

కృష్ణశాస్త్రి గారిది అతి ప్రాచీనమైన పండిత కుటుంబం. వారి పూర్వీకులు పిఠాపురం సంస్థానంలో అయిదు శతాబ్దాలుగా ఆస్థాన కవులు, విద్వాంసులు, నిత్యకవితా గోష్టుల మధ్య పుట్టి పెరిగిన వారికి పదవ ఏటనే పద్యరచనా కౌశలం అబ్బింది. సర్ రఘుపతి వెంకటరత్నం గారి వంటి ఆంగ్లపండితుల శిష్యరికం వల్ల ఆంగ్ల కవిత్వంతో అతి సన్నిహితమైన పరిచయం ఏర్పడింది. సునిశితమైన కవితా హృదయం గలవారు గనుక, 'పాత కొత్త'లను మేళవించి. ఆంగ్ల కవిత్వంలోని అందచందాలను, లోతుపాతులను, భావ పటిష్టతను తెలుగు నుడికారంతో పలికించగలిగారు. తెలుగులో నవ్య కవిత్వానికి సృష్టికర్తలయ్యారు. ఆ రోజుల్లో సాహితీ సభల్లో కూర్చోగలగడమే ఒక అదృష్టంగా భావించే వాళ్ళం మాబోటి యువకులం. కృష్ణశాస్త్రి గారి పద్య పఠనం, ప్రసంగం మాకు ముఖ్యమైన ఆకర్షణలు.



బహుశా ఆ రోజుల్లోనే – 1921 ప్రాంతాన్ని విశ్వభారతిలో బి.ఎన్. రెడ్డిగారితో కృష్ణశాస్త్రిగారికి పరిచయమవవలసింది కాస్తలో తప్పిపోయింది. సినిమారంగంలో తాను ప్రవేశిస్తానని అప్పటికి బి.ఎన్.కే తెలియదేమో. ఇద్దరి అభిరుచులు, సంస్కారం ఆ రోజుల్లోనే ఇద్దరినీ సన్నిహితుల్ని చేసి ఉండేవి. ఆ తరువాత సుమారు పదేళ్ళకి బి.ఎన్. "వందేమాతరం" చిత్రానికి దర్శకత్వం వహించడం, ఆ చిత్రం 'ప్రివ్యూ' డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారి ఆధ్వర్యాన జరగడం, ఆ సందర్భంలో శాస్త్రిగారు కూడా సదస్యులలో ఉండడం జరిగిందట. విశ్వభారతిలో ఏర్పడవలసిన పరిచయం అప్పుడు స్నేహబంధం అయింది. ఆ తరవాత అంత గాఢ మైత్రిగా పరిణమించింది. మరొక పన్నెండేళ్ళకి వారి మైత్రికీ, అభిరుచుల సాన్నిహిత్యానికీ ఫలితంగా ప్రతిరూపంగా 'మల్లీశ్వరి' రూపొందింది. సినిమా పాటలకి సాహిత్య గౌరవం కల్పించిన మొదటి చిత్రం 'మల్లీశ్వరి'. బి.ఎన్. "సుమంగళి, దేవత, స్వర్గసీమ" చిత్రాల్ని తీసిన రోజుల్లోనే కృష్ణశాస్త్రిగారిని పాటలు వ్రాయమని అడుగుతుండేవారు. ఆ తరవాత వాహినీ స్టూడియో నిర్మాణంలో పడ్డాక రెడ్డిగారు ఒక చిత్రానికి మాటలూ, పాటలూ వ్రాయడానికి కృష్ణశాస్త్రిగారిని నియమించారు. రెండేళ్ళ వరకూ చిత్రం ప్రారంభించకపోయినా, శాస్త్రిగారికి ప్రతినెల డబ్బు ఇస్తూనే వచ్చారు. అతి కష్టం మీద కృష్ణశాస్త్రిగారిని సినిమారంగంలోకి దింపారు. శాస్త్రిగారికి బి.ఎన్., ఎంత ఆప్తులో, వాహినీ సంస్థ కూడా అంత ఆప్తమైనదీ అయిపోయింది. బి.ఎన్. తర్వాత ఏ చిత్రం తీసినా, శాస్త్రి గారి పాటలు ఉండితీరాయి వాటిలో.

ఇద్దరు సన్నిహితులైన ప్రతిభావంతుల జీవితాలు కూడా సమాంతర రేఖలలో నడుస్తాయేమో ! బి.ఎన్.కీ. శాస్త్రిగారికీ పుత్రికా మరణం ఒకేరకమైన గొడ్డలి పెట్టు. బి.ఎన్. ఆ దెబ్బ తిన్నాక సిగరెట్లు మానేశారు; శాస్త్రి గారు చుట్టలు మానేశారు.

అతి విషాదకరమైన చిత్రం ఏమంటే, శాస్త్రిగారు చుట్టలు మానేసిన కొన్ని ఏళ్ళకి ఆయన గొంతులోని స్వరపేటిక కాన్సర్ వ్యాధికి గురి అయింది. 1964 ఏప్రిల్ లో బొంబాయిలోని ప్రముఖ సర్జన్ హీరానందానీ శస్త్ర చికిత్ర చేశారు. కృష్ణశాస్త్రి గారి గొంతు మూగవోయింది.

హీరానందానీ మాటలో, నవ్వులో, నడకలో అన్నిటిలోనూ ఆరోగ్యం ఉత్సాహం తాండవిస్తూంటాయి. ఆయన చేయి ఎంత సమర్ధంగా శాస్త్ర చికిత్స చేస్తుందో, ఆయన వ్యక్తి అంతకన్న సమర్ధంగా రోగి మనస్సులో ఆరోగ్యాన్ని నింపుతుంది. కృష్ణశాస్త్రి గారి మాట పోయింది కాని, ఆరోగ్యం మనస్సులోనూ, శరీరంలోనూ నిండింది, ఆయన ఆపరేషన్ అయిన తరవాత మంచం మీదుండి కోలుకుంటున్న రోజుల్లోనూ ప్రతిరోజూ కొన్ని వందల పంక్తులు వ్రాసేవారు. తనని గురించీ, హీరానందానీని గురించీ, లోకాన్ని గురించీ, అందులో ప్రతివాక్యంలోనూ చమత్కారమో కవిత్వమో ఉండి తీరింది. అంతక్రితం గాలికి పోయిన ఆయన వాక్యనిర్మాణ ప్రతిభ, తెలుగు నుడికారంమీద ఆయనకున్న అధికారం, తెలుగు పదాలలోని సంగీతం, ఆయన కవితా హృదయం – అన్నీ వ్రాత మూలకంగా నిలిచిపోయాయి. ఆయన గొంతు మూగదైపోవడం ఒక రకంగా తెలుగు వారికి వరంగానే పరిణమించిందని నేననుకుంటూ ఉంటాను.

మొదట్లో "కృష్ణపక్షం, ఊర్వశి, ప్రవాసం" వ్రాసిన కృష్ణశాస్త్రిగారికీ, 1960 తరవాత కృష్ణశాస్త్రి గారికీ కొంత భేదం ఉంది. కృష్ణ పక్షపు కృష్ణశాస్త్రిగారిలో భావక్లిష్టత, భాషా జటిలత్వం ప్రధానంగా ఉండేవి. సినిమాకి పాటలు వ్రాయడం వల్ల వచ్చిందో. లేక స్వతహాగ ఆయనే పెరిగారో చెప్పలేం. ఆయన హైదరాబాదు రేడియోలో స్పోకెన్ వర్డ్ ప్రొడ్యూసర్ గా ఉన్న రోజుల్లో వ్రాసిన రేడియో నాటికల్లో మరొక కృష్ణశాస్త్రిగారు దర్శనమిస్తారు. ఎంత క్లిష్టమైన భావాన్నయినా అతి తేలిక పదాల్లో చెప్పడం, మామూలు పదాలకి అర్ధగౌరవం, భావౌన్నత్యం కల్పించడం, వాటిని కావ్యభాషగా మలచడం ఆయన సాధించారు. అందుకే ఆయన ఏ సినిమాకి పాట వ్రాసినా, అది కొత్తగానూ, జనరంజకంగానూ ఉంటోంది.

కృష్ణశాస్త్రిగారంటే ఎక్కడో ఊహాలోకాల్లో విహరించే భావుకుడు, దివినించి 'దిగిరాని' ఆశాజీవి అనే అపోహ కవి లోకంలోనే కాక సంస్కారుల్లోనూ, సామాన్యుల్లోనూ కూడా ఉంది. చాలా మంది సంఘజీవి అయిన కృష్ణశాస్త్రిగారిని ఎరుగరు. కవులలో లోకాన్ని అంత సన్నిహితంగా ఎరుగున్నవారు అరుదు. ఆయనకు మనుషులంటే మహా ఇష్టం. భావుక శిఖరాలనందుకున్న మేధావి మొదలు జీవంతో పొంగి పొరలే పల్లె పడుచు వరకు

అందరూ ఆయనకు ఆప్తులు, సన్నిహితులు. అందుకే ఆయన రచనలలో అంత రంగు–రుచి ఉంటాయి. మేఘదూతలలోని అందచందాలను 'మేఘమాల' (మల్లీశ్వరిలోనిది) పాటలో నిక్షిప్తం చేసిన ఆ మహాకవే 'రాజీ నా ప్రాణం' లో పల్లెవాళ్ళ గీతాన్ని ఎంత హృద్యంగా వ్రాయగలిగారో ఆలోచించుకుంటే, ఆయన ప్రతిభలో ఎంత వైవిధ్యముందో అర్ధమౌతుంది.

మొట్టమొదట్లో ప్రజానీకంలో ఒక ప్రముఖుణ్ణి గురించి ఏర్పడ్డ అభిప్రాయం అంత తొందరగా మారదు. అయితే 'కృష్ణపక్ష'పు రోజుల్లోనే– అప్పుడాయన బ్రహ్మసమాజ సభ్యులు– కొన్ని వందల ప్రార్ధన గీతాలు వ్రాశారు. అంత తేలిక పదాలలో, అంత గాఢమైన భక్తి భావాన్ని పొందుపరచిన కవి తెలుగు సాహిత్య చరిత్రలోనే లేదని చెప్పాలి. 'నా నోట నీమాట గానమయ్యే వేళా' వంటి ప్రార్ధన గీతాలు తెలుగు సాహిత్యంలోనే మణిపూసలు.

ఆయన్ని గురించి కొన్ని అభిప్రాయాలు (అందులో కొన్ని నిజమైనవి, కొన్ని అపోహలు) తెలుగునాట పాతుకుపోయాయి. ఆయన బద్ధకస్తుడనీ, ఆయన చేత ఏ పనైనా చేయించుకోడం కష్టమనీ, ఆయన సామాన్యులకు అందుబాటులో లేని లోకంలో ఎప్పుడూ విహరిస్తూంటాడనీ మొదలైనవి. లౌకిక వ్యవహారాల విషయంలో ఆయన నిజంగా బద్ధకస్తులే. అయితే, కాలం యొక్క విలువ తెలియనివారు కారు. సినిమా నిర్మాతల్లో చాలా మంది ఆయన్ని పాటలు వ్రాయమని పిలవడానికి భయపడతారు. కారణాలు అనేకం. ఆయన తమకు అందుబాటులో ఉండరనీ – అంటే, డబ్బు ఎక్కువ అడుగుతారనీ, సకాలంలో పాటలు పూర్తి చెయ్యరనీ, లలితమైన భావగీతాలు తప్ప – నేటి సినిమాకి అవసరమైన సరదా గీతాలు వ్రాయరనీ. మొదలైనవి.

ఆయనకి డబ్బు విలువ తెలియకపోలేదు. అయితే, మంచిపాట వ్రాశానన్న సంతృప్తి డబ్బుకన్నా ఆయనకి విలువైనది. మరొక సంగతి; ఆయన్ని పాటకి కూర్చోబెడితే ఒక్కొక్కప్పుడు పాట పూర్తికావడానికి మూడు నాలుగు రోజులు పట్టొచ్చు. కారణం బద్ధకం మాత్రం కాదని నాకు తెలుసు. సంగీతదర్శకుడు నిర్ణయించిన 'ట్యూను' లో అర్ధభావాలు సరిపోయేలాగ ఆ ట్యూన్ లోంచి మొలుచుకొచ్చే తెలుగు పదం ఏదో ఒకటి ఉండి తీరుతుందని ఆయన నమ్మకం. ఆ పదం కోసం ఆయన గంటలు గంటలు అన్వేషిస్తారు. పాదపూరణం ఏదో ఒక విధంగా చేసి పారేసి, పాట పూర్తిచేసి (ఆయన పరిభాషలో 'కిట్టించి') వెళ్ళిపోవడం ఆయన స్వభావానికే విరుద్ధం. పాట బాగా రాకపోతే తను వ్రాయడమే అనవసరమని ఆయన విశ్వాసం. ఈ విధంగా ఆలస్యమౌతున్నప్పుడు నిర్మాతలకు చిరాకు కలగడం సహజం. అంత సన్నిహితుడైన బి.ఎన్.గారే "మల్లీశ్వరి" రోజుల్లో–ఒక పాట ఎన్నాళ్ళకీ రాకపోతే – ఆఖరికి, జయదేవుని 'ధీరసమీరే' రికార్డు చేసుకోడానికి నిర్ణయించడం, ఆ తర్వాత శాస్త్రిగారు 'మనసున మల్లెల మాలలూగెనే' వ్రాసి తెస్తే, పరమానందపడి ఎంత ఆలస్యమైనా గొప్పపాట తయారైందని సంతోష పడడం నేనెరుగుదును. ప్రతి పదానికీ అర్ధభావాలతో పాటు సంగీత పరమైన విరుపు, రాగఛ్ఛాయ ఉంటాయని శాస్త్రి గారి వాదం. ఒక ట్యూన్ లో ఒకేపదం ఇముడుతుంది. అది దొరికే వరకూ శాస్త్రిగారి పాట పూర్తికాదు. పూర్తయిన తర్వాత మాత్రం సంగీతం, మాట, అర్ధభావాలు అన్నీ ఒకదానిలో ఒకటి మేళవించి; చెవికీ హృదయానికీ విందుచేసే పాట తయారౌతుంది.

శాస్త్రిగారు సినిమాలకు, బ్రహ్మ సమాజానికి, తనకోసం, రేడియో నాటకాలకూ వెయ్యి పైగా పాటలు వ్రాశారు. ప్రతీపాటా ఒక మచ్చుతునక.

అసలు పాటల కోసం పుట్టారు కృష్ణశాస్త్రి గారు.

కృష్ణశాస్త్రి గారి జననం : 1-11-1897. స్వస్థలం:పిఠాపురం. విద్యాభ్యాసం : కాకినాడలో ఇంటర్మీడియేట్. 1918లో విజయనగరంలో బి.ఎ. వీరి ఏకైక పుత్రుడు 'బుజ్జాయి' ప్రముఖ చిత్రకారుడు.

సినిమా రచనలు

మల్లీశ్వరి (అన్ని గీతాలు, సంభాషణలు కూడా), నా ఇల్లు (గీతాలు, సంభాషణలు కూడా), ఆకలి (అన్ని పాటలూ) తండి (అన్ని పాటలూ), వద్దంటే డబ్బు (కొన్ని పాటలు), రాజీ నా ప్రాణం (గీతాలు, సంభాషణలు కూడా), రాజగురువు (గీతాలు, సంభాషణలు), అప్పయ్యార్ (తమిళ చిత్రానికి తెలుగు వ్యాఖ్యానం, గీతాలూ, పద్యాలు), బంగారు పాప (అన్ని పాటలూ), రక్తకన్నీరు (అన్ని పాటలూ), భాగ్యరేఖా (అన్ని పాటలూ), కార్తవరాయుని కథ(పాటలు), రాజమకుటం(రెండు పాటలు), పూజాఫలం (కొన్ని పాటలు), కన్యాశుల్కం (ఒక పాట), భక్తశబరి(కొన్ని పాటలు), ఉండమ్మా బొట్టుపెడతా (అన్ని పాటలూ)

★ ★ ★

"కార్తవరాయుని కథ" చిత్రం తర్వాత హైదరాబాద్ కు నివాసం మార్చడంతో ఒక్కో చిత్రానికి రెండు మూడు పాటల చొప్పున చాలా తక్కువ చిత్రాలకు రాశారు. అవి డాక్టర్ ఆనంద్, అమాయకుడు, సుఖదుఃఖాలు, కలసిన మనసులు.

★ ★ ★

"బంగారు పంజరం" చిత్రంతో మళ్ళీ మద్రాసుకు మకాం మార్చారు. దాంతో ఆ చిత్రానికి రెండు హాస్యపాటలు తప్ప మిగతావన్నీ రాశారు.

ప్రస్తుతం పాటలు వ్రాస్తున్న చిత్రాలు.

"ఏకవీర" (కొన్ని పాటలు), విజయభట్ వారి చిత్రం(మూడు), ఫల్గుణా పిక్చర్స్ వారి చిత్రం (రెండు) అనురాధా మూవీస వారి చిత్రం (ఒకటి), మనీషా (హైదరాబాద్) ప్రొడక్షన్స్ వారి చిత్రం(రెండు), వస్తాడే మా బావ (కొన్ని పాటలు)

★ ★ ★

హిట్స్ అయిన గీతాలు

మల్లీశ్వరి (అన్ని పాటలూ), నా ఇల్లు(అదిగదిగో గగన సీమ, రావమ్మా...), రాజీ నా ప్రాణం (మల్లెపూలో), బంగారు పాప (తాధిమి తకధిమి తోల్ బొమ్మ), భాగ్యరేఖా (నీ వుండేదా కొండపై). రాజమకుటం(సడి సేయకే గాలి సడిసేయబోకే), పూజా ఫలం (సుందర సురనందన వనమల్లీ జాబిల్లీ), భక్తశబరి(ఏమి రామ కథ శబరీ శబరీ, నిను చూచునందాక కన్నుల వెలుగుండేనా), డాక్టర్ ఆనంద్ (నీల మోహనా రారా), అమాయకుడు (మనిషయితే-మనసుంటే కనులు కరగాలిరా), సుఖదుఃఖాలు(ఇది మల్లెల వేళయనీ, మేడంటే మేడా కాదు, గూడంటే గూడూ కాదు), ఉండమ్మా బొట్టు పెడాతా (రావమ్మా మహలక్ష్మి, అడుగడుగున గుడి ఉంది, శ్రీశైలం మల్లన్న.)

# సి.నారాయణ రెడ్డి

## ( విజయచిత్ర, 1969, మార్చి సంచిక నుంచీ)



"సినిమా పాటలలో అశ్లీలం, పచ్చి శృంగారం వున్నదని విమర్శిస్తే, దానికి బాధ్యులు కేవలం పాటల రచయితలే కారు. పాటరాసే రచయిత, ఆ పాట పాడే పాత్రను దృష్టిలో పెట్టుకుని, పాట రాస్తాడు, రాయాలి. పాత్రల స్థాయిని బట్టి పాటల రచన కూడా ఉంటుంది, క్లబ్బుల్లో డాన్స్ చేసే నర్తకి పాడే పాట రచన ధోరణి వేరుగా ఉంటుంది. పాట రచనలో 'సంస్కారం లేదు' అనుకునే ముందే, ఆ పాత్ర ఎలాంటిదన్నది కూడా మనం ఆలోచించుకుంటే ఆది అర్థం కాగలదు. నైట్ క్లబ్బులో నృత్యం చేసే నర్తకి శాస్త్రీయమైన గీతాలు ఎలా పాడగలదు ? అయితే సినిమా పాటల రచనలో 'దిగజారుదు' ఎక్కువగా కనిపిస్తున్నదని రచయితలను విమర్శిస్తే మాత్రం నేను ఒప్పుకోలేను__ పాత్ర స్థాయిని బట్టి రచయిత పాటను రాయాలిగాబట్టి. అయితే, ఒక్కొక్కప్పుడు రచయిత

మామూలుగా రాసే మాట చిత్రీకరణకు వచ్చేసరికి, అసభ్యత స్ఫురించేలా కనిపించవచ్చును. దానికి రచయితను అంటే ఏలా ?...

ఉదాహరణకు 'ఏదో ఏదో అవుతున్నది' అన్నది మామూలు తెలుగు నుడికారం. 'నాకు ఏదోలా వుంది: అదోలా ఉంది; గుండెలో ఏదో అవుతున్నది' అని మనం సామాన్యంగా వాడుతూ వుంటాం. అదే నుడికారాన్ని పాటలో పెట్టి మేము రాస్తే రాసేటప్పుడు ఏ విధమైన అసభ్యత, అశ్లీలం అందులో స్ఫురించవు. చిత్రీకరించడంలో 'అసభ్యత' గనక కనిపిస్తే ఆ తప్పును పాటల రచయితల మీదకు నెట్టడం భావ్యం కాదని నా ఉద్దేశం. 'నన్నుచూడు' అని పాటలో వున్నదనుకుందాం. దానికి ముఖాన్ని చూపించినంతవరకూ, బాగానే వుంటుంది; 'నన్ను చూడు' అని వక్షభాగాన్ని ప్రముఖంగా చూపిస్తే దానికి పాటల రచయిత ఎలా బాధ్యుడు కాగలడు?" అని ప్రశ్నించారు ప్రఖ్యాత పాటల రచయిత డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి.

సింగిరెడ్డి నారాయణరెడ్డి అయితే, 'సి' ఏమిటి 'ఎస్' అని వుండొద్దా అనే అనుమానం కలుగుతుంది. నారాయణరెడ్డి స్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో ఎందుకనో 'రిజిస్టర్'లో 'సి' అని పడింది. 'సరేలే, తెలుగుకు కూడా పనికి వస్తుందని ఆయన అప్పుడు సరిపెట్టుకున్నాడు. నాటినుంచీ, 'సి' అక్షరమే అమల్లో వున్నది. కరీంనగర్ జిల్లాలోని హనుమాజి పేట ఆయన స్వగ్రామం; కుటుంబం రైతు కుటుంబం. 1931 వ సంవత్సరంలో ఆషాఢ పౌర్ణమి నాడు నారాయణ రెడ్డి ఉదయించాడు. చంద్రుడు మనసుకు సంబంధించిన దైవం. అందువల్ల పౌర్ణమినాడు పుట్టిన వాళ్ళు కవులు కావడానికి అవకాశం వున్నదని పెద్దలు చెబుతారు. (ఇవాళ ఆయన విరివిగా 'వెన్నెల పాటలు' రాయడానికి కూడా ఆ వెన్నెల రోజే కారణం కావచ్చును) తండ్రిగారు పుస్తకాలు రాసేంతవరకూ ఏ చదువూ చదువుకో లేదు; ఉత్తరాలు రాసేంత వరకూ మాత్రమే చదువుకున్నారు. వాళ్ళ వంశ వృక్షంలో కూడా ఎక్కడా కవులు కనిపించరు. కాని నారాయణ రెడ్డికి మాత్రం కవిత్వం మీద ఉత్సాహం కలిగింది. అసలు, అతనికి సంగీతం అంటే మొదట్నించీ అభిమానం. ఉషారుగా ఈలవేస్తూ ఏదో గాలి పాట పాడుతూ వచ్చేవాడు చిన్నతనంలో. సంగీతం మీద ఉన్న ఉత్సాహంతో అతను హరికథలు వినేవాడు. వేములవాడనుంచి, హరికథకులు వాళ్ళ వూరొచ్చి, పాటలు పాడేవారు. ఆ పాటలు వినడంతో నారాయణరెడ్డికి, సాహిత్యం మీద కూడా అభిలాష కలిగింది.

చిన్నతనంలో సాహిత్యం మీద అభిలాష ఎలా కలిగిందో చెప్పడం కష్టంగాని, అతను అవీ ఇవీ చదివి, కవిత్వం రాయాలనుకున్న ఉత్సాహంలో కూర్చుని, పద్నాలుగవ ఏట "ఒక నాడు ఒక నక్క ఒక అడవిలో చేరి, పొట్ట కోసరమెటో పోవుచుండె" అని ప్రారంభించాడు. అలా అలా, అదీ అదీ రాస్తూ తమ బడిలోని తెలుగు పండితులయిన వెంకటరమణాచార్యులు గారికి చూపించాడు. ఆ అబ్బాయిలోని ఉత్సాహం ఆయన్ని ఆకర్షించింది. ఎలా రాయాలి? రాసిన మాటల్లో తప్పులేమిటి ? ఎలా వుండాలి ? అని వెంకట రమణాచార్యులు గారు నారాయణరెడ్డికి చెప్పేవారు. ఆ విధంగా అతను కవిత్వంలో కృషి చెయ్యడం ఆరంభించాడు. వ్యాకరణం తెలియదు. అయినా సంస్కారంతోనూ సంపర్కంతోనూ అతనికి కవిత్వధోరణి అబ్బింది.

చిత్రం ఏమిటంటే, మెట్రిక్ అయ్యేదాకా కూడా అతనికి ఆధునిక కవిత్వంతో పరిచయం కలగలేదు. ఇంటర్మీడియెట్ చదువుకని నారాయణరెడ్డి హైదరాబాద్ వచ్చాడు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో సభ్యుడిగా చేరి, ప్రాచీనాంధ్ర కావ్యాలూ, వర్తమాన రచయితల పుస్తకాలూ చదవడం సాగించాడు. అప్పుడే అతనికి ఆధునిక కవితాధోరణి తెలిసింది; ఆధునిక కవుల పేర్లూ తెలిశాయి.

హైస్కూలు చదువు పూర్తవుతున్న రోజుల్లోనే ఛందోరహస్యాలూ, వ్యాకరణ విశేషాలూ పెద్దల దగ్గర తెలుసుకుని _ కొన్ని నాటకాలు రాశాడు _ సీతాపహరణం, జాతీయోద్యమం మొదలైనవి. ఆ నాటకాల్లో పద్యాలూ, పాటలూ, వచనమూ వుండేవి. విద్యార్థులందరూ ఆ నాటకాలు ఆడారు. "మారాలి మారాలి మారాలిరా, కరడుగట్టిన నేటి కరకు సంఘపు రూపు మారాలిరా" అంటూ ఆ రోజుల్లోనే అతను అద్భుతమైన పాటలు రాశాడు.

ఇంటర్మీడియెట్ చదువుకుంటున్న రోజుల్లో ఓసారి కవి సమ్మేళనం జరిగింది. ఆ సమ్మేళనంలో అతను చాలామంది కవులను చూశాడు. కృష్ణశాస్త్రి, కరుణశ్రీ, జాషువా, శ్రీశ్రీ మొదలైన కవులందరూ తెలిసారు. విశేషం ఏమిటంటే నారాయణరెడ్డి కూడా విద్యార్థి కవిగా ఆ సమ్మేళనంలో పాల్గొని ఒక గేయం చదివాడు. అది పూర్తికాగానే పెద్దలందరూ చప్పట్లు కొట్టడం అతనికి బాగా జ్ఞాపకం వున్న విషయం.

సంగీత జ్ఞానం కూడా నారాయణరెడ్డికి బాగా వుండడం వల్ల అతను ఏ పదమైనా, పాటైనా పాడుతూవుంటే, అతి మధురంగా హాయిగా వుంటుంది. ఆయన కంఠ మాధుర్యాన్ని విన్న వాళ్ళకు ఆ విషయం బాగా తెలుసు.

కవిగా అప్పటికే మంచి ఖ్యాతిలో వున్న దాశరథితో, నారాయణరెడ్డికి పరిచయం ఏర్పడింది. దాశరథి, అతన్ని అభినందించారు. నాటినుంచి, ఇద్దరికీ ఒక విధమైన భ్రాతృసంబంధం ఏర్పడింది. 'తెలంగాణా రచయితల సంఘం' అన్న పేరిట ఇద్దరూ కలిసి ఒక సంస్థను స్థాపించారు. దాశరధి దానికి

అధ్యక్షుడు; నారాయణ రెడ్డి కార్యదర్శి. ఇద్దరూ, తెలంగాణా జిల్లాలలో తిరుగుతూ, సాహితీ స్రవంతులను ప్రవహింప జేసేవారు. సాంస్కృతిక సభల్లో, సాహిత్య సమావేశాల్లో, కవిసమ్మేళనాల్లో తరచు పాల్గొనేవారు. భారతి, ఆంధ్రపత్రిక, తెలుగు స్వతంత్ర మొదలైన పత్రికలు నారాయణరెడ్డి కవితను అచ్చు వేయడం సాగించాయి. అప్పుడే నారాయణరెడ్డి పేరు, కవిత్వం పదిమందికీ బాగా తెలిశాయి.

యమ్.ఎ. పూర్తి చేసే లోపల 'కవి'గా నారాయణరెడ్డికి మంచి ప్రఖ్యాతి ఏర్పడింది. ఆయన రాసిన పద్యాలూ, గీతాలూ, పుస్తకాలూ సాహితీ పరులందరికీ బాగా పరిచయమైనాయి.

ఆ తర్వాత ఆయన ఉస్మానియా విశ్వ విద్యాలయ కళాశాలలో తెలుగు లెక్చరర్ గా వుంటూ, పి.హెచ్.డి పూర్తి చేశారు. 'ఆధునిక ఆంధ్ర కవిత్వము, సంప్రదాయములు, ప్రయోగములు' అనే పరిశోధనకు ఆయనకు 1963లో 'డాక్టరేట్' లభించింది. తర్వాత 'రీడర్' అయినారు. ప్రస్తుతం ఆయన యమ్.ఎ. తరగతుల విద్యార్థులకు బోధన చేస్తున్నారు; డాక్టరేట్ పట్టాకోసం కృషి చేస్తున్న విద్యార్థులకు 'గైడ్' గా వుంటున్నారు.

నారాయణరెడ్డి గారి జీవితంలో స్వయంకృషే ఎక్కువగా కనిపిస్తుంది. రేడియోలో స్వీయ కవితాగానం చెయ్యడానికి, ఎక్కువగా పుస్తకాలు రాయడానికీ, కవిగా, వక్తగా ప్రఖ్యాతి గాంచడానికీ ఆ కృషే కారణమైంది.

ఆయన సినిమా రంగ ప్రవేశం అప్రయత్నంగానే జరిగింది. మొదట్లో కొంతమంది నిర్మాతలు ఆయనను సినిమాలకు పాటలు రాయవలసిందిగా అడుగుతూ వుండేవారు. అయితే అప్పట్లో ఆయన దానికి అంత ఉత్సాహం చూపలేదు. అయితే ఎవరైనా అడిగితే చిత్రంలో వున్న అన్ని పాటలూ తనచేతనే రాయించవలసిందని కోరదామనుకున్నారు. అలా రాయడంతో, అన్ని రసాల పాటలనూ రాయవచ్చును అన్న దృష్టి వున్నది.

ఒకసారి, ఒక మిత్రునితో నారాయణరెడ్డి గారు సారధి స్టూడియోకు వెళ్ళారు. అప్పుడు 'కలసివుంటే కలదు సుఖం' షూటింగ్ జరుగుతున్నది. యన్.టి.రామారావు గారు మేకప్ తో కనిపించారు. అంతకు ముందు ఒకసారి రామారావుగారూ, నారాయణరెడ్డిగారూ మద్రాసులోని ఒక సెట్లో కలుసుకున్నారు. ఆ కాస్త పరిచయంతో ఇద్దరూ కాస్సేపు మాట్లాడుకున్నారు. "మీ విశ్వనాధనాయుడు పుస్తకం చదివాను. చాలా బావుంది" అని రామారావు అభినందించారు; నారాయణరెడ్డి సంతోషించారు.

"అయితే మీరెందుకు సినిమాలకు పాటలు రాయకూడదు ? మీ బోటివారి అవసరం వున్నది గదా" అన్నారు రామారావు.

"సమయం, స్థాయి వుంటే తప్పక రాస్తాను. నా కవిత్వంలోని వైవిధ్యాన్ని ప్రదర్శించగలిగే అవకాశం కూడా కలిగితే..." అన్నారు నారాయణరెడ్డి.

"అయితే మా రాబోయే చిత్రానికి మీరే అన్ని పాటలూ రాయాలి" అన్నారు వెంటనే రామారావు.

అలా జరిగింది నారాయణరెడ్డిగారి సినిమా రంగ ప్రవేశం. యన్.ఎ.టి. వారి 'గులేబకావళి' చిత్రంలో మొదటిసారిగా ఆయన పాటలు రాశారు. "మొదట్లో సినిమా పాట రాయడానికి కొంత శ్రమ అనిపించినా. ఆ చిత్ర సంగీత దర్శకులు రాజుగారు, నిర్మాత త్రివిక్రమరావు గారూ నాకు పద్ధతి చెప్పి, గైడ్ చేశారు" అని చెప్పారు నారాయణ రెడ్డి. ఆ చిత్రంలో ఆయన అన్ని రసాల, రకాల పాటలూ రాయడంతో మంచి అనుభవం కలిగింది. జనరంజకంగా ఎలా రాయాలి; రసిక జనరంజకంగా ఎలా రాయాలి అన్న పద్ధతులు తెలిశాయి; కిటుకులు తెలిశాయి; కీలకాలు తెలిశాయి.

నారాయణ రెడ్డి సినిమాల్లోకి రాక పూర్వం ఎన్నో కావ్యాలు రాశారు; వచ్చిన తర్వాత కూడా రాస్తున్నారు. ఆయన రాసిన కొన్ని రచనలు; అజంతా సుందరి (నాటకం) కర్పూర వసంత రాయలు, విశ్వనాధనాయుడు, ఋతుచక్రము, సమదర్శనము, దివ్వెల మువ్వలు, వెన్నెలవాడ, అక్షరాల గవాక్షాలు. జాతిరత్నం : "మధ్య తరగతి మందహాసం" ప్రస్తుతం అచ్చులో వుంది.

నారాయణరెడ్డి రాసిన ఎన్ని సినిమా పాటలు హిట్ అయినాయి ? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేము. హిట్స్ అయిన పాటల్లో ఆయన పాటలు చాలా వున్నాయి.

"పాట ఎలా ప్రచారం పొందుతుంది ? అన్న విషయం కచ్చితంగా చెప్పలేం. అయితే థీమ్ సాంగ్ (చిత్రంలో రెండు మూడు సార్లు వచ్చే ఒక పాట) ప్రచారంలోకి రావడానికి అవకాశం వుంది. ఒక్కో సారి చాలా మంచి పాటరాశాము అనుకున్నా. ఆ పాటకు ప్రజాదరణ లభించని సందర్భాలూ వున్నాయి. నా వుద్దేశంలో, పాట ప్రజాదరణ పొందడానికి ముఖ్యంగా కావలసినది సన్నివేశం. కథతో అతుక్కుని వున్న పాటయితే, పాట రచన ఏమాత్రం బాగున్నా ప్రచారంలోక రాగలదు. నృత్యగీతాలు, యుగళ గీతాలూ అయితే బాణీ బలం కావాలి. ఒక్కోసారి ఎలాంటి పాటయినా సరే ప్రచారంలోకి వస్తుంది

ఆ పాట. లౌడ్ స్పీకర్ లలోనూ, రేడియో లోనూ తరచు వినిపిస్తూ వుంటే చాలు; ఒక్కోసారి చిత్రంలో చూస్తున్నప్పుడు పాట రంజకంగా వినిపించవచ్చును; బయట విన్నప్పుడు కనిపించకపోవచ్చును. కొన్ని పాటలు ప్రేక్షకుల కోసం వుంటాయి; కొన్ని శ్రోతల కోసం వుంటాయి. శ్రోతలు సాధారణంగా గంభీరమైన పాటలు కోరుతూ వుంటారు. కరతాళ ధ్వనులూ, పదతాళ ధ్వనులూ వినిపించే పాటలు బయట ప్రపంచంలోకి రాక పోవచ్చును. ఇలా పాట ప్రచారంలోకి రావడం అన్నది పలురకాలు" అన్నారు నారాయణరెడ్డి.

"చిత్రంలో పాట రాయడానికి మంచి సన్నివేశం లభించాలి. లభిస్తే మంచి పాట రాయవచ్చును. శృంగార యుగళ గీతాల్లో వైవిధ్యం కనిపించడానికి అవకాశం లేదు. అవుట్ డోర్ పాటలయితే చెట్టూ చేమా, ఇన్ డోర్ పాటలయితే చందమామా అంతకు మించి వస్తువు లేదు. సన్నివేశ బలం గల పాటల్లో (ఉ|| 'ఆత్మబలం' లోని అనగనగ ఒక రాజు) మంచి పాటలు కనిపిస్తాయి. సన్నివేశ బలం వున్నప్పుడే కవితా బలమూ కనిపిస్తుంది. ఇది సినిమాలకే కాదు, కావ్యాలకు కూడా వర్తిస్తుంది. కుటుంబ గాథల్లో మంచి వస్తుబలం వుంటుంది" అన్నారాయన.

నారాయణరెడ్డి గారు రాసిన పాటల్లో నూటికి తొంభై తొమ్మిది పాటల్లో యతి ప్రాసలు వుంటాయి. ఆ నియమం తప్పకుండా ఆయన పాట రాయరు. ఇంతవరకూ ఆయన ఐదువందల పాటలకు పైగా రాశారు. అందులో కొన్ని : డి.వి.యస్ సి.ఏ.సి. తారకరామా, డి.బి.యస్, శ్రీ గౌతమ్, భారతి, రవిచిత్ర, విజయభట్, యస్.వి.యస్. శ్రీ రాజ్ ఆర్ట్ మొదలైన సంస్థలు నిర్మిస్తున్న చిత్రాలు.

నారాయణరెడ్డి పద్మా పిక్చర్స్ వారి "ఏకవీర" చిత్రానికి సంభాషణలు కూడా రాస్తున్నారు. ఈ చిత్రంతో ఆయన సంభాషణా రచయితగా కూడా స్థిర పడడం ఖాయమని పరిశ్రమ భావిస్తున్నది.

# విఠలాచార్య

## ( విజయచిత్ర, 1969, మే, సంచిక నుంచి)



విఠలాచార్య సనాతన కుటుంబంలోంచి వచ్చిన వ్యక్తి. ఆయన స్వస్థలం, జన్మస్థలం ఉడిపి. మాతృభాష కన్నడం. 1920 వ సంవత్సరంలో జనవరి 28 న ఆయన పుట్టారు.

ఉడిపిలోనే విఠలాచార్య విద్యాభ్యాసం సాగింది. రాజుల కథలూ, మాంత్రికుడి కథలూ వినడానికి ఆ అబ్బాయి అప్పుడు ఎంతో కుతూహలం చూపేవాడు. నేటి ఆయన చిత్ర నిర్మాణానికి ఆ విధంగా నాడే పునాది పడి వుంటుంది! చరిత్ర పుస్తకాలు చదవడం అతనికి అలవాటయింది.

ఆ అలవాటు నేటికీ వుంది. ఆయన లైబ్రరీలో ఇవాళ, దాదాపు మూడువేల పుస్తకాలున్నాయి. ఈ మూడు వేల పుస్తకాలూ ఆ కోవకు చెందినవే.

అయితే విఠలాచార్యకు చదువు మీద శ్రద్ధకలగలేదు. అతని చదువు ఒకటోఫారం మధ్య దాకా వచ్చి ఆగిపోయింది. 'ఈ చదువూ, ఈ బడీ బోరు.' అనుకుని 'జోరు' గా తిరగడం సాగించాడు. 'ఈ వూరు విడిచి పెట్టి ఎక్కడికైనా పోవాలి; కష్టపడి ఏదైనా పని చెయ్యాలి' అనుకున్నాడతను. ఆ వూహతో, కట్టుకున్న గుడ్డలతో బయల్దేరాడు – ఉడిపి నుంచి. ఎక్కడికి పోవాలి? అనుకున్నాడు మళ్ళీ. 'అరిసికరై' అనే వూళ్ళో అతని అన్నగారు హోటలు నడుపుతున్నారు. అక్కడికి పోదాం అని కాలు సారించాడు. అయితే ఆ వూరు అక్కడికి ఎంత దూరమో, ఎలా వెళ్ళాలో

ఏ విషయాలూ అతనికి తెలియవు. తీరా చూస్తే నూటయాభైమైళ్ళ దూరం వుంది. చిత్రం ఏమిటంటే – జానపదంలోని రాజకుమారుడిలా, విఠలాచార్య మధ్య మధ్య మజిలీలు చేస్తూ ఆ నూటయాభైమైళ్ళూ కాలినడకన పూర్తి చేశాడు; అప్పుడు అతని వయస్సు తొమ్మిది సంవత్సరాలు.

అన్నగారి హోటలు వ్యాపారంలో చేరి, విఠలాచార్య కష్టపడి పని చేసి, పెద్దవాడైనాడు. అరిసికరై దగ్గర ఒక కొండ వున్నది. ఆ కొండ మీద వెంకటేశ్వరాలయం వుంది. దానికి 'మాలెకల్లు తిరుపతి' అని పేరు. అక్కడినుంచి, అసలు తిరుపతికి, భూమిలోంచి సొరంగ మార్గం వున్నదని ఒక నమ్మకం కూడా వుంది. విఠలాచార్య ఆ వూరు వస్తూనే, ఆ వెంకటేశ్వర ఆలయానికి వెళ్ళి – "స్వామీ ! తుండుగుడ్డతో ఈ వూరు వచ్చాను. నన్ను పెద్దవాడిని చేసి, ఐశ్వర్యం ఇస్తావో, ఇలాగే వుంచుతావో నీదే భారం" అని ప్రార్థించాడు.

హోటలు వ్యాపారంలో విఠలాచార్య లక్ష్మీదేవి అనుగ్రహం పొందాడు. అన్నగారితో పాటు అతనికీ ఐశ్వర్యం కలిసొచ్చింది. (ఆ నమ్మకంతోనే ఆయన, అరిసికరైలో వున్న వెంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్ళే కొండదారిలో వున్న ఎలక్ట్రిక్ దీపాల ఖర్చును చాలా కాలం నుంచి భరిస్తున్నారు. ఆ ఆలయంలో కల్యాణ మంటపం కూడా ఆయన నిర్మించారు.)

ఆ వూళ్ళో వుంటూనే, విఠలాచార్య నాటకాల్లో వేషాలు వెయ్యడం ఆరంభించారు. కత్తిసామూ, గరిడీ, కుస్తీలూ నేర్చుకున్నారు. అనేక కుస్తీ ప్రదర్శనాలలో పాల్గొని, బహుమతులు పొందారు.

1938లో విఠలాచార్య జాతీయోద్యమంలో పాల్గొని, మూడు సార్లు జైలు శిక్ష అనుభవించారు. దాదాపు ఐదు సంవత్సరాలు పాటు, రాజకీయాల్లో ముమ్మరంగా తిరిగిన తర్వాత, 1943 లో తిరిగి వ్యాపారంలో పడ్డారు. అయితే ఈ సారి వ్యాపారం సినిమాలకు సంబంధించినది. కొంత మంది దగ్గర స్నేహితులతో కలిసి, టూరింగ్ టాకీస్ నడపసాగారు. మూడు సంవత్సరాలు ఆ వ్యాపారం నడిపిన తర్వాత, ఆ మిత్రులూ ఆయనా కలిసి – 'మాహాత్మా పిక్చర్స్' అన్న సినిమా నిర్మాణ సంస్థను స్థాపించి – శ్రీనివాస కల్యాణం, సౌభాగ్యలక్ష్మీ మొదలైన ఏడు కన్నడ చిత్రాలను నిర్మించారు. విఠలాచార్య ఆ చిత్రాలకు నిర్మాత. మూడు, నాలుగు చిత్రాల్లో ఆయన హాస్యపాత్రలు కూడా ధరించారు.

నేటి దర్శకుడయిన జి. విశ్వనాథం అప్పుడు ఎడిటర్ గా వుండేవారు; దరిమిలా ఒక చిత్రాన్ని డైరక్టు చేశారు – ఆ చిత్రం వందరోజులు ఆడింది. అది పురస్కరించుకుని, ఆ సంస్థ వారు విశ్వనాథాన్ని ఇంకో చిత్రం కూడా డైరక్టు చెయ్యమన్నారు. అయితే, ఎందుకనో ఆయన వున్నట్టుండి ఎక్కడికో అడ్రస్ చెప్పకుండా పరారీ అయిపోయాడు. దాంతో, జరుగుతున్న జాగును భరించలేక, విఠలాచార్య, తానే దర్శకత్వాన్ని చేపట్టవలసి వచ్చింది. ఆ విధంగా ఆయన దర్శకుడిగా రూపొందారు.

అయితే కన్నడ చిత్రాలు ఎంత కష్టపడి తీసినా ఆటే లాభాలు సంపాయించేవి కావు. పైగా, అంతకంటె భారీగా వచ్చే తెలుగు, తమిళ చిత్రాల తాకిడి ఒకటి. ఈ కారణంగా విఠలాచార్య, కన్నడ చిత్ర నిర్మాణాన్ని విడిచి పెట్టి, తెలుగు చిత్రాలు తియ్యాలనుకున్నారు. తెలుగు చిత్రాలు తియ్యడానికి ఇంకో కారణం కూడా వుందని విఠలాచార్య చెబుతారు.

ఒక పెద్ద జ్యోతిష్కుడి దగ్గరకు వెళ్ళి ఆయన రెండు ప్రశ్నలు అడిగారట.

1. ప్రస్తుతం నాకు దాదాపు రెండు లక్షల రూపాయలు అప్పుంది. అది తీరిపోతుందా? ఎన్నాళ్ళలో?
2. నేను లాభాలు సంపాయించాలంటే ఏ వ్యాపారం చెయ్యాలి?

ఈ రెండు ప్రశ్నలకూ జ్యోతిష్కుడు ఇచ్చిన సమాధానాలు ఏమిటంటే – రెండేళ్ళలో ఆ అప్పులు తీరిపోతాయనీ, పరభాషా చిత్రాలు తీస్తే లాభాలు వస్తాయనీ. జ్యోతిష్కుడు చెప్పినట్టే, రెండేళ్ళలో ఆయన అప్పులు తీరిపోయాయి. పరభాషా చిత్రాలు తియ్యాలన్న ఉద్దేశంతో కూడా తెలుగు చిత్రాల నిర్మాణానికి ఉపక్రమించారు.

1953 లో విఠల్ ప్రొడక్షన్స్ పేరిట విఠలాచార్య దర్శక, నిర్మాతగా తెలుగు చిత్రాల నిర్మాణం ఆరంభించారు. తెలుగులో తీసిన ఆయన మొదటి చిత్రం – 'కన్యాదానం'. ఆ చిత్రం తీసేనాటికి విఠలాచార్యకు తెలుగు అసలు రాదు. (ఈ రోజున ఆయన దగ్గర వున్న పుస్తకాల్లో తెలుగు పుస్తకాలు ఎక్కువ – తెలుగు క్షుణ్ణంగా మాట్లాడతారు!)

తర్వాత ఆ సంస్థ విఠల్ కంబైన్స్ గా మారింది. రెండు సంస్థల పేరిటా మొత్తం 17 చిత్రాలు నిర్మించారు. ఏ రెండు, మూడు చిత్రాలో తప్ప ఈ చిత్రాలన్నీ మంచి లాభాలు తెచ్చిపెట్టాయి. ఇంతవరకూ ఆయన 33 చిత్రాలను డైరక్టు చేశారు! ఇన్ని చిత్రాలను డైరక్టు చెయ్యడం కూడా ఘనతే ! ఇందులో ఒక తమిళ చిత్రం, కొన్ని కన్నడ చిత్రాలూ, ఎక్కువ తెలుగు చిత్రాలూ వున్నాయి.

ప్రస్తుతం ఆయన గండికోటరహస్యం, (ఈ నెల విడుదల) కదలడు – వదలడు, పి.యస్.ఆర్, గౌతమీ, కె. జి. ఆర్, విఠల్ కంబైన్స్ వారి చిత్రాలను డైరక్టు చేస్తున్నారు. ఇవన్నీ జానపదాలే. విఠలాచార్యగారికి ఎనమండుగురు సంతానం. నలుగురు అబ్బాయిలూ, నలుగురు అమ్మాయిలూ. పెద్దబ్బాయి – బి. వి. శ్రీనివాస్ – దర్శకుడిగా వుంటున్నాడు. తతిమ్మా అబ్బాయిలు చదువుకుంటున్నారు.

“నా విజయ రహస్యం ఏమిటంటే – అన్ని రసాలూ గల కథను చకచకా చెప్పడం. నా దృష్టిలో సినిమాలో ముఖ్యమైనవి మూడు రసాలు – కరుణ, హాస్యం, శౌర్యం” అన్నారు విఠలాచార్య. ఆయన స్వశక్తిమీద పైకి వచ్చిన మనిషి. కష్టపడి పని చెయ్యడం, హృదయపూర్వకంగా పని చెయ్యడం – అన్న అంశాలు ఆయన జీవిత కథలో ప్రధానంగా కనిపించే అంశాలు.

“నేను మద్రాసు వచ్చిన మొదట్లో వాహిని స్టూడియోలో కన్నడ చిత్రాలు తీసినప్పుడు, శ్రీ నాగిరెడ్డిగారు చాలా సహాయం చేశారు. కన్నడ చిత్రాల నిర్మాణానికి ఖర్చు ఎక్కువ అవుతోందని అంటే – స్టూడియో అద్దె చాలా తగ్గించి, అనేక సదుపాయాలు కలిగించారు. అలాగే శ్రీ సుందర్ లాల్ గారు కూడా నాకు సహాయ పడ్డారు” అన్నారు విఠలాచార్య.

1972 లో ఆయన సొంత స్టూడియోను ప్రారంభిస్తారు. “అప్పుడు రెండు రకాల చిత్రాలనూ నిర్మించాలన్న ఉద్దేశం నాకు వున్నది. ఇటు ‘బాక్సాఫీస్’ చిత్రాలూ, అటూ ప్రయోగాత్మక చిత్రాలూ నిర్మించగలిగే స్తోమత, తాహతు అప్పుడు లభించగలవని నేను అనుకుంటున్నాను” అని చెప్పారు విఠలాచార్య.

# నేను చూసిన తొలి సినిమా షూటింగ్

## ( విజయచిత్ర, 1970, డిసెంబర్ సంచిక నుంచి)



ప్రపంచంలో మేధావంతులుగా పరిగణింపబడే మహాశయులకు కూడా బాల్యంలో ఈ ప్రపంచం కొత్తగానే కనిపిస్తుంది. అలాగే, పెద్ద సినిమా తారలకు కూడా ఒకనాడు సినిమా షూటింగ్ కొత్తగానూ, వింతగానూ కనిపిస్తుంది. నేటి సినిమా తారలు తొలిసారిగా తాము చూసిన సినిమా షూటింగుల గురించి ఈ కొత్త శీర్షికలో తెలియజేస్తారు :

# సావిత్రి

మద్రాసు రావడం నాకు అదే మొదటిసారి; సినిమా అవకాశాలు వస్తే కూడా జారవిడుచుకోకూడదన్న ఆశతో వున్నాను. అప్పటికే నేను నృత్యం బాగా నేర్చుకుని వున్నాను.

విజయావారు 'పాతాళభైరవి' చిత్రం ప్రారంభిస్తున్నారు. ఆ చిత్రంలో ఒక నృత్యసన్నివేశం వున్నదనీ, అందులో పాల్గొనడానికి మంచి నర్తకి కోసం చూస్తున్నారనీ తెలిసింది. కబురు నాకు కూడా వచ్చింది. నన్ను వాహినీ స్టూడియోకి తీసుకెళ్ళారు. సినిమా స్టూడియో చూడడం అదే నాకు మొదటిసారి. అటూ ఇటూ వింతగా విడ్డూరంగా చూడసాగాను. అసలు సినిమా షూటింగ్ ఎలా చేస్తారో, అక్కడ పద్ధతి ఎలా వుంటుందో చూడాలన్న కోరిక నాకు చాలా కాలంగా వుంది. సరే, ఎలాగూ స్టూడియోకి వచ్చాంగదా, షూటింగ్ కూడా చూడాలనిపించి, నన్ను స్టూడియోకి తీసుకొచ్చిన వారిని అడిగాను. వాళ్ళ చిత్రమే "షావుకారు" షూటింగ్ జరుగుతున్నదనీ, చూడవచ్చుననీ చెప్పారు. నేను ఫ్లోర్ లో అడుగు పెట్టాను. పెట్టీ పెట్టగానే 'సైలెన్స్' అని పెద్ద కేక వినిపించింది. ఎక్కడి దాన్ని అక్కడే కుక్కిన పేనులా, బొమ్మలా నించుండిపోయాను. ఎదురుగా లైట్లు, కెమెరా, నటులూ అందరూ కనిపించారు. వింతగా చూస్తున్నాను. ఒకాయన 'విజిల్' ఊదగానే, పాట వినవచ్చింది. అది హరికథ. 'హరికథ షూటింగ్ జరుపుతున్నారన్నమాట' అనుకున్నాను. దర్శకులు, నిర్మాతలూ అనుకుంటాను అక్కడ కూర్చుని వున్నారు. వారికి దగ్గర్లోనే ఒక పల్లెటూరి వ్యక్తి, బీడీ పీలుస్తూ నించుని వున్నాడు. "ఇదేమిటీ, సభ్యత లేకుండా ఈయన, పెద్దవాళ్ళ ముందు బీడీలూ అవీనూ" అనుకున్నాను. తీరా అడిగితే.. అది ఆ చిత్రంలోని పాత్ర. మసక మసకగా వుండడం చేత ఆ వ్యక్తి ముఖాన రంగు ఉన్నట్టు నేను గమనించలేదు. ఆయనెవరని అడిగితే___ "ఎస్.వి. రంగారావు ఇప్పుడిప్పుడే వస్తున్నారు" అని చెప్పారు. "ఓహో" అనుకున్నాను. నేను చూసిన షూటింగ్, ఆ పాటలోని చిన్న భాగం. అదే, పదే పదే వేస్తున్నారు; రిహార్సల్సు చేస్తున్నారు; షూట్ చేస్తున్నారు. ఇంతలో నన్ను 'డాన్స్ హాల్' కు రమ్మంటున్నారని కబురు వచ్చింది. ఫ్లోర్ నుంచి బయటికి వచ్చాను. ప్రొజెక్షన్ థియేటర్ దగ్గర ఒకాయన ఎవరితోనో మాట్లాడుతూ కనపించారు. ఆయనను దూరం నుంచే గుర్తుపట్టాను అక్కినేని నాగశ్వరరావు గారు! నేను ఆయన చిత్రాలు చాలా చూశాను. ఆయన నటనంటే నాకు ఎంతో ఇష్టం. ఆయన మీద నాకు గౌరవభావం వుంది. అనుకోకుండా కనిపించారు గదా అని, నా అంతట నేనే ఆయన దగ్గరకు వెళ్ళి "నమస్కారం" అన్నాను. ఆయన కూడా "నమస్కారం" అన్నారు. అంతే మళ్ళీ పక్కాయనతో మాట్లాడుతున్నారు. నన్ను పలకరిస్తారనీ, ఎవర మీరని అడుగుతారనీ ఆశించాను. కాని, ఆయన ఇంకేమీ మాట్లాడలేదు. కాస్సేపు నించుని, నేను 'డాన్సు హాల్' దగ్గరకు వెళ్ళిపోయాను. అక్కడ చిత్ర దర్శకులైన కె.వి.రెడ్డిగారికి నన్ను పరిచయం చేశారు. కాస్సేపు వాళ్ళందరూ మాట్లాడుకున్న తర్వాత "ఆ అమ్మాయి ఎవరో తెలివైన దానిలాగే వుంది" అన్నారు కె.వి.రెడ్డిగారు. ఆ మాట నాకూ వినిపించింది. ఆ నృత్యంలో పాల్గొనడానికి నేనే ఎన్నికయ్యాను; ఐతే, మొదటిసారిగా నేను షూటింగ్ లో పాల్గొన్న చిత్రం 'సంసారం.'

# జయలలిత

'శ్రీశైల మహత్యం' అనే కన్నడ చిత్రంలో మా అమ్మగారు నటించారు. అప్పుడు నాకు ఆరో సంవత్సరం. ఒకరోజు షూటింగ్ చూడాలనిపించి, సాయంకాలం బడి నుంచి రాగానే అమ్మతో బయల్దేరాను. ఇంకా షూటింగ్ ప్రారంభం కాలేదు. అమ్మ, ముఖానికి రంగు వేసుకుంటున్నారు. వాళ్ళలో వాళ్ళు ఏవేవో మాట్లాడుకుంటున్నారు. 'షూటింగ్ ఉంటుందా, ఉండదా' అని చర్చించుకుంటున్నారు. కారణం ఏమిటంటే ఆ చిత్రంలో నటించవలసిన ఒక చిన్న అమ్మాయి (ఆ చిత్రంలో శ్రీమతి కృష్ణ కుమారి కూడా నటించారు. ఆమె చిన్నతనంలోని వేషం అన్నమాట) వంట్లో బాగులేని కారణంగా షూటింగ్ కు రాలేదట. ఆ అమ్మాయి కోసం అని సెట్టు ఆపడానికి వీల్లేదట. నన్ను చూసిన ఒకాయన. వెంటనే అమ్మగారి దగ్గరకు వెళ్ళి ఏదో మాట్లాడారు. అమ్మ సరేనన్నారు. ఆ రోజు షూటింగ్ లో చిన్న డాన్సు కూడా వుంది. నాకు ఆడాన్సు నేర్పించి, ఆ పాత్ర నటించమన్నారు. నేను నటించాను. అంతగా తెలుసుకోవాలనే వయస్సు కాదు అప్పుడు. విశేషం ఏమిటంటే_ నేను చూసిన మొదటి షూటింగు, నేను పాల్గొన్న మొదటి షూటింగూ అదే అయిందన్నమాట.

## రాజశ్రీ

మా అన్నయ్య మద్రాసులో మెడిసిన్ చదువుతున్నాడు. మా అక్కతో నేను మద్రాసువచ్చాను. అప్పుడు నేను చిన్న పిల్లను. మేము వుంటున్న ఇంటి పక్కనే ఒక ఆడిటర్ గారు వుండేవారు. వారి అమ్మాయికి నృత్యం నేర్పించేవారు. నేను రోజూ అది గమనించేదాన్ని. నాకూ నృత్యం నేర్చుకోవాలని అనిపించేది. నాకు వీణ నేర్పిస్తున్నారు కాని, నా దృష్టి నృత్యం మీద వుండేది. నాకు వీణ నేర్పుతున్న ఆవిడకు నృత్యం కూడా తెలుసు. ఆవిడ అన్నారు "అమ్మాయికి నృత్యంలో ఆసక్తి వుంది. నేర్పిస్తే బావుంటుంది" అని. పక్క ఆడిటర్ గారింట నృత్యం నేర్పుతున్న ఆయన ప్రఖ్యాత నాట్యాచార్యులైన దండాయుధపాణి పిళ్ళై గారి శిష్యుడు. అక్కయ్య, ఆయన్ని అడిగితే నాకు కూడా నృత్యం నేర్పుతానన్నారు. కాని, ఆయన చాలా బిజీగా వుంటారు. అంచేత వారానికి మూడు రోజులు మాత్రం వచ్చి నాట్యం నేర్పేవారు.

సినిమా షూటింగ్ చూడాలన్న ఉద్దేశ్యంతో ఒక రోజు ఏ.వి.యమ్. స్టూడియోకి వెళ్ళాము. 'నాగులచవితి' షూటింగ్ జరుగుతోంది. చూద్దామని వెళ్ళబోతూ వుంటే, నాకు నాట్యం నేర్పుతున్న మాస్టారు కనిపించారు. 'ఏమిటిలా వచ్చావు?' అన్నారు. నేను చెప్పాను. 'ఆఁ మాట... ఇలా రా' అని ఆయన నన్ను ఒక పెద్ద హాలు దగ్గరకు తీసుకెళ్ళారు. అక్కడ చాలా మంది పిల్లలు వున్నారు. ఆ చిత్రంలో శ్రీమతి జమున నటిస్తున్నారు. ఆమె చిన్నతనంలోని పాత్రకు అమ్మాయి కోసమని అక్కడ ఎన్నిక జరుగుతున్నదట. మా మాస్టారు నాగురించి ఎవరితోనో చెప్పారు. ఆయన నన్ను చూసి "నీకు డాన్సు వచ్చునా అమ్మాయి?" అని అడిగారు. తల వూపాను వచ్చును అన్నట్టు. ఆయన నన్ను ఎగాదిగా చూసి, "ఈ అమ్మాయి చేత వేయిద్దాం" అన్నారు. ఆయనే ఏ.వి.యమ్. స్టూడియో అధిపతి శ్రీ ఏ.వి.మెయ్యప్ప చెట్టియార్ గారు. నాకు అప్పుడు తెలీదు. వెంటనే నాకు డాన్సు నేర్పించారు. శ్రీ దండాయుధపాణి పిళ్ళై గారు ఆ చిత్రానికి నృత్య దర్శకులు. ఆయనే నాకు ఆ నృత్యం నేర్పారు. నేను వేషం వేసుకున్నాను, సెట్లోకి వెళ్ళాను, నటించాను. అదే నేను చూసిన మొదటి షూటింగూ పాల్గొన్న మొదటి షూటింగూ !

# సినిమాటోగ్రఫీ అన్నయ్య

## ( సినిమారంగం, 1971, ఫిబ్రవరి సంచిక నుంచి)



మనకున్న కొద్దిమంది ప్రథమ శ్రేణి ఛాయాగ్రాహకులలో అన్నయ్య (డి.ఎల్.నారాయణ) ఒకరు. 30 ఏళ్ళకు పైగా కెమేరా ఆయన జీవితంలో ఒక భాగమై పోయింది.

అన్నయ్య 1923 జనవరి 12న మైసూర్ రాష్ట్రంలోని చితల్ దుర్గలో జన్మించారు. హైస్కూల్ విద్యాభ్యాసం పూర్తి చేశాక తన 17వ ఏటనే మద్రాసు ప్రాగ్జోతి స్టూడియోలో విఖ్యాత ఛాయాగ్రాహకులు కీ॥ శే॥ రామనాధ్ గారి దగ్గర అప్రెంటిస్ గా చేరారు.

"ఆ రోజుల్లో మాకు రోజుకి నాలుగణాలు అంటే ఇప్పటి ఇరవై అయిదు పైసలు బేటా

ఇచ్చేవారు. అయినా, ఆ రోజుల్లో ఆ డబ్బు భోజనానికి, టిఫెన్ కి సరిపోయేది," అని ఆయన నవ్వుతూ అంటూ, "సాంకేతికంగా ఈనాడు ఉన్న సౌలభ్యాలు మాకు ఆ రోజుల్లో లేవు. ఉన్న వాటితోనే సరిపెట్టుకునే వాళ్ళం. ఎక్కువగా రిఫ్లెక్టర్స్ తో ఔట్ డోర్ షూటింగ్ జరిపేవాళ్ళం," అన్నారు పాతరోజులు జ్ఞాపకం చేసుకుంటూ.

ఈయన తాతగారు, చలనచిత్ర పితామహులు స్వర్గీయ హెచ్.ఎం.రెడ్డిగారు ఆ రోజుల్లో నేటి ప్రముఖ దర్శకనిర్మాత ఎల్.వి.ప్రసాద్ గారు హీరోగా నిర్మించిన "సత్యమే జయం" చిత్రానికి అన్నయ్య కెమెరామన్ గా పని చేశారు.

అవి ద్వితీయ ప్రపంచ సంగ్రామం ముమ్మరంగా సాగుతున్న రోజులు. మద్రాసు మీద కూడా బాంబులు పడడంతో స్వర్గీయ రెడ్డిగారు మద్రాసునించి మైసూర్ కు తమ నిర్మాణ కార్యక్రమాన్ని, స్టూడియోను కూడా తరలించారు. ఐతే, ఆ మార్పు అంతగా సహకరించక పోవడంతో అన్నయ్య తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పూనా ప్రయాణం కట్టారు. పూనా షాలిమార్ స్టూడియోలో డబ్ల్యూ.జెడ్. అహమద్ దగ్గర సహాయకుడుగా కొన్ని చిత్రాలకు పనిచేసి 1945లో తిరిగి మద్రాసు చేరారు.

అప్పటికి మిర్జాపూర్ రాజావారి శోభనాచల స్టూడియో మాంచి డిమాండ్ లో ఉంది. అక్కడ శ్రీ కోట్నిస్ వద్ద సహాయకుడిగా అన్నయ్య మరికొన్ని చిత్రాలకు పని చేశారు. రాజా సాబ్ "కీలు గుఱ్ఱం" తీస్తూ అన్నయ్యకు కెమెరామన్ గా అవకాశమిచ్చారు. ఆ తర్వాత "తిలోత్తమ, ప్రియురాలు, లక్ష్మమ్మ" వగైరా చిత్రాలకు పనిచేశాక 1951లో ఆ స్టూడియోకు గుడ్ బై చెప్పి బయటకు వచ్చి, శుభోదయా వారి "ఆదర్శం" చిత్రానికి పనిచేశారు.

హీరో కాంతారావు తొలి చిత్రం "ప్రతిజ్ఞ"ను స్వర్గీయ రెడ్డిగారు నిర్మిస్తూ, అన్నయ్యను కెమెరామన్ గా నియమించారు. ఆ తర్వాత "వద్దంటే డబ్బు", మరికొన్ని చిత్రాలకు పనిచేశాక అన్నయ్య క్రమంగా 'ఫ్రీలాన్సర్' అయి, డి.బి.ఎస్. వారి "పెంకి పెళ్ళాం", పొన్నలూరి వారి "శోభ", "బందరాముడు" (తమిళ రూపాంతరం "అతిశయ తిరుడన్" కూడా), కాళిదాసు, మహామంత్రి తిమ్మరుసు, రాముడు భీముడు, "శ్రీ కృష్ణావతారం" వంటి కొన్ని రజతోత్సవ చిత్రాలకూ పని చేశారు. ఇంతవరకు ఆయన అన్ని భాషలకు కలిపి మొత్తం 80 చిత్రాలకు పని చేశారు. హీరో కాంత్రారావు హేమా ఫిలిమ్స్ పతాకం కింద సమర్పించిన "సప్తస్వరాలు" నించి, సంజీవిని ఫిలిమ్స్ తొలి చిత్రం "గందర గండడు". ద్వితీయ చిత్రం త్వరలో విడుదలయ్యే "ప్రేమ జీవులు" కూడా అన్నయ్య ప్రతిభకు నిదర్శనాలే.

ప్రస్తుతం రెండు కన్నడ చిత్రాలకు మంత్రాలయా మూవీస్ వారు గేవా కలర్ లో నిర్మించే హిందీ చిత్రానికి అన్నయ్య పని చేస్తున్నారు.

"ఆ రోజుల్లో డెబ్రీ బెల్ అండ్ హోల్, ఐమో కెమెరాలతో షూట్ చేసే వాళ్ళం. ఈ రోజు మిచెల్, ఎయిరోఫ్లెక్స్ లు కూడా వాటికి జత కలిశాయి. అలాగే 'జూమ్' కూడా సాంకేతికంగా ఎంతో మంచి ఫలితాలను ఇస్తోంది. పోతే, ట్రాలీకి పనికాస్త తగ్గింది. సాంకేతికంగా విదేశ చిత్రాలతో మన చిత్రాలు కూడా ఇప్పుడిప్పుడే పోటీ పడుతున్నాయి మనకున్న సాంకేతిక సదుపాయాలు, ఆర్థిక స్థోమత ఒక పరిధిని దాటడం లేదు. చిత్ర నిర్మాణంలో "స్పీడ్" ఎక్కువైంది. ఒక విధంగా అది హర్షణీయమైనా మరో విధంగా క్వాలిటీ వర్క్ చూపించడానికి ఎక్కువ అవకాశాలు లేవు. అయినా, ఉన్నంతలోనే నిర్దుష్టమైన ఫలితాలను ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం." అన్నారు అన్నయ్య.

తెలుపు-నలుపు చిత్రాల ఫోటోగ్రఫీ కంటే వర్ణ చిత్రాల ఫోటోగ్రఫీ సులభమని ఈయన అభిప్రాయం. వర్ణ చిత్రాలలో 'లైట్ అండ్ షేడ్', సెట్ లు, దుస్తులు కెమరామెన్ పనిని సులభం చేస్తాయి అంటారు.

తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, ఆంగ్ల భాషలలో తన మాతృభాష మరాఠీ అంత అనర్గళంగా మాట్లాడగల అన్నయ్య గృహం ఎనమండుగురు పిల్లలతో కళకళలాడుతూంటుంది. ఎప్పుడూ చిరునవ్వుతో పిన్నా పెద్దా అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, తన పనేమిటో తనేమిటో తప్ప ఇతర విషయాలలో జోక్యం కలుగజేసుకోని అన్నయ్య సినిమా రంగంలో అందరికీ మిత్రులు ఆప్తులు అజాత శత్రువు.

పెద్దబ్బాయ్ మల్లిక్ తండ్రి అడుగుజాడలలోనే సినిమాటోగ్రఫీ వృత్తిని చేపట్టాడు.

"నన్నడిగితే ఈ వృత్తికి డిప్లొమాలు, డిగ్రీలు కంటే ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎంతో సహాయపడుతుందంటాడు. పోతే ఫోటోగ్రఫీకి కావల్సిందల్లా ఇంకా నేర్చుకోవాలనే తపన, పట్టుదల, కార్యదీక్ష" అన్నారు అన్నయ్య — ఫోటోగ్రఫీని వృత్తిగా స్వీకరించదలచిన వారికి మీరిచ్చే సలహా ఏమిటని అడిగితే.

మూడు దశాబ్దాలకు పైగా ఛాయా గ్రాహణంలో అనుభవం సంపాదించిన అన్నయ్య ఇప్పటికీ అదే ఉత్సాహంతో సెట్ లో పని చేస్తూ ఉంటే చూడ ఎంతో ముచ్చటగా ఉంటుంది.

భవిష్యత్తులో కూడా ఈయన ఎన్నో సరికొత్త ప్రయోగాలు చేసి, ప్రేక్షకులకు మరింత కన్నుల పండువగావిస్తారు.

వారి కొడుకు మల్లిక్ త్వరలోనే తండ్రి అంతటి వాడవ్వాలని "సినిమారంగం" ఆశీర్వదిస్తోంది.

# నటన

## - షావుకారు జానకి

( విజయచిత్ర- 1971, జనవరి సంచిక నుంచి)




సరిగ్గా పదిహేను నిమిషాలే వున్నాయి. ఇప్పటికే చాలా మారిపోయాను. అద్దంలోకి చూసుకున్నాను. కళ్ళకొలకుల్లో వున్న నల్ల రంగుని మరి కొంచెం పొడిగిస్తే బాగుండుననిపించింది. రంగులన్నీ గజిబిజిగా బల్లమీద పడున్నాయి. వాటి మధ్య నా చేతిగడియారం టిక్... టిక్.. మంటూ అట్టే వ్యవధి లేదని జ్ఞాపకం చేస్తూంది. అబ్బ... చేతులు వణుకుతున్నాయ్. కాళ్ళు తేలిపోతున్నాయి. చెవులు హోరుమంటున్నాయి. ఏమిటా ఘోష? మొదటి గంట వినిపించింది. ప్రార్థనకు రమ్మని పిలిచారు. వెళ్ళాను. కళ్ళు మూసుకున్నాను. నమస్కరించాను. మదటిసారిగా రంగస్థలం మీదకు వెళ్తున్నాను. "అంతమంది ప్రేక్షకుల ముందు నిలబడి నటించగలిగే మనోధైర్యమూ, శక్తీ నాకియ్యి" అని మనసులోనే ప్రార్థించాను. మూడోగంట కూడా కొట్టేశారు.

ఒక చేతిలో చిన్న తోలుపెట్టె, మరో చేతిలో ఉత్తరం పట్టుకుని రంగస్థలం మీదకు దారితీశాను. ఒక్క అడుగు.. ఇంకొక్క అడుగు ముందుకు వేస్తే నేను జానకిని కాను. కల్పనను, ఒక అనాధను. ఉద్యోగం కోసం బయలుదేరాను. ఉద్యోగం దొరుకుతుందా? నేను కలుసుకోవలసిన డాక్టర్ గారు ఆస్పత్రిలో వున్నారా లేదా? అనే భావం మొఖం మీద కనిపించాలి. కనిపిస్తోందా? ఏమో, నాకు తెలియదు... ఆలోచించడానికి వ్యవధి లేదు. రంగస్థలం మీదికి ప్రవేశించాను. అంతవరకూ వున్న కంగారు, దడ మాయమైపోయాయి. అప్పటి నుంచి మూడుగంటల సేపు కల్పనగా బతికాను. కల్పన ఒక జీవిత కాలంలో అనుభవించిన సుఖమూ, సంతోషమూ, ఆనందమూ, ఆశా, ఆవేదనా, చిత్తక్షోభా మూడుగంటలలో నేను తీవ్రంగా అనుభవించాను. అంటే ఆ మూడు గంటలలో నాకు ఇంకొక జీవితానుభవం పెరిగింది.

రంగస్థలం మీద నటించడానికీ, చలన చిత్రాల్లో నటించడానికీ ఇదే ముఖ్యమైన తేడా. రంగస్థలం మీద ఒక పాత్ర నటించగానే, అది ఆ నటి వ్యక్తిగతానుభవం అవుతుంది. కొత్త ఎమోషనల్ ఎక్స్పీరియన్స్ కలుగుతుంది. ఒక పాత్రకు రూపకల్పన చేశాను. నన్ను కాక మరో మనిషిని ప్రేక్షకులకు ప్రత్యక్షంగా చూపించాను. నేను నటిస్తున్న పాత్ర పడే బాధా, తపన, ఆనందం నిజంగా ఒక వ్యక్తి అనుభవిస్తున్నదని అంతమంది ప్రేక్షకులు అప్పటికప్పుడే నాతో పాటు అనుభవించేటట్టు చేస్తాను. అప్పుడు నేను పడే తృప్తి అనిర్వచనీయమైనది. రంగస్థల నటికి ఈ తృప్తి కలుగుతుంది. సినిమా నటికి ఇలాంటి తృప్తి ఎన్నటికీ కలుగదనే నా నమ్మకం. సినిమాల్లో నటన ఈ వ్యక్తిగతానుభవాన్ని ఇవ్వలేదు. ముందు సీను వెనుకా, వెనుక సీను ముందూ, అడ్డదిడ్డంగా, చిన్న చిన్న షాట్స్ గా తియ్యడం వల్ల నటికి ఆ ఎమోషనల్ ఎక్స్పీరియన్స్ కలుగదు. ఒక్కొక్కప్పుడు ఒకే సన్నివేశాన్ని పూర్తి చెయ్యడానికి ఒక సంవత్సరం కూడా పట్టవచ్చు. ఈ ఏడాదిలో నటి శారీరకంగానూ మానసికంగానూ మారుతుంది. ఒకే సన్నివేశాన్ని ఇంత వ్యవధిలో తీసినప్పుడు నటి నటనా స్థాయిలో కూడా హెచ్చు తగ్గులు రావడం సహజం. రంగస్థలం మీద నటిస్తున్నప్పుడు ఉద్రేకాలు, అనుభూతులు ఆ పాత్ర అనుభవించినట్టు నటి వరుసగా అనుభవిస్తుంది కనుక ఎమోషనల్ కంటిన్యుటీ ఉంటుంది. స్క్రిప్ట్ రచయిత, దర్శకుడు, కెమేరామాన్, ఎడిటర్ వీరందరి సహాయం వుంటుంది సినిమా నటికి. రంగస్థలనటికి ఇంతమంది సహాయమూ వుండదు. జోక్యం కూడా వుండదు. ఒకసారి నటి రంగస్థలం మీదకు వెళ్ళిన తరవాత కేవలం నటి స్వశక్తి మీద ఆధారపడవలసి వుంటుంది. అందుకే రంగస్థలం మీద నటన ఇచ్చిన తృప్తీ, ఆనందం, క్రియేటివ్ ఆర్టిస్ట్ కు సినిమా నటన ఇవ్వలేదు. రంగస్థలం మీద తప్పు చెయ్యడానికి వీలు లేదు. చేస్తే దిద్దుకునేందుక అవకాశం వుండదు. ఆ ప్రదర్శనకు ఆ తప్పు అలాగే వుండి పోతుంది. అందువల్ల రంగస్థలం మీద వున్నంతసేపూ, నటి మనసు అరక్షణం కూడా ఇంకో విషయం మీదకు పోకూడదు. తన సంభాషణలేకాక మిగతా నటీనటుల సంభాషణలు కూడా నటికి క్షుణ్ణంగా తెలిసి వుండాలి. సినిమా నటనలో తప్పు చేస్తే ఫరవాలేదు. 'కట్' అనే పదం వినిపించగానే మళ్ళా నటించడానికి సిద్ధపడవచ్చు. ఆవేళ నటించినది మర్నాడు చూసుకుని తృప్తిగా లేకపోతే మళ్ళీ తియ్యమనడానికి అవకాశం వుంటుంది సినిమా నటికి. ఈ విధంగా చూసుకుంటే చలనచిత్రాల్లో నటించడం చాలా సులభం. ఇంకో విధంగా చూసుకుంటే చాలా కష్టం. దీపాల మధ్య నిలబడి నటిస్తున్నప్పుడు సినిమా నటికి ఒకే ఒక్క ప్రేక్షకుడు కెమేరా. ఆ ఒక్క ప్రేక్షకుడి రియాక్షన్ అప్పటికప్పుడు తెలియదు... కామెరా చప్పట్లు కొట్టడమో, ఈలల వెయ్యడమో చెయ్యలేదు కనుక. షూట్ చేస్తున్న సన్నివేశం ఎక్కడిదో జ్ఞాపకం ఉంచుకోవాలి. ఇంతకు ముందు చిత్రించబడ్డ సన్నివేశాలలో తన నటన గుర్తుంచుకోవాలి. ఇప్పుడు కామెరా ఎక్కడున్నదీ, దీపాలు ఎక్కడున్నవీ చెయ్యి మరీ పైకెత్తితే ఫ్రేమ్ లోంచి బయటికి పోతుందా ? ముఖం మరీ పక్కకు తిప్పితే నటి అందంగా కనిపించాలని కామెరామాన్ గంటల తరబడి, కష్టపడి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపం ముఖం మీద పడడం మానేసి మెడమీద పడుతుందేమో ? అంతే కాదు. అక్కడ నటికి ఎదురుగా హీరో వుండకపోవచ్చు__ వుండకపోయినా వున్నాడని ఊహించుకుని హీరోని ఉద్దేశించి ప్రేమ వాక్యాలు చెప్పాలి. ఒక్కొక్కప్పుడు నటీనటుల తప్పు వల్ల కాకపోయినా, సాంకేతిక లోపాల వల్ల తీసినదే మళ్ళా మళ్ళా తియ్యవలసి వస్తుంది. ఎన్నో కారణాల వల్ల ఒకే మూడ్ లోకి, ఒకే ఉద్రేకంలోకి నటి మళ్ళీ మళ్ళీ రావలసి వస్తుంది. ఈ ప్రోసెస్ లో ఎంతో నర్వస్ ఎనర్జీ వృధా అవుతుంది. ఈ దృష్టితో చూస్తే సినిమా నటన చాలా కష్టం. సినిమా నటికి ఎంతో ఊహా పటిమ కావాలి. పాత్రకు కావలసిన అనుభూతిని తనకు తానే తెచ్చుకోవాలి. ఇది చాలా కష్టం. అక్కడి వాతావరణం, పక్కన నటిస్తున్న నటీనటులు అట్టే సహాయ పడతాయని నేననకోను. కాని తెచ్చుకున్న అనుభూతిని ప్రేక్షకులక అందజెయ్యడంలో కామెరా ఎంతో సహాయపడుతుంది సినిమా నటికి. రంగస్థల నటికి ఆ సహాయం ఎంతమాత్రమూ లేదు. తన భావప్రకటన, కంఠస్వరం ఆఖరు వరసలో వున్న ప్రేక్షకుడికి కూడా స్పష్టంగా కనిపించి, వినిపించేందుకు తనే పాటుపడాలి. కనుక రంగస్థల నటికి బాధ్యత ఎక్కువ.

రంగస్థల నటికి వోయిస్ ప్రొజెక్షన్ చాలా ముఖ్యం. తియ్యని కంఠస్వరం చాలా అవసరం. ఉచ్చారణలో లోపం వుండ కూడదు. సంభాషణలు ప్రేక్షకులకు రక్తి కట్టించాలంటే సన్నివేశానికి అనుగుణంగా కంఠస్వరం మారాలి. తగ్గు స్థాయిలో మాట్లాడినా, త్వరత్వరగా మాట్లాడినా మాటలు మాత్రం మింగివెయ్యకూడదు. స్పష్టంగా, తియ్యగా సంభాషణలు చెప్పలేని నటిని ప్రేక్షకులు భరించలేరు. భగవంతుడు మంచి కంఠస్వరం యిచ్చి వుంటే ఇవన్నీ నటి తగిన శిక్షణతో నేర్చుకోవచ్చు. రంగస్థల నటి తన ప్రత్యేక ప్రతిభను బట్టి తను నటించవలసిన పాత్రను ఎన్నుకోవాలా, లేక ఎటువంటి పాత్రనైనా నటించి రక్తి కట్టించగలదా అనే సంశయం కలుగుతుంది. ఒక నటి విషాద పూరితమైన పాత్రను పోషించి రాణించి వుంటే, ఆ నటి అటువంటి పాత్రలకే సరిపోతుందని ముద్రవెయ్యడం చాలా పొరపాటని నా ఉద్దేశ్యం. ప్రతిభావంతురాలైన నటి ఎటువంటి పాత్రనైనా ఆత్మస్థైర్యంతో నటించి ప్రేక్షకులను

ఒప్పించగలదు. నటికి తను నటిస్తున్న పాత్రే కాక నాటకం కూడా నచ్చాలి. నాటక కర్త సృష్టించిన పాత్రను సరిగ్గా అర్థం చేసుకోవాలి. నటించబోయే పాత్ర యొక్క మనోభావాలనూ, వ్యక్తిత్వాన్ని, అలవాట్లనూ, నడక తీరును మనసులో స్పష్టంగా రూపకల్పన చేసుకోవాలి. నాటకకర్త కావలసినన్ని వివరాలిస్తాడు నాటకంలో. నాటకకర్త మేధావి నాటకం గొప్పదీ అయివుంటే నటికి అంతకన్నా కావలసిందేముంది? నాటకకర్త మైనాన్ని, ఫోటోని ఇస్తాడన్నమాట. ఆ ఫోటోను చూస్తూ, ఆ మైనం ముద్దను ఒక మనిషిగా రూపొందించాలి నటి. అంటే మిగతా డైమన్షన్స్ ఇవ్వగలిగే ప్రతిభ వుండాలి రంగస్థల నటికి.

నటి అంతరంగిక జీవితానికి, రంగస్థల జీవితానికీ చాలా సంబంధం వున్నది. అంతరంగిక జీవితంలో ఎంతోకొంత క్షోభపడి, కష్టసుఖాలు తెలుసుకుని, ఆనందం, ప్రేమ, భక్తి రుచి చూసిన మనిషి, వివిధ రకాల పాత్రలను ప్రత్యేకతతో, ప్రజ్ఞతో నటించగలదని నా నమ్మకం. అందుకని ఈ అనుభవాలు ఏవీ లేని మనిషి నటించలేదు అని నేను అనను కాని, ఊహతో పాటు జీవితానుభవం మిళితమైన వ్యక్తి నటనలో లోతూ, పరిపూర్ణతా వుంటాయి. ఆంతరంగిక జీవితం మీద రంగస్థలం నటనకు ఎటువంటి ప్రభావం వున్నది ? చాలా వున్నది. నా మటుకు నాకు నాటకం పూర్తయి యింటికి వచ్చిన తరవాత ఒక పట్టాన నిద్రపట్టదు. నాటకాన్ని గురించి, ఆ నాటి నా నటనను గురించి, ప్రేక్షకుల అభిప్రాయాలను గురించి ఎవరితోనైనా గంటల తరబడి మాట్లాడాలనిపిస్తుంది. అమ్మ పోయిందన్న వార్త టెలిఫోన్ లో విని కళ్ళుతిరిగి నేను పడినప్పుడు నా చెయ్యి తగిలి బల్ల మీద వున్న రాధాకృష్ణుల బొమ్మ కిందపడడం సహజంగా ఉందా? నేను ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని కలలుకంటున్న మనిషి ఏదో భ్రమలో పడి నన్ను 'అమ్మా' అని పిలిచినప్పుడు నా ఆవేదనా, కళ్ళలో బాధా ఆఖరి వరుసలో వున్న వాళ్ళకు స్పష్టంగా తెలిసిందా ? ఊ... నాటకం ఐపోయిన తరువాత కూడా యిలా చాలా సేపటివరకూ ఆ పాత్ర నన్ను వదిలి వెళ్ళదు. ప్రేక్షకులు ఎక్కడ హర్షించారు ? ఎక్కడ సరిగ్గా రిసీవ్ చేసుకోలేక పోయారు లోపం ఎవరిది? రేపు ఆ ఘట్టంలో యిలా చేస్తే బాగుంటుందేమో అనే ఆలోచనలు నన్నెప్పుడూ వేధిస్తూనే వుంటాయి. పిల్లలూ, యిల్లూ, వంటా, ఆదాయపు పన్ను యిత్యాది వ్యక్తిగత సమస్యల మీద తగిన శ్రద్ధ చూపించవలసిన సమయాల్లో కూడా నా నటనను గురించి ఆలోచించడం మొదలుపెట్టి ఈ ప్రపంచాన్నే మరిచిపోతాను.

నాటకానికి ముందు ప్రశాంతత కోరుకుంటాను. ఎంత ప్రశాంతత కోరుకున్నా, రంగస్థలం మీదికి వెళ్ళబోతున్న ప్రతి ఒక్కసారీ నెర్వస్ గానే ఫీలవుతాను... ఏదో భయం.. ఈ వేళ ప్రేక్షకులు వేరు, నిన్నటి వాళ్ళు కారు. వీళ్ళ అభిరుచులు ఎలాంటివో ? వీళ్ళకు ఈ నాటకం నచ్చుతుందో లేదో ? మిగతా నటీనటులు ఎలా చేస్తారో... ఏం చేస్తారో... నేనేం చేస్తానో... యిన్నిసార్లు వేసిన నాటకం కదా అలా జరుగకూడదని ఏం జరుగుతుందని ఒక వైపు వివేకం ధైర్యం చెబుతూనే వుంటుంది. ఏమో, ఎలా చెప్పగలం ? ఏదయినా జరుగవచ్చు. ఈ భయం తప్పదు. అందుకే ప్రతి పదర్శనా కొత్తగానే వుంటుంది.

ఒకసారి బొంబాయిలో ఒక నాటకం వేస్తున్నాం. సీను ప్రారంభం అయింది. నేను నర్స్ ను. విజయ అనే అమ్మాయి హాస్పిటల్ కి వస్తుంది. డాక్టర్ ఆవిడను నాకు పరిచయం చేస్తాడు. విజయ నన్ను పరీక్షగా చూసి "ఎందుకో గాని మిమ్మల్ని చూడగానే నాకు మంచి అభిప్రాయం కలిగింది. మీరు తప్పకుండా మా యింటికి రావాలి" అంటుంది. "ఊఁ.. అలాగా" అని నేను ఆ కొత్త వ్యక్తి చొరవకు సిగ్గుపడుతూ ఏం మాట్లాడాలో తెలియక ఆడవాళ్ళకు చాలా సహజమైన ధోరణిలో "ఏమండీ, మీ చేతినున్న గాజు చాలా అందంగా వుంది" అంటూ ఆవిడ చేతికేసి చూశాను. ఆవిడ చేతికి గాజు లేదు! వేసుకు రావటం మరచిపోయింది ! "ఊఁ... అంత బాగుందా ? కావాలంటే మీరు తీసుకోండి, కొట్లో ఒక్కటే ఒకటి వుంటే కొన్నాను" అంటూ విజయ తన చేతినున్న గాజు తీసి నా చేతికివ్వాలి. తరువాత సీనులో ఆ గాజు నా చేతికి వుండడం కథకు చాలా అవసరం. అప్పుడు నేనేం చెయ్యాలి? అరక్షణంలో తేల్చుకోవాలి. ఇద్దరూ కంగారు పడితే అభాసవుతుంది. అలాంటప్పుడే రంగస్థల నటికి సమయస్ఫూర్తి కావాలి. ఆమె చేతికి గాజు వున్నట్టే, నేను నిజంగా తీసుకున్నట్టే నటించాను. ఇలాంటి చిన్న చిన్న లోపాలు, సరిదిద్దుకోవడాలు వుండబట్టే ప్రతి ప్రదర్శనా కొత్త ప్రదర్శన లాగే ఫీలవుతాం. ప్రతి ప్రదర్శన ముందు నటికి భయం, జాగ్రత్త తప్పకుండా వుండాలి. లేకపోతే నటన యాంత్రికంగా తయారయే ప్రమాదం వుంది. పాత్రలో జీవం వుండదు.

రంగస్థలం నాకు నేర్పినది క్రమశిక్షణ, టీమ్ వర్క్. ప్రతి ప్రదర్శనా ఒక కొత్త పాఠం, ఒక కొత్త అనుభవం. రంగస్థలం నాకింకా నేర్పుతోంది. నేనింకా నేర్చుకుంటూనే వున్నాను. నటిగా సంపూర్ణతను సాధించడానికి ఒక జీవితకాలం చాలదేమో. ప్రపంచంలో ఎంతమంది వున్నారో, అంతమంది బ్రతుకులు బ్రతకటానికి ఒక జీవితకాలం చాలుతుందా ?

# ప్రఖ్యాత చిత్రనిర్మాత

# బి.ఎన్.రెడ్డి - 1

## ( సినిమా - 1955, జనవరి సంచిక నుంచి)


జీవిత విశేషాలు :

ప్రఖ్యాత చిత్రనిర్మాత

బి. ఎన్. రెడ్డి

వాహినీవారి తొలి చిత్రం "వందేమాతరం" విడుదల అయి దాదాపు 16 సంవత్సరాలయింది. ఆనాటినుంచీ తెలుగు సినిమా పరిశ్రమ ఒక కొత్త ప్రతిష్ఠను సంపాదించుకున్నది. అంతకు పూర్వం సినిమా చిత్రాలను తక్కువ తరగతి కళగా భావిస్తూ వుండిన కళాభిమానులెందరో తమ అభిప్రాయాన్ని మార్చుకున్నారు. వాహినీ చిత్రాలు ఒకటి తరవాత మరొకటి ఈ ప్రతిష్ఠను ముందుకు తీసుకుపోయాయి. సినిమా చరిత్రలో ఈ పరిణామాన్ని సాధించిన వ్యక్తి బి. ఎన్. రెడ్డి.

ఇన్ని సంవత్సరాల కాలంలోనూ బి. ఎన్. విడుదల చేసిన చిత్రాలు అయిదు మాత్రమే—ఆరవది త్వరలో విడుదల కానున్నది. "స్వర్గసీమ" తరువాత చాలా ఏళ్ళు ఆయన చిత్రమే లేదు. అయినప్పటికీ ఆయన చిత్రం తీయని సమయంలో ఆయన స్థానం ఖాళీగానే వుండిపోయిందిగాని ఆ స్థానాన్ని మరొకరు ఆక్రమించుకోవటం

1939 లో బి. ఎన్. రెడ్డి

వాహినీ వారి తొలి చిత్రం "వందేమాతరం" విడుదల అయి దాదాపు 16 సంవత్సరాలయింది. ఆనాటినుంచీ తెలుగు సినిమా పరిశ్రమ ఒక కొత్త ప్రతిష్ఠను సంపాదించుకున్నది. అంతకు పూర్వం సినిమా చిత్రాలను తక్కువ తరగతి కళగా భావిస్తూ వుండిన కళాభిమానులెందరో తమ అభిప్రాయాన్ని మార్చుకున్నారు. వాహినీ చిత్రాలు ఒకటి తరవాత మరొకటి ఈ ప్రతిష్ఠను ముందుకు తీసుకుపోయాయి. సినిమా చరిత్రలో ఈ పరిణామాన్ని సాధించిన వ్యక్తి బి.ఎన్.రెడ్డి.

ఇన్ని సంవత్సరాల కాలంలోనూ బి.ఎన్. విడుదల చేసిన చిత్రాలు అయిదు మాత్రమే ఆరవది త్వరలో విడుదల కానున్నది. "స్వర్గసీమ" తరువాత చాలా ఏళ్ళు ఆయన చిత్రమే లేదు. అయినప్పటికీ ఆయన చిత్రం తీయని సమయంలో ఆయన స్థానం ఖాళీగానే వుండిపోయింది గాని ఆ స్థానాన్ని మరొకరు ఆక్రమించుకోవటం జరగలేదు. చిత్ర నిర్మాణంలో బి.ఎన్. సాగించేది ఒక ఉద్యమం అనుకున్నట్టయితే ఆ ఉద్యమంలో ఆయనకు పోటీగాని, సహాయంగాని లేదనే చెప్పవచ్చు.

ఆయన ప్రభావం ఇతరులపై లేదని కాదు.. చాలా వుంది. కాని ఆయనలాగా మరెవరూ తమ లక్ష్యాన్ని అంటిపెట్టుకుని చిత్రాలు తీయలేదు. అధిక సంఖ్యలో చిత్రాలు తీసీ, అధికంగా డబ్బుగడించే చిత్రాలు తీసీ నిర్మాతలు అర్జించలేని కీర్తీ, ఔన్నత్యమూ బి.ఎన్.కు వాటంతట అవే లభించాయి.

కడప జిల్లా, పులివెందల తాలూకాలోని కొత్తపల్లి గ్రామంలో 1908 నవంబరు 16 న బి.ఎన్. జన్మించాడు. అయితే ఆయన బాల్యం ఆయన జన్మస్థలానికి ఆరుమైళ్ళ దూరాన గల పొట్టిపాడు గ్రామంలో మాతామహుల యింట గడిచింది. తండ్రిగారు, నరసింహారెడ్డిగారు వేరుశనగ ఫాక్టరీ, జిన్నింగ్ ఫాక్టరీ పెట్టారు. ఆయన వ్యాపారం నిమిత్తం తరుచు తిరుగుతూండటం వల్ల బి.ఎన్. తల్లిగారితో సహా తాతగారి యింట కొంతకాలం గడపటం జరిగింది. బి.ఎన్. మాతామహులకు ఒకతే కూతురూ, ఒకడే కొడుకు. ఈ సమయంలో వారి కుమారుడు సి.హెచ్.రామరెడ్డి ఈయన డైరెక్టర్ ఆఫ్ ఎగ్రికల్చర్ గా దరిమిలా పనిచేశారు. చదువు నిమిత్తం ఇంగ్లాండు వెళ్ళి ఉండటం చేత, బి.ఎన్. ను అమ్మమ్మ చాలా గారాబంగా చూసేది. ఆమె కథలు చెప్పటంలో నిధి. కథలలో తృష్ణ కలగటానికి బి.ఎన్. కు ఈమె చాలా తోడ్పడింది.

చిత్రావతీ నది నానుకుని వున్న పొట్టిపాడు గ్రామం. కొత్తపల్లి లాగ కాక, చాలా అందమైనది. అందుచేత బి.ఎన్. బాల్యం అక్కడ ఆనందంగా గడిచింది. మట్టి బొమ్మలు చెయ్యటమూ, తాటాకులతో చేసిన గాలి బొంగరాలు తిప్పుతూ, ఆకాశం కేసి చూస్తూ బి.ఎన్. నిరాటంకంగా ఏవేవో కలలు కన్నాడు.

ఆయన ఏ రెండేళ్ళ వాడో అయి వుండగా ఒక రాత్రి వీధినాటకం అయిందిట. మర్నాడు ఆ నాటకానికి సంబంధించిన వాళ్ళు యాచనకు వచ్చినప్పుడు బి.ఎన్. కిందటి రాత్రి వాళ్ళు పాడిన పద్యమంతా ఏకరువుపెట్టాడట. అది చూసి తాతగారు, "ఇంత తెలివిగలవాడు ఏం బతుకుతాడు?" అన్నారట. తరవాత కొద్ది రోజులకే బి.ఎన్. కు తీవ్రమైన జబ్బు టైఫాయిడ్ అయివుండాలి వచ్చి, దాని నుంచి కోలుకున్నాక పునర్జన్మ ఎత్తినట్టయి. నడవటమూ, మాటలు మళ్ళీ నేర్చుకోవలసి వచ్చిందట.

బి.ఎన్. అక్షరాభ్యాసమూ, తెలుగులో ఒకటి రెండు వాచకాలూ తాతగారి ఇంట వుండగానే పూర్తి అయాయి. ఇంగ్లీషు చదువుకోసం ఆయనను ప్రొద్దుటూరు పంపి హైస్కూలులో ప్రవేశ పెట్టారు. ఇది కూడా అందమైన గ్రామం. గ్రామం వెంబడే ప్రవహించే పెన్నార్ నదీ, ఇసుక దిబ్బలూ ఆయనకు ఆనందాన్ని చేకూర్చేవి. అయితే బి.ఎన్. ఇక్కడ వున్నది ఒక సంవత్సరం మాత్రమే.

ఈ లోపుగా నరసింహారెడ్డి గారి వ్యాపారం మద్రాసులో కేంద్రీకృతమైంది. ఆయన సకుటుంబంగా అక్కడే స్థిరపడి పోవాలని నిశ్చయించారు. మద్రాసుకు వస్తూనే బి.ఎన్. ను తొండమండలం హైస్కూలులో అయిదవ తరగతిలో ప్రవేశపెట్టారు. మరుసటి ఏడు గోవిందప్పనాయకన్ హైస్కూలులో ఫస్ట్ ఫారంలో ప్రవేశించాడు. ఇక్కడే బ్రిజ్ మోహన్ దాస్ అనే కుర్రవాడు బి.ఎన్. కు సహాధ్యాయిగా తటస్థపడ్డాడు. ఇద్దరికీ మంచి స్నేహం కుదిరింది.

ఈ స్కూలులో చదువుతుండగా బి.ఎన్.కు తొలిసారిగా గ్రీజ్ పెయింట్ వేసుకుని స్టేజి ఎక్కి, రవీంద్రనాథ్ టాగూర్ రచించిన "ఆటమ్ ఫెస్టివల్" అనే నాటకంలో గాలిపటం ఎగరవేసే కుర్రాడుగా నటించటం జరిగింది. ఈ నాటకాన్ని బారతీ లైబ్రరీ వారు ఏర్పాటు చేశారు. ఈ నాటకానికి అధ్యక్షత వహించిన దర్శి చెంచయ్య గారు ("నేనూ నాదేశం" గ్రంథకర్త) నాటకం గురించి మాట్లాడుతూ బి.ఎన్. ను గురించి ప్రత్యేకంగా మాట్లాడారట. కాని నిజానికి బి.ఎన్. కు అప్పటికి నాటకమంటే ఏమిటో కూడా తెలీదు. ఈ నాటకంలో ఆయన చెప్పవలసిన వాక్యం ఒకటే ఉంది. దాన్ని పెద్దవాళ్ళు ఆయన చేత కంఠస్థం చేయించారు. తరువాత ఆయన టాగూర్ "శాక్రిఫైస్" నాటకంలో కూడా ఒక చిన్నపాత్ర ధరించాడు. కాని ఆయనకు నిజమైన నాటకాలపిచ్చి త్వరలోనే కలగనున్నది.

థర్డ్ ఫారం పూర్తికాగానే బి.ఎన్. చదువు ముత్యాలపేట హైస్కూలుకు మారింది. ఇక్కడ చదువుతున్న కాలంలో ఆయన విద్యార్థుల పోటీలలో పాల్గొని వక్తృత్వానికీ పఠనానికీ బహుమానాలు పొందుతూ ఉండేవాడు. ఇక్కడ చదువుతున్న కాలంలోనే ఆయన మొట్ట మొదటి సారిగా, చెప్పుకోదగిన తెలుగునాటకం, డా.గోవిందరాజుల సుబ్బారావు గారు నటించిన "ప్రతాపరుద్రీయం" చూడటం తటస్థించింది. బి.ఎన్. మీద దీని ప్రభావం ఇంతా అంతా కాదు.

ఏదైనా తనను ఆకర్షిస్తే దానిని గురించి కలలుగనే మనస్థత్వం బి.ఎన్. ది నాటకాలు ఆయనను బలంగా పట్టుకున్నాయి. వాటితో సన్నిహిత సంబంధం పెట్టుకోవాలనీ, నటులనూ, రిహార్సల్స్ నూ చూడాలనే బలమైన కాంక్ష కలిగింది. దీనిని తృప్తి పరుచుకునేటందుకు ఆయన గోడౌన్ స్ట్రీట్ లో ఉండే ఆంధ్రనాటక సభలో చేరాడు. సభకు అందరికన్న ముందు వెళ్ళటం, అందరికన్న ఆలస్యంగా బయలుదేరి. పొద్దుపోయి ఇంటికి వచ్చి, పెద్దవాళ్ల చేత మాటలు పడటం జరుగుతూండేది. ఈ అవకాశం దొరికినందుకు బి.ఎన్. ఎవరికి ఏ సహాయం కావలసినా చేస్తూ ఉండేవాడు. అప్పుడప్పుడూ ఎవరైనా తక్కువైతే చిల్లర వేషాలు కూడా వేసేవాడు. ఈ ప్రపంచంలోకి తనకు ప్రవేశం దొరికిన ఆనందంలో ఇంట్లో ఎన్ని చీవాట్లు పడినా ఆయనకు తగిలేవి కావు. ఈ దశలో ఆయనకు నటులను అనేకమందిని సన్నిహతంగా చూసే ఆవకాశం కలిగింది. పారేపల్లి సుబ్బారావు, మాధవపెద్ది వెంకట్రామయ్య, బళ్ళారి రాఘవాచారి, బెల్లంకొండ సుబ్బారావు మొదలైన వారందరినీ ఈ విధంగా ఆయన చూడగలిగాడు. ఈ సభలోనే నీలంరాజు వెంకట శేషయ్యగారి మైత్రికూడా బి.ఎన్.కు లభించింది. బి.ఎన్.కు నాటకరంగంతోనూ, తెరవెనుక భాగోతంతోనూ సన్నిహిత సంబంధం ఏర్పడటానికి నీలంరాజు శేషయ్య గారు చాలా తోడ్పడ్డారు. ఇందుకు బి.ఎన్. ఆయనకు చాలా కృతజ్ఞుడు.

1927లో బి.ఎన్. కు వివాహమయింది. వధువు మేనత్తకూతురే. వివాహం మద్రాసులోనే జరిగింది. 1928లో ఆయన పచ్చయప్ప కళాశాలలో చేరి ఇంటర్ చదివాడు. ఈ ఇంటర్ చదువు 1930 సెప్టెంబరులో గాని పూర్తి అయింది కాదు. అందుచేత కొద్దికాలం కాలేజినుంచి విముక్తి కలిగింది. ఈ కాలంలో బి.ఎన్. ను తండ్రిగారు తమ వ్యాపారం చూసి రావటానికి గాను కలకత్తా పంపారు. ఇక్కడ బి.ఎన్. తమ ఎగుమతి-దిగుమతి వ్యాపారం

చూడటానికి బదులుగా శిశిర్ కుమార్ బహదూరీ నాటకాలూ, అహీన్ చౌధురీ నాటకాలూ, ధనీబాబూ, అంగుర్బాలా మొదలైన వారి నాటకాలూ, కొరిన్తియన్, ఆల్ఫ్రెడ్ థియేటర్ల నాటకాలూ చూశాడు.

తరువాత బి.ఎన్. కు శాంతి నికేతనం వెళ్ళి అక్కడ ఒక నెల గడిపే అవకాశం దొరికింది. అక్కడి వాతావరణం చూశాక ఆయనకు బి.ఏ. చదువు అక్కడే సాగించాలనిపించింది. దీనికిగాను తండ్రిగారి అనుమతి పొందాలని ఆయన మద్రాసుకు తిరిగి వచ్చేసరికి బర్మాకు ప్రయాణం తగిలింది. రంగూన్ లో కూడా ఆయన తమ వ్యాపారం గురించి తెలుసుకున్నదానికంటే అక్కడి ఒపెరాలూ, స్టేజీషోలూ చూడటం జాస్తి అయింది. ఆయన రంగూన్ నుంచి లాషో, మాండలే మొదలైన అనేక చోట్లకు తిరిగి దేశాటన చేశాడు.

బి.ఎన్. బర్మాలో ఉండగానే గాంధీ మహాత్ముడు దండీ సత్యాగ్రహం ప్రారంభించాడు. బర్మాలో కూడా జాతీయోద్యమం ఉన్నతంగా సాగింది. ఒక పార్క్ లో విదేశీ వస్త్రాలన్నీ పెద్ద కుప్పవేసి తగలబెట్టటం బి.ఎన్. కళ్ళారా చూశాడు. బ్రహ్మాండమైన ఊరేగింపూ, బహిరంగ సభా జరిగాయి. ఈ ఉద్యమం చూసి బి.ఎన్. రక్తం పొంగిపోయింది. ఇందులో పాల్గొనాలనే ధృఢనిశ్చయంతో ఆయన మద్రాసుకు తిరిగివచ్చాడు. ఆయన మద్రాసులో పడవ ఎక్కినప్పుడు విదేశీ పద్ధతిలో సూటూ, టై మొదలైనవి వేసుకుని ఉన్నాడు. ఆయన తిరిగి మద్రాసు రేవులో దిగినప్పుడు ఖద్దరు ధోవతీ, ఖద్దరు లాల్చీ ధరించి ఉన్నాడు.

మద్రాసులో కూడా ఉద్యమం జోరుగా ఉంది. నిత్యమూ ఊరేగింపులు. బి.ఎన్. ఆ ఊరేగింపుల వెంట వెళ్ళేవాడు. ఆయన వెంట ఆయన తమ్ముడు నాగిరెడ్డి కూడా ఉండేవాడు. ఈ ఉద్యమంలోన బి.ఎన్. మొదటిసారి దుర్గాభాయిగారిని ఇప్పటి దేశముఖ్ సతిని ఒక నాయకురాలుగా చూశాడు.

మద్రాసులో ఉంటే పిల్లలు ఏమి చేసి పోతారో అని తండ్రిగారు వాళ్ళను స్వగ్రామానికి పంపారు. అక్కడ వాళ్ళు ఏమీ చెయ్యరని ఆయన భ్రమ !

దేశమంతా చెలరేగ ఈ మహోద్యమం కడపజిల్లాలో లేదని విని విచారిస్తున్న బి.ఎన్.కు మంచి అవకాశం దొరికింది. స్వగ్రామం చేరి ఆయన అక్కడ "దత్త మండల చరఖా సమితి" స్థాపించాడు. చాలామంది వాలంటీర్లను వారిలో కొందరు ఆయన బంధువులే చేరదీశాడు. ఈ వాలంటీర్ దళం గ్రామ గ్రామానికీ వెళ్ళి చరఖాలు బాగుచెయ్యటమూ, పత్తి పంచటమూ, పాటలు పాడుతూ సంచారాలు చెయ్యటమూ, గ్రామలలో ఉపన్యాసాలివ్వటమూ చేసేది. అసలే వేసవికాలం, అందులోనూ రాయలసీమ. దీనికి తగ్గట్టు చాలామంది వాలంటీర్లు, ఇలాంటి పవిత్రమైన పనిమీద పాదరక్షలు ధరించి పోరాదని పట్టుబట్టారు. జనవాక్యం శిరసావహించి బి.ఎన్. పాదరక్షలు విసర్జించాడు. అసలే నడిచే అలవాటు లేదు. దానికి తోడు పాదరక్షలు కూడా లేవు. అయినా ఒక్క రోజులో ఆయన వాలంటీర్లను వెంటవేసుకుని 19 మైళ్ళు నడిచి అయిదు గ్రామాలు తిరగటమూ, కాళ్ళు బొబ్బలెక్కటం జరిగింది.

ఈ ఉద్యమంలో ఒక భాగం, సంతలలో కల్లుదుకాణాలు పికెటింగ్ చెయ్యటం. ఒకనాడు సింహాద్రిపురం అనేచోట సంత జరుగుతూంటే బి.ఎన్., వాలంటీర్లూ అక్కడికి వెళ్ళారు. బి.ఎన్. కల్లుదుకాణం దగ్గిర పికెటింగ్ ప్రారంభించాడు. కొంత సేపు పికెటింగు సాగినాక ఒక పోలీసు అధికారి, దుకాణం మూసేయిస్తున్నానని చెప్పి బి.ఎన్. ను పంపించేశాడు. ఆయన సైకిల్ మీద ఒంటరిగా బయలుదేరి ఇంటికి చేరుకున్నాడు. మిగిలిన వాలంటీర్లు మాత్రం సంతలోనే ఉండిపోయారు.

బి.ఎన్. వెళ్ళిపోయిన కొంతసేపటికి ఆ సంతలోనే ఒక మనిషి హత్య జరిగింది. హత్య అయినవాడు బి.ఎన్. గ్రామం వాడే.

బి.ఎన్. ప్రారంభించిన ఉద్యమాన్ని అణచటానికి అధికారులకు ఈ హత్య ఉపయోగపడింది. బి.ఎన్. మీదా మిగిలిన వాలంటీర్ల మీదా హత్యా నేరం మోపబడినట్టు తెలిసింది. లోపాయకారిగా విచారించగా. "నువు ప్రారంభించక పూర్వం ఈ జిల్లాలో ఉద్యమం లేదు. దీన్ని విరమించేటట్టయితే కేసు లేకుండా చేస్తాం." అని చెప్పారు. అసలే ఈ హత్యతో మనసు వేసారిపోయి వున్న బి.ఎన్.కు ఇందులో తన అనుచరులంతా ఇరుక్కోవటం మరింత దుస్సహంగా తోచి ఆయన తన ఉద్యమాన్ని ముడిచి పెట్ట వలసివచ్చింది. స్వగ్రామానికి వచ్చిన కొన్న మాసాలకు ఆయన ఉద్యమం చాలించి, పెద్ద పరివర్తన పొంది తమ్ముడు నాగిరెడ్డితో మద్రాసుకు తిరిగివచ్చాడు.

ఆనాడు ఆ సంతలో ఈ దారుణ హత్యే జరక్కపోతే బి.ఎన్. ఈ కాలానికి చిత్రనిర్మాతగా పేరు సంపాదించుకోవటానికి బదులు కిందటి ఆంధ్ర శాసనసభలో ప్రభుత్వం మీద వచ్చిన విశ్వాసరాహిత్య తీర్మానానికి అనుకూలంగానో ప్రతికూలంగానో వోటుచేసి ఉండునేమో

బి.ఎన్. ప్రారంభించిన దత్తమండల చరఖా సంఘం గురించి ఒక ముక్క చెప్పాలి. తండ్రిగారిని ఉద్యమానికి డబ్బడిగితే రాదనే భయంతో ఖాదీవ్యాపారం లాభసాటిగా ఉంటుందని చెప్పి బి.ఎన్. తండ్రిగారి దగ్గిర కొంత డబ్బు తీసుకున్నాడు. కాని ఏకులూ, రాటాలూ తీసుకున్న వారు కొంత

నూలు దాచుకుని మిగిలిన దానిలో రాళ్ళు పెట్టి తూచి మోసం చేశారు. నేసిన ఖద్దరు బట్టలు అమ్మిదామంటే అఖిలభారత చరఖా సంఘం వారు సకాలంలో ఈ సంఘాన్ని గుర్తించలేదు. బట్ట యావత్తూ ఊరికే పంచి పెట్టటం జరిగింది.

ఆయనకు చదువు మీద ధ్యాసపోయింది. అందుచేత ఆయన కాలేజీకి స్వస్తి చెప్పి. ఊరికే కూచోవటానికి మనస్సు ఒప్పక ఉదయమూ సాయంకాలమూ జరిగే జి.డి.ఏ. క్లాసులకు వెళ్ళసాగాడు. జి.డి.ఏ పూర్తి అయినాక ఆయన శాస్త్రి అండ్ షా కంపెనీలో ఎప్రెంటిస్ గా చేరాడు. ఈ పనిలో బి.ఎన్. ఆగ్ఫా కంపెనీవారి ఎకౌంట్లు ఆడిట్ చేయవలసి వచ్చింది. అక్కడ పని పూర్తి కాగానే ఆయన కాలయాపనకు గాను వుడ్స్ రోడ్ లో వుండే "ప్రజామిత్ర" ఆఫీసుకు వెళ్ళే అలవాటుండేది.

బి.ఎన్. కు అలవడిన ఆసక్తులలో ఒకటి జర్నలిజం, రచన. దీనికి కారకులు స్వర్గీయ ఎస్.జి. ఆచార్యగారు. బి.ఎన్. మద్రాసుకు వచ్చి చాలా కాలం తమిళ స్నేహితులతోనే తిరగటం చేత ఆయనకు తెలుగు భాషతోనే సంపర్కం లేకపోయింది. ఈ దశలో ఎస్.జి. ఆచార్యగారు తటస్థపడి, తెలుగురచనలోనూ, తెలుగు పత్రికలోనూ ఆసక్తి రగిలించారు. దీని ఫలితంగా ఆయనకు "ప్రజామిత్ర" వంటి పత్రిక నడిచేచోటికి వెళ్ళటమూ, చూడటమూ సరదాగా ఉండేది.

అదీగాక ఆయనకు రామబ్రహ్మం పరిచయం నాట్యకళా పరిషత్తుద్వారా అయింది. మద్రాసులో బళ్ళారి రాఘవాచార్లు గారి అధ్యక్షతను పరిషత్తు జరిగినప్పుడు దానికి కార్యదర్శులు రామబ్రహ్మం, నీలంరాజు శేషయ్యగారూ, వారితో పాటు బి.ఎన్. ఆ పరిషత్తులో చాలా పనిచేశారు. ఈ పరిషత్తులోనే "తప్పెవరిది?"లో బి.ఎన్. చిన్న పాత్ర కూడా ధరించాడు.

"ప్రజామిత్ర" ఆఫీసులో రామబ్రహ్మం, సముద్రాల రాఘవాచార్లు, శ్రీనివాసశిరోమణి, తాపీ, నార్ల, గోపీచందు మొదలైన వారుండేవారు. వారు పనిచేసే వాతావరణమూ, ఆ పాతకాలపు ప్రెస్సూ చూస్తుంటే బి.ఎన్. కు రకరకాల భావాలు కలిగేవి.

బి.ఎన్. కనిన కలల్లో ఒకటి మంచి ప్రెస్ ఏర్పాటు చేసి, భారీగా పుస్తకాలూ, పత్రికలూ ప్రచురించి హిగిన్ బాదమ్స్ పద్ధతిలో దేశమంతటా పుస్తకాల షాపులు పెట్టాలని. ఈకలలోనుంచి ప్రెస్ పెట్టాలనే కోరిక ఆవిర్భవించింది. ఆయన వెంటనే తండ్రి గారి నడిగి పదివేలు తీసుకుని ఆచారప్పన్ వీధిలో ఒక ప్రెస్ ఏర్పాటు చేసి, దాని ప్రారంభోత్సవం రామబ్రహ్మం గారిచేత చేయించి, "ప్రజామిత్ర" పత్రికను అందులోనే అచ్చువేసుకోమన్నాడు. ఈ ఏర్పాట్లకు కుమ్మక్కీ ఇచ్చినవాడు బి.ఎన్. చిన్ననాటి స్నేహితుడి బ్రిజ్ మోహన్ దాస్. ఈయన బియ్యే పూర్తి చేసినాక వెంటనే ఉద్యోగం దొరకక నరసింహా రెడ్డిగారి వ్యాపారంలోనే పనిచేస్తూండేవాడు. 1944లో ఈ ప్రెస్ నాగిరెడ్డి నిర్వహణ కిందికి వచ్చేనాటికి బి.ఎన్. చిత్రనిర్మాణంలో మెడలోతున దిగిపోయి వున్నాడు.

## ప్రఖ్యాత చిత్రనిర్మాత

# బి.ఎన్.రెడ్డి - 2

### ( కినిమా - 1955, ఫిబ్రవరి సంచిక నుంచీ)

బి.ఎన్. ఎన్నో కలలు కన్నాడు. ఆయన కన్న కలలు కొన్ని రూపొందలేదు. కొన్నిటికి మరెవరో రూపం ఇచ్చారు. కాని సినిమాలను గురించి మాత్రం ఆయన కలలు కన్నట్టు కనపడదు! ఆయన సినిమాలలోకి ప్రవేశించటం ఆయన ప్రయత్నం దాదాపు ఏమీ లేకుండానే జరిగింది.

రామబ్రహ్మంగారు ఒక వంక "ప్రజామిత్ర" నడుపుతూనే మరొక వంక సినిమాలలో కూడా వేలుపెట్టి ఉంచాడు. ఆ కరణం చేత "ప్రజామిత్ర" ఆఫీసుకు వచ్చేవారిలో "ద్రౌపదీ వస్త్రాపహరణం" నిర్మాత పారుపల్లి శేషయ్య బి.ఎన్.కు పరిచయం కూడా అయింది.

"వస్త్రాపహరణం" అయినాక వేల్ పిక్చర్స్ స్టూడియోలో "కనక తార" ప్రారంభించారు. ఒకనాడు శేషయ్య గారు "ప్రజామిత్ర" ఆఫీసుకు వచ్చి, వేల్ పిక్చర్స్ లో కొత్తగా స్టూడియో లైట్లు ఏర్పాటు చేసి షూటింగ్ చేస్తున్నారనీ, ఒకసారి వచ్చి చూడమనీ బి.ఎన్.తో అన్నారు. పోనీ చూస్తామని బి.ఎన్.




అక్కడికి వెళ్ళాడు. స్టూడియోలో శేషయ్య గారు బి.ఎన్. కు హెచ్.ఎం.రెడ్డి గారిని పరిచయం చేశారు. హెచ్.ఎం.రెడ్డి గారు రైలుకు వెళ్ళుతున్నారట. "ఆయనను మీ కారులో స్టేషన్ దగ్గర వదలండి." అని శేషయ్య గారు బి.ఎన్. తో అన్నారు.

రైలుకు టైముండటం వల్ల బి.ఎన్., హెచ్.ఎం. బీచ్ కి వెళ్ళి అక్కడ కొంతసేపు కూచున్నారు. అక్కడ హెచ్.ఎం. రెడ్డిగారు తానొక సినిమా కంపెనీ పెట్టబోతున్నాననీ, అందులో గొప్ప గొప్పవాళ్ళంతా షేర్లు తీసుకుంటున్నారనీ, బి.ఎన్. కూడా షేరు తీసుకోవాలనీ కోరారు. కాని బి.ఎన్. కు మనసు మొగ్గలేదు. తరువాత హెచ్.ఎం. రెడ్డి గారు చాలా సార్లు వచ్చి నరసింహారెడ్డి గారితో మాట్లాడి ఆయననే ఒప్పించారు.

కంపెనీకి "రోహిణీ పిక్చర్స్ లిమిటెడ్" అని పేరు పెట్టారు. కంపెనీ తాలూకు ఆర్టికిల్స్, మెమొరాండం బి.ఎన్. తయారుచేశాడు. ఈ కంపెనీలో కన్నాంబకూ, దొమ్మేటి సూర్యనారాయణకూ కూడా వాటాలున్నాయి. దొమ్మేటితో "రంగూన్ రౌడీ" తీయాలని సంకల్పం. ఈ సంస్థలో షేర్లు తీసుకుంటారనుకున్న వారు కొందరు వెనక్కు తగ్గారు. అందుచేత బి.ఎన్. తన పరిచయస్తుల చేతా, మూలా నారాయణాస్వామి గారి చేతా ఆ షేర్లు కొనిపించాడు. కంపెనీకి మేనేజింగ్ ఏజెంట్స్ రెడ్డి అండ్ కో. ఇందులో హెచ్.ఎం., బి.ఎన్. భాగస్వాములు.

మూలా నారాయణ స్వామి గారిని గురించి వినివున్నప్పటికీ బి.ఎన్. కు మొదట్లో పరిచయం లేదు. ఒకసారి ఆయన అనంతపురులో ప్రెస్ పెట్టే ఉద్దేశ్యంతో యంత్ర సామాగ్రి కొనటానికి మద్రాసు వచ్చి. ఈ విషయమై బి.ఎన్. సహాయపడగలవాడని విని ఆయన వద్దకు వచ్చారు. ఆనాటినుంచీ ఇద్దరికీ పరిచయమూ, స్నేహమూ కలిగింది.

"కనకతార" పూర్తి కాకమునుపే దొమ్మేటి మరణించాడు. ఆ కారణం చేత రోహిణీ సంస్థ "రంగూన్ రౌడీ" తీసే అవకాశం లేకపోయింది. ఆ కథనే కొద్దిగా మార్చి "గృహలక్ష్మి" అని పేరుపెట్టి చిత్రం తయారు చేశారు. ఈ చిత్రం కార్తికేయ స్టూడియోలో తయారయింది. రామనాథ్, శేఖర్ గార్లు ఆ స్టూడియోలో అప్పుడు భాగస్వాములు.

"గృహలక్ష్మి" పూర్తి అయే సమయంలో బి.ఎన్., హెచ్.ఎం. గార్లు విడిపోవలిసి వచ్చింది. ఆ యిద్దరి దృక్పథాలలోనూ గల తేడాయే దీనికి ప్రధాన కారణం.

రోహిణీ సంస్థనుంచి తన వాటా, తాను వేయించిన వాటాలూ తీసివేసుకుని ఇతరుల సొమ్ము వారికి వాపస్ చేసేటప్పుడు ఆ మిత్రులు తమకు సొమ్ము అవసరం లేదనీ, చాతనయితే ఇంకో కంపెనీ పెట్టి చిత్రాలు తీయమనీ అన్నారు. ఈ మాటలే వాహినీ సంస్థకు ఆశీర్వచనం. 65వేల రూపాయల మూలధనంతో బి.ఎన్. మేనేజింగ్ డైరెక్టరుగా సంస్థ రిజిస్టరయింది. ఎక్కడెక్కడి నదులూ వచ్చి సముద్రంలో చేరినట్టుగా, రామనాథ్ కామెరా మాన్ గా, శేఖర్ ఆర్ట్ డైరెక్టర్ గా, సముద్రాల కవిగా వచ్చారు. కె.వి.రెడ్డి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ గా, బ్రిజ్ మోహన్ దాస్ కంపెనీ సెక్రెటరీగా, నాగయ్య మ్యూజిక్ డైరెక్టరుగా పని చేశారు.

కథ ఒకటి కావాలి. బి.ఎన్. రాస్తున్న నవల ఒకటి ఉన్నది. అది సినిమా కోసం రాస్తున్నది కాదు. కాని రామనాథ్ ఆ కథను చూసి చిత్రం తీయటానికి పనికి వస్తుందన్నాడు. తానే దాని ఆధారంతో స్క్రిప్ట్ తయారు చేశాడు కూడా. "గృహలక్ష్మి" లో పనిచేసిన నాగయ్య, కాంచనమాల ప్రధాన పాత్రలకు కుదిరారు.

ఈ చిత్రం వెనక బి.ఎన్. భావాలు ఎన్నో వున్నప్పటికీ దీన్ని ఆయన డైరెక్ట్ చేయలేదు. డైరెక్ట్ చేద్దామని ఆశించలేదు కూడా. సెట్టు మీద డైరెక్టరు విధులన్నీ రామనాథే నిర్వర్తించాడు. కాని తీరా చిత్రం పూర్తి అయినాక రామనాథ్ పట్టుబట్టి. డైరెక్టరుగా బి.ఎన్. పేరు వేయించాడు. "టెక్నికల్ డైరెక్షన్ తెలియక పోతేనేం? మిగిలిన డైరెక్షన్ భాధ్యతలన్నీ మీకే బాగా తెలుసు!" అని రామనాథ్ వాదించాడు.

మరుసటి ఏడు వాహినీ వారి రెండవచిత్రం "సుమంగళి" వెలువడింది. దీనికి కథా, స్క్రిప్టూ కూడా రామనాథ్ రాశాడు. 1941లో "దేవత" విడుదల అయింది. 1943లో కె.వి. రెడ్డి గారి దర్శకత్వంతో "భక్తపోతన" వెలువడింది. ఈ నాలుగు చిత్రాలలోనూ రామ్ నాథ్ శేఖర్ గార్లతో సన్నిహితంగా కలిసి పనిచేయటం బి.ఎన్. కు ఎంతో లాభించింది.

"భక్త పోతన" పూర్తి అయేసరికి ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. యుద్ధం మూలంగా పరిస్థితులు చాలా తారుమారయాయి. వాహినీ పిక్చర్స్ కొద్ది పెట్టుబడిగల సంస్థ. చిత్ర నిర్మాణం చూడబోతే లక్షలలోకి పోయింది. అందుచేత ఇంకొక సంస్థ ఏర్పరచవలసి వచ్చింది. వాహినీ ప్రొడక్షన్స్ ఏర్పాటు చేశారు. ఇందులో నూరింట 80 వంతులు డబ్బు మూలా నారాయణస్వామి గారిది. వాహినీ పిక్చర్స్ కు ఇందులో ఒక వాటా ఉంది. బి.ఎన్., కె.వి.రెడ్డి, దాస్, మొదలైన వారు కూడా వాటాలు తీసుకున్నారు. వాహినీ పిక్చర్స్ సంస్థను డిస్ట్రిబ్యూషన్ సంస్థగా ప్రత్యేకించారు. వాహినీ ప్రొడక్షన్స్ కు కూడా మేనేజింగ్ డైరెక్టరు బి.ఎన్. రెడ్డే.

ఈ కొత్త సంస్థతో ఒకేసారి రెండు చిత్రాలు ప్రారంభించాలని ఉద్దేశం. కాని దీనికి విఘ్నంగా రాఫిలిం కొరతా, కంట్రోళ్ళూ, పర్మిట్లు వచ్చాయి. ఈ సమయంలోనే రామనాథ్, శేఖర్ గార్లు వాహినీ సంస్థను విడిచిపెట్టి జెమినీ సంస్థలోకి వెళ్ళిపోయారు.

"స్వర్గసీమ"కు పూర్వం చిత్ర ప్రపంచంలో కొందరికైనా ఒక అపోహ ఉండేది. వాహినీ చిత్రాలలో ఘనత చాలా వరకు రామనాథ్ శేఖర్ గార్లదేనని. "స్వర్గసీమ" లో వీరు లేకపోవటం అటుంచి, ఇది పూర్వపు వాహినీ చిత్రాల కంటే కూడా బాగా నడిచింది. "స్వర్గసీమ" కు కథకుడు చక్రపాణి. 1943 లో చక్రపాణికీ బి.ఎన్. కూ ఈ విధంగా పరిచయం ఏర్పడింది.

"స్వర్గసీమ" అనంతరం బి.ఎన్. వెనక్కు తిరిగి చూచుకుని తన స్థితిని సింహావలోకనం చేసుకుంటే నిస్పృహ కలిగింది. దామాషాను మూడేళ్ళ కొక చిత్రం డైరెక్టు చేసి ఆ సంపాదన మీద జీవించాలంటే చాలా కష్టంగా కనబడింది. ఈ చిక్కునుంచి బయట పడటానికి ఆయనకు రెండే మార్గాలు : ఇతరులకు చిత్రాలు తీసిపెట్టటం, లేదా ఒకదాని వెనక మరొకటిగా చిత్రాలు తయారుచేసే సావకాశాలు కల్పించుకోవటం.

మూలా నారాయణస్వామి గారు రెండో సౌకర్యం కలిగించటనికి తోడ్పడతామన్నారు. ఆయన దగ్గిర స్టూడియో నిర్మించడానికి డబ్బున్నది కాంగ్రెసు ప్రభుత్వం ప్రొహిబిషన్ అమలు జరిపితే నారాయణస్వామిగారి డిస్టిలరీ మూసి వేయాలి. అటువంటి సందర్భంలో తాను నిర్వహించేందుకు స్టూడియో లాంటిది వున్నట్టయితే ఆయన కూడా మద్రాసులో నివాసం ఏర్పాటు చేసుకుని స్టూడియో చూసుకుంటూ వుండవచ్చు.

నారాయణస్వామిగారి కోరిక ప్రకారం 1945లో బి.ఎన్. వాహినీ స్టూడియో నిర్మాణభారం తనమీద వేసుకున్నాడు. ఈ పని నాలుగేళ్ళు పట్టింది. నారాయణస్వామిగారు ఊహించినట్లు ప్రొహిబిషన్ వచ్చింది. ఆయన మద్రాసులో నివాసం కూడా ఏర్పరుచుకున్నారు.

స్టూడియో నిర్మాణం ప్రారంభించే సమయంలో మూలావారు, బి.ఎన్., నాగిరెడ్డి, కే.వి.రెడ్డి ప్రభృతులందరూ తలా ఒక ఇటుకా పెట్టి శంకు స్థాపన చేశారు. స్టూడియో ప్రారంభోత్సవం ఏ నాయకులచేతనో, హోదాలో ఉన్న వారిచేతనో చేయించాలని కొందరు సూచించారు గాని ఈ సూచన బి.ఎన్. కు నచ్చలేదు. స్టూడియో ప్రారంభోత్సవం కళాకారులైన వారే చేయాలని ఆయన పట్టుదల. అదే ప్రకారం, ప్రఖ్యాత కర్నాటక గాయనీమణి అయిన శ్రీమతి పట్టమ్మాళ్ చేత ప్రారంభోత్సవం చేయించారు. ఆమె "వాతాపి గణపతిం భజే" అనే పాట పాడింది.

కాని కాలం ఖర్మం కలిసి రాలేదు. మూలావారి ఆరోగ్యమూ, ఆర్థిక పరిస్థితులూ ఒకేసారి తారుమారయాయి. స్టూడియో విక్రయించవలసిన పరిస్థితి కూడా ఏర్పడింది. ఆ పరిస్థితి నుంచి బయటపడటానికి స్టూడియోను విజయ ప్రొడక్షన్స్ వారికి గుత్తకివ్వవలిసి వచ్చింది.

దీనితో బి.ఎన్. ఆఖరు కల కరిగిపోయింది. వాహినీ సంస్థలన్నిటిపైనా తనకు గల బాధ్యతలనన్నింటినుంచీ తప్పుకుని ఆయన తన సినిమా జీవితాన్ని తిరిగి వ్యవస్థాపించుకున్నాడు; అది వాహినీ చిత్రాలకు ప్రొడ్యూసరు గానూ, డైరెక్టరుగానూ పనిచేయటం. ఈ దశలో ఆయన "మల్లీశ్వరి" తయారు చేసి 1951 డిసెంబరులో విడుదల చేశాడు. బి.ఎన్. స్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. మూడేళ్ళ కొక చిత్రం తీసే అవకాశం మటుకే మిగిలింది.

బి.ఎన్. జీవితంలో, ప్రయత్నాలలో ఏ ఒడుదుడుకులు ఏర్పడినా ఆయన ఖ్యాతి మాత్రం ఒక్కొక్క చిత్రంతోనూ ముందడుగు వేస్తూనే వుంది. "మల్లీశ్వరి" ఎక్కువ డబ్బు అర్జించినా, అర్జించకపోయినా అంతులేని ఖ్యాతి సంపాదించి పెట్టింది. ఆ చిత్రాన్ని అనేకమంది విదేశీయులూ, డాక్టర్ రాధాకృష్ణలాటి మహానాయకులూ చూసి మెచ్చుకున్నారు.

1947లో జరిగిన నాట్యకళాపరిషత్తు బి.ఎన్. ను సన్మానించింది. "మల్లీశ్వరి" అనంతరం పచ్చయప్ప కళాశాలవారూ, కావలి విద్యోదయా సంస్థవారూ, కాకినాడలోని సరస్వతీ గానసభవారూ బి.ఎన్. కు సన్మానాలు చేశారు. ఇవన్నీ పండిత సన్మానాలతో తుల్యమైనవి. మద్రాస్ స్టేట్ సంగీత నాటక పరిషత్తులో ఆయనకు సభ్యత్వం లభించింది.

బి.ఎన్. అర్జించుకున్న కీర్తి క్షణికమైనది కాదు. అది కాలంతో బాటు పెరిగేది. చిత్ర నిర్మాతగా ఆయన అభిరుచులలో లాలిత్యం వుంది. ఆయన తన సృష్టిని డబ్బుతో తూచలేదు.

చిత్రనిర్మాతగానే గాక ఆయన జీవితమూ కృషీ పరోక్షంగా చాలా విధాల ఫలించింది. పెద్ద వటవృక్షం నుంచి ఊడలు దిగినట్టుగా బి.ఎన్. వేసిన బీజాలనుంచి రామనాథ్, శేఖర్, నాగయ్య, సముద్రాల, కె.వి.రెడ్డి, నాగిరెడ్డి, చక్రపాణి, బ్రిజ్ మోహన్ దాస్ మొదలైన అనేకులు, ఒకొక్కరూ ఒక్కొక్క సంస్థగా వెలశారు. వారిలో కొందరు సంస్థలు స్థాపించారు కూడానూ.

ఈనాడు విజయ వారి నిర్వహణకింద ఉన్న వాహినీ స్టూడియోకు బి.ఎన్. జీవితానికి చాలా సంబంధంవున్నది. విజయ టెక్నీషియనులలో కామెరామాన్ మార్కస్ బార్ ట్లే "స్వర్గసీమ" కు కామెరా మాన్, సౌండ్ ఇంజనీర్ ఎ.క్రిష్ణన్ వాహినీ చిత్రాలకు పనిచేసినవాడే. వాహినీ స్టూడియో మేనేజరు చిదంబర సుబ్రహ్మణ్యం, శాస్త్రీ అండ్ షా లో బి.ఎన్. ఎప్రెంటిస్ గా ఉండినప్పుడు, తాను కూడా జూనియర్ ఎప్రెంటిస్ గా ఉండినవాడు, చాలాకాలం వాహినీ సంస్థలలో పనిచేసిన వాడు. విజయసంస్థకు ప్రొడ్యూసరుగా సంస్థలో వాటాదారుగా ఉన్న చక్రపాణి "స్వర్గసీమ" రచయిత.

బి.ఎన్. ఆప్తులలో చాలా మంది సినిమా పరిశ్రమతో, వాహినీ, విజయా సంస్థలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. బి.ఎన్. పెద్ద తమ్ముడు బి.నాగిరెడ్డి విజయ ప్రొడక్షన్స్, వాహినీ ప్రొడక్షన్స్ కు మేనేజింగ్ డైరెక్టర్, విజయ చిత్ర నిర్మాత. రెండవ తమ్ముడు బి.కొండారెడ్డి కామెరామాన్. "మల్లీశ్వరి". "పెద్దమనుషులు", "బంగారు పాప" చిత్రాలకు పనిచేశాడు. మూడవ తమ్ముడు బి.రామలింగారెడ్డి విజయ సంస్థలో ఒక భాగస్వామి.

బి.ఎన్. ఇటీవల తయారు చేసిన "బంగారు పాప" త్వరలో విడుదల కాబోతుంది.

## నా కథ

# యద్దనపూడి సులోచనారాణి

( సినిమారంగం - 1972, సెప్టెంబర్ సంచిక నుంచి)

[మాటలలో మాధుర్యాన్ని, పాత్రలలో నిర్మల తత్త్వాన్ని చాటే విఖ్యాత రచయిత్రి శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి శ్రీ నెమలికంటి చలపతిరావు గారి కుమార్తె. శ్రీ యద్దనపూడి లక్ష్మీ నరసింహరావుగారి అర్ధాంగి. ఆదిలో అన్న శ్రీ ఎన్. రాధాకృష్ణమూర్తి ఎన్నో కథలు రాసేవారు. ఆ కథలను ఈమె ఫేర్ చేసేది చిన్నతనంలో.

శరత్ సాహిత్యాన్ని ఆరాధించే ఈమె చదివింది స్కూల్ ఫైనల్ వరకే అయినా ఇంగ్లీషు గ్రంథాలు చాలా చదివింది. మానవత పైన, మానవ శక్తి పైన ఈమెకు అత్యంతమైన విశ్వాసం ఉంది. కళాత్మక హృదయం గల ఈమె ఇంత వరకూ తనకు నచ్చిన రచన వెలువడలేదంటూంది. ఈమెకు రచనా వ్యాసంగంలో ఒక ఆశయం ఉంది. అది ప్రపంచంలో సాధ్యమైనన్ని భాషలలో తెలుగు రచనలు స్వీయ రచనలయితే మరీ మంచిది అనువదించబడేట్టు చూడాలని. సినిమాలకు మాటలు రాయంటం పట్ల అంత ఆసక్తి లేకపోయినా ఈ పరిశ్రమలో గడిస్తూన్న అనుభవం దృష్ట్యా స్క్రీన్ ప్లే తనే రాసి ఒక చక్కని స్వీయ నవలని ఒక సమర్థవంతుని దర్శకత్వంలో నిర్మించాలన్న ఆకాంక్ష ఈమెకు ఉంది.]

## నా కథ...

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి



కృష్ణా జిల్లాలో బందరు దగ్గర కాజ లో సనాతన ఆచారాలు గల పెద్ద కుటుంబంలో 1939 ఏప్రిల్ 2న జన్మించాను. అయిదుగురు అక్కలు, ముగ్గురు అన్నలు ఉన్నారు. నా తల్లిదండ్రులకు ఆఖరి సంతానాన్ని అవడం వల్ల కొంచెం గారాబంగానే పెరిగాను.

"చిత్రనళీయం" అనే నా మొట్ట మొదటి కథ 1957 "ఆంధ్ర పత్రిక"లో ప్రచురించబడింది. నేను చాలా తక్కువగా వ్రాసేదాన్ని. వ్రాసినవి "ఆంధ్ర పత్రిక"కే పంపించేదాన్ని. నేను కథ పంపడమే ఆలస్యమన్నట్లు "ఆంధ్ర పత్రిక" సంపాదకులు రెండు మూడు వారాలు ముందుగానే పెద్ద పెద్ద అక్షరాలతో, నా కథ ఫలానా వారం రాబోతూన్నట్లు పబ్లిసిటీ ఇచ్చేవాళ్ళు. ఆ పెద్ద పెద్ద అక్షరాలలో నా పేరు చూసుకోవడం అప్పట్లో నాకు చాలా థ్రిల్లింగ్ గా ఉండేది. నా కథలు అప్పట్లో పాపులర్ అవటానికి సగం కారణం బాపూ వేసిన బొమ్మలేనని నేను అనుకుంటాను. చాలా అందంగా, నా కథలో ఉన్న భావం అంతా ఆ బొమ్మల్లో ప్రతిబింబిస్తున్నట్టుగా ఉండేవి.

1957 నించి 1962 వరకు నేను వ్రాసిన కథలు దాదాపు పది కూడా లేవు. ఆ టైమ్ లో నేను అత్తవారింటికి రావటం, కొత్త పరిసరాల మధ్య మెలగటం వల్ల బహుశా నేను ఎక్కువగా వ్రాయలేక పోవటానికి కారణం అనుకుంటాను. దాదాపు నేను పూర్తిగా వ్రాయటం మానేసేదాన్ని. కీ||శే|| గోపీచంద్ గారు "యువ"కు తరుచుగా వ్రాస్తూండమని ప్రోత్సహిస్తూ ఉండేవారు.

1962లో "చదువుకున్న అమ్మాయిలు" సినిమా కథగా వ్రాస్తున్న డాక్టర్ శ్రీదేవి మరణించడం, ఆ కథ 'చదువుకున్న ఆడపిల్లల కథ' కావడంతో ఆమె సగం వ్రాసి వదిలేసిన కథను పూర్తి చేయటానికి అన్నపూర్ణా వారు కొత్త లేడీరైటర్స్ కోసం గాలిస్తున్నప్పుడు శ్రీ దాశరథి నా పేరు సూచించటం జరక్కపోతే నా సినిమా కథల విషయం ఎలా ఉండేదో నాకు తెలియదు.

మొదట్లో సినిమా కథ అంటే చాలా హుషారు పడ్డాను. కాని, తర్వాత తర్వాత శ్రీ దుక్కిపాటి మధుసూదన రావు గారి డిసిప్లిన్, అన్న టైమ్ ప్రకారం స్క్రిప్ట్ ఇచ్చేయాల్సిన ఖచ్చితమైన పద్ధతి నాకు కొంచెం ఇబ్బంది అనిపించేది. ఎప్పుడో సరదాగా బుద్ధి పుట్టినప్పుడు ఏదో ఒక కథ వ్రాసి, దాన్ని మళ్ళీ కాపీ కూడా చేయకుండా పత్రికకి పంపే అలవాటయిన నాకు వ్రాసింది ఒకటికి పది సార్లు చదువుకోవటం, ఎదుట వాళ్ళకు ఏ అనుమానాలు వస్తాయో అని నాలో నేనే ఆలోచించుకోవటం, వ్రాసిన దాన్నే తిరిగి మళ్ళీ మళ్ళీ వ్రాయటం చాలా బోర్ గా అనిపించేది. ఇక జన్మలో సినిమా కథ వ్రాయకూడదు అనుకున్నాను. (కాని ఇప్పుడు సినిమా కథే తేలిక అనిపిస్తోంది. ఎందుకంటే, సినిమా కథ తయారు చేయటంలో మనకు తోడుగా డైరెక్టర్, ప్రొడ్యూసర్, డైలాగ్ రైటరూ ఉంటారు. ఈ ప్రశ్నలు వేసుకుని జవాబులు చెప్పుకునే భారం సగం వాళ్ళు భరిస్తారు.)

ఇంచుమించుగా అదే టైమ్ లో శ్రీ రమణ, శ్రీ బాపూ "జ్యోతి" పత్రికకు నన్ను ఒక సీరియల్ వ్రాసి ఇమ్మని కోరటం జరిగింది. నేను చిన్న చిన్న కథలే తప్ప సీరియల్స్ వ్రాయలేనని చెప్పాను. పోనీ, కాస్త పెద్ద కథ వ్రాసి ఇవ్వండి_ అంటూ వాళ్ళు ప్రోత్సహించారు. ఆ పెద్ద కథే నా మొట్ట మొదటి నవల "సెక్రెటరీ". తర్వాత సీరియల్స్ నాకు అలవాటు అయిపోయినాయి.

ఆ విధంగా ఇటు సినిమాలకు వ్రాయటం, అట పత్రికలకు సీరియల్స్ వ్రాయటం ఒకేసారి మొదలైంది.

ఒక సబ్జెక్ట్ మీద ఏకాగ్రత కుదుర్చుకోవటంలో శ్రీ మధుసూదనరావుగారి దగ్గర అభ్యాసం అయిన డిసిప్లిన్ కానివ్వండి, ఇటు సీరియల్స్ వ్రాయాల్సిన వత్తిడి వల్ల కానివ్వండి ఒకేరోజున రెండు మూడు వివిధ కథలను వ్రాయటం నాకు ఇప్పుడు బాగా అలవాటు అయింది. ఇది కేవలం అభ్యాసం వల్ల వచ్చిన విషయం.

నేను వ్రాసినవి ఇప్పటి వరకూ ఒక పదిహేను కథలు, ఏడు నవలలు కంటే ఎక్కువ లేవు.

సినిమా కథలకు శ్రీ మధుసూదన రావు గారు, సీరియల్స్ కు రమణ బాపుగార్లు పునాదులు వేసుకోటానికి నాకు ఒక విధంగా సాయపడ్డారు. ఈ పునాదుల మీద ఎంత అందమైన, పటిష్టమైన సాహితీ భవనం నేను కట్టుకోగలను అనేది కేవలం నా సామర్థ్యం మీద, నా కృషి మీద ఆధారపడి ఉంటుందని నాకు తెలుసు.

నా నవలలు : సెక్రెటరీ, విజేత, ఆహుతి, జీవన తరంగాలు, మీనా, ఆరాధన, ఆశల శిఖరాలు.

ఇంతవరకు వచ్చిన సినిమాలు : మనుషులు మమతలు, ఆత్మ గౌరవం, ఆత్మీయులు, జై జవాన్.

చిత్ర నిర్మాణంలో ఉన్న నా నవలలు : విచిత్ర బంధం, జీవన తరంగాలు, మీనా (సారథి స్టూడియోస్), ఆరాధన (హిందీ, శ్రీ ఎల్.వి. ప్రసాద్ గారి ప్రసాద్ ప్రొడక్షన్స్).

# నాగభూషణం

## ( సినిమారంగం - 1969, మార్చి సంచిక నుంచీ)



An artiste is not made; but born.

మన నాగభూషణం పై కోవకు చెందిన కళాకారుడు.

నేడు నాగభూషణం జీవితం వడ్డించిన విస్తరి కాదు..

సినీ కళాధినేత ఈయన్ని ఎన్నో విధాల పరీక్షించాక గాని, నేటి సుస్థిర స్థానాన్ని ఇవ్వలేదు.

ఈయన విజయానికి సోపానాలు – ఆత్మ స్థయిర్యం, ఆత్మ విశ్వాసం, పట్టుదల.

సినిమా నటన ఒక తపస్సు లాంటిది. ఆ తపస్సుకు ఈయన దీక్షతో, ఏకాగ్ర దృష్టితో కొనసాగించాడు. శిఖరాగ్రాన్ని చేరుకోవాలనే లక్ష్యంతోనే కృషి చేశాడు; శిఖరాగ్రాన్నిచేరుకున్నాడు. ఈ జైత్రయాత్రలో ఎన్ని అడ్డంకులున్నా– మనో ధైర్యంతో అవలీలగా దాటగలిగాడు. తనలో అజ్ఞాతంగా ఉండిపోయిన ప్రతిభాసంపత్తులను ఆదిలో కొందరు నిర్మాతలు గుర్తించక పోయినా – ఈయన చలించలేదు.

నాగభూషణం పాల్గొన్న తొలి చిత్రం పీపుల్స్ ఆర్ట్ థియేటర్స్ వారి "పల్లెటూరు". అందులో నేటి డైరెక్టర్ వి.మధుసూదనరావు, నిర్మాత తమ్మారెడ్డి కృష్ణమూర్తిగార్లు కూడా నటించారు. ఇంకా "పెంకి పెళ్ళాం" చిత్రంలో తాగుబోతుగా, "అమరసందేశం" లో విలన్ గా – ఇలా ఎన్నో చిత్రాలలో పాల్గొన్నాడు.

1956 లో "ఏది నిజం" చిత్రంలో హీరోగా నటించడమే కాక – ఆ చిత్ర నిర్మాణంలో ఆ చిత్ర నిర్మాత, తన స్వస్థలం నెల్లూరులో తన బాల్య మిత్రుడు అయిన ఘంటసాల కృష్ణమూర్తికి చేదోడు వాదోడుగా ఉంటూ దర్శకత్వ భాధ్యత ఒకటి తప్ప – ఆఫీస్ బోయ్ పనినించి మిగతా బరువులన్నీ తనే మోశాడు. తనే దృశ్య విభజన చేశాడు. సుంకర సత్యనారాయణను రావించి, దగ్గరుండి సంభాషణలు రాయించాడు. ఆ చిత్రం విడుదలై విజయవంతంగా ప్రదర్శింపబడింది. రాష్ట్రపతి బహుమతి కూడా పొందింది. హీరోగా నాగభూషణానికీ మంచి పేరూ వచ్చింది. కాని, తను హీరోగా స్థిరపడడానికి తగడని నాగభూషణానికే తెలుసు.

అంతే ... ఆ తర్వాత కొంత కాలం వరకు ఈయనకు ఏ పిక్చర్లూ లేవు.

'ఒక సారి హీరోగా నటించాడు గనుక, సహాయ పాత్రలను ధరించడానికి అంగీకరిస్తాడో-లేదో?' అని నిర్మాతలు భావించారో ఏమో !

తనకు వేషం కావాలని సినిమా కంపెనీల చుట్టూ తిరిగే అలవాటు నాగభూషణానికి మొదట్నించీ లేదు. అది అహం కాదు; ఆయన తత్త్వమంతే.

ముఖ్యమైన కారణం ఏమిటంటే – చాలా మంది చిత్ర నిర్మాతలు ప్రత్యక్ష్యంగా నటులలో తాము చూడగలిగిన శక్తులను విశ్వసిస్తారు గాని, వారిలో గుప్తంగా ఉన్న శక్తులను అంచనా కట్ట గల వారు అరుదు. అటువంటి నిర్మాతలు కళ్ళబడే వరకు ఏ ఆర్టిస్టుకైనా మంచి అవకాశం దొరకదు. అలా మంచి అవకాశం దొరికే వరకు కాలం వృధా చేయకుండా మరో మంచి పని చేయాలనుకున్నాడు నాగభూషణం. తత్ఫలితమే రవి ఆర్ట్ థియేటర్స్ అవతరణ. తమిళనాడులో గొప్ప సంచలనం కలిగించిన ఎం. ఆర్. రాధా గారి "రక్త కన్నీరు" నాటకాన్ని పాలగుమ్మి పద్మరాజుగారి చేత తెనిగించి, 1956 జూలైలో నెల్లూరులో తొలి ప్రదర్శన ఇచ్చారు. ఆ తర్వాత ఈ నాటకం ఆంధ్ర దేశాన్ని ఎంతటి ఊపు ఊపిందో ఎవరికీ తెలియనిది కాదు.

కొంత మందికి తాము ఆశించనివి ఫలిస్తుంటాయి. నాగభూషణం విషయంలో అదే నిజమైంది. తీరుబడిగా ఉన్నప్పుడు తాను ప్రారంభించిన రంగస్థలోపాసన ఉత్తరోత్తరా చలన చిత్ర సీమలో తాను ఉచ్చస్థితికి రావడానికి ఎంతో ఉపకరిస్తుందని ఆ నాడు ఈయన ఆశించి ఉండడు.

అందుకే సినిమాల పై నించి దృష్టి మరల్చి, తన నాటక సమాజం మీదనే మనసునంతా కేంద్రీకరించాడు. ప్రతి సంవత్సరం నవంబర్ నెల నించి జూన్ నెలా దాకా ఆంధ్రదేశంలో వాడవాడలా నెలకు పాతికకు పైగా ప్రదర్శనలు ఇస్తూ వచ్చారు. జూలై నించి సెప్టెంబరు వరకు వర్షాకాలం గనుక కాస్త ఊపిరి సల్పుకోడానికి విరామం ఉండేది.

ఒకసారి ఒకే నెలలో 32 ప్రదర్శనలు కూడా ఇచ్చారు. ఒకే ఊళ్ళో 15 రోజుల పాటు వరుసగా ప్రదర్శనలివ్వబడ్డాయి కూడా. కాకినాడలో ఏకబిగిన 14 రోజుల పాటు ప్రదర్శించారు. అదే చోట 1958 లో ఒకే రాత్రి రెండు నాటకాలు వేశారు. అలాగే 1960 లో విజయవాడ జింఖానా క్లబ్ లో ఒకే రాత్రి రెండు నాటకాలు రూ. 2/-, 0.50 పై. ప్రవేశ రుసుములు చొప్పున ప్రదర్శింపబడగా పాతిక వేల రూపాయల దాకా వసూలయింది.

"కలికాలం, బికారి రాముడు, పాపం పండింది, కోతలరాయుడు" రవి ఆర్ట్ థియేటర్స్ వారి తతిమ్మా నాటకాలు. కాని, ఇవేవీ వారి తొలి నాటకం "రక్త కన్నిరు" లాంటి అఖండ విజయాన్ని సాధించ లేక పోయాయి.

"రక్త కన్నీరు" లో పాల్గొన్న వాణిశ్రీ , శారద, రేవతి, మీనాకుమారి, సుజాత, ఆదోని లక్ష్మి మున్నగు వారిలో కొందరు సినిమా రంగంలో తారాపథాన్నందుకున్నారు. వాణిశ్రీ తెలుగు – తమిళ చిత్రాలలో, శారద మలయాళ చిత్రాలలో, రేవతి – కన్నడ చిత్రాలలో హీరోయిన్ లు అయిపోయారు. మొదటినించి పాల్గొంటూన్న నటీమణి సీతా మాత్రమే.

ఈ సమాజంలోని నటీనటులందరూ క్రమశిక్షణకు అలవాటు పడినవారు; నటనలో రాటు తేలిన వారు.

మొత్తం 30 కుటుంబాలు రవి ఆర్ట్ థియేటర్స్ మీద ఆధారపడి ఉన్నాయి.

ఇంతవరకు ఈ సమాజం వారు 1,200 కు పైగా ప్రదర్శనలిచ్చారు.

ఈ విషయాలన్నిటి బట్టి ఆలోచిస్తే, నాగభూషణం ఎన్ని సత్కారాలకైనా, సన్మానాలకైనా, మన్ననలకైనా, బిరుదులకైనా, అర్హుడనిపిస్తుంది. దాదాపు 100 కప్పుల దాకా సంక్రమించాయి. 1956 లో సామర్లకోటలో ఈయన్ని ఒక ఎత్తయిన వేదిక మీద నిలుచోబెట్టి, ఈయన కనబడనంత ఎత్తు పూలమాలలతో సత్కరించారు. ఒక 90 ఏళ్ళ ముసలమ్మ ఇద్దరు మనుష్యుల ఊతతో వచ్చి, తనకు పూలమాల వేసి, ఫల పుష్పాలు సమర్పించిన ఉదంతం తన జీవితంలో మరువ లేనిదంటాడు నాగభూషణం.

నవ్యకళా మండలి రజతోత్సవ సందర్భంగా దాని స్థాపకుల్లో ఒకరైన ఈయనకు ఇటీవలే హైదరాబాద్ 'రవీంద్ర భారతి' లో ఘనంగా సన్మాణం జరిగింది.

ఒక్క ముక్కలో చెప్పాలంటే – ఏ నటుడికీ జరగనన్ని గౌరవాలు ఈయనకు జరిగాయి.

"ఏవో నాటకాలు ఆడుకుంటూ హాయిగా ఎక్కడో ఉన్నాడులే", అని కొందరు నిర్మాతలు ఈయన్ని అప్పుడు ఉపేక్షించారేమో కాని. కొన్ని వేషాలకు కబురు చేసిన నిర్మాతలు ఇద్దరు ముగ్గురు లేకపోలేదు. వాళ్ళ చిత్రాలలో నటించడానికి ఈయన ఎప్పుడైనా మద్రాసు వచ్చినా అప్పుడు సినిమా రంగం స్థితిగతులు గురించి ఈయనకు ఎక్కువగా ఏమీ తెలీదు.

1961 లో సుందర్ లాల్ నహతా – డూండీ గార్ల "శభాష్ రాజా" చిత్రంలో ఒక హాస్య దుష్ట భూమికను నిర్వహించడానికి కబురు వచ్చింది. తను కోరినంత డబ్బు ఇవ్వడానికి నిర్మాతలు ఇష్టపడ్డాక ఆ క్లిష్ట పాత్రను ధరించడానికి నాగభూషణం అంగీకరించారు.

"మంచి మనసులు" చిత్రంలో (ఎం. ఆర్. రాధా అదే తమిళ చిత్రంలో ధరించిన) ఒక పాత్రకు మన నాగభూషణాన్ని ఆదుర్తికి సజెస్ట్ చేశారు హీరో నాగేశ్వరరావు. అసలప్పటికి ఏడేళ్ళ క్రితం అనగా – 1954 లో ఆదుర్తి తొలి దర్శకత్వ బాధ్యత వహించిన "అమర సందేశం" లో నాగభూషణం విలన్ పాత్ర ధరించి ఉన్నాడు.

అలా 1961 నించి ఏటా ఒకటి రెండు చిత్రాలలో నటించడానికి ఒప్పుకుంటూ, ఒకవంక నాటక ప్రదర్శనలు ఉధృతంగా ఇస్తూనే వచ్చాడు. 1967 లో "ఉమ్మడి కుటుంబం" లో పాల్గొనే వరకు కూడా ఈ నాటకాల జోరు తగ్గలేదు. "ఉమ్మడి కుటుంబం" రజతోత్సవం చేసుకుంది. ఆ చిత్రంతో నాగభూషణం సినిమా రంగంలో చాలా బిజీ అయిపోయాడు. ఎందరో నిర్మాతలు బుక్ చేయడానికి ఎగబడ సాగారు. ఈ స్థితిలో 1967 నవంబర్ నించి నాటకాల సీజన్ కు వెళ్లగలనో లేనో అనే సంకటంలో పడ్డాడు నాగభూషణం. ఈయన సినమా రంగంలో బిజీ అయిపోతే తమ కూట్లో దుమ్ము పడుతుందేమోనని భయపడ్డారు.

ఈయన నాటక సమాజాన్ని నమ్ముకున్న నటీనటులు; కొందరు ఆశలు వదులుకున్నారు కూడా, కాని, నాగభూషణం వాళ్ళకు అన్యాయం చేయగలడా? తనకు ఎన్ని పిక్చర్ లు ఉన్నా సరే – ప్రతి నెలా మొదటి వారంలో ప్రదర్శనల దాకా వాళ్ళతో కలిసి ఇస్తానని హామీ ఇచ్చాడు. అంతే కాదు; నటించినందుకు తను పారితోషికం చిల్లి గవ్వయినా పుచ్చుకోకుండా – వసూలైన మొత్తమంతా వారికే పంచి ఇవ్వసాగాడు.

దీనిని బట్టి నాగభూషణం హృదయం ఎంత విశాలమైనదో, చేతలు ఎంత ఉదారమైనవో ఇట్టే ఊహించుకోవచ్చు.

ఇక కేరెక్టర్ ఆర్టిస్ట్ గా ఈయన ఏ చిత్రంలో మహోన్నతంగా నటించాడో ఏరి చెప్పడం కష్టం. కారణం – అన్ని చిత్రాలలోనూ ప్రతిభావంతంగా తన పాత్రలను పోషించడమే. చిన్న పాత్రయినా ప్రాధాన్యత గల పాత్రగా దాన్ని రూపొందించే మెళకువలు ఈయనకు బాగా తెలుసు. "భట్టి విక్రమార్క" లోని సిద్దుడి వేషమైనా, "మాయాబజారు" లోని సాత్యకి పాత్రయినా, "భాగ్యరేఖ" లోని సిపాయి భూమికైనా, ఇటీవలే విడుదలైన "వరకట్నం" చిత్రంలోని మీసాల వెంకయ్య పాత్రయినా – విశిష్టంగా పోషిస్తూ, ప్రేక్షకులు ఏ మాత్రం ఆశాభంగం చెందకుండా తన ప్రాజ్ఞత, ప్రతిభావిశేషాలు వినియోగించి నటించగల సమర్థుడు నాగభూషణం.

ఒక్కో నటుడు తాను ధరించే పాత్రలకు ఒక్కో రకమైన వ్యక్తిత్వాన్ని చేకూర్చితాడు. ఈ వ్యక్తిత్వాన్ని ఆ నటుడు తన నటనాప్రభావం చేత సృష్టించాడా – లేక, ఆయనకది సహజసిద్దమైనదేనా – అన్న సమస్య ఏ ప్రేక్షకుడ్నీ వేధించదు. ప్రేక్షకుడు పాత్రలో చూసే వ్యక్తిత్వం వాస్తవంగా తోచాలి. అంతే.

తన్ను తానుగా కాక మరో ప్రతి రూపాన్ని ప్రదర్శించి చూప గలిగినప్పుడే నటుడు నిజంగా నటించినట్లవుతుంది. ఏ పాత్రలో అయినా మనం చూసేది ఒకే వ్యక్తినయినా – మన మనస్సులో నిలవవలసింది ఆ పాత్రే కాని, ఆ వ్యక్తి కానే కాదు. అలా పాత్రలకు ప్రాణం పోసి, ప్రేక్షకుల హృదయాంతరాళాల్లో ఒక స్థిరమైన రూపాన్ని మలచి నిలపగలిగిన వ్యక్తే నిజమైన నటుడు అందుకే నాగభూషణం లీనమై, తాదాత్మ్యం చెంది కదిలించగల ప్రతి పాత్రా ప్రేక్షకులను పులకాంకితుల్ని చేస్తుంది. కనుకే, ఇన్ని చిత్రాలలో నటించినా ప్రేక్షకులకు ఆయన పై మోజు పెరుగుతూనే ఉంది.

సరియైన పాత్ర దొరికి, మంచి కథ, మంచి కంపెనీ ఉంటే గాని అగ్రిమెంట్ మీద సంతకం చెయ్యకూడదన్న నిశ్చయం నాగభూషణానికి లేకపోతే – ఆయన ఈ పాటికి ఇప్పటికన్నా రెట్టింపు చిత్రాలలో నటించి ఉండేవాడేమో !

పెద్ద నిర్మాతలు – చిన్న నిర్మాతలు అనే తారతమ్యం లేదీయనకు. అందరినీ సమదృష్టిలోనే చూస్తాడు. ఎటొచ్చీ చక్కని, చిక్కని పాత్రలను శక్తివంచన లేకుండా ఒప్పించడమే ఈయన ధ్యేయం.

అంతే కాదు; నిర్మాతల కష్టసుఖాలను గమనిస్తూ, వారికి ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా షూటింగ్ లకు సకాలానికి హాజరవుతూ, తోటి నటీనటులతో సెట్ లో ఎంతో సహకరిస్తూంటాడు. గనుకనే నాగభూషణానికి నిర్మాతలు మంచి ప్రోత్సాహం ఇస్తున్నారు నిజానికి ఆయన మంచే ఆయన ప్రగతికి కారణమైంది.

తను నటించిన చిత్రాలు శతదినోత్సవాలు చేసుకున్నందుకు నాగాభూషణం ఏనాడూ గర్వపడలేదు. ఒక చిత్రంలో తాను పోషించిన పాత్ర కన్నా మరో నటుడు నిర్వహించిన భూమిక విశేషంగా ప్రజాభిమానం పొందిందని ఎవరైనా అంటే ఈయన ఖిన్నుడతడు. భూషణ, తిరస్కారాలకు ఈయన అతీతుడు.

తనకు ప్రోత్సాహమిచ్చి ఆత్మీయత – ఆదరాభిమానం కనబరించిన వారిని ఈయన ఏనాటికీ మరచిపోలేదు. అలాగే నాటక రంగాన్ని కూడా ఏనాటికీ మరిచిపోలేదు. తన వృద్ధాప్యంలో ఏ హైదరాబాద్ లోనో స్థిరపడి పోయినప్పుడు అక్కడొక రంగస్థలాన్ని నిర్మించి, కనీసం వారానికి ఒక ప్రదర్శనయైనా ఏ శనివారాలనాడో ఇస్తూ, ఉత్సాహవంతులైన యువతీ యువకులకు నటనలో తర్ఫీదు ఇవ్వాలని నాగభూషణం ఆశయం.

అంతకు రెండింతలు కృషి చేసి, కీర్తి ప్రతిష్టలకు రెట్టింపు చేసుకోడానికి నాగభూషణానికి శక్తిని, ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించు గాక !

# మాస్టర్ వేణు

## ( విజయచిత్ర - 1968, సెప్టెంబర్ సంచిక నుంచి)



సంగీతంలో శాస్త్రీయ సంగీతమే గొప్పదీ – ఏనాటికయినా నిలిచేదీ – అన్నది సంగీత దర్శకుడు వేణు గారి గట్టి అభిప్రాయం. ఆ అభిప్రాయం ఆయనకు చిన్నప్పటి నుంచీ వున్నది.

"శాస్త్రీయ సంగీతాన్ని ఆధారంగా తీసుకునే ఇవాళ మనంగాని మరొకరు గాని తేలిక స్వరాలను కూర్చుతున్నాము. ఆ శాస్త్రీయ సంగీతం మహా సముద్రం . కాని ప్రస్తుత పరిస్థితులలో ఆ సంగీతానికి ఆదరణ లేదన్నది సత్యమైన విషయం; అది విచారించవలసిన విషయం. అయితే దేశకాల పరిస్థితుల్లో అన్నిటా మార్పులు వస్తున్నట్టే సినిమా సంగీతంలోనూ వచ్చాయి; వస్తున్నాయి. పూర్వం రోజుల్లో ఫక్తుశాస్త్రీయం వుండేది. రాను రాను హిందుస్థానీ పద్ధతిలో వుండే సంగీతం వచ్చింది. జానపద పద్ధతులు వచ్చాయి; పాశ్చాత్య పోకడలు కలిశాయి; సంగీతం రకరకాలుగా మారింది; కలగాపులగం అయింది. దానికంతటికీ కారణం ప్రజాదరణ. కొత్త కోసం అర్రులుచాచే ప్రజానీకం కోసం, కొత్త పోకడలను వల్లనే శాస్త్రీయంలో పాశ్చాత్యం, పాశ్చాత్యంలో మన జానపదం, ఆ రాగంలో ఈ రాగం – అలా అలా ఎన్నో వచ్చాయి. ఈ మార్పు హర్షదాయకమే. ఏ కళయినా ప్రజలకోసమే. ప్రజల మెప్పు పొందని కళ, కళ కాదన్నది ఒప్పుకోదగ్గ విషయమే. అందుకనే ప్రజలకోసం అని, ప్రజాభిరుచులకు అనుగుణంగా – అన్ని కళలూ మారుతున్నట్టే సినిమా సంగీతం కూడా మారింది. అయితే నాకున్న భయమల్లా – భారతీయ సంగీతాన్ని కొంత కాలానికి మరిచిపోతామా అని ! రాను రాను సంగీతం ఇష్టంవచ్చినట్టు మెలికలు తిరిగిపోతూ పోతే, భారతీయ సంగీతం, దాని పోకడ, పద్ధతి – ఎక్కడ వుంటుంది? – ఏమైపోతుంది? – దాన్ని కాపాడుకుంటూ, ఎన్ని మార్పులు చేసుకుంటూ పోయినా ఇబ్బందిలేదు. మన సంగీతం పునరుద్ధరింపబడాలి. అప్పుడే సినిమా సంగీతానికి నిండుదనం కలుగుతుందని నా అభిప్రాయం.

అయితే, "సంగీతంలో ఇలాంటి మార్పులు కలగడానికి కారణం మీరేగదా" అని నన్నడిగితే నేను ఒప్పుకుని తీరాలి. కాని, ఆ మార్పుకు కారణం కేవలం సంగీతదర్శకులే కాదు. ప్రజలూ – ప్రజల అభిరుచులను పాటించే దర్శకనిర్మాతలూ, ప్రజలు శాస్త్రీయసంగీతాన్ని కూడా ఆదరిస్తూవుండాలి. ఆదరిస్తే, ఆ సంగీతం ఏనాటికయినా నిలిచివుంటుంది.

అయితే, చక్రం తిరిగినట్టు తిరిగే సినిమా సంగీతంలో ఇప్పుడిప్పుడు మళ్ళీ శాస్త్రీయఛాయలు కనిపిస్తున్నాయి. ఎక్కువమంది ప్రేక్షకులు శాస్త్రీయసంగీత పోకడలలో వున్న పాటలను వినడానికి కుతూహలం చూపుతున్నారు. ఇది సంతోషించదగ్గవిషయం. ఈ అభిరుచి ఇలాగే కొనసాగినట్టయితే, మన సంప్రదాయ సంగీతానికి ధోకావుండదు. అయితే, ఈ అభిరుచి ఇలాగే వుంటుందా – మారుతుందా అన్నదే సందేహం. అది ప్రజాభిరుచులమీద ఆధారపడి వున్న విషయం. అందుకే ప్రజలు, మన సంప్రదాయ సంగీతాన్ని కూడా వినడానికి ఎక్కువగా కుతూహలపడుతూ వుండాలని నా కోరిక.

మేము చిత్రాల్లో కాపీ సంగీతాన్ని అందిస్తునామని అది దారుణమనీ చాలామంది ఆడిపోసుకుంటూ వుంటారు. అయితే, కాపీ చెయ్యాలని ఏ సంగీతదర్శకుడూ వూహించడు; కాపీ చెయ్యడానికి ఇష్టమూపడడు.

'ఈ రకం 'ట్యూను' వినడానికి ప్రేక్షకులు ఉత్సాహం చూపుతారు. ఫలానా హిందీ చిత్రంలోని ఈ పాట పెద్ద హిట్టు. ఆ హిట్టు పాటనే మనమూ అనుసరిద్దాం' అని నిర్మాతలూ దర్శకులూ ఆదేశిస్తూ వుంటారు. వారి ఆదేశం ప్రకారం నడుచుకోవడం – అందరికీ విధి అయినట్టుగానే , సంగీత దర్శకుడికీ విధే. తన శక్తి సామర్ధ్యాలను వినియోగించుకుంటూ, స్వరకల్పన చెయ్యాలనే ప్రతి సంగీత దర్శకుడూ ఆశిస్తాడు గాని, 'కాపీ' చెయ్యాలని ఎన్నడూ ప్రయత్నించడు.

"అద్భుతమైన పాటలను వినిపించిన ఆ సంగీత దర్శకుడే – ఎందుకు కాపీ ట్యూను వినిపించాడు?" అని ప్రశ్నించుకుంటే, పై సమాధానం దానంతట అదే దొరుకుతుంది. అలా కాపీ చెయ్యమని ప్రోద్బలించడంవల్ల సంగీతదర్శకుడి శక్తి సామర్ధ్యాలు కుంటుపడడం సంభవిస్తుంది; తన మీద తనకే నమ్మకం తగ్గిపోయే ప్రమాదం ఏర్పడుతుంది; ఏం చెయ్యాలన్నా నిరుత్సాహమే ఎదురవుతుంది. ఇది ఆరోగ్య లక్షణం కాదు. అలా రికార్డు కాపీ చెయ్యడానికే అయితే, మేమెందుకు?" అని ప్రశ్నించారు వేణు.

'మాస్టర్' వేణుకు ఇలాంటి అభిప్రాయాలు చాలా వున్నాయి. ఆ అభిప్రాయాలు ఏర్పాటు చేసుకోడానికి ముందు జరిగిన కృషి కూడా చాలా వుంది.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

వేణు బందరులో పుట్టాడు – పెరిగాడు. ఆయన మేనమామగారైన రామయ్య నాయుడుగారు సంగీత విద్వాంసుడు. ఆయన దగ్గర వాద్య సంగీతం నేర్చుకోసాగాడు వేణు – తన తొమ్మిదో సంవత్సరం దగ్గర్నుంచి. ఒక పక్కనుంచి బడిలో చదువుకుంటూనే, హార్మోనియమ్ కూడా శ్రద్ధగా నేర్చుకోవడం సాగించాడు. సంవత్సరం తిరిగేసరికే – వేణు హార్మోనియమ్ వాయించడంలో నేర్పు సంపాయించాడు. హార్మోనియమ్ ముందువేసుకుని, కూచుని, చకాచకా వేళ్ళు కదిలిస్తూ చల్లగా హాయిగా వాయించే పదేళ్ళ వేణుని చూసి అంతా ఆశ్చర్యపోయేవారు. "హార్మోనియమ్ అంత మనిషిలేడు – అంత చక్కగా ఎలా వాయిస్తున్నాడో" అనేవారు అతన్ని చూసి.

తర్వాత, సంగీత విద్వాంసులైన చేబ్రోలు వెంకటరత్నంగారి దగ్గర గాత్రం నేర్చుకోవడం ఆరంభించాడు. వేణు తల్లిగారు కూడా ఆయన దగ్గర సంగీతం నేర్చుకునేవారు. తల్లీ కొడుకులిద్దరూ సంగీతంలో సమానంగా మెట్లు ఎక్కుతూ రాసాగారు.

రానురాను వేణుకు సంగీతం మీద అభిమానం ఎక్కువకాసాగింది. దాంతో చదువు మీద శ్రద్ధ సన్నగిల్లింది. మూడోఫారందాకా మాత్రం చదివి, ఆ చదువుకో 'ఫుల్ స్టాఫ్' పెట్టేశాడు. ఒకేసారి గాత్రసంగీతాన్ని వాద్యసంగీతాన్ని మరింత క్షుణ్ణంగా అభ్యసించసాగాడు. హార్మోనీమీద వాయిస్తూ, దాంతోపాటే పాడేవాడు. తను పాడుతూ, ఆ పాటను అనుసరిస్తూ హార్మోనీ వాయిస్తున్నాడా – హార్మోనీ వాయిస్తూ, ఆ ప్రకారం పాడుతన్నాడా – తెలిసేది కాదు. అంత అద్భుతంగా రెండింట్లోనూ ప్రజ్ఞ సంపాయించాడు.

తన 14 వ ఏట నుంచి, వేణు 'హార్మోనియమ్ కచేరీ'లు చెయ్యడం ఆరంభించాడు. వేణు హార్మోనియమ్ అంటే, అందరూ చెవి కోసుకునేవారు. అలా చిన్నతనంలోనే వేణు మంచి పేరు సంపాయించుకున్నాడు.

మద్రాసులో 'గిరీన్ మ్యూజియమ్' నడుపుతున్న డాక్టర్ గిరిగారు – ఓ సారి వేణు వాద్యం విని తన్మయులయ్యారు. అంతటి జ్ఞానం గలవాడు బందర్లోనే వుండిపోతే ఏం లాభం? అనిపించింది ఆయనకి.

"వేణూ ! నువ్వు హార్మోనియమ్ వాయించడంలో అద్భుతమైన ప్రజ్ఞ సంపాయించావు. నువ్వు బందర్లోనే వుండిపోతే, నీ కృషి కి సార్ధకం లేదు. నీ విద్య పదిమందికి తెలియాలి. నువ్వు బాగా పేరు తెచ్చుకోవాలి." అని ఆశించి, తనతో మద్రాసు రమ్మన్నారు. సినిమా ఫీల్డులో తనకూ తన వాయిద్యానికీ మంచి అవకాశాలున్నాయని వేణు అప్పటికే ఆ నోటా ఆ నోటా వింటున్నాడు. అందుకనే, గిరిగారు రమ్మనగానే అతను మద్రాసు బయల్దేరాడు.

1938 లో 'మాలపిల్ల' ప్రారంభమవుతన్న రోజుల్లో వేణు మద్రాసు వచ్చాడు. గిరిగారు వేణును మాలపిల్ల సంగీత దర్శకులైన భీమవరపు నరసింహారావుగారికి పరిచయం చేశారు. బి. యన్. ఆర్. గారు అతని వాయిద్యాన్ని విన్నారు. వేణు కృషినీ, నైపుణ్యాన్నీ కొని యాడారు. "నీలాంటివాడు

చిత్ర పరిశ్రమకు ఎంతో అవసరం." అని, వెంటనే వేణుకు అవకాశం కలగజేశారు. 'మాలపిల్ల' చిత్రానికి హార్మోనిస్టుగానూ, నరసింహారావుగారికి సహాయ దర్శకుడిగానూ వేణు సారధి సంస్థలో చేరాడు.

మొదట్లో సినిమా సంగీతం, పాటలూ, ట్యూన్ కంపోజింగూ లాంటివి వేణుకు కాస్త కొత్తగా కనిపించినా, కొద్ది రోజుల్లోనే అలవాటు పడ్డాడు. 'మాలపిల్ల' చిత్రంలోని అన్ని పాటలకూ సహాయకుడిగానూ, హార్మోనిస్టుగానూ పని చేశాడు. ఆ సమయంలోనే అతనికి తక్కిన వాద్యాల మీద కూడా మోజు కలిగింది. బి. యన్. ఆర్. గారి దగ్గర సితార్, దిల్ రుబా, ఫ్లూట్ మొదలైన వాద్యాలను నేర్చుకున్నాడు.

'మాలపిల్ల' చిత్రంలో బి. యన్. ఆర్. చేసిన 'నల్లవాడే గొల్లపిల్లవాడే' లాంటి జానపద సంగీత పోకడలు – వేణు తలలోకి ఎక్కాయి. జానపద సంగీత పోకడలలోని మాధ్యుర్యాన్ని వేణు అప్పుడే బాగా చవి చూశాడు.

మాలపిల్ల చిత్రం పూర్తి కాగానే, సారధివారు 'రైతుబిడ్డ' చిత్రాన్ని ఆరంభించాడు. ఆ చిత్రానికి కూడా వేణు, బి. యన్. ఆర్. దగ్గర సహాయకుడిగా పని చేశాడు. బి. యన్. ఆర్. 'మీరాబాయి' చిత్రానికి సంగీత దర్శకత్వం వహించగా, వేణు ఆ చిత్రానికి కూడా సహాయకుడిగా పని చేశాడు. అప్పటికి, వేణు మూడు చిత్రాల అనుభవం సంపాయించి సినిమా సంగీతాన్నీ, ఆ సంగీతపు పోకడలనూ ఆకళింపు చేసుకున్నాడు.

తర్వాత అతనికి ఒక తమిళ చిత్రానికి పని చేసే అవకాశం వచ్చింది. ఆ చిత్రాన్ని బొంబాయిలో నిర్మిస్తున్నారు. ఆ కంపెనీతో వేణు, బొంబాయి వెళ్ళాడు. కొద్ది రోజుల తర్వాత, ఆ కంపెనీ ఆగిపోయింది. వేణుకు ఏం చెయ్యాలో తోచలేదు. తాను బొంబాయి రావడానికి కారణాలు కూడా లేకపోలేదు. తమిళ చిత్రానికి సహాయకుడిగా పని చెయ్యడం వల్ల, ఆ ధోరణి కూడా తెలుసుకోవచ్చుననీ, బొంబాయి వెళ్ళడం వల్ల అక్కడ సంగీత పోకడలు కూడా తెలుసుకోవచ్చుననీ, అక్కడ విధానాలను నేర్చుకోవచ్చుననీ అతను ఆశ పడ్డాడు. అయితే, ఆ కంపెనీ మూత పడడం వల్ల అతని ఆశ నిరాశయి పోయింది. ముందు కొద్దిగా అధైర్యపడినా, తర్వాత ధైర్యం తెచ్చుకున్నాడు. ఎలాగైనా బొంబాయిలో కొనాళ్ళుండి హిందూస్థానీ సంగీత పోకడలను అవగతం చేసుకోవాలనీ, హిందీ చిత్రాల సంగీత దర్శకుల విధానాలను తెలుసుకోవాలనీ నిర్ణయించుకున్నాడు.

కొన్నాళ్ళు బొంబాయిలో అలా ఇలా గడిపి, ఒక మిత్రుడి ద్వారా వసంతదేశాయ్ పరిచయం సంపాయించాడు వేణు. జయశ్రీ, చంద్రమోహన్ లతో శాంతారామ్ 'శకుంతల' చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. వసంతదేశాయ్ ఆ చిత్రానికి సంగీత దర్శకుడు. తన ఆర్కెస్ట్రాలో వసంతదేశాయ్ వేణుకు అవకాశం ఇచ్చాడు. 'శకుంతల' చిత్రం లోని పాటలకు, ఆర్కెస్ట్రాలో వేణు 'సెల్లో' వాయించేవాడు. ఓ సంవత్సరం ఆ ఆర్కెస్ట్రాలోనే వుంటూ, అనేక విషయాలు తెలుసుకున్నాడు. 'ఆర్కెస్ట్రయిజేషన్' లో ఉత్తరాది వారు అనుసరించే విధానాలనూ, వారు వాడే వాయిద్యాలనూ బాగా తెలుసుకున్నాడు.

అయితే, వేణు తనకున్న విద్యతో తృప్తి పడలేదు. హార్మోనియమ్ వాయించడంలో అతనికి అద్భుతమైన ప్రజ్ఞ వున్నా – అతను ఆ విద్యను ఇంకా నేర్చుకోవాలనుకున్నాడు.

'స్కూల్ ఆఫ్ మ్యూజిక్' అని బొంబాయిలో వుండేది. మనహర్ బర్వే దాన్ని నడిపేవాడు. మనహర్ అన్ని వాద్యాలను వాయించడంలోనూ నిపుణుడు. 'మాస్టర్ ఆఫ్ ఆల్ ది ఇన్ స్ట్రుమెంట్' అనేవారు ఆయన్ని. వేణు ఆయన దగ్గర చేరి, హార్మోనియమ్ ఇంకా బాగా నేర్చుకున్నాడు. ఆరునెలలు తిరక్కుండానే, అతను ఆ విద్యాలయంలో 'మాస్టర్' డిగ్రీ తీసుకున్నాడు. అప్పట్నుంచే అతను – 'మాస్టర్' వేణు అయ్యాడు.

బొంబాయిలో వుంటున్న ఆ సమయంలోనే వేణుకు, సంగీతదర్శకుడు నౌషాద్ తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం చిత్రంగా జరిగింది. వసంతదేశాయ్ ఆర్కెస్ట్రాలో పనిచేస్తున్నప్పుడు వేణు – వసంతదేశాయ్ ఇంట్లోనే వుండేవాడు. ఒకరోజు టీ తాగడానికని, హోటలుకు వెళ్ళగా, హోటలువాడు గ్రామఫోను మీద ఓ పాట వేస్తూ వుంటే, ఆ పాట విన్నాడు. ఆ పాట అతన్ని ముగ్ధుణ్ణి చేసింది. 'అలాంటి పాట అంతవరకూ ఎక్కడా వినలేదే' – అనుకున్నాడు. పాట పూర్తి కాగానే, హోటలు వాడి దగ్గరికి వెళ్ళి ఆ పాట ఎవరిదో ఏమిటో చూశాడు. అది 'నమస్తే' అన్న చిత్రంలోది. దాని సంగీత

దర్శకుడు — నౌషాద్. ఆ పాట — 'పంఛీ-జా' అన్న పాట. ఆ పాటలోని స్వరం, స్వరం కన్న అందులోని నేపథ్యసంగీతం – వేణును ముగ్ధుణ్ణి చేశాయి. పాటలో వచ్చే నేపథ్యసంగీతం విడిగా వుందిగాని, పాటలోలాగా లేదు; అది-కొత్త! ఆ కొత్తదనమే వేణును — నౌషాద్ దగ్గరకు లాక్కెళ్ళింది !

"ఎవరీ నౌషాద్ ?" అని అడిగాడు వేణు హోటల్లో. అతను కొత్త సంగీతదర్శకుడనీ, కర్దార్ స్టూడియోలో వుంటాడనీ తెలుసుకున్నాడు. వేడివేడి టీని నోట్లో పోసేసుకుని, అక్కడ నుంచి కర్దార్ స్టూడియోకు పరుగెత్తాడు. స్టూడియో ముందున్న గూర్ఖా — వేణును "అందర్ నైచల్ నా, జావ్ జావ్" అనేశాడు. కిందా మీద పడి, వేణు గూర్ఖా గడ్డం పుచ్చుకుని బతిమాలి, లోపలకు ప్రవేశించాడు. లోపల పాట రికార్డింగ్ జరుగుతోంది. రికార్డు చేయిస్తున్న నౌషాద్ ను చూసి, మనసులోనే ఓ నమస్కారం పెట్టుకున్నాడు. రికార్డింగ్ అయిపోయిన తర్వాత, ఆయన్ని కలుసుకుని, తనను పరిచయం చేసుకున్నాడు. తోడి కళాకారుడు, తనకోసం అలా పరుగెత్తుకుంటూ రావడం చూసి, ఎంతో మెచ్చుకున్నారు నౌషాద్.

ఓ సందర్భంలో, నౌషాద్ — వేణూ వాయిద్యాన్ని విన్నారు; 'శహబాష్' అని మరింత మెచ్చుకున్నారు. ఆనాడే, వేణు అంటే ఆయనకు ఓ 'ముద్ర' పడిపోయింది. ఆ ముద్ర నేటికీ, అలాగే వుంది.

బొంబాయిలో వేణు సంగీతంలో చాలా మంచి అనుభవాలు సంపాయించాడు. అతని అనుభవాన్నీ సంగీత జ్ఞానాన్నీ చూసి — హిస్ మాస్టర్స్ వాయిస్ గ్రామఫోను కంపెనీవారు వేణును మ్యూజిక్ డైరక్టర్ గా ఆహ్వానించారు. 1946లో వేణు బొంబాయి నుంచి, మద్రాసు వచ్చి హెచ్. యమ్. వి. లో చేరాడు. రెండు సంవత్సరాల పాటు అతను అక్కడ సంగీత దర్శకుడిగా పని చేశాడు.

వాహినీ స్టూడియోను విజయవారు తమ నిర్వహణ కిందకు తీసుకున్న సమయంలో — 'ఆర్కెస్ట్రా కండక్టర్' గా వేణును తీసుకున్నారు. ఆర్కెస్ట్రా ఇన్ ఛార్జిగా అతను ఐదు సంవత్సరాలు విజయా సంస్థలో పని చేశాడు. వేణును తీసుకున్న మొదటి రోజుల్లోనే విజయావారు — అమెరికా నుంచి 'హేమండ్ ఆర్గన్' అనే వాయిద్యాన్నితెప్పించారు. ఆ వాయిద్యంలో అన్ని వాయిద్యాలూ సృష్టించవచ్చును. (అప్పుడు ఆ వాయిద్యం ఖరీదు పదహారువేల రూపాయలు; ఇవాళ నలభైవేలు !) ఒక టీచర్ ను ఏర్పాటు చేసి, ఆ వాయిద్యాన్ని విజయావారు వేణుకు నేర్పించారు. వేణు అందులోనూ నైపుణ్యం సంపాయించాడు. చిత్రం ఏమిటంటే — ఆ వాయిద్యాన్ని వాయించగలవారు, నేటికీ వేణు తప్ప మద్రాసులో ఇంకొకరు లేరు ! గుణసుందరికథ, పాతాళభైరవి, మల్లీశ్వరి మొదలైన అనేక చిత్రాల్లో ఆ వాయిద్యం ప్రముఖంగా వినిపిస్తుంది. అది వాయించినది వేణు !

సారధివారు 'అంతా మనవాళ్ళే' చిత్రం ఆరంభిస్తూ వేణును సంగీత దర్శకునిగా తీసుకున్నారు. సినిమా పరిశ్రమలో అడుగు పెడుతూ ఏ సారధి సంస్థలో అతను మొట్టమొదటి జేరి, పని నేర్చుకున్నాడో — ఆ సారధి వారి చిత్రానికే కొన్ని సంవత్సరాల తర్వాత అతను సంగీత దర్శకుడు కాగలిగాడు !

'అంతా మనవాళ్ళే' చిత్రం తర్వాత — వేణు సంగీత దర్శకత్వం వహించిన చిత్రం — 'రోజులు మారాయి'. అదీ సారధివారిదే. రోజులు మారాయి చిత్రంలోని పాటలన్నీ చిత్రంతో పాటే ప్రజాదరణ పొందాయి. ముఖ్యంగా — 'ఏరువాకా' పాట ఆంధ్రదేశమంతా మోగిపోయింది ! రెండో చిత్రంతోనే, వేణు మంచి సంగీత దర్శకుల జాబితాలో జేరిపోయాడు.

అక్కడినుంచీ తోడికోడళ్ళు, మాంగల్యబలం, బాటసారి, రాజమకుటం, సిరిసంపదలు, ప్రతిజ్ఞాపాలన, భార్య మొదలైన 50 చిత్రాలకు ఆయన సంగీత దర్శకుడిగా పని చేశాడు. తోడికోడళ్ళు, మాంగల్యబలం, రాజమకుటం మొదలైన చిత్రాల్లోని పాటలు బహు జనాదరణ పొందిన పాటల్లో కొన్ని.

'మాస్టర్' వేణు దగ్గర ఇంకో ప్రజ్ఞ వుంది. రికార్డింగ్ లో ఆయన కొన్ని ఫీటు చేస్తూ వుంటారు. ఎప్పుడైనా, ఇతర వాయిద్యాలు వాయించేవారు రికార్డింగ్ కు, రాకపోతే, ఒక్క చిన్న 'బిట్టు' లోనే నాలుగైదు రకాల వాయిద్యాలు వుంటే — ఆ నాలుగింటినీ అటూ ఇటూ పరుగెత్తుతూ ఆయనే వాయించేస్తారు ! ఏ ఇన్ స్ట్రుమెంట్ ప్లేయర్ అయినా, 'ఫలానా స్వరం సరిగ్గా పలకడం లేదు, అని అంటే, ఆ వాయిద్యాన్ని తీసుకుని తాను ఆ స్వరాన్ని పలికించి చూపించగల ఇంకో ప్రజ్ఞ కూడా ఆయన దగ్గర వున్నది. పాట ట్యూన్ చెయ్యడంలో వేణుగారి విధానం కూడా తమాషాగా వుంటుంది. ప్రతి

పాటనూ ప్రతివారూ హార్మోనియమ్ మీదనే కంపోజ్ చేస్తారు. అయితే, వేణుగారు, విషాదగీతం అయితే సితార్ మీదా, పాశ్చాత్య పద్ధతిలో వుండే పాటయితే పియానో మీదా, 'చల్లని' పాటయితే వేణువు మీదా – అలా ఆయా వాయిద్యాల మీదనే పాటకు స్వరం కల్పిస్తారు.

వేణు అభిమాన సంగీత దర్శకుడు – నౌషాద్. వారిద్దరూ ఎంతో ఆత్మీయులు.

"నేను చేసే కొత్తరకమైన పాటలనూ, వాటికీ వేసే స్వరాలనూ ఎప్పటికప్పుడు నౌషాద్ గారికి పోస్ట్ ద్వారా తెలియబరుస్తూ వుంటాను. కొన్నింటిని మెచ్చుకుంటారు. కొన్నింటికి సలహాలు ఇస్తారు. వారు చేసే ప్రయోగాలు కూడా నాకు వ్రాస్తూ వుంటారు. నౌషాద్ గారు నాకు గురుతుల్యులు" అంటారు వేణు.

వేణు గారి భార్య కూడా సంగీతాభిమాని. ఆవిడ వీణ వాయిస్తారు. ఈ 'సంగీత దంపతుల' కు ఇద్దరు అబ్బాయిలు. పెద్దవాడు పి.యు.సి., రెండో అబ్బాయి స్కూల్ ఫైనలూ చదువుకుంటున్నారు. ఇద్దరికీ సంగీతమంటే అభిమానం. పెద్దబ్బాయి పియానో నేర్చుకుంటున్నాడు. రెండో అబ్బాయి – ఆర్కెస్ట్రాలో 'బాంగోస్ ప్లేయర్' గా కూడా పని చేస్తూ వుంటాడు.

పరిశ్రమలోని చాలా మంది వాయిద్యనిపుణులు వేణు గారి దగ్గర హార్మోనియమ్ మీద 'సులువులూ, మెళకువలూ' తెలుసుకుని వెళ్తూ వుంటారు. ఆయన చాలా మందికి హార్మోనియమ్ నేర్పారు; నేర్పుతున్నారు. ఇవాళ ఆయన దగ్గర హార్మోనియమ్ నేర్చుకుంటున్నవారిలో ఘంటసాలగారి అబ్బాయి కూడా వున్నాడు !

"హార్మోనియమ్ స్కూల్ పెట్టి, నాకు తెలిసిన విద్యను పదిమందికీ నేర్పాలన్న ఉత్సాహం నాకుంది. ఇది నెరవేరడానికి నేను గట్టిగా కృషి చేస్తున్నాను." అన్నారు వేణు. ఇవాళ ఆయన – వింతకాపురం, కౌముదీ, సురేష్ వారి చిత్రాలకు సంగీత దర్శకునిగా పని చేస్తున్నారు.

# ఎమ్.మల్లికార్జునరావు

## ( విజయచిత్ర - 1972, జూన్ సంచిక నుంచీ)

25 సంవత్సరాల క్రితం మాట !

గుంటూర్లో 'నాయకురాలు' నాటకం జరుగుతోంది. కొత్త ముఖాల కోసం వెతికే సి. పుల్లయ్య గారూ ఆ నాటకం చూస్తున్నారు. అందులో ఆయనకు ఒక అబ్బాయి కనిపించాడు. ఆ అబ్బాయి బాలచంద్రుడి పాత్ర ధరించి, ఉషారుగా నటిస్తున్నాడు. 'ఈ అబ్బాయిని తీసుకోవచ్చు' అనుకున్నారు పుల్లయ్యగారు. అతనితో మట్లాడి అతన్ని తీసుకుని, తన 'గొల్లభామ' చిత్రంలో యువరాజు పాత్ర వేయించారు. ఆ అబ్బాయి పేరు – మంగళగిరి మల్లిఖార్జునరావు. ఒకనాడు మేటి నటీమణిగా వెలుగొందిన సీనియర్ శ్రీరంజని కుమారుడు.




మల్లిఖార్జునరావు అప్పుడు గుంటూరు కాలేజీలో చదువుకుంటూనే, నాటకాలు ఆడుతూ వుండేవాడు. యన్. టి. రామారావు, గుమ్మడి మున్నగువారితో అతనికి మంచి పరిచయం. గుమ్మడి బ్రహ్మనాయుడు, రామారావు నలగామరాజు, మల్లిఖార్జునరావు బాలచంద్రుడు పాత్రలు

ధరిస్తూ 'నాయకురాలు' ఆడేవారు. అలా, అతను అమెచూర్ సంస్థలు ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనడమూ, వారి నాటకాలు కొన్ని డైరక్టు చెయ్యడమూ చేసేవాడు. కళా రంగంలో అతని కృషి అలా వుండగా, విప్లవరంగంలో ఇంకోరకంగా వుండేది. సమ్మెల్లో పాల్గొనడం, చట్ట విరుద్ధమైన తెగింపులు చెయ్యడం చేసేవాడు. చదువు సరిగా సాగేది కాదు. బి. ఏ. లో చేరిన తర్వాత, ఆ సినిమా అవకాశం రావడంతో చదువుకు పూర్తిగా స్వస్తి చెప్పేశాడు.

'గొల్లభామ' చిత్రంలో వేషం అయిపోయిన తర్వాత, మల్లిఖార్జునరావు మళ్ళీ ఎక్కడా వేషం వెయ్యలేదు. సరైన పాత్ర లభిస్తే వెయ్యడానికి అతను సిద్ధంగానే ఉన్నాడు. అలాగే కొన్ని సంవత్సరాలు తిరిగి పోయాయి.

నాగిరెడ్డి, చక్రపాణి విజయాసంస్థ ఆరంభిస్తూ నటీనటులను కొందర్ని పెర్మనెంట్ ఆర్టిస్టులుగా తీసుకున్నారు. రామారావు, రంగారావు, పద్మనాభం, బాలకృష్ణ మొదలైన వారందరూ అప్పుడే చేరారు. 'షావుకారు' చిత్రం తర్వాత, కె.వి. రెడ్డిగారు మల్లిఖార్జునరావును నాగిరెడ్డిగారికి పరిచయం చెయ్యడం, నాగిరెడ్డిగారు అతన్ని కూడా ఆర్టిస్టుగా తీసుకోడానికి అంగీకరించడం జరిగాయి. ఆ అంగీకారం ప్రకారం, ఆ తర్వాత అతను పెర్మనెంట్ ఆర్టిస్టుగా అక్కడ అంగీకార పత్రం మీద సంతకం చేశాడు.

ఒక సంవత్సరం పాటు అతను ఏ పనీ, పాటూ లేకుండా జీతం తీసుకుంటూ రాజాలా తిరిగాడు. ఉదయమే, స్టూడియోకి వెళ్ళడం, టిఫిను తినడం, స్టూడియోలో అక్కడా అక్కడా తిరగడం, ఇంటికి వచ్చేయడం – అంతే జరిగేది. తనకు సరిపోయే పాత్ర వచ్చేవరకూ అలా నిరీక్షించవలసిందే – అనుకున్నాడు. అయితే, ఆ తర్వాత అతనికి 'బోర్' కొట్టింది. ఊరికే జీతం తీసుకుంటూ, తిరగడం మంచి పనిలా కనిపించలేదు. ఏమైతే అయిందని, ఒక రోజు తెగించి వెళ్ళి చక్రపాణిగారిని అడిగాడు – తన విషయం. "నీకు సరైన వేషం రావాలి గదా. ఐనా నువ్వు చదువుకున్నవాడివి; నాటకాలూ ఆ అనుభవం వుంది. ఏ డైరక్షన్ డిపార్టుమెంట్ లోనో చేరితే బానే వుంటుంది." అన్నారు. చక్రపాణి గారు. మల్లిఖార్జునరావు ఓ క్షణం ఆలోచించి – 'అలాగే చేస్తాను సార్' అన్నాడు. చక్రపాణి గారు డైరక్టర్ ప్రసాద్ గారితో చెప్పి, ఆయన దగ్గర జేర్పించారు. అప్పుడు 'పెళ్ళి చేసి చూడు' ప్రారంభమవుతోంది. ప్రసాద్ గారి దగ్గర తాతినేని ప్రకాశరావు, రజనీకాంత్ సహాయకులుగా పని చేస్తున్నారు. మల్లిఖార్జునరావు మూడో అసిస్టెంట్ గా జేరాడు.

దర్శకత్వశాఖలో ఉద్యోగం అతనికి బాగానే వుంది. చాలా విషయాలు తెలుస్తున్నాయి. నటన, దర్శకత్వమే కాకుండా, ఎడిటింగ్ మొదలైన తక్కిన టెక్నికల్ శాఖలూ, వాటిల్లోని విశేషాలూ అవగాహన అవుతున్నాయి. 'ఇది ఎందుకొచ్చిందో, మంచికే వచ్చింది' అనుకున్నాడతను. 'చంద్రహారం' వరకూ మల్లిఖార్జునరావు విజయా సంస్థలో పని చేసి, ఆ తర్వాత 'అమర సందేశం' చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దగ్గర జేరాడు. సుబ్బారావుగారు అంతవరకూ ఎడిటర్ గా పని చేసి, ఆ చిత్రానికే దర్శకుడయినారు. అంచేత, మల్లిఖార్జునరావుకు ఎడిటింగ్ లోనూ, డైరక్షన్ లోనూ కూడా బాగా పని చెయ్యడానికి అవకాశాలు కలిగాయి. ఆ చిత్రానికి అతను అసోసియేట్ డైరక్టర్ గా, అసోసియేట్ ఎడిటర్ గా కూడా పని చేశాడు.

'అమర సందేశం' తర్వాత, మల్లిఖార్జునరావుకు రాజలక్ష్మీ సంస్థలో అవకాశం వచ్చింది. నిర్మాతలు సుందర్ లాల్ నహతా, దూండీల సారధ్యంలో నడిచే ఆ సంస్థలో అతను అన్ని శాఖలలోనూ పనిచేసి, చాలా విషయాలు నేర్చుకున్నాడు.

"దూండీగారు నన్నొక తమ్ముడిలా చూసుకున్నారు. చాలా సంవత్సరాలు నేను ఆ సంస్థలో వున్నాను. ప్రొడక్షన్ ప్లానింగ్, డైరక్షన్, ఎడిటింగ్ మొదలైన శాఖల్లో మంచి అనుభవం కలిగింది. అక్కడ అలాంటి స్వేచ్ఛ, స్వేచ్ఛ ద్వారా అనుభవాలూ ఏర్పడ్డాయి. రాజలక్ష్మీ సంస్థలో నేను నేర్చుకున్న పాఠాలు ఇన్నీ అన్నీ కావు." అంటారు మల్లిఖార్జునరావు కృతజ్ఞతాభావంతో.

ఆ సంస్థలో ఆయన శభాష్ రాముడు, మంచి మనసుకు మంచి రోజులు, సతీ అనసూయ, శభాష్ రాజా, శాంతి నివాసం, రక్త సంబంధం మొదలైన పలు చిత్రాలకు పని చేశారు. యల్. వి. ప్రసాద్, ఆదుర్తి, సి. యస్. రావు, కదారు నాగభూషణం, వి. మధుసూదనరావు, కమాలాకర కామేశ్వరరావు మొదలైన దర్శకుల దగ్గర ఆయన పాఠాలు నేర్చుకున్నారు.

తండ్రిగారైన నాగుమణిగారు సారణి సంస్థను స్థాపించి, 'కాళిదాసు' తీశారు. ఆ సంస్థలో మల్లిఖార్జునరావు భాగస్వామి కూడా.

'కాళిదాసు' తర్వాత ఆ సంస్థ 'ప్రమీలార్జునీయం' మొదలెట్టింది. మల్లిఖార్జునరావు ఈ చిత్రంతో తొలిసారిగా దర్శకత్వపు బాధ్యతను చేపట్టారు.

'ప్రమీలార్జునీయం' తో నా అనుభవం ఇనుమడించింది. పలువురు దర్శకుల దగ్గర పని చేసిన అనుభవసారంతో, నా శక్తి సామర్థ్యాలను ఉపయోగించి నేను ఆ చిత్రాన్ని రూపొందించాను. చిత్రం పూర్తయిన తర్వాత, ఒక మంచి చిత్రాన్ని తియ్యగలిగానన్న పరిపూర్ణమైన తృప్తి కలిగింది. ఆ చిత్ర

నిర్మాణ కాలంలో, కొందరు 'బాగా నడుస్తుంది' అనేవారు. కొందరు 'ఫలానాలాటి దృశ్యాలు వుంటే ఇంకా చాలా బాగా నడుస్తుంది' అని రకరకాలుగా అంటూ వుండేవారు. నేను నా మనసు చెప్పిన నిర్ణయం, ఆత్మ విశ్వాసాలతో ఆ చిత్రాన్ని నిర్మించాను. విడుదలైన తర్వాత, బాక్స్ ఆఫీసు దగ్గర ఆ చిత్రం ఘన విజయం సాధించలేకపోయినా, దర్శకుడిగా నాకు పేరు తెచ్చి పెట్టింది. ఇవాళ పరిశ్రమలో నన్నొక దర్శకుడిగా నిలబెట్టింది ఆ చిత్రమేనని నేను గట్టిగా నమ్ముతాను" అన్నారు మల్లిఖార్జునరావు.

'ప్రమీలార్జునీయం' తర్వాత ఆయన రాజలక్ష్మీ వారి 'గూఢచారి 116' చిత్రం డైరక్టు చేశారు. అది మంచి హిట్టయింది! "అంతకు ముందు తీసినది ఒక పౌరాణికం; తర్వాత తీసినది ఒక థ్రిల్లర్. రెంటికీ సంబంధం లేదు. ఆ చిత్రం, ఆ పాత్రలూ వేరు; ఇది వేరు. అలాంటి వైవిధ్యం గల చిత్రాలు ఆదిలోనే లభించడం నా అదృష్టం" అంటారాయన.

పట్టుకుంటే పదివేలు, ముహూర్త బలం, చెల్లెలికోసం, బందిపోటు భీమన్న, శబాష్ వదినా, మాస్టర్ కిలాడి మొదలైన చిత్రాలు ఆయన ఆ తర్వాత డైరెక్ట్ చేసిన చిత్రాలు. వీటి మధ్యలో ఆయన సొంతంగా నిర్మించి, దర్శకత్వం వహించిన చిత్రం 'అందరికీ మొనగాడు'. 'కండరవండో' అన్న మలయాళ చిత్రం కూడా ఆయన డైరక్ట్ చేశరు. ప్రేమ్ నజీర్, ఉషానందినిలతో 'పట్టాభిషేకం' అన్న మరో మలయాళ చిత్రాన్ని ఇప్పుడు డైరక్టు చేస్తున్నారు. తమిళంలో విజయవంతంగా నడిచిన 'శపధం' చిత్రం ఆధారంగా జైశంకర్ అండ్ కో వారు తీస్తున్న తెలుగు చిత్రానికి ఆయన దర్శకుడు. ఈ చిత్రం దాదాపు పూర్తి కావచ్చింది. దీని తర్వాత ఆయన సొంత సంస్థ పేరిట ఒక సాంఘికాన్ని ఆరంభిస్తారు. అది స్క్రిప్టులో వుంది.

"అయితే ఇంత వరకూ నేను మంచి "కథ" గల చిత్రాన్ని డైరక్ట్ చెయ్యలేదు. అన్నీ ట్రీట్ మెంట్ సబ్జక్ట్స్. మంచి డ్రామా వున్న సబ్జక్ట్ చెయ్యాలన్న కోరిక చాలా రోజులుగా వుంది. అలాగే, విప్లవాత్మకమైన సాంఘిక సంచలన చిత్రం తియ్యాలన్న ఆశ కూడా వుంది. ఇవి నా వ్యక్తిగత అభిరుచులకు సరిపోయే కథలు. మా సొంత సంస్థ పేరిట తియ్యబోయే చిత్ర కథ ఇలాంటిదే !" అన్నారు మల్లిఖార్జునరావు.

"చిత్ర దర్శకుడికి ఏ చిత్రమైనా ఒకటే. పురాణం అయినా, థ్రిల్లర్ అయినా, జానపదమైనా, చిత్రం చిత్రమే. ప్రతి చిత్రానికీ కథనం, దర్శకత్వం అవసరమే. దర్శకుడు చూపవలసిన శక్తి అన్ని చిత్రాలకూ ఒకటే. ఒక దానికి తక్కువ శక్తి, ఇంకోదానికి ఎక్కువ శక్తీ అని వుండవు. మంచిదో చెడ్డదో గాని నాలో ఆత్మ విశ్వాసం వుంది. నన్ను నేను నమ్ముతాను. నాకు నచ్చింది తీస్తాను. అది మంచిదనిపిస్తే, కృతజ్ఞతలతో తీసుకుంటాను. నా మనసుకు తృప్తి అనిపించకపోతే మాత్రం ఎవరెన్ని చెప్పినా వినే స్వభావం కాదు నాది. అలాంటి నిశ్చితాభిప్రాయం దర్శకుడన్న ప్రతివారికీ ఉండాలని నేను భావిస్తాను." అంటారు మల్లిఖార్జునరావు.

తీరిక లభిస్తే మల్లిఖార్జునరావు ఏదో చిత్రం చూస్తారు – అది ఏ భాషదయినా సరే. తక్కువగా చదువుతారు; ఎక్కువగా సినిమాలు చూస్తారు. సినిమా దర్శకుడికి గాని, మరే టెక్నీషియన్ కి గాని, నటీనటులకు గాని, చిత్రాలే గురువులు అని ఆయన నమ్మకం. "పుస్తకంలో చదివే దాంట్లో లేదు. కథానాయిక 'క్లబ్ డాన్సర్' ఐనప్పుడు దుస్తులు ఆ విధంగానే రూపొందించబడితే అందులో తప్పేముంది? కొన్ని చిత్రాలలో ఒక దుష్ట పాత్రను ఆకర్షించి, మభ్య పెట్టి తన పని సాధించుకోవాలనుకొన్నప్పుడు కథానాయికగాని, మరే పాత్ర అయినా గానీ కాస్త 'సెక్సీ' గా కనిపించినట్లు చూపడం కథకు, ఆ సన్నివేశానికి అవసరం. అప్పుడు 'క్లోజప్' లో ఆ పాత్ర 'సెక్సీ' గా కనిపించిందనీ – అందుకు దుష్ట పాత్ర 'రియాక్షన్' కావడం ఎబ్బెట్టుగా వుందనీ అంటే కథానుగుణంగా ఇక చిత్రం నడిచేదెలా ? ఏ చిత్రానికైనా పాత్రల వస్త్రధారణగానీ, స్వభావ చిత్రీకరణగాని కథానుగుణంగా వుండటమే ప్రధానం!

కనిపించనిది చిత్రంలో స్పష్టంగా కనిపిస్తుంది. వివిధ చిత్రాలూ చూడడం అన్నది మంచి పాఠాలు నేర్పుతుంది." అన్నది ఆయన దృఢ విశ్వాసం.

"ఎంత గొప్ప దర్శకుడికైనా ఎవరికైనా మంచి కథ లభించాలి. అది చిత్ర నిర్మాణంలో ప్రధమమైనది. ఆ కథను తెరకు అనువదించాలి. అది ప్రప్రధమమైనది. ఎంత మంచి కథ లభించినా 'ప్రెజెంటేషన్' బాగుండకపోతే, కచ్చితంగా దెబ్బతింటుంది. అలాగే పాత్రధారుల ఎన్నిక కూడా. 'మిస్ కాస్టింగ్' కూడా చాలా ప్రమాదకరం" అని ఆయన భావిస్తారు.

ఇవాళ బొంబాయిలో లేచిన 'కొత్త కెరటం' లాంటిది తెలుగులోనూ రావాలని ఆయన అంటారు. 'వాటిల్లో కళా వుంది; కాసూ వుంది. జీవితానికి ప్రతిబింబాలు ఆ చిత్రాలు. తెలుగు పరిశ్రమ కూడా అలా కొత్త దారి తొక్కితే, నిశ్చయంగా కొత్త పూలు పూస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను." అన్నారు మల్లిఖార్జునరావు – దృఢ నిశ్చయం గల కళ్ళతో భవిషత్తులోకి చూస్తూ.

# దాసం గోపాలకృష్ణ

## ( విజయచిత్ర – 1968, ఆగష్టు సంచిక నుంచీ)




బాలా ప్రొడక్షన్స్ వారి 'బంగారు సంకెళ్ళు' చిత్రం – కొత్త రచయితను పరిచయం చేస్తున్నది. అతను దాసం గోపాలకృష్ణ. 'బంగారు సంకెళ్ళు' చిత్రం నిజానికి గోపాలకృష్ణకు మొదటి చిత్రమే అయినా – అంతకు పూర్వం అతను భారత్ ఫిల్మ్స్ వారి 'భక్త పోతన' లో కూడా సంభాషణలు రాశాడు. అయితే, సహాయ సంభాషణా రచయితగా ఆ చిత్రంలో అతను పని చేశాడు – 'బంగారు సంకెళ్ళు' తానుగా, పూర్తిగా మాటలు రాసిన చిత్రం.

అత్తిలి దగ్గరగా వున్న కోడవల్లి గ్రామం గోపాలకృష్ణ స్వగ్రామం. అత్తిలి, తణుకు, భీమవరం – మొదలైన వూళ్ళలో అతను చదువుకున్నాడు. గోపాలకృష్ణ తండ్రి గారు మంచి పండితులు. ఖగోళ, భూగోళ శాస్త్రాల మీద, తతిమ్మా శాస్త్రాల మీద ఆయనకు మంచి శ్రద్ధ వుండేది.

కోడవల్లి గ్రామం – చెప్పుకోవాలంటే వీధి భాగవతాలకు పుట్టిల్లు లాంటిది. ఆ వూరి వీధి భాగవతులకు మంచి పేరుండేది. వాళ్ళు వీధి నాటకాలు రమ్యంగా ఆడేవాడు. చిన్నతనంలో గోపాలకృష్ణ ఆ నాటకాలను ఆసక్తితో చూసేవాడు; వారివారి పద్ధతులను గమనించేవాడు. నాటకాల మీద శ్రద్ధ అలా వుండగా అతను తెలుగులో బాగా కృషి చెయ్యడం ఆరంభించాడు. ప్రబంధాలు, కావ్యాలు చదివి అర్థం చేసుకున్నాడు; వ్యాకరణం బాగా ఒంట పట్టించుకున్నాడు.

ఇంటర్మీడియెట్ చదువు పూర్తయిన తర్వాత, గోపాలకృష్ణ ఏ వుద్యోగానికి పోవడమూ అన్న ఆలోచనలో పడి, ఏ ఉద్యోగమూ చెయ్యలేదు. పత్రికల్లో వ్యాసాలూ కథలూ రాయడం సాగించాడు. చిన్నతనంలో నాటకాలమీద వున్న ఉత్సాహం వల్ల, తన పాండిత్యంతో – కొన్ని పురాణ నాటకాలు రాశాడు. అప్పట్లో సాంఘికాలమీద పెద్ద నమ్మకం లేదు. తర్వాత తర్వాత సాంఘిక వాతావరణంతో సాంఘిక నాటకాలు కూడా రాయాలన్న ఉత్సాహం కలిగి – ఆ నాటకాలు రాయడానికి ఉద్యమించాడు.

హైస్కూల్లో చదువుకుంటూ వుండగానే అతనికి నాటక రచన అలవాటయింది. పాటలు కూడా రాయడం సాగించాడు.

స్కూల్లో ప్రదర్శించడానికని, మొదటిసారిగా 'సర్వం జగన్నాథం' అన్న సాంఘిక నాటికను రాశాడు. ఆ నాటికను స్కూల్లో ఆడారు; తర్వాత అక్కడా అక్కడా ఆడారు. పద్యాలూ పాటలతో 'పున్నమిదేవి' అన్న చారిత్రక నాటకాన్నీ, 'నరకాసుర వధ' పురాణ నాటకాన్నీ రాశాడు – గోపాలకృష్ణ అప్పట్లో.

1960 లో తణుకులో ఆంధ్ర నాటక కళా పరిషత్తు జరిగింది. ఆ పోటీలో దాసం గోపాలకృష్ణ రాసిన 'చిల్లరకొట్టు చిట్టెమ్మ' నాటకం ప్రదర్శింపబడింది. నాటక రచనకు ఉత్తమ బహుమతీ, తదితర బహుమతులు కొన్నీ లభించాయి. ఆ నాటకంతో గోపాలకృష్ణ పేరు అందరికీ బాగా తెలిసింది. ఆ నాటకం అతనికి మంచి పేరు తీసుకొచ్చింది.

"దానికి కారణం – ఆ నాటకంలోని కథా వస్తువూ, పాత్రలూ. సజీవమైన పాత్రలూ, వాస్తవికమైన కథా కావడంచేత ఆ నాటకాన్ని అందరూ మెచ్చుకున్నారు" అన్నడు గోపాలకృష్ణ.

కొంతకాలం క్రితం 'చిల్లరకొట్టు చిట్టెమ్మ' నాటకం మద్రాసులో ప్రదర్శింపబడింది. నాటక ప్రదర్శన చూసి, రెండో రోజు కూడా అదే నాటకాన్ని కల్చరల్ క్లబ్ వారు ఆడించారు. ఆ నాటకంలో వాణిశ్రీ నటించింది. ఆ నాటకంతోనే ఆమె, దర్శక నిర్మాతల దృష్టిలో పడి, తారగా మారింది; మంచి రచయితగా గోపాలకృష్ణ పేరు మద్రాసులో బాగా పాకింది.

డా॥రాజారావు గారు 'పుట్టిల్లు' తీస్తున్న సమయంలో గోపాలకృష్ణ మద్రాసు వచ్చాడు. 'పుట్టిల్లు' బృందంలో వున్నవారు కొందరు గోపాలకృష్ణ మిత్రులు. అప్పుడే ఆయనకు దర్శకుడు రామినీడు గారితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం మంచి స్నేహమైంది. గోపాలకృష్ణ నాటకాలు, అతని రచనా రామినీడు గారిని మెప్పించాయి. 'భక్త పోతన' చిత్రం తీస్తున్న సమయంలో గోపాలకృష్ణను రప్పించి, ఆ చిత్రానికి సహాయ సంభాషణా రచయితగా పని చేయించారు. గోపాలకృష్ణకు సినిమాలతో సంబంధం అలా ఏర్పడింది. అప్పుడే స్క్రిప్టు, మంచి చెడ్డలు మొదలైన విషయాలు అనేకం తెలిశాయి.

రామినీడుగారి దర్శకత్వంలో బాలా ప్రొడక్షన్స్ వారు 'బంగారు సంకెళ్ళు' ప్రారంభిస్తూ గోపాలకృష్ణను రచయితగా తీసుకున్నారు. 'బంగారు సంకెళ్ళు' జరుగుతూ వుండగానే, అతనికి మరికొన్ని అవకాశాలు వచ్చాయి.

సుబ్బలక్ష్మి పిక్చర్స్ వారు బి.యస్. నారాయణ దర్శకత్వంలో ఆరంభిస్తున్న సాంఘిక చిత్రానికీ, గిడుతూరి సూర్యం దర్శకత్వంలో సప్తగిరి ఆర్ట్స్ వారు తీస్తున్న సాంఘికానికీ, పి.సుబ్రమణ్యం దర్శకత్వంలో కళా చిత్రవారు నిర్మించనున్న సాంఘికానికీ గోపాలకృష్ణ ఇవాళ, రచయితగా పని చేస్తున్నారు.

"చిత్ర రచన, పద్ధతీ అంతా నాకు రామినీడుగారే నేర్పారు. ఆయన ప్రోత్సాహంతోనే తెర రచయితను కాగలిగాను. ఆయన నాకు గురుతుల్యులు" అన్నారు గోపాలకృష్ణ.

# కె.ఎస్.రెడ్డి

# నృత్యదర్శకుడు

## (విజయచిత్ర – 1968, జూలై సంచిక నుంచీ)

చలనచిత్రంలో గ్రూప్ డాన్సుకు మంచి స్థానం వుంది. సాధారణంగా ప్రతి చిత్రంలోనూ ఈ డాన్సు కనిపిస్తూ వుంటుంది. 'గ్రూప్ డాన్స్' అన్న పదానికి తెలుగులో 'సమూహ నృత్యం' అని వాడుతున్నారు. చిత్రాల్లో నృత్యాలు – ఒక్కరే చేసేవి – ఇద్దరు చేసేవి – ఎంతమందో కలిసి చేసేవి – ఇలా రకరకాలుగా వుంటాయి. అవసరాన్నిబట్టి, సందర్భాన్ని బట్టి – ఆ నృత్యాలు వుంటాయి. సాధారణంగా గ్రూప్ డాన్సుల్లో – ప్రధానంగా ఒక డాన్సర్ ఉంటారు. పది, పదిహేను మంది కూడా నృత్యం చేస్తారు. ఇలాంటి నృత్యాలనే గ్రూప్ డాన్సులు అంటారు. ఈ నృత్యాలు జానపద చిత్రాల్లో విధిగా కనిపిస్తాయి. పురాణ చిత్రాల్లో ఇంద్ర దర్బారూ, అలాంటి వాటిల్లో




www.koumudi.net

కనిపిస్తాయి. సాంఘికాలయితే, క్లబ్బుల్లోనూ దొంగల ముఠాలు గల గుహల్లోనూ, పుట్టిన రోజు పండగల సందర్భాల్లోనూ నృత్యాలు అవసరమవుతూ వుంటాయి.

చలన చిత్రం విజ్ఞాన, వినోదాల మిశ్రమం. ఈ నృత్యాలు వినోదం (ఎంటర్ టైన్మెంట్) కోసం ఉద్దేశింపబడ్డవి. సాధారణంగా, చిత్రాల్లో కూడా కథలో వచ్చే పాత్రలకు వినోదం కల్పించడానికే గ్రూప్ డాన్సులు అవసరమవుతూ వుంటాయి. తద్వారా ప్రేక్షకులకు కూడా వినోదం కలుగుతుంది.

నేను 'డాన్సు మాస్టర్' గా ఇవాళ అనేక చిత్రాలకు పని చేస్తున్నాను. అయితే, మొదట నేను గ్రూప్ డాన్సర్ గా చిత్రాల్లో ప్రవేశించాను. మాది రాజమండ్రి. రాజమండ్రిలో నేను చదువుకుంటూ వుండేవాడిని. చదువుతో పాటు నృత్యం కూడా నేర్చుకోవాలన్న శ్రద్ధ కలిగి, శ్రీ వేదాంతం జగన్నాధశర్మగారి (రాజమండ్రిలోనే) రోజూ నృత్యం నేర్చుకుంటూ వుండేవాడిని. అప్పుడు డాన్సు హాబీ నాకు – ఇవాళ 'వృత్తి' ఐంది!

1950 ప్రాంతాల, నాకు సినిమాల్లో వేషాలు వెయ్యాలన్న ఉత్సాహం కలిగింది. ఆ ఉత్సాహంతో మద్రాసు వచ్చాను. సంవత్సరం పాటు వేషాలకోసం కృషి చేశాను గాని – అవకాశాలు లభించలేదు. అక్కడా అక్కడా చిన్నచిన్న వేషాలు లాంటివి వచ్చాయి గాని, అవి వేస్తే ప్రయోజనం లేదని వూరుకున్నాను. సంవత్సరం పై చిలుకు కాలం అలా గడిచిపోయిన తర్వాత, అది వరలో నేను 'హాబీ' గా నేర్చుకున్న నృత్యం నాకు పనికొచ్చింది. అనేక మంది నృత్య దర్శకులను కలుసుకుని, నా విద్య చూపించాను. నాట్యంలో నాకున్న శ్రద్ధనూ, ఉత్సాహాన్నీ చూసి, నృత్య దర్శకులు 'గ్రూప్' నృత్యాల్లో నాకు అవకాశాలు కలిగించసాగారు. నిజానికి, గ్రూప్ నృత్యాలు చెయ్యడానికి నేను నేర్చుకున్నంత విద్య అనవసరమే; అయినా నా అంతట నేను ఆ విద్యలో ఇంకా కృషి చేసి ప్రావీణ్యత సంపాయించదలచుకున్నాను. రెండేళ్ళు – గ్రూప్ డాన్సుల్లో పాల్గొన్న తర్వాత – నాకు 'సోలో' (ఒక్కణ్ణే) డాన్సు చేసే అవకాశం కలిగింది. అది – 'ఆత్మార్పణం' అనే మలయాళ చిత్రంలో. అక్కడనుంచీ, అక్కడా అక్కడా సోలో అవకాశాలు రాసాగాయి. ఐనా, గ్రూప్స్ లో కూడా చేసేవాడిని. ఇంకో రెండు సంవత్సరాలపాటు గ్రూప్ డాన్సుల్లో పాల్గొన్న తర్వాత, సోలో డాన్సులు మాత్రమే చెయ్యసాగాను. అంటే – నేను ఒక్కణ్ణే కాకపోయినా జంటగా అనేక చిత్రాల్లో పాల్గొన్నాను. 'రోజులు మారాయి' చిత్రంలో వహీదారెహమాన్ తో నేను నృత్యం చేసిన సంగతి పాఠకులకు జ్ఞాపకం వుండొచ్చునని భావిస్తున్నాను. అలాగే, రాగిణి, ఇ.వి. సరోజ, రీటా, యల్. విజయలక్ష్మి, గీతాంజలి, కుచల కుమారి – మొదలైన డాన్సర్స్ అందరితోనూ జంటగా అనేక చిత్రాల్లో నృత్యాలు చేశాను. రెండు సంవత్సరాల కాలంలో – నేను సుమారు 80 చిత్రాల్లో సోలో, కాంబినేషన్ (జంట) నృత్యాలు చేశాను. రెండు సంవత్సరాల్లో ఇన్ని నృత్యాలు చెయ్యడం – మగవారికి – రికార్డుగా భావించవచ్చును.

మొదటి రోజుల్లోనే, నేను శ్రీమతి వైజయంతిమాల బృందంలో చేరి, దేశమంతా టూర్ చేశాను. అది 'చండాలిక' – నృత్య నాటిక. అలా గ్రూప్ నృత్యాల్లో పాల్గొంటున్నా – 'అక్కడి కా విద్య చాలులే' అన్న దృష్టితో నేను ఆ విద్యను నిర్లక్ష్యం చెయ్యలేదు. అనేక పుస్తకాలు తెప్పించి, పుస్తకాల ద్వారా అనేక నృత్యాల పద్ధతులు తెలుసుకున్నాను; అనేక నృత్య ప్రదర్శనాలకు వెళ్ళి ఆయా పద్ధతులు తెలుసుకున్నాను. పాశ్చాత్య పోకడలూ, భారతదేశంలో వున్న వివిధ నృత్యాలూ తెలుసుకున్నాను. అలాంటి కృషి నేను చెయ్యబట్టే – నాకు 'డాన్సు మాస్టర్' అవకాశం కలిగింది. అది – 'దేశ ద్రోహులు' చిత్రంలో శ్రీ బోళ్ళ సుబ్బారావు గారు కల్పించారు. 'మాస్టర్' వృత్తిని చేబట్టడానికి నేను మొదట అంగీకరించలేదు – ఆ విద్యలో ఇంకా నేను సాధించవలసింది చాలా వున్నదనే ఉద్దేశంతో. కాని, బోళ్ళ సుబ్బారావుగారు నన్ను బాగా ప్రోత్సహించి, నృత్య దర్శకుని చేశారు. నా అదృష్టం వల్ల – తర్వాత తర్వాత అనేక చిత్రాలొచ్చాయి. గత నాలుగు సంవత్సరాలలోనూ, నేను 52 చిత్రాలకు నృత్య దర్శకుడిగా పనిచేశాను; అయితే, 'మాస్టర్' ను అయిన తర్వాత కూడా నేను ముఖ్య నర్తకుడిగా చిత్రాల్లో కనిపిస్తున్నాను. ఇటీవల 'రామ్ అవుర్ శ్యామ్' లో నృత్యం చేశాను. తెలుగు, తమిళం, కన్నడం, హిందీ , మలయాళం మున్నగు అనేక భాషా చిత్రాల్లో నేను నృత్యాలు చేశాను; తెలుగు, తమిళ, కన్నడ చిత్రాలకు నృత్య దర్శకునిగా పనిచేశాను; చేస్తున్నాను.

ఇదంతా – ఎందుకు చెప్పానంటే – గ్రూప్ డాన్సర్ గా వుంటూ, మాస్టర్ ను కావడానికి వెనక వున్న కథ ఎలాంటిదో చెప్పడానికి.

ఇవాళ పరిశ్రమలో వుంటూ, గ్రూప్ నృత్యాల్లో పాల్గొంటున్న వారిలో పాతిక మంది స్త్రీలు, ఇరవై మంది పురుషులూ వున్నారు. వీళ్ళలో పది, పదిహేను మంది మంచి అనుభవం గలవారు వున్నారు. ఆ రోజుల్లో గ్రూప్ నృత్యాల్లో పాల్గొనేవారికి కూడా అర్హతలు కావలసి వుండేవి. ఇవాళ అక్కర్లేదు. కాస్త అడుగులు వెయ్యడం, మూవ్మెంటూ వచ్చి, అందంగా వుంటే చాలు.

షూటింగ్ కి వెళ్ళే ముందు గ్రూప్ నృత్యాలకు ఆరు, ఏడు రోజులపాటు రిహార్సల్సు వుంటాయి. దానికి ముందు నృత్య దర్శకుడు – ఎలాంటి నాట్యం, ఎలాంటి మూవ్ మెంటుతో వుంటే బావుంటుంది అని ఆలోచించి కంపోజ్ చేస్తాడు. శాస్త్రీయమైన నృత్యం అయితే సంగీత దర్శకునితో కూచుని, జతులు చూసుకుని, సంగీత దర్శకుని తోడ్పాటుతో – అప్పుడే నృత్యం 'సెటప్' అవుతుంది. మామూలుగా వుండే నృత్యాలయితే, సంగీతానికి అనుకూలంగా నేను నృత్యాన్ని కంపోజ్ చేస్తాను. కంపోజ్ చెయ్యడానికి సోలో అయితే రెండు, మూడు రోజులు పడుతుంది. గ్రూప్ డాన్సు అయితే ఐదారు రోజులు పడుతుంది. నృత్యదర్శకుడు, పాట వింటూ మూవ్ మెంట్ సెట్ చేస్తాడు. తన మూవ్ మెంటు తాను చూడలేడు కాబట్టి – అసిస్టెంటుకు చెప్పి చేయిస్తాడు. అసిస్టెంటును 'కంపోజర్' అంటారు. ప్రతి నృత్యదర్శకుడికి 'కంపోజర్స్' వుంటారు. అనుకున్న అభినయం కంపోజర్ చేసి చూసినప్పుడు, బాగులేకపోతే, ఇంకోటి సెట్ చేస్తాము. ఆ విధంగా నిర్ణయం అయిపోయిన తర్వాత, ఆ నృత్యాన్ని నృత్యం చేసే ఆర్టిస్టులకు చెబుతాము.

చిత్రాల్లో నాయికానాయకులు యుగళగీతాలు పాడే సన్నివేశాల్లో కూడా నృత్యదర్శకుడికి పని వుంటుంది. నృత్యదర్శకుడు – ఇద్దరి చేత (మగ, ఆడ) ఆ మూవ్ మెంట్ ను చేయించి చూపుతాడు; ఆర్టిస్టులు చేస్తారు. నృత్యదర్శకుడికి చిత్ర నిర్మాణంలో ఎక్కువ బాధ్యతే వున్నది. నృత్యం కంపోజ్ చెయ్యడం దగ్గర్నుంచీ, షూట్ చెయ్యబడిన దృశ్యాలను 'ఎడిట్' చేస్తున్న సమయం వరకూ నృత్యదర్శకుడి పనీ, బాధ్యతా వున్నాయి.

మన చిత్రాల్లో గ్రూప్ డాన్సులకు ప్రాముఖ్యత ఎప్పుడూ వుంటుంది. గ్రూప్ డాన్సులలో పాల్గొన్న వారిలో చాలామంది పేరు తెచ్చుకున్న నర్తకులయ్యారు. నా ఉద్దేశంలో నటిగా స్థిరపడడానికి – నర్తకికి మంచి అవకాశం వుంది. అందుకనే, మన చిత్రాల్లో డాన్సర్స్ గా వచ్చిన చాలా మంది, నటీమణులుగా రూపొంది, స్థిరపడ్డారు. వైజయంతిమాల, పద్మిని, వహీదారెహమాన్, ఇ.వి.సరోజ, రాగిణి, భారతి మొదలైన డాన్సర్స్ నటీమణులుగా స్థిరపడి, తారాపథానికి వెళ్ళారు. నాట్యంలో అభినయం, భావం ప్రముఖస్థానం వహిస్తాయి. నర్తకులకు అవి బాగా అలవాటు అవుతాయి. వారు పాత్రధారణ చేస్తే – భావప్రకటన, అభినయం, టైమింగ్ – లాంటివన్నీ సులభమవుతాయి. చక్కని నటీమణులుగా రూపొందడానికి అవకాశాలు వున్నాయి.

ఇవాళ మన చిత్రాల్లో నృత్యాలు చేస్తున్న అమ్మాయిలలో కొంతమంది పాత్రలు ధరించిన వాళ్ళున్నారు. అయితే అవకాశాలు ఎక్కువగా రాకపోవడంతో, నాట్యంలోనే వుండిపోయారు.

నటనలో మంచిస్థానం సంపాయించాలంటే, నాట్యం బాగా దోహదం చేస్తుంది. నాట్యంలో ఆ గొప్పదనం వుంది. ఆ విషయాన్ని మన చలన చిత్ర చరిత్ర గట్టిగానే రుజువు చేస్తుంది. ముక్కు, మొఖం, అందంగా వుండి, నాట్యంలో ప్రవేశంగలవారు ఎందరో వున్నారు; అందులో కొందరు సినిమా రంగంలో వున్నారు. అటువంటి వారికి తగిన ప్రోత్సాహం లభిస్తే, తారలు కాగలరన్నది నిస్సందేహం !

# సుందర్ లాల్ నహతా

# నిర్మాత

## ( విజయచిత్ర – 1968, ఆగస్టు సంచిక నుంచీ)

చలనచిత్ర పరిశ్రమకు మూల స్తంభాలు అనదగ్గ వారు పరిశ్రమలో 'కొందరున్నారు. అలా – పరిశ్రమ మనుగడకూ, విస్తరణకూ, కారకులైన వారిలో ఒకరు – సుందర్ లాల్ నహతా, చిత్ర నిర్మాతగా, పంపిణీదారుగా, సలహాదారుగా – ఆయనను పరిశ్రమ చాలా కాలం నుంచి ఎరుగును. వ్యాపారదక్షత, నిర్మాణబాధ్యత, కష్టనష్టాలూ, మంచిచెడ్డలూ, అంచనాలు వెయ్యడంలో సుందర్ లాల్ నహతా గట్టివారు.



చలనచిత్ర పరిశ్రమను – 'పరిశ్రమ' గా మార్చాలనీ, కళాత్మకమైన వ్యాపారాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలనీ, లేకపోతే పరిశ్రమ మనలేదనీ ఆయన భావించారు. ఒక భాషలో విజయవంతమైన చిత్రాలను ఇంకో భాషలో నిర్మించడం, తక్కువ వ్యవధిలో చిత్ర నిర్మాణాలను, వంటివి ఎన్నో – ఆయన చేశారు. డిస్ట్రిబ్యూటరుగా ఎన్నో చిత్రాలను ఆయన విడుదల చేశారు; శాంతినివాసం, సతీ అనసూయ, జయం మనదే, గుడి గంటలు, రక్త సంబంధం, మంచి మనసుకు మంచిరోజులు, వీరాభిమన్యు, గూఢచారి – 116 మున్నగు ఎన్ని చిత్రాలకో ఆయన నిర్మాత.

సుందర్ లాల్, కొత్త దర్శకులను ప్రోత్సహించారు; కొత్త రచయితలకు అవకాశం ఇచ్చారు; కొత్త నటీనటులను వెలుగులోకి తెచ్చారు; నిర్మాణంలో కొత్త వరవడులు పెట్టి – అనేకమందికి ఆ పద్ధతులు నేర్పారు; చక్కని నిర్మాతలుగా వారిని రూపొందించారు; చిత్రాన్ని పంపిణీ చెయ్యడంలో కూడా ఆయన అవలంభించిన పద్ధతులూ, చిట్కాలూ అనేకులకు తెలుసును.

"ఏ ఏ ప్రదేశాల్లో – ఏ ఏ కాలాల్లో ప్రేక్షకులు సినిమాలు చూస్తారు – అన్నది కూడా ముఖ్యాంశాం. అది కనిపెట్టి చిత్రాలు విడుదల చేస్తూ వుండాలి. పండగలూ, పబ్బాలప్పుడూ, ప్రజల దగ్గర డబ్బు వుండే సమయాల్లోనూ చిత్రాలను విడుదల చెయ్యాలి. వానాకాలం, కోతలకాలం – ఇలాంటి సమయాలు కనిపెడుతూ వుండాలి. కనిపెట్టి, చిత్రాలను విడుదల చేస్తూ వుండాలి" అన్నారు సుందర్ లాల్.

దక్షత, సామర్ధ్యం, తెలివి తేటలూ గలవారు ఏ పరిశ్రమలోనైనా రాణిస్తారు. చిత్ర పరిశ్రమలో సుందర్ లాల్ నహతా రాణించడానికి ఇలాంటివే అనేక కారణాలు.

★ ★ ★ ★ ★ ★ ★ ★

ఈస్ట్ ఇండియా ఫిల్మ్ కంపెనీ అధినేత చమ్రియా – చమ్రియాటాకీ డిస్ట్రిబ్యూటర్స్ పేరిట మద్రాసులో కూడా ఒక శాఖను ఆరంభించదలచుకున్నారు. బాధ్యతాయుతంగా పని చెయ్యగల, ఉత్సాహవంతులైన యువకులను ఆ సంస్థలో పెట్టాలని చమ్రియా ఆశించారు. ఆ సమయంలోనే సుందర్ లాల్, చమ్రియాకు తటస్థపడ్డారు.

సుందర్ లాల్, అప్పుడే కలకత్తా యూనివర్శిటీలో బి. కామ్. డిగ్రీ తీసుకున్నారు. చమ్రియా ఆ యువకుణ్ణి ఎగాదిగా పరీక్షించి చూశారు. 'అబ్బాయి ధీమాగా నించున్నాడు; తెలివితేటలు ముఖంలోనే ఉట్టిపడుతున్నాయి; పెల్లుబుకుతున్న ఉత్సాహం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది' అనుకున్నారు చమ్రియా.

"నువ్వు నా మద్రాసు శాఖకు మేనేజరువి" అన్నారాయన – ఒక్క ముక్కలో. సుందర్ లాల్ ఆశ్చర్యంగా చుశారు.

"క్షమించండి. నాకు సినిమా పిచ్చి వున్న మాట నిజమే; విడవకుండా – వచ్చే ప్రతి సినిమా చూస్తానన్నమాట నిజమే. అయితే అంత మాత్రాన, సినిమా పరిశ్రమ గురించి నాకు బాగా తెలుసు అని నేను అనుకోవడం లేదు. నా విషయంలో మీరు బాగా ఆలోచించుకుని గాని, ఒక నిర్ణయానికి రావద్దని నా ప్రార్ధన" అన్నారు సుందర్ లాల్, వినయంగా.

"నువ్వు నాకు తెలుసు; మా కుటుంబానికీ నువ్వు తెలుసు; నువ్వు వ్యవహారాలు ఎలా నడపగలవో నీకు తెలియక పోయినా, నాకు తెలుసు. అంచేత నిన్ను నేను తయారు చేసుకోగలను" అన్నారు చమ్రియా.

సుందర్ లాల్ ఇంకేం మాట్లాడలేదు. చమ్రియా టాకీ డిస్ట్రిబ్యూటర్స్ మద్రాసు శాఖకు మేనేజరుగా వచ్చారాయన. అది – 1941 వ సంవత్సరం.

నేటి రాజశ్రీ పిక్చర్స్ అధిపతి, తారాచంద్ బర్జాత్యా కూడా అప్పుడు చమ్రియాతో వుండేవారు. చిత్ర పరిశ్రమలో వున్న దాదాపు అన్ని శాఖలతోనూ తారాచంద్ కు పరిచయం వున్నది; ఆ పరిజ్ఞానమూ వున్నది. తన అనుభవాల్నీ తనకున్న పరిజ్ఞానాన్నీ పురస్కరించుకుని, తారాచంద్, సుందర్ లాల్ కు

అనేక విషయాలు నేర్పారు. చిత్ర నిర్మాణం అంటే ఏమిటి – పంపిణీ చెయ్యడం అంటే ఏమిటి – చిత్రాలకు పెట్టుబడి పెట్టే విధానాలు ఎలా వుండాలి – మొదలైన అనేక విషయాలను సుందర్ లాల్ అర్ధం చేసుకున్నారు; వంట బట్టించుకున్నారు.

కొంత కాలానికి చమ్రియా జోస్యం నిజమైంది. వారి మద్రాసు శాఖను సుందర్ లాల్ కట్టుదిట్టంగా, సమర్ధవంతంగా నిర్వహించసాగారు. సుందర్ లాల్ వ్యవహార నైపుణ్యాన్ని చూసి, చమ్రియా ముచ్చటపడ్డారు.

"నువ్వు – నేను అనుకున్న దానికంటె గట్టివాడివి. నీ పనితనం నాకు నచ్చింది. నిన్ను నా సంస్థలో భాగస్వామిని చేస్తున్నాను" అన్నారు చమ్రియా.

ఆ క్షణం నుంచీ సుందర్ లాల్ ఆ సంస్థలో భాగస్వామిగా మారి, చమ్రియాతో సమానమైన హోదాకు వచ్చారు. మేనేజరుగా చేరిన వ్యక్తి భాగస్వామి కాగలిగాడంటే – దానికి ఎంత సామర్ధ్యం కావాలో, వ్యవహార దక్షత కావాలో వూహించిన వారికే అర్ధమవుతుంది.

"చమ్రియా ఎన్నడూ నన్నొక పనివాడిగా చూడలేదు. సొంత బిడ్డలా ఆదరించారు. నా మీద ఆయన చూపిన వాత్సల్యం మరువరానిది. నేనంటే ఆయనకు ఎంతో అభిమానం వుండేది. నేను కూడా ఆయన్ని యజమానిగా ఎన్నడూ భావించలేదు; కుటుంబంలోని ముఖ్యునిగానే భావించాను. 41 లో ఆయనతో కలిగిన పరిచయం 1967 వచ్చేసరికి ఎంతో స్నేహంగా మారింది. 67 లో ఆయన మృతి చెందారు. అటువంటి వ్యక్తిని పోగొట్టుకున్నందుకు నేనెంతగా కుమిలి పోయి వుంటానో, ఎంతగా దుఃఖించి వుంటానో ఎవరూ అంచనా కట్టలేరు" అన్నారు నహతా రుద్ధ కంఠంతో.

తారాచంద్ బర్జాత్యా 1966 వరకూ చమ్రియాతో వున్నారు. తర్వాత ఆయన చమ్రియాను విడిచిపెట్టి – వేరే వెళ్ళిపోయారు. తారాచంద్, సుందర్ లాల్ ఇద్దరూ చిత్రాల పంపిణీ కార్యక్రమాల్లో సమాన హోదాలోనే పని చేశారు.

యుద్ధ భయం వల్ల 1943 లో చమ్రియా సంస్థ విజయవాడకు తరలించబడ్డది. అక్కణ్ణుంచీ పది సంవత్సరాలపాటు ఆ సంస్థ విజయవాడలోనే వున్నది. ఆ పది సంవత్సరాల కాలంలోనూ, చమ్రియాసంస్థను చూసుకుంటూ – తెలుగు చలన చిత్ర పరిశ్రమకు అనేక సహాయాలు చేశారు నహతా. తెలుగు చిత్ర పరిశ్రమను వెలుగులోకి తీసుకు రావడానికి ఎంతగానో శ్రమించారు. ఆ సమయంలోనే ఆయన, ఆంధ్ర చలనచిత్ర వాణిజ్య మండలికి అధ్యక్షుడిగా కూడా ఎన్నికయినారు.

సినిమా థియేటర్లో చూపించబడే, వార్తా చిత్రాలకు ప్రభుత్వం, థియేటర్ యజమానుల వద్ద వసూలు చేస్తున్న మొత్తం చాలా ఎక్కువనీ, ఆ మొత్తాన్ని తగ్గించవలసిందనీ – తగ్గించేదాకా వార్తా చిత్రాల ప్రదర్శనను నిలిపి వేయవలసిందిగా ఉత్తరువు జారీ చెయ్యాలని – ఆంధ్ర ఫిల్మ్ వాణిజ్య మండలి కోర్టువారిని కోరింది.

దాంతో, అప్పుడు కేంద్ర సమాచార శాఖా మంత్రిగా వుంటున్న బి.వి.కేస్కర్, విజయవాడలో ఒక అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి, వాణిజ్య మండలితో సంప్రతించి, వార్తా చిత్రాల అద్దెను తగ్గించారు. థియేటర్లో ఒక చిత్రానికి వసూలైన మొత్తాన్ని బట్టే, ఆ అద్దె కూడా వుండేట్టుగా ఆమోదించారు. అప్పుడు సుందర్ లాల్ మండలికి అధ్యక్షులు. ఆయన ఆధ్వర్యంలో అలాంటి ఉద్యమాలు ఎన్నో సాగాయి.

1950 వ సంవత్సరంలో సుందర్ లాల్ నహతా తారాచంద్ బర్జాత్యాతో కలిసి రాజశ్రీ పిక్చర్స్ అన్న సంస్థను స్థాపించారు. ఆ సంస్థ చిత్రాలను నిర్మిస్తుంది; విడుదల చేస్తుంది. అక్కడి నుంచీ సుందర్ లాల్ చిత్ర నిర్మాతగా మారారు. తెలుగు, తమిళ భాషలలో అనేక చిత్రాలు నిర్మించారు; విడుదల చెశారు.

శ్రీ ప్రొడక్షన్స్, రాజలక్ష్మీ ప్రొడక్షన్స్, విజయలక్ష్మీ పిక్చర్స్ మొదలైన సంస్థలను కూడా సుందర్ లాల్ ఆరంభించి, చిత్ర నిర్మాణం చేశారు. ఆయన నిర్మంచిన చిత్రాల్లో అనేక చిత్రాలు అఖండవిజయం పొందిన చిత్రాలు. 'ప్రేక్షకులు ఏ రకమైన చిత్రాలను ఆదరిస్తారు?' అన్న విషయం ఆయనకు బాగా తెలుసు అనడానికి – అది తార్కాణం.

"సినిమా ముఖ్యమైన ఉద్దేశం ప్రజలకు వినోదాన్ని కల్పించడం. వినోదంతోపాటు ప్రయోజనం వుండడం కూడా ముఖ్యమైనదే. చిత్రాలు ప్రజలకోసమే తీస్తున్నాము కాబట్టి – వారు మెచ్చే విధంగా తియ్యడమే సమంజసమైనదీ, సబబైనదీ. వినోదంతో పాటు సాంఘిక ప్రయోజనం కూడా వుండాలన్నది నా ఉద్దేశం" అన్నారు సుందర్ లాల్.

ఆయన నిర్మించిన చిత్రాల్లో ఆయనకు బాగా వచ్చిన చిత్రం – శాంతినివాసం.

"ఎందువల్ల?"

"ఆ చిత్ర కధలో ప్రయోజనం వున్నది. చక్కని కుటుంబగాథ; మంచి నీతిగల కథా. దానికి తోడు వినోదానికీ మంచి అవకాశం వున్నది. అందుకనే, ఆ చిత్రాన్ని జెమినీ వారు హిందీలో నిర్మించగా, అనేక చోట్ల రజతోత్సవాలు జరుపుకున్నది" అన్నారు నహతా.

తెలుగులో వచ్చిన 'గూఢచారి – 116' ను ఆయన హిందీలో 'ఫర్జ్' పేరిట నిర్మించారు. ఆ చిత్రం అనేక కేంద్రాల్లో రజతోత్సవాలు జరుపుకున్నది.

"చిత్ర నిర్మాతగా, పంపిణీదారుగా, పెట్టుబడిదారుగా నేను చిత్ర పరిశ్రమలో అనేకమందిని ఎరుగుదును. ఏ వృత్తిలోనైనా విజయం సాధించాలంటే ఆ వృత్తిమీద శ్రద్ధ వుండాలి; తోడుగా పని చేసేవారి సహకారం వుండాలి. నా అదృష్టం వల్ల – నా చిత్రాలకు పని చేసిన టెక్నీషియన్ల, నటీనటుల సహకారం ఎంతగానో లభించింది." అన్నారు సుందర్ లాల్.

"ఇవాళ, అనేక చిత్ర నిర్మాణాలు ప్రారంభంలోనే ఆగిపోతున్నాయి. దానికి కారణం – ధనాభావం. పెట్టుబడి చూసుకోకుండా పరిశ్రమలోకి దిగటంవల్లనే ఇవి ఏర్పడుతున్నాయి. సరైన ఆర్థిక స్తోమత కలిగి వుంటే, ఇలాంటి ఇబ్బందులు రావు. అందుకనే, చిత్ర నిర్మాణంలోకి దిగేవారు – ముందుగా 'పెట్టుబడి' ని సవ్యంగా చూసుకోవాలి. ఒక నిర్ణయం చేసుకున్న తర్వాత దానికి కట్టుబడి వుండాలి. అలా పెట్టుబడి, కట్టుబడీ వుంటే – చిత్ర నిర్మాణం సులభ సాధ్యమవుతుంది; చిత్రం తొందరగా పూర్తవుతుంది; ఖర్చూ తగ్గుతుంది." అన్నారాయన.

తాను నిర్మాతగా కావడానికి ముఖ్యమైన కారణం ఏమిటో సుందర్ లాల్ వివరించారు;

"ఇదివరలో డిస్ట్రిబ్యూటర్ గా మాత్రమే వుండేవాణ్ణి. మేము పంపిణీకి తీసుకున్న చిత్రాలను – ఫలానా తేదీకి ఇస్తామని థియేటర్లు బుక్ చేసుకునేవాళ్ళం. కాని, డబ్బులేకనో, ఇతర ఇబ్బందుల మూలంగానో అనుకున్న చిత్రం అనుకున్న కాలానికి వచ్చేదికాదు. దాంతో, ఏ పాత చిత్రాన్నో ఆడుకోవలసి వచ్చేది. ఇలాంటి ఇబ్బందులు కలగడంవల్ల – మనమే నిర్మాతలమైతే బాగుంటుంది గదా అనిపించింది. ఆ ఆలోచనే నన్ను నిర్మాతను చేసింది !"

ఇండోనీషియాలో రెండవ ఆసియా – ఆఫ్రికా చలన చిత్రోత్సవం జరిగినప్పుడు భారత చలన చిత్రాల తరపున ('నర్తనశాల' చిత్రంతో) సుందర్ లాల్ జకార్తా వెళ్ళి – ఆ ఉత్సవంలో పాల్గొన్నారు.

జర్మనీ ప్రభుత్వ ఆహ్వానాన్ని పురస్కరించుకుని, ఆయన, ఈ ఆగస్టులో జర్మనీలో జరగబోయే ఎగ్జిబిషన్ కు వెళుతున్నారు.

దక్షిణ భారత చలనచిత్ర వాణిజ్య మండలికి – సుందర్ లాల్ నహతా ఇప్పుడు అధ్యక్షులుగా వుంటున్నారు. చలనచిత్ర పరిశ్రమ మనుగడకు – ఆయన ఎన్నో పరిష్కార మార్గాలు కనిపెట్టారు – కనిపెడుతూనే వున్నారు.

"నేను ఇవాళ ఈ స్థితికి రావడానికి కారణం – కేవలం నా కృషీ, పట్టుదలా మాత్రమే కావు; నా మిత్రులూ, ప్రజలూ నాకు ఇచ్చిన ఆదరాభిమానాలూ, సహకారాలే ముఖ్య కారణం" అన్నారు నహతా – కృతజ్ఞతా సూచకమైన చిరునవ్వుతో.

# పాలగుమ్మి పద్మరాజు

## ( సినిమారంగం – 1969, మార్చి సంచిక నుంచీ)

కెమిస్ట్రీ లెక్చరర్ గా వివిధ రసాయనిక ప్రయోగాలు చేసి విద్యార్థులకు విజ్ఞానం అందివ్వవలసిన పాలగుమ్మి పద్మరాజు జన్మతః కళాకారులవడం వల్ల వివిధ రసాల ప్రయోగాలు చేసి ప్రేక్షకులకు వినోదం కల్పించే సినిమా రచయితగా, దర్శకునిగా ఈ సినిమా రంగంలో తనకో ప్రత్యేకమైన స్థానాన్ని నెలకొల్పుతున్నారు.




పాశ్చాత్య సాహిత్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి శరపరంపరగా ఎన్ని రచనలు సాగించినా – దేనికి దానిలో కొత్త శిల్పమూ, కొత్త విధానమూ సృష్టిస్తూ తనవి తీరా చదివించే రచనలను ఘనత వహించిన పా.ప 1915 జూన్ 21 న పశ్చిమ గోదావరి జిల్లాలోని తిరుపతిపురంలో జన్మించారు. ఈయన విద్యాభ్యాసం బి.ఎస్.సి వరకు రాజమండ్రిలో సాగింది. కాశీ విశ్వవిద్యాలయంలో ఎం.ఎస్.సి పట్టా పుచ్చుకున్నారు.

1938 లో తన 23 వ ఏట రాసిన "సుబ్బి" ఈయన తొలి కథ. ఆ కథను 'భారతి' కి పంపించారు. అదే కథను స్వయంగా ఆంగ్లంలో అనువదించారు. అది "త్రివేణి" లో ప్రచురితమయ్యాక తెలుగు కథా "భారతి" లో అచ్చయింది.

1939 లో కాకినాడ కాలేజ్ లో డిమానస్ట్రేటర్ గా చేరి అక్కడే 1911 నించి 1945 వరకు లెక్చరర్ గా, అనంతరం భీమవరం కాలేజీలో కెమీస్ట్రీ శాఖకు అధిపతిగా పని చేశారు.

1951 లో 'న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూనల్' పత్రిక నిర్వహించిన అంతర్జాతీయ కథానికల పోటీలో "గాలివాన" కథారచయితగా ద్వితీయ బహుమతి పొంది, అంతర్జాతీయ ఖ్యాతినార్జించారు. ఆ కథ పలు విదేశ భాషల్లో అనువదింపబడింది.

1952 లో బి.ఎన్.రెడ్డి గారి ఆహ్వానాన్ని పురస్కరించుకొని, సెలవు మీద మద్రాసుకు వచ్చారు. వాహినీ సంస్థతో సంబంధంతో బంగారానికి తావి అబ్బినట్లయింది. ఈయన ఆ సంస్థ కోసం "బంగారు పాప" కు ముందు రాసిన "రంగులరాట్నం" చిత్ర కథ 1968 లో చిత్రంగా తయారై విడుదలైంది. అది ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో సర్వవిదితమే. వాహినీ సంస్థకే "అమరావతి" మున్నగు నాలుగు కథలు కూడా రాశారు. ఐతే, తొలుత (1954) లో తెరకెక్కింది – ఆధునిక పోకడలతో అభ్యుదయ పథం పట్టి, తెలుగు చలన చిత్ర చరిత్రకు వన్నె చిన్నెలూ, వెలుగు వాసులూ చేకూర్చి పెట్టిన "బంగారు పాప". ఆ చిత్రంతో రెండేళ్ళు సెలవు పెట్టి వచ్చిన ఈయన మద్రాసులోనే స్థిరపడి పోయారు.

ఆ తర్వాత "భాగ్యరేఖ, భక్త శబరి, బికారి రాముడు, భక్త కుచేల, గ్రామదేవతలు" ఇత్యాది చిత్రాలకు కథ, సంభాషణలు; "పరాశక్తి" చిత్రానికి సంభాషణలు, "రాజమకుటం" చిత్రానికి స్క్రీన్ ప్లే రాసి, పాత్రల సృష్టిలో సైతం తన ప్రత్యేక నైపుణ్యాన్ని కనబరచారు.

ఆ తర్వాత – రాజమండ్రిలో (1931 లో) ఈయనకు సహాధ్యాయుడైన ప్రముఖ నిర్మాత శ్రీ సరిదె భావనారాయణగారు 1966 లో నిర్మించిన "గోపాలుడు భూపాలుడు" చిత్రానికి రచయితగా గౌరీ సంస్థతో సంబంధమేర్పరచుకొని, ఆ తర్వాత ఆ సంస్థ నిర్మించిన "పాలమనసులు, సర్కార్ ఎక్స్ ప్రెస్" చిత్రాలకు సంభాషణలు రాశారు. గౌరీ వారు కన్నడంలో నిర్మించిన "సింహస్వప్నం" చిత్రానికి స్క్రీన్ ప్లే రాశారు. అదే సంస్థ తదుపరి నిర్మించిన "దేవుడిచ్చిన భర్త" చిత్రానికి కథ, సంభాషణలు సమకూర్చడమే కాక ప్రతిభావంతంగా దర్శకత్వం కూడా నెలుపారు.

ఈయన తొలుత దర్శకత్వభారం వహించిన చిత్రం "బికారి రాముడు".

ఇంకా "సుఖ దుఃఖాలు, చుట్టరికాలు" చిత్రాలకు కూడా రచన సాగించారు. ఈ నెలలోనే విడుదలయ్యే వాహినీ వారి "బంగారు పంజరం" చిత్రం ఈయన కలంలోని ప్రతిభా విశేషాలను మరో నిదర్శనం.

"భక్త ప్రహ్లాద, రక్త కన్నీరు" చిత్రాలకు ఈయన కొన్ని పాటలు కూడా రాశారు.

ఇక నాటక రచయితగా కూడా ఎంతటి ఘన విజయాలను సాధించారో అందరూ ఎరిగినదే. నాగభూషణంగారు పలు చోట్ల పలుమార్లు ప్రదర్శిస్తున్న "రక్త కన్నీరు" నాటకాన్ని ఈయన తమిళ మూల కథకు చేర్పులు మార్పులు చేసి, మెరుగులు దిద్దారు. "బికారి రాముడు" నాటకాన్ని కూడా రవి ఆర్ట్ థియేటర్స్ వారి ప్రదర్శించారు. 'దూరపు కొండలు, శాంతి నివాసం' నాటకాలను రేఖా అండ్ మురళీ అధినేత సుప్రసిద్ధ హాస్య నటుడు పద్మనాభం ప్రదర్శించారు. చివరి రెండూ రేడియో నాటకాలుగా శ్రోతలను కూడా ఆకర్షించాయి. బహుముఖ ప్రశంసలందుకున్న వీరి తదితర రేడియో నాటికలు 'బ్రతికిన కాలేజీ, ఇంటల్లుడు.'

"బ్రతికిన కాలేజీ" తో పాటు 'నల్లరేగడి' నవల, 'కూలిజనం' కథలు, 'చచ్చిపోయిన మనిషి' అనే లారెన్స్ నవలకు అనువాదం 'చచ్చి సాధించాడు' అనే డిటెక్టివ్ నవల పుస్తక రూపంలో వెలువడి, పండిత పామరులను విశేషంగా ఆకర్షించాయి.

ఈయన అభిమాన పాశ్చాత్య రచయిత ఎర్నెస్ట్ హెమింగ్స్ వే.

గత ఆగస్ట్ 18 న కేంద్ర విద్యామంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన సాంస్కృతిక బృందంలో ప్రతినిధిగా ఈయన తూర్పు ఐరోపా దేశాలైన యుగోస్లోవియా, హంగరీ, రుమేనియా, బల్గేరియా మున్నగు దేశాలలో పర్యటించి, అక్కడి స్టూడియోలు, థియేటర్లు ఇత్యాది కళాకేంద్రాలలోని ఆధునిక రీతులను పరిశీలించారు. పెక్కు విదేశీ రచయితలతో ముచ్చటించారు.

వీరు సాహిత్యంలో ఎంత కృషి చేశారో – వీరి తమ్ముడు పాలగుమ్మి విశ్వనాథం సంగీతంలో అంత కృషి చేశారు. ప్రముఖ వైణికులయిన విశ్వనాథంగారు ప్రస్తుతం లలిత సంగీతం అసిస్టెంట్ ప్రొడ్యూసర్ గా హైదరాబాద్ ఆలిండియా రేడియోలో పనిచేస్తున్నారు.

సున్నితమైన హాస్యాన్ని వెకిలితనం లేకుండా హుందాగా, సహజ సుందరంగా నడిపించే నేర్పు పా.ప.కే చెల్లింది. ప్రస్తుతం "రెండవ అశోకుని మూడు నాళ్ళ పరిపాలన" అనే నేటి దేశ కాల, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, విద్యా విధానాల పై ఒక చక్కని వ్యంగ్య రచనను సాగిస్తున్నారు...

ఇది కాక వాహినీ వారు నిర్మించబోయే కొత్త చిత్రానికి, రేఖా అండ్ మురళీ వారి తాజా చిత్రానికి స్క్రిప్ట్ పని ప్రారంభించారు.

పా.ప. నిరాడంబరజీవి. నిగర్వి. నిండు కుండ ... అజాత శత్రువు, సరసులు, సహృదయులు, సర్వసులభులు, మితభాషి. అయితే, మొగమాటం లేని తర్కంతో సంభాషించగలరు గనుకనే సినిమా కథలను వీరితో చర్చించడానికి పెక్కు నిర్మాతలు కుతూహల పడుతూంటారు.

చామన ఛాయ, విశాలమైన నుదురు, పాపిట తీసిన క్రాపు, తెల్లని దుస్తులు, గంభీరమైన కంఠం, కళ్ళజోడు మాటునుండి తొంగి చూసే విప్పారిన నేత్రాలు, చేతిలో ఎప్పుడూ పొగలు చిమ్ముతూండే ఖరీదైన సిగరెట్టు, పది మందిలో సైతం ప్రత్యేకంగా కనబడే వ్యక్తిత్వం – వీటన్నిటి సమన్విత స్వరూపమే పాలగుమ్మి పద్మరాజు.

# ఛాయాగ్రహణ దర్శకుడు పి. దేవరాజ్

## ( విజయచిత్ర – 1975, ఆగస్టు సంచిక నుంచి)

కొందరు జీవితంలో ఏదో చెయ్యాలనుకుంటారు. మరికొందరు ఏమీ అనుకోరు. కాని అనుకోక పోయినా సరే, ఆనవాయితీ వుండడం నుంచి, దారి అటే లాగుతుంది. ప్రసిద్ధ ఛాయాగ్రాహకుడు దేవరాజ్ కు అదే జరిగింది. దేవరాజ్ తండ్రి గారు పి. శ్రీధర్ నాటి రోజుల్లో సుప్రసిద్ధుడైన ఛాయాగ్రాహకుడు. స్వప్నసుందరి, మాయారంభ, మాయలమారి, శ్రీలక్ష్మమ్మకథ మున్నగు చిత్రాలను అద్భుతంగా చిత్రించిన పేరు గలవారు. కాని దేవరాజ్ కు ఆ ఉత్సాహం మొదట్నుంచీ లేదు. దేశాలు తిరగాలని, వూళ్ళు ఏలాలనీ అతను ఉద్దేశించాడు. మద్రాసులోనే పుట్టి, పెరిగి, ఇక్కడే చదువు పూర్తి చేసిన

తర్వాత అతని ఆశలకు ఒక దారి కనిపించింది. 'షిప్' లో జేరాడు. కలకత్తా నుంచి మద్రాసు; మద్రాసు నుంచి కలకత్తా వెళ్ళే 'షిప్' లో అతని ఉద్యోగం. కొంతకాలం అది బాగానే వున్నట్టు అనిపించింది. మరి కొంతకాలం కాగానే, దాని మీద విరక్తి కలిగింది. ఎప్పుడు చూసినా ఒంటరిగా నీటి మీద ప్రయాణం. తల్లిదండ్రుల్నీ స్నేహితుల్నీ చూడాలంటే, కష్టం. ఏదో జైలు జీవితంలా వున్నట్టుంది గాని, తను ఆశించినట్టుగా 'ఊళ్ళు తిరుగుతూ హాయిగా' లేదు; రాజీనామా చేసి, వచ్చేశాడు. తర్వాత ఏం చెయ్యాలి? తండ్రి గారిలా కెమెరా పని నేర్చుకుంటే? అతనికి ఉత్సాహం లేదు. అలా ఆలోచించి, ఆలోచించి సరే కానిమ్మని చేరాడు. చేరిన తర్వాత అతనికి అందులో ఉత్సాహం కనిపించింది.




1961 లో ప్రసాద్ ప్రొడక్షన్స్ వారి 'అవుట్ డోర్ యూనిట్' లో చేరాడు. రెండేళ్ళలోనే అతనికి 'కెమెరా' విషయం అవగాహనమయింది.

తర్వాత ప్రసాద్ వారు అతన్ని తమ 'స్పెషల్ ఎఫెక్ట్' సు శాఖకు మార్చారు. ఆ పనిమీద అతను బొంబాయి వెళ్ళి కొంతకాలం వున్నాడు. ఛాయాగ్రాహణంలో అతనికి వున్న ఉత్సాహం ఇందులో కనిపించలేదు. బొంబాయి నుంచి మద్రాసు వచ్చేసి , రాజలక్ష్మి వారి కెమెరా యూనిట్ లో చేరాడు. అప్పుడు 'గూఢాచారి 116' పూర్తి అవుతున్నది. రవికాంత్ నగాయిచ్ శిష్యరికంలో 'ఫర్జ్' చిత్రానికి పనిచేశాడు. తర్వాత 'మహాబలుడు' కు చేశాడు. రవికాంత్ ఆ చిత్రానికి దర్శకుడు కావడం వల్ల, చాయాగ్రహణానికి సంబంధించిన పనులన్నీ దాదాపుగా – సహాయకులైన దేవరాజ్, కృష్ణలకే అప్పజెప్పారు. ఆ టైమ్ లో అతనికి మంచి అనుభవం కలిగింది.

అంతే! ఆ అనుభవంతోనే అతను హీరో కృష్ణ ద్వారా 'మాస్టర్ కిలాడీ' చిత్రానికి ఛాయాగ్రాహకుడయ్యాడు ! అది అతని తొలి చిత్రం. తర్వాత రివాల్వర్ రాణి, రౌడీలకు రౌడీలు, జేమ్స్ బాండ్ 777, పసివాని పగ, పంజరంలో పసిపాప, రాజ్యంలో రాబందులు, అభిమానవతి మొదలైన తెలుపు – నలుపు చిత్రాలకు పనిచేశాడు.

అతనికి వర్ణచిత్రం తీసే తొలి అవకాశాన్ని వై. వి. రావు కల్పించారు. ఆ చిత్రం – 'మొనగాడొస్తున్నాడు జాగ్రత్త!' తర్వాత పిల్లా ? పిడుగా?, రాణి అవుర్ జానీ (హిందీ), నాకూ స్వతంత్రం వచ్చింది వర్ణ చిత్రాలకు పని చేశాడు. వై. వి. రావు నిర్మించిన 'ఒకనారి వంద తుపాకులు' చిత్రంలో కొంత భాగం 'సినిమా స్కోప్' లో వున్నది. ఆ చిత్రం ద్వారా అతనికి ఆ అవకాశం కూడా కలిగింది.

"తెలుగులో తొలిసారిగా 'సినిమా స్కోప్' లో షూట్ చేసే అవకాశాన్ని పొందగలిగాను. అందుకు వై. వి. రావు గారే కారకులు" అంటారు దేవరాజ్.

కొంతకాలం క్రితం దేవరాజ్ సొంతంగా చిన్న చిత్రం తియ్యాలని, మూడు నెలల్లో పూర్తి చెయ్యాలనీ పథకం వేశారు – కొత్త దర్శకుడితో, కొత్త వాళ్ళతో. కాని అది రెండేళ్ళయిపోయింది; కొత్త వాళ్ళు అనుకుంటే, పెద్దవాళ్ళతోనే తియ్యవలసి వచ్చింది. అప్పుడు ఆ చిత్రానికి 'మట్టి మనుషులు' అని పేరు పెట్టారు; ఇప్పుడు దాన్నే 'పెద్దింటి కోడలు' అని మార్చారు.

"నిర్మాణ వ్యవహారాలలో పడి, చాలా ఇబ్బందుల్లో పడ్డాను. కాని, నిర్మాత జి. వి. యస్. రాజుగారు, వెంకట్రాజుగారు, సుబ్బారావు గారు, వేణి మూవీస్ శ్రీనివాసరావుగారు మొదలైన మిత్రులు నాకు ఆసరాగా నిలబడి, చిత్రాన్ని పూర్తి చెయ్యడానికి తోడ్పడ్డారు. వారికి ఎప్పటికీ నేను కృతజ్ఞుడైన వుంటాను. త్వరలోనే ఈ చిత్రం విడుదల కాబోతున్నది." అన్నారు దేవరాజ్.

" 'నాకూ స్వతంత్రం వచ్చింది' వర్ణ చిత్రం నాకు నచ్చిన చిత్రం. పనితనం చూపడానికి అవకాశం ఇచ్చిన చిత్రం. నాకు కావలసిన సదుపాయాలు ఇచ్చి, కొంతవరకూ నా అభిరుచి మేరకు తియ్యడానికి ప్రోత్సహించారు దర్శక నిర్మాతలు శ్రీ లక్ష్మీదీపక్, శ్రీ ప్రభాకరరెడ్డి. ఈ చిత్రంలో కొంతవరకూ సహజ వాతావరణాన్ని, వాస్తవికతనూ చూపించడానికి కృషి చేశాము.

"నిజం చెప్పాలంటే, సహజ వాతావరణం, వాస్తవికతలు 'కలర్' లో వచ్చినంత చక్కగా 'తెలుపు నలుపు' చిత్రాల్లో రావు. రంగుల్లో ఆ సౌకర్యాలున్నాయి. పైగా నా దృష్టిలో కలరే తేలిక, బ్లాక్ అండ్ వైట్ కంటె. ప్రతిది 'మోల్డ్' చేసుకోవలసిన అవసరం లేదు. అందంగా, హాయిగా, వాస్తవికంగా ఎలా కావాలంటే అలా, కలర్ లో చూపవచ్చును. అందుకే నేను కలర్ ఛాయాగ్రాహణం అంటే ఎక్కువగా ఇష్టపడతాను." అన్నారు దేవరాజ్.

"అప్పట్లో నేను కె. యస్. ఆర్. దాసు గారితో ఎక్కువగా క్రైమ్ చిత్రాలకు పనిచెయ్యడం వల్ల, నన్ను 'క్రైమ్ ఫోటోగ్రాఫర్' అనేవారు – నేనే క్రైమూ చెయ్యకపోయినా, కాని, నాకు కొత్త తరహాగా వుండే సాంఘిక చిత్రాలకు పనిచెయ్యడం అంటే చాలా ఇష్టం. ఉన్నది ఉన్నట్టుగా తియ్యాలని అభిలాష. అలాంటి అవకాశం వస్తే ఎంతైనా చెయ్యాలనీ వున్నది; చెయ్యకలననీ వున్నది." అంటారు దేవరాజ్.

"నిజానికి క్రైమ్ చిత్రాలు నాకు మంచి పేరు తెచ్చాయి. ఆ చిత్రాలకు నేను ఎప్పుడూ కృతజ్ఞుడినే. కాని అవే ఎప్పుడూ అయితే ఉత్సాహం తగ్గుతుంది. అంటే ఆ చిత్రాలకు పనిచెయ్యనని కాదు; అవీ చేస్తాను. కాని, అందరూ 'వెరైటీ' కోరుకున్నట్టే ఛాయాగ్రాహకుడు కూడా 'వెరైటీ' కోరుకోడంలో తప్పులేదనుకుంటాను.

క్రైమ్ చిత్రాలు తియ్యడంలో చాలా ఇబ్బందులున్నాయి. ప్రతి క్షణమూ అక్కడ గండమే. ఎక్కడో కెమెరా పెట్టాలి; థ్రిల్లింగ్ గా తియ్యాలి. గుర్రాలుంటే అవి తంతాయి; రివాల్వర్ లు వుంటే బులెట్లు తగుల్తాయి. కొండ అంచుల మీద, ఇంటి కప్పుల మీదా కెమెరాతో పరుగెత్తాలి. దానికి కొంత తెగింపు, సాహసం కూడా అవసరమే. అందుకనే పేరు రావడం కూడా అలాగే వస్తుంది." అంటారు ఆయన.

తెలుగులో ఇకమీదట వర్ణచిత్రాలకే ఎక్కువ అవకాశం వుందని దేవరాజ్ నమ్మకం. "కన్నడం; మలయాళ భాషలవారే ఎక్కువగా వర్ణచిత్రాలు తియ్యగలుగుతున్నారు. ప్రజలు వర్ణచిత్రాలు చూడ్డానికే అలవాటుపడ్డారు; అంచేత, ముందు ముందు అవే ఎక్కువగా వస్తాయి" అంటారాయన.

దేవరాజ్ వాళ్ళది – 'ఛాయాగ్రహణ వంశం' తండ్రిగారి పోలిక దేవరాజ్ కు వచ్చినట్టే, దేవరాజ్ తమ్ముళ్ళు కూడా ఆ శాఖలోనే పనిచేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే వాళ్లు కూడా ఛాయాగ్రాహకులుగా కనిపిస్తే అందులో ఆశ్చర్యం ఏమీ వుండదు!

వై. వి. రావు త్వరలో ఆరంభించబోతున్న వర్ణచిత్రానికి ('రోటీ' ఆధారంగా) దేవరాజ్ పనిచెయ్యబోతున్నారు. "తొలిసారిగా, యన్. టి. రామారావుగారితో పని చెయ్యబోతున్నాను. వారు ఆశీర్వదించారు" అన్నారు దేవరాజ్ తృప్తిగా.

# నేనెరిగిన మహ్మద్ రఫీ

## – ఎ.పుండరీకాక్షయ్య

## ( సినిమారంగం – 1969, మే సంచిక నుంచీ)




మధుర గాయకుడు మహమ్మద్ రఫీ కారణ జన్ముడు. కళాతపస్వి. ప్రతి రోజూ ఆకాశవాణి ద్వారానో, సినిమాల ద్వారానో, గ్రామఫోన్ రికార్డ్ ల ద్వారానో అసంఖ్యాక శ్రోతలను ముగ్ధులను గావించ గల్గుతున్నాడంటే – ఆయనలో ఏదో దైవాంశ ఉందని చెప్పక తప్పదు. ఆయనకా సుశ్రావ్యమైన కంఠం దైవదత్తమైనది. గాయకుడిగా ఆయన్ని గురించి ఎరుగని ఆంధ్రులెవరూ ఉండరనడంలో అతిశయోక్తి ఏమీ ఉండబోదు కాని, వ్యక్తిగా ఆయన ఎంతటి ఉత్తముడో ఆయనతో మా అనుభవాలను వివరించడమే ఈ రచన యొక్క ప్రధానోద్దేశం.ఆయన గాత్రం కన్నా ఆయన హృదయం మరింత ఉత్తమమైనది. పరమ సాధువు. సరళ హృదయుడు. ఉదార స్వభావుడు. శాంతమూర్తి. సహన సంపన్నుడు. చొరవా, యుక్తీ, గడుసుతనమూ, వంచనశక్తీ – ఆయనలో కించిత్తయినా కనిపించవు. ఆయన పెదవులపై సదా జిగేల్ మనే

మందహాసంలో కృతిమత్వం ఏ కోశానా కనిపించదు. ఆయన నిరాడంబరత్వం మా అందరికీ ఎంతైనా ఆశ్చర్యాన్ని కలిగించింది. కీర్తి ప్రతిష్ఠలు, సిరిసంపదలు ఆయనలో ఏ అతిశయమూ కల్గించక పోవడం ఎంతో విడ్డూరంగా కనిపిస్తుంది. అశేష శ్రోతల హృదయాలలో, సినీ పారిశ్రామికుల దృష్టిలో తన స్థానం ఎంతటి ఉన్నతమైనదో వ్యక్తం చేయని నిగర్వి. తానొక ప్రఖ్యాత మధుర గాయకుడని జ్ఞాపకం చేసేవారిని ఏ మాత్రం భరించలేడు. పట్టుదల గల మనిషి. ఆ పట్టుదల ఎంత గట్టిదో – ఆయన మాట కూడా అంత గట్టిది. గణనీయమైన పై గుణగణాలకు తార్కాణంగా కొన్ని సంఘటనలను వివరిస్తాను ...

మా తారకరామా పిక్చర్స్ పతాకం కింద "భలే తమ్ముడు" అనే చిత్రాన్ని ఓ శుభ ముహూర్తాన మేము ప్రారంభించిన విషయం ఆంధ్ర ప్రేక్షక మహాశయులకు తెలిసిందే. వ్యాపార రీత్యా ఆ చిత్రాన్ని ఆద్యంతం అతి విశిష్టంగా, వినూత్నంగా తయారు చేయాలని మా సంకల్పం. ప్రతి అంశం లోనూ ఏదో నవ్యత చూపించాలని మా తాపత్రయం. అందుకే మ్యూజిక్ విషయం వచ్చేసరికి – మధుర గాయకుడు రఫీ చేత హీరోకు పాటలు పాడిస్తే, బావుంటుందనే నిర్ణయానికి వచ్చాం. మళ్ళీ "శ్రీ కృష్ణావతారం" లాంటి ఏ పౌరాణిక చిత్రమో, అయి ఉంటే, మాకీ తలంపు కలిగి ఉండేది కాదేమో !

ఈ మా నిర్ణయాన్ని మా శ్రేయోభిలాషులు పలువురు ఆమోదించారు కూడా. రఫీ శ్రావ్యమైన కంఠం నించి తెలుగు పాటలు వినిపించే సదవకాశం పొందాలని ప్రయత్నించాం.

కాని, బొంబాయిలో ఆయన ప్రతి రోజూ రెండు మూడు రికార్డింగ్ లకు హాజరవుతూ, సవ్యంగా ఊపిరి సల్పుకోడానికి సైతం వ్యవధి లేనంత బిజీగా ఉంటాడు. మద్రాసుకు వచ్చి పాడేంత తీరుబడి ఆయనకు ఉంటుందా? ఆయనకు రాని తెలుగు భాషలో పాడడానికి అంగీకరిస్తాడా? అంగీకరించినా – ఎంత వరకు పాడగలడు? ఆయనకు అఖిల భారత స్థాయిలో పెద్ద మార్కెట్ గల హిందీ చిత్రాల మూలంగా ముట్టినంత పారితోషికం చిన్న మార్కెట్ గల తెలుగు చిత్రాల మూలంగా లభించదని నిర్లక్ష్యం వహిస్తాడా?

ఇలాంటి సంశయాలెన్నో పొడ సూపాయి.

అయినా, ఒక నిర్ణయానికి వచ్చేశాం గనుక – ఇక్కడి నా మిత్రులు శ్రీ దాసుగారి ద్వారా బొంబాయిలోని వారి మిత్రులు శ్రీ ఎన్. సి. మీనన్ గారి మూలంగా రఫీని కాంటాక్ట్ చేశాం. తన పై ఇంత అభిమానం ఉంచినందుకు రఫీ కృతజ్ఞతలు తెలుపుతూ, తెలుగు పాటలు పాడడానికి తనకేం అభ్యంతరం లేదు కాని, తన ఉచ్చారణ ఎంత వరకు నిర్దుష్టంగా ఉంటుందోనన్న సందేహాన్ని వ్యక్తపరచాడు.

భాష అవధులు లేనిది సంగీతం. అందుకే, ఆయన తెలుగులో సైతం హిందీ పాటలకు ఏ మాత్రం తీసిపోకుండా పాడగలరనే నమ్మకం మాకుందని ఉత్తరం రాసి ఆయన్ని కలుసుకోడానికి ఒక ఎంగేజ్మెంట్ ఫిక్స్ చేశాం. ఈ లోగా మా సంగీత దర్శకులు టి.వి.రాజు గారి చేత డాక్టర్ సి. నారాయణ రెడ్డి గారు రాసిన నాలుగు గీతాలను ట్యూన్ చేయించాక, గత ఆగష్టు 4న రాజుగారూ, నేనూ విమానంలో బొంబాయికి బయలుదేరాం.

బాంద్రా పరిసరాలలో ప్రశాంతంగా ఉండే ప్రాంతమైన వాటర్ ఫీల్డ్ రోడ్ లోని 44 వ నెంబర్ భవంతి ఆయన నివాసం. సప్తస్వరాలకు చిహ్నాలైన ఏడు స్తంభాల పై అత్యాధునిక రీతుల్లో నిర్మింపబడిన రెండంతస్తుల భవనమది. ఆ స్తంభాల మధ్య కార్లు ఆపడానికి ప్రత్యేకమైన స్థలం ఉంది. మేడ పైకి వెళ్ళడానికి లిఫ్ట్ ఉంది. పై అంతస్తు ఆయన కుటుంబానికి కేటాయించబడింది. కింది అంతస్తులో ఆయన ప్రత్యేక గదులున్నాయి. ఆయన మామూలుగా అందర్నీ కలుసుకొని మాట్లాడేది అక్కడే. డ్రాయింగ్ రూమ్ నేత్రోత్సవమొనర్చేలా ఎంతో కళాత్మకంగా అలంకరించబడి ఉంది. పలు రాజకీయ ప్రముఖులతో, దేశ నాయకులతో రఫీ తీయించుకున్న ఫోటోలు, ఆయన పొందిన రజత పతకాలు, కప్పులు చక్కగా కొన్ని అద్దాల అలమారులలో అలంకరింపబడి ఉన్నాయి. ఎక్కడ అట్టహాసంగాని, ఆడంబరంగాని అగుపించవు. ఏ కోశం నించి చూసినా అది ముస్లిమ్ ల నివాస స్థలమనిపించదు. రఫీ కూడా సామాన్యమైన గళ్ళ లుంగీ, లాల్చీ ధరించి ఉన్న వాడల్లా – తన నిర్మలమైన సహజ మందహాసంతో మాకు స్వాగతమిచ్చాడు. కుశల ప్రశ్నలయ్యాక, "తెలుగు మహాజనులను తెలుగు పాటలతో నేను రంజింప జేయగల్గితే – ఇంత కన్నా నేను కోరుకునే అదృష్టం ఇంకేం ఉంటుంది ! అది కేవలం భగవంతుని అనుగ్రహమనే చెప్పాలి." అన్నాడాయన ఎంతో వినయంతో. అంతటి విద్వత్తు గల వ్యక్తికి వినయ విధేయతలు ప్రత్యేక భూషణాలు.

అనవసర కాలయాపన జరగకుండా ఆయన వెంటనే రెండు పాటలను ఉర్దూ లిపిలో రాసుకుని వెళ్ళి, హార్మోనియమ్ ముందు కూర్చున్నాడు. ప్రతి పదం అర్థం, భావం తెలుసుకున్నాక – హార్మోనియమ్ వాయిస్తూ, ఎంతో ఓపికతో ఓ గంట పాటు సాధన చేశాడు. ఆయన ఏకాగ్రతకు, దీక్షకు, కృషికి ఎంతైనా అభినందించక తప్పదు. ఆ తర్వాత ఆయన "ముచ్చటైన మీ భాషను నేనెక్కడా ఖూనీ చేయలేదు కదా?" అన్నాడు.

"ఎంత మాట!" అన్నాను. నిజానికి ఆ తెలుగు పదాలు ఆ శ్రావ్యమైన కంఠంలో కొత్త సొంపును సంతరించుకున్నట్లున్నాయి.

ఇక, కాల్షీట్ల విషయాలు ఏర్పాటు చేసుకోడానికి మర్నాడు కలుసుకునేందుకు నిశ్చయించి, అలాగే మళ్ళీ కలుసుకున్నాం. వెంటనే ఆయన వెళ్ళి హార్మోనియమ్ ముందు కూర్చున్నాడు. మాకు పాడి వినిపించాడు. పరభాషోచ్చారణలో స్పష్టత సాధించడానికి ఆయన క్రితం రాత్రంతా ఎంత నిర్విరామమైన కృషి సల్పి ఉంటాడో ఊహించుకొని, మేము చకితులమయ్యాం.

మిస్టర్ జహీర్, రఫీ బావమరిది; ఆయన కార్యదర్శి కూడాను. ఆయనతో రఫీ సంప్రదించాక, డైరీ తిరగేశాడు. శంకర్ – జైకిషన్, లక్ష్మీకాంత్ – ప్యారేలాల్ మున్నగు సంగీత దర్శకులతో తన పాటల రికార్డింగ్ లను వాయిదా వేయడానికి వీలవుతుందేమో కోరమని జహీర్ తో చెప్పాడు.

బొంబాయిలో ఒక రోజుకు రెండు పాటలు, ఒక్కోసారి మూడు నాలుగు పాటల రికార్డింగ్స్ లో కూడా పాల్గొనడం ఆయానకు పరిపాటి. కాని, మా చిత్రంలో మాత్రం తను పాడవలసిన ఆరు పాటలకు ఆరు రోజుల కాల్షీట్లు ఇచ్చాడు. "నాకు రాని భాష కదా – అందుకనే ఎక్కువ రోజులు కాల్షీట్లు ఇచ్చాను" అన్నాడాయన.

ఇక పారితోషికం గురించి – తెలుగు మార్కెట్ చిన్నదన్న విషయాన్ని మేం ప్రస్తావించ నవసరం లేకుండా ఆయనే సముచితంగా నిర్ణయించాడు. మా ముక్కూ ముఖం ఆయన ఎరుగడు. అయినా, మా మీద సంపూర్ణ విశ్వాసం ఉంచి, మమ్మల్ని కనీసం అడ్వాన్స్ అయినా అడక్కపోవడం లోనే ఆయన సంస్కారం వెల్లడయింది. ఆయనకు ధనం కన్నా సంగీతారాధనే ముఖ్యమవడానికి ఇదొక నిదర్శనం.

ఆగస్ట్ 22 ఉదయం ఎనిమిదిన్నరకు రఫీ జహీర్ తో విమానంలో మద్రాసు చేరుకున్నాడు. విమానాశ్రయం బయట కారులో నా పక్కన కూర్చోగానే జేబులోంచి కొన్ని కాగితాలను తీశాడు. ఆ కాగితాలు ఆయన ఉర్దూలో రాసుకున్న మా పాటలే ! కారు స్టార్ట్ వగానే ఆ పాటలను మృదువుగా గానం చేయసాగాడు. అప్పుడప్పుడు నా ముఖ కవళికలను క్రీగంట పరిశీలిస్తూ, "ఉచ్చారణ కరెక్ట్ గా ఉందా?" అని అడగసాగాడు. నాకు నవ్వొచ్చింది. ఆయన కార్యదీక్షను ప్రశంసించకుండా ఉండలేకపోయాను.

రఫీ కోసం ఉడ్ లాండ్స్ లో ఒక ఫ్లాట్ ను బుక్ చేశాం. అక్కడ తన పెట్టే బేడా పడెయ్యగానే, టీ పుచ్చుకొని, కాస్సేపయినా విశ్రమించకుండా "ఇక రిహార్సల్స్ కు పోదామా?" అన్నాడు వెంటనే.

ఆ నాడు ఉదయం పదిన్నర నించి పన్నెండువరకు మా చినబావగారు శ్రీ త్రివిక్రమరావుగారి ఆధ్వర్యంలో రిహార్సల్స్ జరిగాయి. సాయంత్రం నాలుగు నించి ఏడున్నరవరకు శ్రీమతి సుశీలతో జంట పాటల రిహార్సల్స్ జరిగాయి. అసలంతవరకు శ్రీమతి సుశీలకు తెలీదు తాను రఫీతో కలిసి పాడబోతున్నానని. ఆ విషయం తెలియడంతో ఆమె ఎంతో ఆనందించింది. "రఫీ గారితో కలిసి పాడాలన్న నా చిరకాల వాంఛ ఇంత త్వరగా నెరవేరుతుందని నేను కలలో కూడా అనుకోలేదు సుమండీ !" అంది. ఇక తోటి ప్లేబాక్ ఆర్టిస్ట్ ల పట్ల రఫీ చూపే సహకారం, ఇచ్చే గౌరవం ఇంతా అంతా కాదు. "నేను మీ భాషలో పాడబోతున్నాను. అలాగే మీరు కూడా లతా మంగేష్కర్ లా మా భాషా చిత్రాలలో కొన్ని పాటల పాడాలి," అన్నాడు రఫీ ఆమెతో.

రిహార్సల్స్ లో మా సంగీత దర్శకులు టి. వి. రాజు గారు, అయన సహాయకులు విజయా కృష్ణమూర్తిగారు హార్మోనియమ్ పై ఏవైనా కొత్త సంగతులు వినిపిస్తే, "ఆ హా ! భేష్ !" అంటూ అప్పటికప్పుడు మెచ్చుకొని, ఎంతో ప్రోత్సాహమిచ్చేవాడు రఫీ.

ఆ మర్నాడు రికార్డింగ్ కు ఏర్పాటు చేశాం.

రికార్డింగ్ కు వెళ్ళడానికి ముందు శ్రీ ఎన్. టి. ఆర్. ను దర్శించాలని రఫీ కోరాడు. హిందీ హీరోల గాత్ర పరిధులకు తగ్గట్టు షమ్మీకపూర్, ధర్మేంద్ర మున్నగు వారికి – ఒక్కొక్కరికి ఒక్కో శృతిలో పాడడం రఫీకి అలవాటు. అందుకోసం ఆ ఆర్టిస్ట్ ల ట్రెన్డ్ ను పరిశీలించాల్సిన

అవసరం ఎంతైనా ఉంది. మా బావ గారు శ్రీ ఎన్. టి. ఆర్ తో రఫీ తేనీరు సేవించి, పిచ్చాపాటి కబుర్లతో సరదాగా కాలక్షేపం చేసినంత సేపూ ఆ పరిశీలనలు జరిపాడు. అందు నిమిత్తమే "శ్రీ కృష్ణావతారం" చిత్రాన్ని కూడా తాను ఒకసారి చూడాలని కోరి, చూసి ఎంతో ఆనందించారు కూడా. రికార్డింగ్ లో రఫీ పాడవలసిన మెదటి పాట –

"ఎంతవారుగాని, వేదాంతులైనగాని

వాలుచూపు సోకగానే – తేలిపోదురోయ్ !"

పది గంటలకు ప్రారంభమైన రికార్డింగ్ గంటన్నరలో ముగిసింది. మైక్ ముందు రఫీ నిలుచున్నాడంటే పాట' ఓకే. అయింది' – అనే వరకు అక్కడ్నించి కదలడన్న మాట. పది టేక్ లయినా సరే – ఎంతసేపైనా అలాగే నిలుచుండిపోతాడు. ఎప్పుడో ఏ ఐస్ వాటరో తప్ప మధ్య మధ్య టీ కూడా పుచ్చుకోడు. ఎప్పుడూ ఏర్ కండిషన్డ్ రూమ్ లో ఉంటూ, సదా ఐస్ వాటర్ పుచ్చుకుంటున్నా – ఎన్నడూ ఆయన కంఠం ఆయన స్వాధీనం తప్పదు. ఇది కూడా భగవంతుడు ఆయనకు ఇచ్చిన వరమేమో ! అసలు మధ్య మధ్య గొంతు కూడా సవరించుకోడు ! రికార్డింగ్ ఓ.కే – అయిందన్న తర్వాత "ఏక్ కప్ గరమ్ ఛా!" అని మనం అడిగితే అప్పుడు "హ( హ( ! అభి పీయేంగే!" అని ఎంతో వినమ్రంగా అంటాడు.

ఇలా ఆయన ఆరు రోజుల కాల్ షీట్లు ఇచ్చిన ఆరు పాటలూ నాలుగు రోజుల్లోనే రికార్డయి పోయాయి. "ఏ పాటైనా రీటేక్ చేయాలంటే, మీరు సంకోచించకుండా చెప్పొచ్చు" అన్నాడు రఫీ ఒకసారి. "మాకు సంపూర్ణ సంతృప్తి కలగనిదే ఓ–కే చేస్తామా?" అన్నాను నేను.

తన గీతాలలోని భావాలను రఫీకి ఉర్దూలో తర్జుమా చేసి చెప్పడానికి ప్రత్యేకంగా విచ్చేసిన డాక్టర్ సి. నారాయణ రెడ్డి గారు సైతం రికార్డింగ్ లు ముగిశాక ఆ పాటలన్నీ విని రఫీ స్పష్టమైన తెలుగు ఉచ్చారణకు అచ్చెరువొందారు.

రఫీ పాటల రికార్డింగ్ జరిగిన విజయా గార్డెన్స్ లోనే ఒక హిందీ చిత్రం తాలూకు ఔట్ డోర్ షూటింగ్ జరగసాగింది. అందులో పాల్గొనడానికి విచ్చేసిన ప్రముఖ హిందీ నటులు ధర్మేంద్ర, తివారీ – విరామ సమయంలో రఫీ పాడిన ఆ తెలుగు పాటలు విని, తమ చెవులను తామే నమ్మలేకపోయారు. "నేటి నుంచి నీ పేరు రఫీరావ్" అని చమత్కారంగా ప్రశంసించారు. శ్రీమతి సుశీల గాత్రాన్ని కూడా "సుశీలా మంగేష్" అని మెచ్చుకున్నారు.

రఫీది పసిపాప మనస్తత్వమనే చెప్పాలి, సౌజన్యమూర్తి, సౌమ్యుడు, నొప్పించక తానొవ్వక ప్రవర్తించే మనస్తత్వం.

ఇంకోసారి రికార్డింగ్ జరుగుతూన్న తరుణంలో మా అమ్మగారు వచ్చారన్న విషయం రఫీకి తెలిసింది. రికార్డింగ్ ముగిసిన వెంటనే "మీ అమ్మ గారు ఏరీ ?" అంటూ మా అమ్మ గారి దగ్గరికి వెళ్ళి నమస్కరించి, "మీకు కొడుకులు ఇద్దరు కాదు; ముగ్గురు. నేనూ మీ కుమారుడ్నే." అంటూ ఆమెకు నమస్కరించాడు. ఆమె ఆనందాతిరేకంతో ఆనంద భాష్పాలు రాలుస్తూ, "నీ కంఠంతో ఎందరికో వీనుల విందు ఒనర్చే నువ్వు ధన్యుడివి, నాయనా!" అని మనసారా ఆశీర్వదించింది.

రఫీ శాఖాహారి. ఇడ్లీలంటే చాలా ఇష్టం. మితంగా భోంచేస్తాడు. ఉదయం ఐదు గంటలకు మేల్కొనగానే న్యూ ఉడ్ లాండ్స్ హోటల్ కు దాదాపు మైలున్నర దూరంలో ఉన్న ఎడ్వర్డ్ ఇలియట్స్ రోడ్ బీచ్ కి కాలినడకనే వెళ్ళి వచ్చేవాడు. తెర ముందు కాక తెర వెనుక ఉండే వ్యక్తి శారీరం గురించే కాక శరీరం గురించి కూడా ఇంత శ్రద్ధ తీసుకొనడం ఎవరికైనా విచిత్రంగానే ఉంటుంది. బొంబాయిలో ఉన్నప్పుడైతే ప్రతి రోజూ టెన్నిస్ ఆడుతాడట.

రఫీకి పెద్దా పిన్నా అనే తారతమ్యం లేదు. ఆఖరికి మా ఆఫీస్ బాయ్ లు ఏ టీయో, ఐస్ వాటరో తెచ్చి ఇస్తే, "షుక్రియా," అని ఎంతో వినయంగా కృతజ్ఞతలు తెలిపేవాడు. తన గాత్రాన్ని ఎవరు మెచ్చుకున్నా, "అంతా భగవంతుని కృప" అంటూ ఆ ఘనతను భగవంతునికే ఆపాదించేవాడు. బొంబాయికి తిరిగి వెళ్ళే ముందు "మీ అమ్మ గారికి మరో సారి ప్రణమిల్లే అదృష్టాన్ని నాకు కలిగించరూ?" అని కోరాడు రఫీ. పెద్దలంటే ఆయన కంత భక్తి గౌరవాలు. మా చిత్రానికి పాటలు పాడి రఫీ మమ్మల్ని వదలి బొంబాయికి వెళ్ళిపోయినా – మా అందరి హృదయాలలో ప్రత్యేకమైన స్థానాన్ని ఆక్రమించుకున్నాడు. ఆ మంచి మనిషి గుణగణాలను, మాతో ఆయన గడిపిన దినాలను ఎన్నటికీ మరువలేము.

మా చిత్రం కోసం ఆయన పాడిన గ్రామఫోన్ రికార్డులు ఈ నెలలోనే విక్రయానికి విడుదలవుతున్నాయి. తనను అభిమానించే అశేష తెలుగు కళాభిమానులను వారి భాషను తన కంఠంతో వినిపించే అవకాశం కలగడం తన అదృష్టంగా భావించిన రఫీకి – ఆ రికార్డులు విడుదలయ్యాక శ్రోతలు ఆనందాన్ని పొందగలిగితే ఆయన నిర్విరామ కృషి, తపస్సు ఫలించినట్లే. ఇన్ని గుణ విశేషాలను ఒకే వ్యక్తిలో చూడగలిగిన నేను – ఈ విషయాల్నీ, నా అనుభూతులనూ చలన చిత్ర కళాభిమానులైన మీ అందరికీ తెలియజేయడం నా ధర్మంగా భావించాను. తత్ఫలితమే ఈ వ్యాసం.

# జి. వీరయ్య

## (ఫిల్మాలయ – 1975, డిసెంబర్ సంచిక నుంచీ)



జి.వీరయ్య
పరిచయం
G Veeraiah Cine Actor

ఫోటోలు: జి.వి.జి

"మాది లవ్ మేరేజ్ అండి. మేమిద్దరం ప్రేమించుకొని, గూడూరుకు పారిపోయి అక్కడ చక్కా పెళ్లాడేసుకున్నాం. మా ఆవిడ ఇప్పుడు నిండు చూలాలు కూడాను," అన్నాడు ఇంతవరకు 50 చిత్రాలలో నటించిన జి. వీరయ్య.

"అలాగా! శుభం! గుమ్మడి పండు లాంటి అబ్బాయి మీకు కలుగుతాడు లెండి," అన్నాను కెమెరాలో ఫిలిమ్ లోడ్ చేస్తూ.

"అంతా భగవంతుని దయ," అన్నాడు వీరయ్య.

"మధ్య భగవంతుని దయ ఏమిటి? అంతా మీ శ్రమ ఫలితం," అన్నాను.

"అవునండి," అన్నాడు వీరయ్య ముందు మందహాసం చేసి, తర్వాత అందులోని అంతరార్థం బోధపడినట్లుంది-విరగబడి నవ్వాడు. ఆయనెందుకలా నవ్వుతున్నాడో అర్థం కాక ప్రశ్నార్థకంగా చూస్తూన్న భార్య చెవిలో ఆ జోక్ విడమర్చి చెప్పాడు. సిగ్గుతో ఆమె ముఖం ఎరుపెక్కగా తుర్రుమని వాళ్ళింట్లోకి పారిపోయింది. "భలే జి. వి. జి. గారు" అన్నాడు వీరయ్య నవ్వుతూ.

"మీకు నాకన్నా ఒక్క 'జి' మాత్రం తక్కువ. లేకపోతే నా అంత పొడగరి అయి ఉండేవారేమో!" అన్నా.

"అవునవును, సార్! నేను 'జి. వి.' ని మాత్రమే కదా? అంటే 'జీవి'-కష్టజీవిని" అన్నాడు వీరయ్య.

"మాది లవ్ మేరేజ్ అండి. మేమిద్దరం ప్రేమించుకొని, గూడూరుకు పారిపోయి అక్కడ చక్కా పెళ్లాడేసుకున్నాం. మా ఆవిడ ఇప్పుడు నిండు చూలాలు కూడాను," అన్నాడు ఇంతవరకు 50 చిత్రాలలో నటించిన జి.వీరయ్య.

"అలాగా! శుభం! గుమ్మడి పండు లాంటి అబ్బాయి మీకు కలుగుతాడులెండి," అన్నాడు వీరయ్య.

"మధ్య భగవంతుని దయ ఏమిటి? అంతా మీ శ్రమ ఫలితం," అన్నాను.

"అవునండి," అన్నాడు వీరయ్య ముందు మందహాసం చేసి, తర్వాత అందులోని అంతరార్థం బోధపడినట్లుంది–విరగబడి నవ్వాడు. ఆయనెందుకలా నవ్వుతున్నాడో అర్థం కాక ప్రశ్నార్థకంగా చూస్తూన్న భార్య చెవిలో ఆ జోక్ విడమర్చి చెప్పాడు. సిగ్గుతో ఆమె ముఖం ఎరుపెక్కగా తుర్రుమని వాళ్ళింట్లోకి పారిపోయింది. "భలే జి. వి. జి. గారు" అన్నాడు వీరయ్య నవ్వుతూ.

"మీకు నాకన్నా ఒక్క "జి" మాత్రం తక్కువ. లేకపోతే నా అంత పొడగరి అయి ఉండేవారేమో!" అన్నా.

"అవునవును, సార్! నేను 'జి. వి.' ని మాత్రమే కదా? అంటే 'జీవి'–కష్టజీవిని" అన్నాడు వీరయ్య.

ఆయన పరిచయం ఆయన వాక్యాల్లోనే –

★ ★ ★ ★ ★

నల్గొండ జిల్లా సూర్యాపేట తాలూకాకు చెందిన ఫణిగిరి గ్రామంలో 1947 ఫిబ్రవరి 5న పుట్టాను. గట్టు నర్సమ్మ, గట్టు సింహాద్రయ్య మా జననీ జనకులు. నాకొక అక్క మాత్రం ఉంది. పేద కుటుంబం మాది. ఫణిగిరి గ్రామస్థులు సాయంతో అక్కడే 8వ తరగతి వరకు చదివాను. హైస్కూలు చదువుకు సూర్యాపేటకు మా అమ్మతో చేరుకున్నాను. వెంపటి బచ్చయ్యగారనే ఆయన సాయంతో జిల్లా పరిషత్ హైస్కూల్లో చేరాను. అక్కడ H.S.C. ఫైనల్ ఇయర్ స్టూడెంట్ అసోసియేషన్ లో ఇండిపెండెంట్ గా "తెలుగు శాఖ" సెక్రెటరీగా గెలిచాను కాని, H.S.C. పరీక్షల్లో ఓడిపోయాను. దాంతో చదువుకు బ్రేక్ పడింది. ఏదైనా ఉద్యోగం చేయక తప్పింది కాదు. కాని, నాకక్కడ ఏం ఉద్యోగం దొరుకుతుంది? 'చెడి చెన్నపట్నం చేరు' అని కదా పెద్దలన్నారు? అక్కడి ఉపాధ్యాయులు, ఇతర మిత్రుల సహాయంతో 1967 లో నేలపట్ల గోపాలరావుగారనే వ్యక్తితో కొట్టు

ఉంది. ఆ కొట్టులో కాగితం పువ్వులు కట్టడం నా పని. రోజుకు 5 రూపాయల కూలి. ఆ కొట్టులో పని చేయడం వల్ల తరచు స్టూడియోలకు వెళ్ళవలసి వస్తూండేది.

ఒక రోజు వాహిని స్టూడియో 1వ ఫ్లోర్ లో "చిక్కడు-దొరకడు" షూటింగ్ సమయంలో డైరెక్టర్ బి.విఠలాచార్యగారిని కలుసుకోవడం జరిగింది. నాకంతకు ముందే సినిమాలలో ఎందుకు ప్రయత్నించకూడదు – అనే తలంపు కలిగింది. వెంటనే నా కోర్కెను విఠలాచార్య గారికి వెల్లడి చేశాను. ఆయన నవ్వుతారేమో అనుకున్నాను. ఎంచేతంటే నా పొట్టి ఆకారానికి ఎవరు వేషం ఇస్తారు? అలాంటి పాత్రలు చిత్రాల్లో ఉంటాయా? కాని, ఆయన నవ్వలేదు. తప్పకుండా ఇస్తానన్నారు. నా పరిస్థితి వివరించాను. తన "అగ్గిదొర" చిత్రంలో "దొడ్డదొర" పాత్రనిచ్చారు. అదే నా తొలి చిత్రం. అంచేతే నా లెటర్ హెడ్ లో ఆ పేరు వేసుకున్నాను.

అంతకు ముందు గోల్డన్ స్టూడియోలో హీరో శోభన్ బాబు గారిని కలుసుకున్నప్పుడు "బాబూ! భావన్నారాయణగారిని గాని, విఠలాచార్యగారినిగాని కలుసుకో. వాళ్ళుతీసే జానపదచిత్రాలలో నీకు ఛాన్సులు ఇస్తే నువ్వు మద్రాసులోనే స్థిరపడిపోవొచ్చుగా?" అని సలహా ఇచ్చారు. భావన్నారాయణగారేమో "నేనిప్పుడు జానపద చిత్రాలు తీయడం లేదు" అన్నారు. విఠలాచార్యగారి ధర్మమా అని సినిమా నటుడ్నయ్యాను. అలా ఆ తర్వాత పది చిత్రాలలో నటించాక శ్రీ శోభన్ బాబు గారిని కలుసుకొని, "మీ దయవల్ల పది చిత్రాలలో ఆక్ట్ చేశానండి." అన్నాను. "వెరీ గుడ్! ఇక నీకేం ఢోకా లేదు." అని ఆశీర్వదించారాయన. ఆ తర్వాత మరో 27 చిత్రాలలో నటించాను. ఇలా ఇండస్ట్రీలో పెద్దవారందరి కరుణకు పాత్రుడ్ని కాగలగడం నా పూర్వజన్మ సుకృతమనే అనుకోవాలి.

డైరెక్టర్ బి. ఎస్. నారాయణరావుగారు "మేనకోడలు" చిత్రంలో మంచి వేషం ఇచ్చారు. అలా శ్రీయుతులు సునీల్ చౌదరి, కె. రాఘవులు, దాసరి నారాయణరావుగార్ల ఆదరణ లభించింది. దాసరి నారాయణరావు గారు తొలుత దర్శకత్వం వహించిన "తాత – మనవడు"లో మంచి ఛాన్సు ఇచ్చారు. ఆయన ఆ తర్వాత దర్శకత్వం వహించిన "సంసారం – సాగరం, బంట్రోతు భార్య, రాధమ్మ పెళ్ళి, తిరుపతి, దేవుడే దిగివస్తే, లక్ష్మణ రేఖ, బలిపీఠం" ప్రతి చిత్రంలోనూ నాకు ఛాన్సులు ఇచ్చి, పోషించారు. ఇప్పటికీ నేనేదైనా ఫిలిమ్ కంపెనీకి వెళ్తే," ఆదుగోరా, దాసరిబిడ్డ వచ్చాడు." అంటూంటారు. ఇంకా "వీర పూజ, రక్త సిందూరం, భలే మొనగాడు, చిన్నారి పాపలు, సప్త స్వరాలు, అగ్గి మీద గుగ్గిలం, పేదరాశి పెద్దమ్మ కథ, రాజసింహ, అగ్గి వీరుడు, ఉక్కుపిడుగు, కథానాయిక మొల్ల, గండర గండడు, భలే పాప, ఇంటి గౌరవం, అదృష్టదేవత, సుగుణ సుందరి కథ, విక్రమార్క విజయం, పంచకల్యాణి-దొంగల రాణి, పిల్లా-పిడుగా, సి.ఐ.డి. రాజు, ఆడపిల్లల తండ్రి, ఆస్తి కోసం, దేవుడు చేసిన పెళ్ళి, వయసొచ్చిన పిల్ల, మా ఊరి గంగ, గుణవంతుడు, సంసారం, ఈ కాలపు పిల్లలు, బంగారు మనిషి, కోటలో పాగా" తెలుగు చిత్రాలు, "రాణి ఔర్ లాల్ పరి (హిందీ), వాగ్దాన (కన్నడం), కులందై ఉళ్ళం, కలియుగ కణ్ణన్ (తమిళం), చిత్రమేళ, విమోచన సమరం, (మలయాళం) చిత్రాలలో నాకు అవకాశాలిచ్చిన దర్శక నిర్మాతలందరికీ కృతజ్ఞుడ్ని. కొన్ని తమిళ, హిందీ నాటకాలలో కూడా నటించాను. "రక్త కన్నీరు" హిందీ నాటకంలో తరచు పాల్గొంటూంటాను.

ఒకప్పుడు నేను "ముత్తు చిప్పి బ్రేసరీస్" అనే బ్రేసరీస్ తయారు చేసే సంస్థలో మేనేజర్ గానూ పని చేశానండోయ్! అప్పుడే ఆ కొట్టుకు ఎదురింట్లో ఉండే మల్లికతో పరిచయమైంది. ఆ పరిచయం ప్రేమగా మారింది. మేం తరచు రహస్యంగా కలుసుకుంటూండే వాళ్ళం. "నేను నీకన్నా పొట్టి కదా?" అన్నాను. "పొట్టి అయితే ఏమండి? మీ మంచి గుణం నన్నాకర్షించింది." అందామె. మా వివాహానికి ఆమె తల్లితండ్రులు అంగీకరించలేదు. వెంటనే మేం 24-6-74 న వెంకటేశ్వర్లు అనే మిత్రుని సాయంతో గూడూరుకు పారిపోయాం. అక్కడ ఓ దేవాలయంలో శ్రీ రామచంద్రయ్యగారు, పలువురు బంధుమిత్రుల ఆశీర్వాదాలతో భక్తి గీతాలు గ్రామఫోన్ లో వినిపిస్తూండగా మా వివాహం జరిగిపోయింది. మా వివాహాన్ని చూట్టూ మేడల మీద నించి, బండ్ల మీద నిలబడి – ఎంతో మంది తిలకించడం చూసి, "మల్లికా! వాళ్ళు మనల్ని చూసి నవ్వుకుంటున్నారనుకుంటున్నావా?" అన్నాను. "నవ్వితే నవ్వనీయండి. అది నేను పట్టించుకుంటేగా? ఈ మాత్రం భరించలేకపోతే మీకు భార్యనెలా అవుతాను?" అంది. మల్లిక నా అర్ధాంగి అవడం కూడా నా పూర్వజన్మ సుకృత మనుకుంటూంటాను.

సరే ... పెళ్ళయిన వెంటనే నేను 'తిరపతి' షూటింగ్ లో పాల్గొనడానికి ఏకాయెకీన బెంగళూరుకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడే మా హనీమూన్. బెంగళూరులో శ్రీయుతులు రాజ్ బాబు, దాసరి నారాయణరావు, నిర్మాత ప్రసాదరావు, శ్రీరాజ్, రాఘవరావు, ఛాయాగ్రాహకుడు మణి, నటులు మురళీమోహన్, చిట్టిబాబు, అప్పారావు, సూర్యచంద్రరావు, సువాసు, ఏచూరి ప్రభృతులు నూతన దంపతులైన మమ్మల్ని హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.

ఈ లోగా మల్లికను నేను లేవదీసుకుపోయానని – మద్రాసులో నా స్నేహితులు ముత్తుస్వామి, రామస్ దొరైలు పోలీస్ స్టేషన్ లో ఉన్నారని తెలిసి, ఎకాయెకీన సతీ సమేతంగా మద్రాసుకు చేరుకున్న వెంటనే ఆ పోలీస్ స్టేషన్ కు వెళ్ళాను. మా వివాహం గురించి అంతా చెప్పాను. "అలా తొందరపడవచ్చా?" అని పోలీస్ స్టేషన్ లో ముందు నన్ను తిట్టినా, తర్వాత మా ఇద్దరినీ ఆశీర్వదించారు!

ఇలా ఎందరో సహృదయుల ఆశీస్సుల వల్లనే నేనిలా జీవ యాత్ర సాగిస్తున్నాను. "తాతా మనమడు" వగైరా చిత్రాల ఫంక్షన్ లకు ఇతర నటీనటులతో పాటు నన్నూ మన రాష్ట్రం లోని ముఖ్య కేంద్రాలకు తీసుకు వెళ్ళడమే కాక అక్కడ మూగిన జనవాహినికి నేను కనిపించేలా కొందరు నన్ను భుజాల మీద ఎక్కించుకొని పరిచయం చేస్తూంటే, నా కళ్ళు చెమ్మగిల్లుతూంటాయి.

ప్రేక్షకుల ఆదరాభిమానాలు కూడా పొందగలిగిన నేను నిజంగా అందరికీ ఎంతో ఋణపడి ఉన్నాను. నిజమేనండి. లేకపోతే – అందరికన్నా పొట్టివాడ్నయిన నేను నటుడుగా స్థిరపడడమేమిటి? అంతా సహృదయుల చలవ వల్లనే కదా?

★ ★ ★ ★ ★

"అయినా, ఈ కాగితం పూలు కట్టే వృత్తిని మాత్రం మానలేదన్న మాట?" అడిగాను ఫోటోలు తీస్తూ.

"ఎలా మానగలనండి! మద్రాసుకు నేను వచ్చిన కొత్తల్లో నాకు జీవనోపాధి కలిగించింది ఈ కాగితం పూలే కదా? షూటింగ్ లు లేనప్పుడు ఈ పనే. నేను మద్రాసుకు వచ్చినప్పట్నుంచి ఈ గుడిసెలోనే కాపురముంటున్నాను. ఇప్పుడు పాతిక రూపాయల అద్దె." అని వీరయ్య అంటూండగా అతని భార్య సమీపంగా పాకలో ఉన్న కొట్టులోంచి ఒక గోలీ సోడా తీసుకొచ్చింది.

"తీసుకోండి, సార్! మంచి ఎండలో వచ్చారు," అన్నాడు వీరయ్య, సోడాకాయను బొటన వేలితో కొట్టి ఇస్తూ. "మా లాంటి చిన్న వేషాలు వేసే వారిని, అందులో నా లాంటి పొట్టివాడ్ని పత్రికలలో ఎవరు పరిచయం చేస్తారండీ – మీరొక్కరు తప్ప. అందుకే జి. వి. జి. గారంటే ఈ ఇండస్ట్రీలో మంచి పేరు." అన్నాడు వీరయ్య.

"అలాగా? నా కంత మంచి పేరుందా?" అన్నాను లోపల పొంగిపోతూన్న సోడాద్రావకం పైకెగయకుండా సీసా మూతి వద్ద అరచేతిని అడ్డంగా నొక్కి ఉంచి.

"మీ దారి మీదే సార్! మీరు లేని పోని సినిమా రాజకీయాలలో తల దూర్చరు. సెట్ స్ కు వస్తూంటారు. మీ పనేదో చూసుకుంటారు. ఏదో జోక్ వేసి అందర్నీ నవ్వించి వెళ్లిపోతూంటారు," అన్నాడు వీరయ్య.

"చూడండి. కాగితం పువ్వులంటే ఎందరికో చులకన. కాని, మీలాంటి వారికి ఇది జీవనోపాధి. ఎంత పెద్ద ఉద్యానవనం సెట్ వేసినా ఈ కాగితం పూలు లేకపోతే అందం, నిండుతనం ఎక్కుడుంటాయి? కాని, మీ శ్రీమతి పేరు మంచి పువ్వు పేరు. మీరిద్దరూ, కలకాలం చిలకా గోరింకల్లా ఉండాలి," అని నేను కూడా ఆశీర్వదించాను.

★★